www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

9 రోజులు.. 9 వేడుకలు..

- ఈసారి బతుకమ్మ పండగను వైభవంగా నిర్వహించాలని సర్కారు నిర్ణయం
- రామప్పలో ప్రారంభోత్సవ కార్యక్రమం
- ఉత్సవాల్లో సెలబ్రిటీలు, అంతర్జాతీయ ప్రముఖులు
- దాండియా వంటి కార్యక్రమాలతో ఇతర రాష్ట్రాల వారినీ బతుకమ్మ వేడుకల్లో భాగస్వామ్యం చేయాలనే యోచన
- త్వరలో షెడ్యూల్ వెల్లడించనున్న మంత్రి జూపల్లి

3

హుస్సేన్ సాగర్‌లో 'ఫ్లోటింగ్ బతుకమ్మ'



సోమవారం | 1-9-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 154 | వరంగల్

శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, బాద్రపదమాసం, శుక్లపక్షం; తిథి: నవమి రా2.43 తదుపరి దశమి; నక్షత్రం: జ్యేష్ఠ రా.7.55 తదుపరి మూల, వర్జ్యం: తె.4.33-6.17; దుర్ముహూర్తం: మ.12.39-1.29, మ.3.07-3.57; అమృతఘడియలు: ఉ.10.12-11.58; రాహుకాలం: ఉ.7.30-9.00; సూర్యోదయం: 6.04; సూర్యాస్తమయం: 6.25

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

బిజినెస్

వరంగల్ ● సోమవారం 1 సెప్టెంబరు 2025

టాటా క్యాపిటల్ 17,200 కోట్ల ఐపీఓ

న్యూఢిల్లీ: టాటా గ్రూప్ నుంచి మరో కంపెనీ మెగా పబ్లిక్ ఇష్యూకి వస్తోంది. గ్రూప్ కంపెనీ టాటా క్యాపిటల్ ఈ నెలాఖరులోగా పబ్లిక్ ఇష్యూ జారీ చేయనుంది. ఈ ఇష్యూ సైజు 200 కోట్ల డాలర్ల (సుమారు రూ.17,200 కోట్లు) వరకు ఉంటుందని మార్కెట్ వర్గాల అంచనా. దీంతో కంపెనీ వాల్యుయేషన్ 1,100 కోట్ల డాలర్ల (సుమారు రూ.96,800 కోట్లు) వరకు ఉండే అవకాశం ఉందని భావిస్తున్నారు.. ఈ ఐపీఓ ఈ నెల 22న ప్రారంభమవుతుందని సమాచారం. ఈ ఐపీఓ మదుపరుల ఆదరణకు నోచుకుంటే భారత క్యాపిటల్ మార్కెట్లో అతి పెద్ద ఫైనాన్షియల్ ఐపీఓ కానుంది.

● టాటా మోటార్స్ మార్కెట్లోకి సరికొత్త వింగర్ ప్లస్ తీసుకువచ్చింది. ప్రీమియం ప్యాసింజర్ మొబిలిటీలో ఇది కొత్త బెంచ్‌మార్క్‌ను సృష్టిస్తుందని కంపెనీ వెల్లడించింది. ఈ వాహనం ధర రూ.20.60 లక్షలు (ఢిల్లీ ఎక్స్‌షోరూమ్).

● ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరులో ఇన్‌స్టామార్ట్ డెలివరీలు 339 శాతం పెరిగినట్లు ప్రకటించింది. కేవలం 12 నిమిషాల్లో ఉత్పత్తులను డెలివరీ చేయటం ఇందుకు ఎంతగానో కలిసివచ్చిందని వెల్లడించింది. సౌందర్య ఉత్పత్తులు 323 శాతం, పెంపుడు జంతువుల ఆహార పదార్థాల డెలివరీలు ఏకంగా 522 శాతం పెరిగాయని తెలిపింది.

● మైనింగ్, ఇన్‌ఫ్రా రంగాలకు అవసరమైన ఉత్పత్తులను తయారు చేస్తున్న ఎపిరాక్.. మహారాష్ట్రలోని నాసిక్‌లో కొత్త ప్లాంట్‌తో పాటు ఆర్ అండ్ డీ సెంటర్‌ను ఏర్పాటు చేస్తోంది. గనులు, నిర్మాణ రంగాలకు అవసరమైన ఉత్పత్తులను ఇక్కడ తయారు చేయనుంది. కంపెనీ ఈ ఏడాది ఏప్రిల్‌లో హైదరాబాద్‌లోని రాక్ డ్రిల్లింగ్ టూల్స్ యూనిట్ సామర్థ్యాన్ని విస్తరించింది.

ఈ ఏడాది ప్రైవేట్ పెట్టుబడుల జోరు

21.5% వృద్ధితో రూ.2.67 లక్షల కోట్లు ఉండే చాన్స్: ఆర్‌బీఐ



ముంబై: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26) దేశంలో ప్రైవేట్ పెట్టుబడులు (క్యాపెక్స్) పుంజుకునే ఆస్కారం కనిపిస్తోంది. 2024-25 ఆర్థిక సంవత్సరంతో పోల్చితే ఈ ఆర్థిక సంవత్సరంలో ప్రైవేట్ పెట్టుబడులు 21.5% వృద్ధితో రూ.2,67,432 కోట్ల స్థాయిలో ఉండొచ్చని భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) అంచనా వేసింది. గత ఆర్థిక సంవత్సరంలో కార్పొరేట్ పెట్టుబడులు రూ.2,20,132 కోట్లుగా ఉన్నాయి. అంతర్జాతీయ అస్థిరతలు వెన్నాడుతున్నప్పటికీ కార్పొరేట్ సంస్థలు అధిక నగదు నిల్వలు, మెరుగైన లాభదాయకత, విభిన్న రుణ వసతుల అందుబాటుతో 2025-26 ఆర్థిక సంవత్సరంలోకి ఎంతో బలంగా అడుగు పెట్టాయని "ప్రైవేట్ కార్పొరేట్ పెట్టుబడులు: 2024-25లో వృద్ధి; 2025-26 అంచనాలు" పేరిట ఆగస్టు బులెటిన్‌లో ప్రచురించిన వ్యాసంలో ఆర్‌బీఐ తెలిపింది. కార్పొరేట్ రంగం ప్రకటించిన పెట్టుబడి ప్రణాళికలు సమీప భవిష్యత్తులో క్యాపెక్స్ ధోరణులకు అద్దం పడుతున్నట్టు పేర్కొంది.

ముఖ్యాంశాలు..

● మౌలిక వసతుల అభివృద్ధికి విధానపరమైన నిరంతర చర్యలు, నిలకడగా అదుపులో ఉన్న ద్రవ్యోల్బణం, తగ్గిన వడ్డీ రేట్లు, తేలిగ్గా నగదు లభ్యత, పెరిగిన సామర్థ్యాల వినియోగం ప్రైవేట్ పెట్టుబడులకు అనుకూలమైన అంశాలు.

● ప్రైవేట్ పెట్టుబడుల్లో అధిక భాగం మౌలిక వసతుల రంగం ఆకర్షిస్తుంది. ప్రధానంగా విద్యుత్ రంగం అగ్రస్థానంలో నిలుస్తుంది.

● సరికొత్త ప్రాజెక్టులపై పెట్టుబడి ప్రణాళికలు ప్రకటించడంతో వ్యవస్థలో కాలానుగుణంగా ఏర్పడే రికవరీతో పాటు సామర్థ్యాల నిర్మాణం జరుగుతున్న సంకేతం వెలువడింది. కార్పొరేట్ సంస్థలు తాము ప్రకటించిన పెట్టుబడి లక్ష్యాలను వాస్తవిక పెట్టుబడులుగా మార్చేందుకు ఇది సానుకూల సంకేతం.

● భౌగోళిక, రాజకీయ ఉద్రిక్తతలతో పాటు ప్రపంచ దేశాల్లో అస్థిరతలు, మందగించిన డిమాండ్ పెట్టుబడి సెంటిమెంట్‌ను దెబ్బ తీసే ప్రమాదం ఉంది

24,800 పైన బుల్లిష్

(సెప్టెంబరు 1-5 తేదీల మధ్య వారానికి)



డా. భువనగిరి అమర్‌నాథ్ శాస్త్రి

టెక్ వ్యూ

నిఫ్టీ గత వారం 25,022-24,405 పాయింట్ల మధ్యన కదలాడి 445 పాయింట్ల నష్టంతో 24,405 వద్ద ముగిసింది. ఈ వారాంతంలో 24,800 కన్నా పైన ముగిస్తే స్వల్పకాలానికి బుల్లిష్ అవుతుంది.

● 20, 50, 100, 200 రోజుల చలన సగటు స్థాయిలు 24,613, 24,842, 24,745, 24,786 వద్ద ఉన్నాయి. ఇవి నిరోధ, మద్దతు స్థాయిలుగా నిలుస్తాయి.

బ్రేకౌట్ స్థాయి: 24,800 బ్రేక్‌డౌన్ స్థాయి: 24,000

నిరోధ స్థాయిలు : 24,600, 24,700, 24,800 (24,500 పైన బుల్లిష్)

మద్దతు స్థాయిలు : 24,200, 24,100, 24,000 (24,300 దిగువన బేరిష్)

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



1 తేదీ			
హైదరాబాద్	525	విజయవాడ	560
వరంగల్	527	గోదావరి	560
చిత్తూరు	578	విశాఖపట్నం	565
		దజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	95	విజయవాడ	117
వరంగల్	95	గుంటూరు	112
కరీంనగర్	95	ఒంగోలు	112
మహబూబ్‌నగర్	95	చిత్తూరు	100
కర్నూలు	95	నెల్లూరు	105
విశాఖపట్నం	121	అనంతపురం	105
గోదావరి	117		

కొత్త మోడళ్లతో మార్కెట్లో పట్టు

హోండా మోటార్స్

కోల్‌కతా: దేశీయ ద్విచక్ర వాహన మార్కెట్లో తన వాటాను మరింత పెంచుకునేందుకు హోండా మోటార్ సైకిల్ అండ్ స్కూటర్ ఇండియా (హెచ్‌ఎంఎస్‌ఐ) ప్రణాళికలను సిద్ధం చేస్తోంది. ప్రస్తుతం దేశీయ మార్కెట్లో కంపెనీ వాటా 28 శాతంగా ఉందని, కొత్త మోడళ్ల విడుదల ద్వారా ఈ వాటాను మరింత పెంచుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు హెచ్‌ఎంఎస్‌ఐ డైరెక్టర్ యోగేశ్ మాథుర్ వెల్లడించారు. ఇందులో భాగంగా ఇప్పటికే 100సీసీ, 125సీసీ విభాగంలో కొత్తగా రెండు బైక్స్‌ను విడుదల చేసినట్లు ఆయన చెప్పారు.

మార్కెట్లోకి సీబీ 125 హార్నెట్: హైదరాబాద్ మార్కెట్లోకి సరికొత్త హోండా సీబీ125 హార్నెట్, షైన్ 100డీఎక్స్ మోటార్‌సైకిళ్లను హెచ్‌ఎంఎస్‌ఐ జోనల్ హెడ్ సునీల్ రెడ్డి విడుదల చేశారు. హోండా హార్నెట్ ధర రూ.1,25,000, షైన్ 100డీఎక్స్ ధర రూ.75,950 (ఎక్స్‌షోరూమ్)గా ఉన్నాయి.

అనిశ్చితిలో 'ఆటో' అమ్మకాలు

బీఎండబ్ల్యూ ఇండియా సీఈఓ హర్దీప్ సింగ్ బ్రార్

న్యూఢిల్లీ: ప్రతిపాదిత జీఎస్‌టీ సంస్కరణలపై వెంటనే స్పష్టత ఇవ్వాలని ఆటో మొబైల్ పరిశ్రమ కోరుతోంది. కార్లపైనా జీఎస్‌టీ రేట్లు తగ్గుతాయనే వార్తలతో ప్రస్తుతం కొనుగోలుదారులు ఎవరూ కొనుగోళ్లకు ముందుకు రావడం లేదని బీఎండబ్ల్యూ గ్రూప్ ఇండియా ప్రెసిడెంట్, సీఈఓ హర్దీప్ సింగ్ బ్రార్ చెప్పారు. 'కొనుగోలుదారుల ఆసక్తి, డిమాండ్ బాగానే ఉంది. అయితే జీఎస్‌టీ రేట్లపై సందిగ్ధతతో వారు కార్లు కొనకుండా వేచి చూసే వైఖరిలో ఉన్నారు. కొత్త వాహనాల అమ్మకాలపై ఇది కొంత వరకు ప్రభావం చూపిస్తోంది' అని బ్రార్ తెలిపారు. వచ్చే పండగల సీజన్‌లో వాహనాల అమ్మకాలు పుంజుకోవాలంటే ప్రభుత్వం వెంటనే దీనిపై స్పష్టత ఇవ్వాలని ఆయన స్పష్టం చేశారు. ప్రస్తుతం ఆటోమొబైల్ వాహనాలపై 28 శాతం జీఎస్‌టీ అమల్లో ఉంది. ఈ నెల 3-4 తేదీల్లో జరిగే జీఎస్‌టీ మండలి సమావేశంలో దీన్ని 18 శాతానికి కుదిస్తారనే వార్తలు షికారు చేస్తున్నాయి.

24, 500 వద్ద నిలదొక్కుకోవడం కీలకం

టెక్ వ్యూ



వి. సుందర్ రాజా

నిఫ్టీ గత వారం కీలక స్థాయి 25,000 వద్ద విఫలమై వారం అంతా కరెక్షన్ ట్రెండ్‌లోనే ట్రేడయి 445 పాయింట్లు నష్టపోయింది. ప్రస్తుతం 24,300 స్థాయి (ఇక్కడే పలు బాటమ్‌లు ఏర్పడ్డాయి) కన్నా స్వల్పంగా పైన ఉంది. మిడ్‌క్యాప్-100 (1900 పాయింట్లు), స్మాల్‌క్యాప్-100 (690 పాయింట్లు) సూచీలు కూడా గత వారం భారీగా నష్టపోయాయి. గత కొద్ది వారాల్లో నిఫ్టీ 750 పాయింట్లకు పైగా నష్టపోయిన కారణంగా మార్కెట్లో ప్రస్తుతం టెక్నికల్ రికవరీకి ఆస్కారం ఉంది. అదే సమయంలో మానసిక అవధి 24,500కి చేరువవుతోంది. అంతే కాదు..ఆగస్టు నెలవారీ చార్టులు బలహీనంగా క్లోజ్ కావడం మరింత అప్రమత్తతను సూచిస్తోంది. సానుకూలత కోసం మార్కెట్ ప్రస్తుత స్థాయిల్లో టెక్నికల్‌గా కన్సాలిడేట్ కావడం అవసరం.

బుల్లిష్ స్థాయిలు: గత వారం మార్కెట్ నిట్టనిలువుగా పతనమైనందు వల్ల మొదట నిలదొక్కుకోవాలి. తదుపరి నిరోధం 24,500 కన్నా పైన నిలదొక్కుకుంటే మైనర్ పాజిటివ్ ట్రెండ్ ఏర్పడుతుంది. ప్రధాన నిరోధం 24,700. స్వల్పకాలిక నిరోధం 25,000.

బేరిష్ స్థాయిలు: బలహీనత ప్రదర్శించినా ట్రెండ్‌లో సానుకూలత కోసం కీలక మద్దతు స్థాయి, గతంలో ఏర్పడిన బాటమ్ 24,300 వద్ద రికవర్ అయి తీరాలి. విఫలమైతే మరింత బలహీనపడుతుంది. ప్రధాన మద్దతు స్థాయి 24,000.

బ్యాంక్ నిఫ్టీ: ఈ సూచీ కూడా గత వారం భారీ డౌన్‌ట్రెండ్‌లో ట్రేడయి 1,600 పాయింట్లు నష్టపోయి 53,600 వద్ద ముగిసింది. గత కొద్ది వారల్లో 4,000 పాయింట్ల మేరకు నష్టపోయింది. ట్రెండ్‌లో సానుకూలత కోసం నిరోధస్థాయి 54,000 కన్నా పైన నిలదొక్కుకోవాలి. ప్రధాన నిరోధం 54,600. గత వారం కనిష్ఠ స్థాయి 53,600 వద్ద విఫలమైతే మరింత బలహీనత తప్పదు. ప్రధాన మద్దతు స్థాయి 53,000.

పాటర్న్: నిఫ్టీ ప్రస్తుతం స్వల్పకాలిక 100 డీఎంఏకు చేరువవుతోంది. సానుకూలత కోసం ఇక్కడ నిలదొక్కుకుని తీరాలి. 24,300 వద్ద "అడ్డంగా ఏర్పడిన సపోర్ట్ ట్రెండ్‌లైన్" వద్ద ప్రధాన మద్దతు ఇంది. ఇక్కడ నిలదొక్కుకోవడం తప్పనిసరి. విఫలమైతే మరింత బలహీనత ఏర్పడుతుంది.

టైమ్: ఈ సూచీ ప్రకారం గురువారం తదుపరి మైనర్ రివర్సల్ ఉండవచ్చు.

సోమవారం స్థాయిలు	
నిరోధం	24,500, 24,560
మద్దతు	24,380, 24,300

ఆచితూచి అడుగేయండి!

దేశీయ స్టాక్ మార్కెట్లు ఈ వారం తీవ్ర ఒడుదొడుకులకు లోనయ్యే అవకాశం ఉంది. అయితే జూన్ త్రైమాసికంలో దేశ జీడీపీ అంచనాలను మించటం, ట్రంప్ టారిఫ్స్‌ను అమెరికా ఫెడరల్ కోర్టు అడ్డుకోవటం వంటి వార్తలు సానుకూల సెంటిమెంట్‌ను నింపే వీలుంది. అదే జరిగితే మార్కెట్లో పుల్‌బ్యాక్ ర్యాలీకి అవకాశం ఉంటుంది. ప్రస్తుతం ఆటోమొబైల్, యాన్సిలరీస్, ఎఫ్ఎంసీజీ, కన్‌స్ట్రక్షన్ మెటీరియల్స్, రిటైల్, ఎలక్ట్రికల్స్ వంటి రంగాలు మాత్రమే కొంత బలం ప్రదర్శిస్తున్నాయి.

స్టాక్ రికమండేషన్స్

ఎల్ అండ్ టీ: కొన్ని నెలలుగా ఈ షేరు సైడ్‌వేస్‌లో చలిస్తోంది. ఇప్పుడిప్పుడే మూమెంటమ్, రిలేటివ్ స్ట్రెంత్ మెరుగవుతున్నాయి. వాల్యూమ్ పెరుగుతోంది. గత శుక్రవారం రూ.3,061 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.3,570 ఎగువన పొజిషన్ తీసుకుని రూ.3,850 టార్గెట్ ధరతో కొనుగోలు చేయవచ్చు. రూ.3,500 స్థాయిని స్టాప్‌లా‌స్‌గా పెట్టుకోవాలి.

కోల్గేట్ పామోలివ్: గత ఏడాది సెప్టెంబరు నుంచి డౌన్‌ట్రెండ్‌లో పయనిస్తున్న ఈ షేరు ప్రస్తుతం అక్యుములేషన్ జోన్‌లో ఉంది. వాల్యూమ్ క్రమంగా పెరుగుతోంది. స్వల్పకాలిక మూమెంటమ్‌ను బట్టి రివర్సల్‌కు అవకాశం కనిపిస్తోంది. గత శుక్రవారం రూ.2,331 వద్ద క్లోజైన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.2,300 స్థాయిలో ప్రవేశించి రూ.2,700 టార్గెట్ ధరతో కొనుగోలు చేయవచ్చు. రూ.2,260 స్థాయిని స్టాప్‌లా‌స్‌గా పెట్టుకోవాలి.

వోల్టాస్: గత ఏడాది సెప్టెంబరు నుంచి ఈ షేరు డౌన్‌ట్రెండ్‌లో పయనిస్తోంది. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి మంచి బేస్ ఏర్పడింది. ప్రస్తుతం కన్స్యూమర్ డ్యూరబుల్స్ విభాగం క్రమంగా పుంజుకుంటోంది. గత శుక్రవారం రూ.1,374 వద్ద క్లోజైన ఈ కౌంటర్‌లో ఇన్వెస్టర్లు రూ.1,350 స్థాయిలో పొజిషన్ తీసుకుని రూ.1,500 టార్గెట్ ధరతో కొనుగోలు చేయవచ్చు. అయితే రూ.1,325 స్థాయిని కచ్చితమైన స్టాప్‌లా‌స్‌గా పెట్టుకోవాలి.

సీజీ పవర్: ప్రస్తుతం ఈ షేరు ఆకర్షణీయమైన ధరలో లభిస్తోంది. చక్కటి బేస్ ఏర్పడింది. పైగా అక్యుములేషన్ జోన్‌లో ఉంది. రిలేటివ్ స్ట్రెంత్ సైతం మెరుగవుతోంది. గత శుక్రవారం రూ.694 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో ఇన్వెస్టర్లు రూ.680 శ్రేణిలో ప్రవేశించి రూ.740 టార్గెట్ ధరతో కొనుగోలు చేయవచ్చు. రూ.660 స్థాయిని స్టాప్‌లా‌స్‌గా పెట్టుకోవాలి.

ఐటీసీ: రెండేళ్లుగా ఈ షేరు డౌన్‌ట్రెండ్‌లో కొనసాగుతోంది. ఎఫ్ఎంసీజీ, కన్స్యూమర్ డ్యూరబుల్స్ రంగాలకు మక్కువ పెరుగుతున్న నేపథ్యంలో ఈ షేరు ఆకర్షణీయంగా మారింది. గత శుక్రవారం రూ.409 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.400 శ్రేణిలో ఎంటరై రూ.445 టార్గెట్ ధరతో కొనుగోలు చేయవచ్చు. రూ.385 స్థాయిని స్టాప్‌లా‌స్‌గా పెట్టుకోవాలి.

- మూర్తి నాయుడు పాదం,
మార్కెట్ నిపుణులు, నిఫ్టీ మాస్టర్
+91 98855 59709
niftymasterlive@gmail.com



నోట్ : పెట్టుబడి నిర్ణయాలు తీసుకునే ముందు మదుపరులు తమ ఫైనాన్షియల్ అడ్వైజర్ల సలహాలు తీసుకోవాలి.

స్పోర్ట్స్



సూపర్-4కు భారత్

● హర్మన్‌ప్రీత్ డబుల్
● 3-2తో జపాన్‌పై గెలుపు
● ఆసియాకప్ హాకీ

రాజ్‌గిర్ (బిహార్): కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ రెండు గోల్స్‌తో అదరగొట్టడంతో.. ఆసియాకప్ హాకీలో భారత జట్టు వరుసగా రెండో విజయంతో సూపర్-4 బెర్త్‌ను ఖరారు చేసుకొంది. పూల్-ఎలో ఆదివారం జరిగిన మ్యాచ్‌లో భారత్ 3-2తో జపాన్‌ను ఓడించింది. డ్రాగ్‌ఫ్లికర్ హర్మన్‌ప్రీత్ (5వ, 46వ నిమిషం) రెండు పెనాల్టీ కార్నర్‌లను గోల్స్‌గా మలిచాడు. 4వ నిమిషంలో మన్‌దీప్ ఫీల్డ్ గోల్‌తో భారత్‌కు తొలి గోల్ అందించాడు. జపాన్ తరఫున కోసి కవాబే (38వ, 58వ) రెండు గోల్స్ సాధించాడు. తొలి మ్యాచ్‌లో చైనాపై గెలిచిన భారత్ మొత్తం ఆరు పాయింట్లతో పూల్-ఎలో అగ్రస్థానంలో నిలిచింది. సోమవారం లీగ్ ఆఖరి మ్యాచ్‌లో కజకిస్థాన్‌తో భారత్ తలపడనుంది. ఇక, సూపర్-4లో స్థానం కోసం జపాన్, చైనా అమీతుమీ తేల్చుకోనున్నాయి. ఇదే గ్రూప్‌లో జరిగిన మరో మ్యాచ్‌లో చైనా 13-1తో కజకిస్థాన్‌ను చిత్తు చేసింది.

అద్వితీయం

● మరో కాంస్యంతో మెరిసిన సాత్విక్, చిరాగ్ జోడీ
● ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్



పారిస్: నిరుడు పారిస్ వేదికగా జరిగిన ఒలింపిక్స్‌లో ఫేవరెట్‌గా బరిలోకి దిగిన భారత బ్యాడ్మింటన్ డబుల్స్ స్టార్ జోడీ సాత్విక్ సాయిరాజ్, చిరాగ్ షెట్టి క్వార్టర్‌ఫైనల్లోనే పరాజయం పాలై నిరాశగా వెనుదిరిగింది. సరిగ్గా ఏడాది తిరిగే సరికి.. అదే వేదిక.. కానీ టోర్నీ ప్రపంచ చాంపియన్‌షిప్.. ఈసారి ఫలితం కూడా మారింది. విశ్వక్రీడల్లో పతకం దూరమైనా, ప్రపంచ టోర్నీలో కాంస్యం సాధించి సాత్విక్, చిరాగ్ జంట అబ్బురపరిచింది. శనివారం అర్ధరాత్రి ఇక్కడ జరిగిన పురుషుల డబుల్స్ సెమీఫైనల్లో ప్రపంచ తొమ్మిదో ర్యాంక్ జోడీ సాత్విక్/చిరాగ్ 19-21, 21-18, 12-21తో ప్రపంచ 11వ ర్యాంకరైన చైనా జంట చెన్ బో యాంగ్/లియు యీ చేతిలో పోరాడి ఓడింది. సెమీస్ ఓటమితో సాత్విక్ ద్వయం కంచు పతకానికే పరిమితమైనా.. ప్రపంచ చాంపియన్‌షిప్‌లో రెండోసారి పతకం నెగ్గి అ'ద్వితీయ'ం అనిపించుకుంది. ఈ మెగా టోర్నీలో రెండు పతకాలు సాధించిన భారత డబుల్స్ జోడీగా సరికొత్త చరిత్ర సృష్టించింది. 2022 టోక్యోలో జరిగిన ప్రపంచ చాంపియన్‌షిప్‌లో సాత్విక్/చిరాగ్ జంట కాంస్యం సాధించిన సంగతి తెలిసిందే.

15

ఇప్పటిదాకా ప్రపంచ చాంపియన్‌షిప్‌లో భారత షట్లర్లు సాధించిన పతకాలు. మహిళల సింగిల్స్‌లో సింధు (ఓ స్వర్ణం, రెండు రజతాలు, రెండు కాంస్యాలు), సైనా నెహ్వాల్ (ఓ రజతం, ఓ కాంస్యం), మహిళల డబుల్స్‌లో జ్వాల/అశ్విని (కాంస్యం), పురుషుల సింగిల్స్‌లో కిదాంబి శ్రీకాంత్ (రజతం), ప్రకాశ్ పదుకోన్ (కాంస్యం), సాయి ప్రణీత్ (కాంస్యం), ప్రణయ్ (కాంస్యం), లక్ష్య సేన్ (కాంస్యం), పురుషుల డబుల్స్‌లో సాత్విక్/చిరాగ్ (రెండు కాంస్యాలు) పతకాలు గెలిచారు.

షి యుకి, యమగూచిలకు సింగిల్స్ టైటిళ్లు: ప్రపంచ చాంపియన్‌షిప్ సింగిల్స్ టైటిళ్లను షి యుకి (చైనా), అకానె యమగూచి (జపాన్) దక్కించుకున్నారు. ఆదివారం జరిగిన పురుషుల సింగిల్స్ ఫైనల్లో షి యుకి 19-21, 21-10, 21-18తో కున్లావత్ వితిసార్న్ (థాయ్‌లాండ్)పై గెలిచి విజేతగా నిలిచాడు. ఆండెర్స్ ఆంటోన్సెన్ (డెన్మార్క్), విక్టర్ లాయ్ (కెనడా) కాంస్య పతకాలతో సరిపెట్టుకున్నారు. మహిళల సింగిల్స్ టైటిల్ పోరులో యమగూచి 21-9, 21-13తో చైనా స్టార్ చెన్ యుఫీని చిత్తుచేసి స్వర్ణం అందుకుంది. అన్ సే యంగ్ (కొరియా), క్వార్టర్స్‌లో సింధును ఓడించిన పుత్రి కుసుమ వర్దాని (ఇండోనేసియా) కాంస్య పతకాలు సాధించారు. కొరియా జంట సియో సంగ్ జే/కిమ్ వోన్ హొ 21-17, 21-12తో చైనా జోడీ చెన్ బో యాంగ్/లూ యికి షాకిచ్చి పురుషుల డబుల్స్ చాంపియన్‌గా నిలిచింది.

అడ్డంకులు అధిగమించి..

గతేడాది పారిస్ విశ్వక్రీడల వైఫల్యం నుంచి కోలుకోవడానికి అమలాపురం కుర్రాడు సాత్విక్, ముంబై షట్లర్ చిరాగ్‌కు చాలా రోజులే పట్టింది. ఒలింపిక్స్ తర్వాత ఏకంగా మూడున్నర నెలలపాటు విశ్రాంతి తీసుకొన్నారు. ఆ తర్వాత 2024 నవంబరులో చైనా మాస్టర్స్ బరిలోకి దిగిన సాత్విక్ జంట సెమీస్ చేరింది. అయితే, చిరాగ్ వెన్నునొప్పితో బాధ పడడంతో మళ్లీ రెండు నెలలు ఆటకు దూరమైంది. జనవరిలో రీఎంట్రీ ఇచ్చిన ఈ జోడీ.. మలేసియా ఓపెన్, ఇండియా ఓపెన్‌లో సెమీస్ చేరింది. క్రమంగా పరిస్థితులు గాడిలో పడుతున్న సమయంలో ఫిబ్రవరిలో సాత్విక్ తండ్రి మరణం విషాదాన్ని మిగిల్చింది. చిరాగ్‌తో కలిసి ఖేల్‌రత్న అవార్డు అందుకునేందుకు వెళ్తున్న సమయంలో సాత్విక్ తండ్రి కాశీ విశ్వనాథం గుండెపోటుతో మరణించాడు. ఈ విషాదం నుంచి తేరుకొని బీడబ్ల్యూఎఫ్ వరల్డ్ టూర్ ఫైనల్స్‌లో సాత్విక్ జంట పోటీపడ్డా.. ఆ టోర్నీలో రాణించలేకపోయింది. ఇలా ఎన్నో అడ్డంకులను అధిగమిస్తూనే సాత్విక్, చిరాగ్ ద్వయం వరల్డ్ చాంపియన్‌షిప్‌నకు సిద్ధమైంది. కానీ, ఈ టోర్నీలో మాత్రం ఎక్కడా తడబడకుండా సెమీస్‌దాకా చేరి పతకాన్ని ఖాయం చేసుకుంది. ప్రీక్వార్టర్స్‌లో ఆరో సీడ్, చైనా జోడీ లియాంగ్-వాంగ్ చాంగ్‌లను ఓడించిన సాత్విక్ ద్వయం.. క్వార్టర్స్‌లో ఆరోన్ చియా-సో వూ యిక్ జీపై నెగ్గిన తీరు అద్భుతం. ఇక, సెమీస్‌లో ఓడినా, ఓవరాల్‌గా రెండో ప్రపంచ పతకంతో సాత్విక్ జంట కెరీర్‌లో మరో మెట్టు పైకెక్కింది.

(ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం)

బుమ్రా, రోహిత్, గిల్ 'ఫిట్‌నెస్' పాసయ్యారు

బెంగళూరు: టీమిండియా టెస్ట్ కెప్టెన్ గిల్, వన్డే సారథి రోహిత్ శర్మతోపాటు పేసర్ బుమ్రా ఫిట్‌నెస్ పరీక్షలో పాసయ్యారు. రాబోయే సీజన్‌ను పురస్కరించుకుని టీమిండియా క్రికెటర్లకు ఇక్కడి సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీలో బీసీసీఐ ఆదివారం ఫిట్‌నెస్ టెస్ట్ నిర్వహించింది. ఆ ముగ్గురితోపాటు జితేశ్ శర్మ, సిరాజ్, జైస్వాల్,సుందర్, శార్దూల్ కూడా టెస్ట్‌లో పాల్గొన్నారు. యోయో టెస్ట్‌తోపాటు కొత్తగా ఎముకల సాంద్రతను కొలిచే 'డీఎక్స్‌ఏ' స్కాన్ కూడా ఆటగాళ్లకు నిర్వహించారు.

నీ బ్యాటింగ్ టెస్ట్ క్రికెట్‌కు అందం

● పుజారపై ప్రధాని ప్రశంసలు

న్యూఢిల్లీ: టెస్ట్ క్రికెట్ సొబగు చటేశ్వర్ పుజార బ్యాటింగ్‌తో మరింత గుబాళించిందని ప్రధాని మోదీ కొనియాడారు. అతడి బ్యాటింగ్ శైలి సుదీర్ఘ ఫార్మాట్ అందానికి అద్దం పడుతుందని ప్రశంసించారు. ఇటీవల టెస్ట్ క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించిన సౌరాష్ట్ర ఆటగాడికి ప్రధాని లేఖ రాశారు. 'పొట్టి క్రికెట్ ఆధిపత్యం చెలాయిస్తున్న కాలంలో..సుదీర్ఘ ఫార్మాట్ ఆట అందం ఎలా ఉంటుందో చెప్పేందుకు నువ్వే తార్కాణం. వెన్ను చూపని నీ తత్త్వం, గొప్ప సంకల్పంతో గంటలకొద్దీ బ్యాటింగ్ చేయగల సామర్థ్యంతో భారత బ్యాటింగ్‌కు అండగా నిలిచావు' అని ఆ లేఖలో ప్రధాని పొగిడారు. ఈమేరకు మోదీ పంపిన లేఖను పుజార ఆదివారం నాడు సోషల్‌మీడియాలో పోస్ట్ చేశాడు.

రెండో వన్డే కూడా లంకదే

హరారే: జింబాబ్వేతో రెండు వన్డేల సిరీస్‌ను పర్యాటక శ్రీలంక 2-0తో క్లీన్‌స్వీప్ చేసింది. పథుం నిస్సంక (122) శతకంతో చెలరేగడంతో.. ఆదివారం జరిగిన రెండో వన్డేలో లంక 5 వికెట్లతో జింబాబ్వేపై గెలిచింది. మొదట జింబాబ్వే 50 ఓవర్లలో 277/7 స్కోరు చేసింది. బెన్ కర్రాన్ (79), సికందర్ రజా (59) అర్ధ శతకాలు సాధించారు. ఛేదనలో లంక 49.3 ఓవర్లలో 5 వికెట్లకు 278 పరుగులు చేసి గెలిచింది. చరిత్ అసలంక (71) రాణించాడు.

జ్వెరెవ్ అవుట్

యూఎస్ ఓపెన్

● ప్రీక్వార్టర్స్‌కు సినర్, స్వియటెక్



జ్వెరెవ్

ఫెలిక్స్

న్యూయార్క్: యూఎస్ ఓపెన్‌లో మూడో సీడ్ అలెగ్జాండర్ జ్వెరెవ్‌కు మూడో రౌండ్‌లో చుక్కెదురైంది. ఆదివారం జరిగిన ఉత్కంఠ పోరులో జ్వెరెవ్ (జర్మనీ) 6-4, 6-7 (7/9), 4-6, 4-6తో 25వ సీడ్ ఫెలిక్స్ అలియసిమ్ (కెనడా) చేతిలో ఓడాడు. 2018 తర్వాత జ్వెరెవ్ నాలుగో రౌండ్‌కు చేరకపోవడం ఇదే తొలిసారి. ఇక ఆదివారం తెల్లవారుజామున ముగిసిన మూడో రౌండ్‌లో వరల్డ్ నెంబర్ వన్ యానిక్ సినర్ 5-7, 6-4, 6-3, 6-3తో షపోవలోవ్‌పై గెలిచి ప్రీక్వార్టర్స్ చేరాడు. మరో మ్యాచ్‌లో రుబ్లెవ్ 2-6, 6-4, 6-3, 4-6, 6-3తో కొలెమాన్ వాంగ్‌పై పోరాడి గెలిచాడు. మహిళల సింగిల్స్ మూడో రౌండ్‌లో రెండో సీడ్ స్వియటెక్ 7-6, 6-4తో అన్నా కలిన్‌స్కయపై, నాలుగో సీడ్ జెస్సికా పెగుల 6-1, 6-1తో ఆన్ లీపై, 8వ సీడ్ ఎనిమిసోవా 6-4, 4-6, 6-2తో క్రిస్టియాన్‌పై గెలిచి ప్రీక్వార్టర్స్‌లో ప్రవేశించారు.

రెండో రౌండ్‌లో యుకీ జోడీ: పురుషుల డబుల్స్‌లో భారత ఆటగాళ్లకు మిశ్రమ ఫలితాలు లభించాయి. తొలిరౌండ్లో రోహన్ బోపన్న/అర్నెడో జంట ఓడగా.. యుకీ భాంబ్రీ/మైకేల్ వీనస్ జంట ప్రత్యర్థిని ఓడించింది.

తలైవాస్‌పై యు ముంబా గెలుపు

ప్రో కబడ్డీ లీగ్



విశాఖపట్నం స్పోర్ట్స్ (ఆంధ్రజ్యోతి): ప్రో కబడ్డీ లీగ్‌లో తమిళ్ తలైవాస్‌కు యు ముంబా ఝలక్ ఇచ్చింది. ఆదివారం ఇక్కడ జరిగిన తొలి మ్యాచ్‌లో యు ముంబా 36-33తో తమిళ్ తలైవాస్‌పై నెగ్గింది. తలైవాస్ రైడర్లు అర్జున్ దేశ్వాల్, కెప్టెన్ పవన్ సెహ్రావత్ 17 పాయింట్లు రాబట్టి జట్టు విజయంలో కీలకపాత్ర పోషించారు. అనంతరం జరిగిన రెండో మ్యాచ్‌లో బెంగాల్ వారియర్స్ 54-44తో హరియాణా స్టీలర్స్‌పై విజయం సాధించింది. ఇక, సోమవారం జరిగే పోటీలో పట్నా పైరేట్స్‌తో యూపీ యోధాస్, గుజరాత్ జెయింట్స్‌తో పుణెరి పల్టన్ జట్లు తలపడనున్నాయి.

ఆర్చర్ చికితకు టీఏఏ సన్మానం



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి): ఇటీవల ప్రపంచ యూత్ ఆర్చరీ చాంపియన్‌షిప్‌లో స్వర్ణం సాధించిన కరీంనగర్ జిల్లా ఆర్చర్ చికితా రావు వచ్చే ఒలింపిక్స్‌లోనూ పతకం సాధిస్తుందన్న విశ్వాసముందని తెలంగాణ ఆర్చరీ సంఘం (టీఏఏ) అధ్యక్షులు టి. రాజు అన్నారు. ఆదివారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో జరిగిన కార్యక్రమంలో చికితను టీఏఏ తరఫున రాజు సన్మానించారు.

సెమీస్‌లో నార్త్, సెంట్రల్ జోన్లు

బెంగళూరు: దులీప్ ట్రోఫీలో నార్త్ జోన్, సెంట్రల్ జోన్ జట్లు తమ తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం ద్వారా సెమీస్‌లో ప్రవేశించాయి. ఆదివారం ఈస్ట్ జోన్‌తో ముగిసిన క్వార్టర్స్‌ను నార్త్ జోన్ డ్రాగా ముగించింది. మూడో రోజే 563 పరుగుల భారీ ఆధిక్యం దక్కించుకున్నప్పటికీ నార్త్ తమ ఆటను కొనసాగించింది. ఈక్రమంలో ఆయుష్ బదోని (204) డబుల్ సెంచరీ సాధించగా, కెప్టెన్ అంకిత్ (198) తృటిలో ఈ ఫీట్ మిస్సయ్యాడు. ఇక రెండో ఇన్నింగ్స్‌లో 658/4 స్కోరు వద్ద నార్త్ జోన్‌డిక్లేర్ చేయడంతో ఇరుజట్లు డ్రాకు అంగీకరించాయి. దీంతో తొలి ఇన్నింగ్స్ 833 పరుగుల ఆధిక్యంతో నార్త్ సెమీస్ చేరింది. ఈస్ట్ జోన్ తొలి ఇన్నింగ్స్‌లో 230 రన్స్ చేసింది. సెంట్రల్ జోన్-నార్త్ ఈస్ట్ జోన్ మధ్య క్వార్టర్స్ కూడా డ్రాగా ముగిసింది. అయితే 478 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యంతో సెంట్రల్ జోన్ సెమీస్‌లో అడుగు పెట్టింది. ఆదివారం ఆఖరి రోజు నార్త్ ఈస్ట్ రెండో ఇన్నింగ్స్‌లో 200/6 స్కోరు చేసింది.

రషీద్‌కు చోటు: స్పిన్నర్ సాయి కిశోర్ గాయంతో దూరమవడంతో అతని స్థానంలో ఆంధ్ర యువ బౌలర్ షేక్ రషీద్‌ను సౌత్ జోన్ జట్టులోకి తీసుకున్నారు. ఇక, తిలక్ వర్మ ఆసియా కప్‌లో ఆడనుండడంతో.. అతని స్థానంలో సెమీస్‌కు సౌత్ జోన్ కెప్టెన్‌గా అజారుద్దీన్‌ను నియమించారు.

www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

సోమవారం | 1-9-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 154 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షఋతువు, భాద్రపదమాసం, శుక్లపక్షం; తిథి: నవమి రా2.43 తదుపరి దశమి; నక్షత్రం: జ్యేష్ఠ రా.7.55 తదుపరి మూల; వర్జ్యం: తె.4.33-6.17; దుర్ముహూర్తం: మ.12.39-1.29, మ.3.07-3.57; అమృతఘడియలు: ఉ.10.12-11.58; రాహుకాలం: ఉ.7.30-9.00; సూర్యోదయం: 6.04; సూర్యాస్తమయం: 6.25 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

యూపీఎస్సీ 'ప్రతిభా సేతు'



- అన్ని పరీక్షల్లో పాసైనా.. సర్వీసులకు ఎంపిక కాని అభ్యర్థుల వివరాలతో డేటాబేస్
- ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలకు డేటా యాక్సెస్
- దాని ద్వారా ప్రతిభావంతులకు ఉద్యోగావకాశాలు
- యూపీఎస్సీ ప్రయత్నాన్ని ప్రశంసించిన మోదీ

2

కాళేశ్వరంపై సీబీఐ

విచారణకు అప్పగించాలని అసెంబ్లీ నిర్ణయం.. సీఎం ప్రకటన



- లక్ష కోట్లు దోచుకున్న దోపిడీ దొంగ కేసీఆర్
- ప్రజాస్వామ్యం కాబట్టి నడి బజారులో ఉరి తీయలేదు
- కేంద్ర సంస్థలు, అంతర్రాష్ట్ర అంశాలు ఇమిడి ఉన్నందున సీబీఐకి అప్పగించడమే మంచిదని నిర్ణయించాం: సీఎం రేవంత్

దోచుకుని.. దబాయింపు

- జస్టిస్ పీసీ ఘోష్ పైనే వ్యక్తిగత విమర్శలు చేస్తున్నారు
- కేంద్రం అనుమతిచ్చినా తుమ్మిడిహెట్టి వద్ద ఎందుకు కట్టలే?
- నీటి లభ్యత ఉందన్నా పునఃపరిశీలించాలని ఎందుకడిగారు?
- శాసనసభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ధ్వజం
- జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదికపై వాడీవేడి చర్చ

10



హైదరాబాద్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో అవకతవకలపై రాష్ట్ర ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది. దీనిని సీబీఐ విచారణకు అప్పగించాలని నిర్ణయించింది. బ్యారేజీలపై జస్టిస్ పినాకిచంద్ర ఘోష్ కమిషన్ సమర్పించిన నివేదికను శాసనసభలో ప్రవేశపెట్టిన ప్రభుత్వం.. దీనిపై సమగ్రంగా చర్చించిన అనంతరం ఈ నిర్ణయం తీసుకుంది. ఆదివారం అర్ధరాత్రి దాటాక శాసనసభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ నిర్ణయాన్ని వెలువరించారు. ఈ సందర్భంగా విచారణను సీబీఐకి అప్పగించడానికి కారణాలను ఆయన వివరించారు. "కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణంలో జరిగిన అవకతవకలపై విచారణ జరిపించేందుకు తెలంగాణ ప్రభుత్వం జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్‌ను ఏర్పాటు చేసింది. నివేదికను జూలై 31న ప్రభుత్వానికి అందిస్తే... ఆగస్టు 4న మంత్రివర్గం ఈ నివేదికను ఆమోదించింది. తదుపరి మంత్రివర్గ నిర్ణయంతో అసెంబ్లీలో పెట్టి, చర్చ చేపట్టాం. కమిషన్ క్రిమినల్ చర్యలకు ఉపక్రమించాలని సిఫారసు చేసింది. విచారణలో అనేక

మిగతా 10వ పేజీలో...

బీఆర్ఎస్ ఎమ్మెల్యేల వాకౌట్

- గన్‌పార్క్ వద్ద నిరసన.. ఘోష్ నివేదిక అంతా ట్రాష్
- కాంగ్రెస్ కుట్రలను ఎండగడతామన్న కేటీఆర్, హరీశ్

12

చెత్త నివేదిక.. చిత్తుకాగితంతో సమానం

- రాజ్యాంగం కల్పించిన హక్కుగా కోర్టుకెళ్తే తప్పేంటి?
- ప్రభుత్వం నడుపుతున్నారా? సర్కస్ కంపెనీనా?: హరీశ్
- ప్రతిపక్ష బీఆర్ఎస్ తరపున 'ఒకే ఒక్కడు'గా ప్రసంగం

రాత్రికి రాత్రే నిర్ణయాలు.. 11 వేల కోట్లు వృథా: పొంగులేటి

బీఆర్ఎస్ చెప్పిన గుండెకాయే పగిలింది: ఉత్తమ్

కాళేశ్వరం లాగే హరీశ్‌రావు కుంగిపోతున్నారు: భట్టి

శాసనసభ నిరవధిక వాయిదా

కేసీఆర్ పాపమే

- ఆయన వల్లే కాళేశ్వరం కుంగుబాటు.. ఖజానాకు భారీ నష్టం
- ఆయనపై చట్టపరంగా చర్యలు తీసుకునే స్వేచ్ఛ ప్రభుత్వానికి ఉంది
- కేసీఆర్ కల నిజం చేసే బాధ్యతను నాటి మంత్రి హరీశ్ తీసుకున్నారు
- అప్పటి ఆర్థిక మంత్రి ఈటల నిశ్శబ్ద నేరస్థుడిలా సహకరించారు
- సోలో నిర్ణయాలు, ప్రణాళికలు, డిజైన్ లోపాలు, ఆర్థిక అవకతవకలు
- బాధ్యులైన అధికారులపై జాలి వద్దు.. కఠిన చర్యలు తీసుకోవాల్సిందే
- జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదికలో పలు కీలక సిఫారసులు
- క్యాబినెట్ ముందుంచాం.. ఏమో తెలియదు!.. స్మిత భిన్న జవాబులు
- ఆమెపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్న కమిషన్

హైదరాబాద్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టు బ్యారేజీల కుంగుబాటుకు, రాష్ట్ర ఖజానాకు భారీ నష్టం కలగడానికి నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ సొంత నిర్ణయాలే కారణమని జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ తేల్చింది. ఒంటెద్దు పోకడతో ఆయన కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణానికి నిర్ణయం తీసుకున్నారని, బ్యారేజీలు ఎక్కడ కట్టాలనే నిర్ణయంలో తీవ్ర తప్పిదాలు జరిగాయని పేర్కొంది. నిపుణుల కమిటీ ఇచ్చిన నివేదిక, మంత్రివర్గం ఉపసంఘం, హైపవర్ కమిటీ.. ఏదీ కూడా మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల దగ్గర బ్యారేజీలు కట్టాలని సిఫారసు చేయలేదని, అది కేసీఆర్ సోలో

మిగతా 11వ పేజీలో...

గూగుల్ మ్యాపులు చూసి.. ప్రాజెక్టు లొకేషన్

- అలైన్‌మెంట్, నిర్మాణ రకాలు కూడా గూగుల్ మ్యాప్ ద్వారానే
- మాజీ సీఎస్ జోషి అఫిడవిట్
- రాజకీయ ఒత్తిడితో వేగంగా ప్రాజెక్టు పూర్తి.. నాణ్యత గాలికి
- ఫలితంగా కుంగిన బ్లాకులు
- కేసీఆర్ ద్వారా డిజైన్ల మార్పులు
- స్పష్టం చేసిన కమిషన్ నివేదిక

11

బీఆర్ఎస్ వల్లే ఆగిన బిల్లులు!



- బీసీ రిజర్వేషన్ బిల్లులను రాష్ట్రపతికి పంపడం వెనక బీఆర్ఎస్ పాత్ర
- గత ప్రభుత్వం తెచ్చిన చట్టాలే నేడు గుదిబండలుగా మారాయి
- వాటిని అధిగమించేందుకు ఆర్డినెన్స్ తెస్తే గవర్నర్ ఆమోదించకుండా చేశారు
- కల్వకుంట్ల కుటుంబం కాదు.. ఎవరినీ కలవకుండా చేసే కుటుంబం
- రిజర్వేషన్లపై ఆ పార్టీకి సంతోషం లేదు.. ఢిల్లీ ధర్నాలో ఎందుకు పాల్గొనలేదు?
- శాసనసభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు

హైదరాబాద్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో బీసీ రిజర్వేషన్ బిల్లులు గవర్నర్ ఆమోదం పొందకుండా వాటిని రాష్ట్రపతికి పంపడం వెనక బీఆర్ఎస్ పాత్ర ఉందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆరోపించారు. బీసీలకు విద్య, ఉద్యోగ అవకాశాలు, స్థానిక సంస్థల ఎన్నికల్లో 42% రిజర్వేషన్లు కల్పించేందుకు తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో రెండు బిల్లులను ఆమోదించి, గవర్నర్‌కు పంపితే.. వాటిని రాష్ట్రపతికి పంపారని తెలిపారు. ఐదు నెలలుగా అవి రాష్ట్రపతి వద్ద పెండింగ్‌లోనే ఉన్నాయన్నారు. ప్రస్తుత గవర్నర్ ఒకప్పుడు ఆర్థిక మంత్రిగా పనిచేశారని, గతంలో తెలంగాణ రాష్ట్రానికి ఆర్థిక మంత్రిగా పనిచేసిన ఓ వ్యక్తి.. బీసీ బిల్లులను రాష్ట్రపతికి పంపేలా గవర్నర్ వద్ద తెరవెనుక లాబీయింగ్ చేశారని చెప్పారు. ఆదివారం శాసనసభలో మునిసిపల్, పంచాయతీరాజ్ చట్ట సవరణ బిల్లులపై సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం 2018లో తీసుకొచ్చిన పంచాయతీరాజ్ చట్టం, 2019లో తెచ్చిన మునిసిపల్ చట్టం.. స్థానిక సంస్థల్లో 50 శాతం లోపే రిజర్వేషన్లు ఉండాలని చెబుతున్నాయన్నారు. అవే ఇప్పుడు పెద్ద గుదిబండలుగా మారాయన్నారు. ఆ అడ్డంకులను అధిగమించి, స్థానిక ఎన్నికలు నిర్వహించడానికి ప్రభుత్వం వెంటనే ఆర్డినెన్స్ తీసుకొచ్చిందని, దాన్ని మళ్లీ గవర్నర్‌కు

మిగతా 12వ పేజీలో...

రిజర్వేషన్లపై.. నేడు గవర్నర్ వద్దకు కాంగ్రెస్

బీసీ రిజర్వేషన్ల బిల్లుకు అసెంబ్లీ ఆమోదం

చాట్‌జీపీటీని నమ్మి.. తల్లిని చంపి..



- ఆపై ఆత్మహత్య చేసుకున్న అమెరికా వ్యక్తి
- కృత్రిమ మేధ ప్రమేయంతో తొలి హత్య!
- మానవ సంబంధాలను దెబ్బతీస్తున్న ఏఐ
- ఏఐ భాగస్వాములతో ఒంటరితనం తగ్గదు.. పెరుగుతుంది
- మనస్తత్వ శాస్త్ర నిపుణుల హెచ్చరిక

2

'ఎడ్యుకేట్ గర్ల్స్'కు మెగసెసే అవార్డు

- ఈ పురస్కారం దక్కించుకున్న తొలి భారతీయ సంస్థ
- పల్లెల్లో బాలికల విద్య కోసం విశేష కృషి
- దేశవ్యాప్తంగా 30 వేల గ్రామాల్లో ఆడపిల్లల అక్షరాస్యత పెంపు

2

సరిహద్దు లేని బంధం!



ఎస్‌సీవో సదస్సులో చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో మోదీ కరచాలనం

సమస్యను సహేతుకంగా తేల్చుకుందాం

- సరిహద్దు సమస్య మన బంధానికి అడ్డురావొద్దు
- ఇరుదేశాల మధ్య వాణిజ్యం పెంచుకుందాం
- శత్రువుల్లా కాదు.. అభివృద్ధి భాగస్వాములుగా
- రాజకీయ, వ్యూహాత్మక కోణంలో సాగుదాం
- ప్రధాని మోదీ, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ నిర్ణయం
- బంధం బాగుండాలంటే శాంతి, సుస్థిరత్వం ముఖ్యం
- పరస్పర నమ్మకం, గౌరవంతో ముందుకెళదాం
- మన బంధాలను మూడో దేశం కోణంలో చూడొద్దు
- భారత్, చైనా మధ్య సహకారం
- మానవాళి సంక్షేమానికి బాటలు వేస్తుంది: మోదీ
- భారత్-చైనా స్నేహితులుగా ఉండడమే మంచిది
- డ్రాగన్, ఏనుగు కలిసి డ్యాన్స్ చేయాలి: జిన్‌పింగ్
- వచ్చే ఏడాది భారత్‌లో జరిగే బ్రిక్స్ సదస్సుకు రావాలని జిన్‌పింగ్‌కు మోదీ ఆహ్వానం
- బ్రిక్స్ అధ్యక్షత కోసం భారత్‌కు జిన్‌పింగ్ మద్దతు

టియాంజిన్ (చైనా), ఆగస్టు 31: భారత్, చైనా మధ్య సరిహద్దు వివాదాలకు సహేతుకమైన, పరస్పర అంగీకారంతో కూడిన పరిష్కారం కనుగొనేందుకు కృషి చేయాలని ప్రధాని మోదీ, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ నిర్ణయానికి వచ్చారు. ఇరుదేశాల వాణిజ్య బంధాన్ని మరింత బలోపేతం చేసుకునే చర్యలపై అంగీకారానికి వచ్చారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తీరుతో ప్రపంచవ్యాప్తంగా వాణిజ్య అస్థిరత నెలకొన్న సమయంలో మోదీ, జిన్‌పింగ్ భేటీలో వాణిజ్యంపై ప్రత్యేకంగా చర్చించడం ప్రాధాన్యం సంతరించుకుంది. షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీవో) సదస్సులో పాల్గొనేందుకు చైనా వెళ్లిన

మిగతా 2వ పేజీలో...

స్వదేశీ ఉత్పత్తులే ముద్దు!

ట్రంప్ సుంకాల వేళ మోదీ పిలుపు.. ఆత్మనిర్భరతతో అగ్రదేశంగా మారదాం!
బహుమతులు, వస్త్రాలు, అలంకార సామగ్రి.. దేశీయ వస్తువులనే వాడండి
ప్రధానంగా పండుగల్లో ఇవే వినియోగించండి.. 'మన్ కీ బాత్'లో ప్రధాని

2

అమెరికా కాలేజీలు కుదేలు!

2

- ఎఫ్-1 వీసాల అనుమతులు 22 శాతం మేరకు నిలిపివేత
- విదేశీ విద్యార్థుల రాకకు బ్రేక్
- రూ.61 వేల కోట్ల రాబడికి గండి
- ట్రంప్ విధానాలతో తీవ్ర నష్టం



సెప్టెంబరులోనూ అధిక వర్షాలే!

- దీర్ఘకాల సగటులో 109% నమోదు?
- కొండచరియలు విరిగిపడే ముప్పు: ఐఎండీ
- రేపు బంగాళాఖాతంలో అల్పపీడనం
- రానున్న రెండు వారాల్లో తెలంగాణ, ఏపీకి భారీ వర్షాలు, వరద ముప్పు: వెదర్ మ్యాన్

2

ఆగస్టులో రికార్డు స్థాయిలో వానలు

- సాధారణం కంటే 75% అధిక వర్షపాతం
- జూన్ నుంచి ఆగస్టుదాకా 26% అధికం
- మరో 2 రోజులు పలు జిల్లాల్లో భారీ వర్షం

7

బ్యాంకు బంగారం తాకట్టు పెట్టి క్రికెట్ బెట్టింగ్

- ఏకంగా 25 కిలోల పసిడి తాకట్టు
- మంచిర్యాల జిల్లా చెన్నూరు ఎస్‌బీఐ మేనేజర్, క్యాషియర్ నిర్వాకం
- నిందితుల వద్ద నుంచి 15 కిలోల బంగారం, రూ.1.61లక్షలు స్వాధీనం
- సూత్రధారితోపాటు 44 మంది అరెస్టు

3

యూపీఎస్సీ ద్వారా 'ప్రతిభా సేతు'

» అన్ని పరీక్షల్లో పాసైనా సర్వీసులకు ఎంపిక కాని అభ్యర్థుల వివరాలతో డేటాబేస్.. వేరే ఉద్యోగాల్లో అవకాశాలు

న్యూఢిల్లీ, ఆగస్టు 31: యూపీఎస్సీ నిర్వహించే పరీక్షల్లో ఉత్తీర్ణులైనా.. అన్ని దశల్లోనూ మెరిట్‌లో ఉన్నా.. స్వల్ప స్కోరు తేడాతో ఆయా పోస్టుల ఎంపిక తుది జాబితాలో చోటు దక్కని అభ్యర్థులకు శుభవార్త..! ఇలాంటి అభ్యర్థులు ఎంపిక కాకపోయినా.. ప్రతిభావంతులేనని పేర్కొంటూ యూపీఎస్సీ తాజాగా 'ప్రతిభా సేతు' పోర్టల్‌ను ప్రారంభించింది. స్వల్ప స్కోరు తేడాతో తుది జాబితాలో చోటు దక్కని 10 వేల మంది అభ్యర్థుల డేటాబేస్‌ను ఆ పోర్టల్‌లో అందుబాటులో పెట్టనుంది. తమ పోర్టల్‌లో రిజిస్టర్ చేసుకున్న ప్రభుత్వ సంస్థలు, ప్రైవేటు/కార్పొరేట్ కంపెనీలకు ఈ డేటాబేస్‌ను పరిశీలించే వెసులుబాటు కల్పించింది. అభ్యర్థి పేరు, సెల్‌ఫోన్/ల్యాండ్‌లైన్ కాంటాక్ట్ నంబర్, విద్యార్హతలు వంటి వివరాలు ఈ పోర్టల్‌లో అందుబాటులో ఉంటాయి. దీంతో.. ఆయా కంపెనీలు, ప్రభుత్వ సంస్థలు కొలువుల భర్తీలో 'ప్రతిభా సేతు'లోని అభ్యర్థులకు ప్రాధాన్యతనిచ్చే అవకాశాలుంటాయని ప్రధాని మోదీ సైతం ప్రశంసించారు. యూపీఎస్సీ నిర్వహించే సివిల్ సర్వీసు పరీక్షలు, ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్, కేంద్ర సాయుధ పోలీసు బలగాలు(సీఏపీఎఫ్) తదితర పరీక్షల్లో అద్భుతమైన ప్రతిభ కనబర్చినా.. తుది జాబితాలో చోటు సంపాదించలేని అభ్యర్థుల వివరాలను ఈ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయనున్నట్లు యూపీఎస్సీ ఓ ప్రకటనలో తెలిపింది.

వాడని, బయట తిరగని వాహనాలపై పన్ను వేయొద్దు: సుప్రీం

న్యూఢిల్లీ, ఆగస్టు 31: బహిరంగ ప్రదేశాల్లో తిరగని లేదా అసలు వినియోగంలో లేని వాహనాల యజమానులకు మోటారు వాహన పన్ను భారం కాకూడదని సుప్రీం కోర్టు పేర్కొంది. ఆ కాలానికి వారు పన్ను చెల్లించాల్సిన పనిలేదని స్పష్టం చేసింది. 2024 డిసెంబరులో ఏపీ హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ దాఖలైన అప్పీల్‌పై సుప్రీం ధర్మాసనం తీర్పు వెలువరించింది. 'సహజంగా రోడ్లు, హైవేలు వంటి ప్రజా మౌలిక సదుపాయాలున్న పబ్లిక్ ప్లేస్‌ల్లో వాహనాలు వినియోగిస్తున్న వారు దాని కోసం పన్ను కట్టాలి. ఒక మోటారు వాహనాన్ని బహిరంగ ప్రదేశాల్లో తిప్పకపోతే, లేదా అసలు వాడుకలో లేకపోతే.. ఆ వ్యక్తి సంబంధిత మౌలిక సదుపాయాల నుంచి ప్రయోజనం పొందుతున్నట్లు కాదు. కాబట్టి ఆ కాలానికి సదరు వ్యక్తిపై మోటారు వాహన పన్ను భారం పడకూడదు' అని ఆగస్టు 29న ఇచ్చిన తీర్పులో సుప్రీం కోర్టు ధర్మాసనం స్పష్టం చేసింది.

బైక్‌పై కైలాస్ యాత్రను పూర్తి చేసిన సద్గురు

» రెండు బ్రెయిన్ సర్జరీల తర్వాత జగ్గీవాసుదేవ్ యాత్ర

కోయంబత్తూర్, ఆగస్టు 31: మోటారు సైకిల్‌పై కైలాస్ మానససరోవర్ యాత్రను పూర్తి చేసిన సద్గురు జగ్గీ వాసుదేవ్‌కు కోయంబత్తూరులో ఘన స్వాగతం లభించింది. ఈ నెల తొమ్మిదిన ఉత్తరప్రదేశ్‌లో మొదలుపెట్టిన యాత్రను సద్గురు 2రోజుల క్రితం పూర్తి చేశారు. రెండు సార్లు బ్రెయిన్ ఆపరేషన్లు చేయించుకున్న సద్గురు ఆ తర్వాత 18 నెలలకే ఈ యాత్రను పూర్తి చేయడం గమనార్హం. తన యాత్ర దిగ్విజయంగా పూర్తి కావడం యోగ వల్లనే సాధ్యమైందని సద్గురు ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. మోటారు సైకిల్‌పై తాను చేసిన ఈ యాత్రలో యోగ ఎంతో ఉపయోగపడిందని అన్నారు. ఆరోగ్య పరిస్థితుల రీత్యా తనను ఈ యాత్ర చేయవద్దని వైద్యులు సూచించారని, యోగాకున్న శక్తిని చాటేందుకు తాను దీనిని చేపట్టి... దిగ్విజయంగా పూర్తి చేసినట్లు తెలిపారు. ఆగస్టు 9న ఆయన ఈ యాత్రను ప్రారంభించారు.

నాటిన చెట్లలో బతికున్న వాటికే గ్రీన్ క్రెడిట్స్!

న్యూఢిల్లీ, ఆగస్టు 31: చెట్ల పెంపకాన్ని ప్రోత్సహించేందుకు తీసుకొచ్చిన గ్రీన్ క్రెడిట్స్‌ను లెక్కించే పద్ధతిని కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖ సవరించింది. గతంలోలా మొక్కలు నాటిన వెంటనే కాకుండా.. ఐదేళ్లు దాటిన తర్వాత వాటిలో బతికి ఉన్న చెట్ల ఆధారంగా క్రెడిట్స్ ఇవ్వాలని నిర్ణయించింది. ఈ క్రమంలో 2024 ఫిబ్రవరి 22న జారీచేసిన నోటిఫికేషన్‌ను ఈ ఏడాది ఆగస్టు 29న సవరించింది. దీనిప్రకారం గ్రీన్ క్రెడిట్ ప్రోగామ్ కింద ఇకపై క్రెడిట్‌లకు రివార్డులు కూడా ఇవ్వనున్నారు. పర్యావరణాన్ని పరిరక్షించేందుకు ఆయా సంస్థలు, కంపెనీలు స్వచ్ఛందంగా తీసుకున్న చర్యలకు ప్రతిఫలంగా ఇచ్చేవాటిని గ్రీన్ క్రెడిట్స్ అంటారు. సవరించిన నిబంధనల ప్రకారం.. వారు ఉపయోగించిన భూ విస్తీర్ణంలో కనీసం 40% స్థలంలో చెట్ల పెంపకం చేపట్టిన ఐదేళ్ల తర్వాతే గ్రీన్ క్రెడిట్స్ మంజూరు చేస్తారు. అలాగే వాళ్లు నాటిన మొక్కల్లో కనీసం ఐదేళ్లకుపైగా జీవించి ఉన్న ప్రతి కొత్త చెట్టుకూ ఒక గ్రీన్ క్రెడిట్ కేటాయిస్తారు.

బిహార్ ఓటర్లందరికీ కొత్త కార్డులు..!

పట్నా, ఆగస్టు 31: ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ తర్వాత బిహార్‌లోని ఓటర్లందరికీ కొత్త ఓటర్ కార్డులివ్వాలని ఎన్నికల సంఘం(ఈసీ) నిర్ణయించింది. ఈసీ ప్రకటించిన ముసాయిదా ఓటర్ల జాబితా ప్రకారం ఆగస్టు 1 నాటికి బిహార్‌లో 7.24 కోట్ల మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో అభ్యంతరాలకు ఆగస్టు 1 నుంచి సెప్టెంబరు 1 వరకు ఈసీ గడువు ఇచ్చింది. మొత్తం 7.24 కోట్ల మంది ఓటర్లలో 99.11 శాతం మంది ఇప్పటికే తమ ధృవీకరణ పత్రాలు సమర్పించారు. ముసాయిదా ఓటర్ల జాబితాలో తమ పేర్లు పొరపాటున వచ్చాయని, జాబితా నుంచి తొలగించాలని మొత్తం 2 లక్షల మంది కోరారు. అదే సమయంలో 33 వేల మంది తమ పేర్లను ఓటర్ జాబితాలో కలపాలని కోరారు. సెప్టెంబరు 30న ఈసీ తుది జాబితా ప్రకటించనుంది. కాగా, బిహార్‌లో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేపట్టిన ఓటర్ అధికార్ యాత్ర సోమవారంతో ముగియనుంది.

ఇండియన్లకు వ్యతిరేకంగా ఆస్ట్రేలియాలో ఆందోళన

కాన్‌బెర్రా, ఆగస్టు 31: విదేశాల నుంచి వచ్చిన వలసదార్లు, ప్రధానంగా భారతీయులకు వ్యతిరేకంగా ఆదివారం ఆస్ట్రేలియాలోని పలు నగరాల్లో ప్రదర్శనలు జరిగాయి. ఒక ప్రణాళిక ప్రకారం 'మార్చ్ ఫర్ ఆస్ట్రేలియా' పేరుతో ఈ ప్రదర్శనలను నిర్వహించారు. భారతీయుల వలసలు దేశ సంస్కృతికి ముప్పు కలిగిస్తున్నాయని నిర్వాహకులు ఆరోపించారు. ఇది 'కొత్త సంస్కృతి స్థాపన'కు దారి తీస్తుందని అభిప్రాయపడ్డారు. 100 ఏళ్లలో వచ్చిన గ్రీకులు, ఇటాలియన్ల కన్నా అయిదేళ్లలో వచ్చిన భారతీయుల సంఖ్యే అధికంగా ఉందని విమర్శించారు. వలసదార్ల కారణంగా ఇళ్ల కొరత ఏర్పడిందని, ఉద్యోగ భద్రత తగ్గిందని, జీవన ప్రమాణాలు, పర్యావరణం, జాతీయ గుర్తింపునకు ముప్పు ఏర్పడిందన్నారు.

చెప్పులో పాము.. కాటేయడంతో టెకీ మృతి

బెంగళూరు, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): చెప్పులో దాగి ఉన్న పాము కాటేయడంతో ఓ టెకీ ప్రాణాలు కోల్పోయాడు. బెంగళూరు జిల్లా బన్నేరుఘట్ట రంగనాథ లేఅవుట్‌లో మంజుప్రకాశ్(41) అనే టెకీ నివాసం ఉంటున్నాడు. శనివారం మధ్యాహ్నం ఇంటి బయట ఉండే చెప్పులు వేసుకుని కాస్త దూరంలోని సర్కిల్ దాకా నడిచి వెళ్లి చెరకు రసం తీసుకొచ్చాడు. ఆ తర్వాత గదిలోకి వెళ్లి పడుకున్నాడు. గంట తర్వాత ఇంటికి వచ్చిన ఓ కార్మికుడు చెప్పుల్లో నుంచి పాము బయటకు వస్తుండడాన్ని గుర్తించాడు. వెంటనే పామును చంపేశారు. ఆ చెప్పులు ప్రకాశ్‌కు చెందినవిగా గుర్తించి అతడి గదిలోకి వెళ్లి చూడగా.. అతడు అప్పటికే నోట్లో నురగ, రక్తం వచ్చి చనిపోయి ఉన్నాడు. మంజుప్రకాశ్ 2016లో బస్సు ప్రమాదంలో గాయపడడంతో శస్త్రచికిత్స చేయించుకున్నాడు. సయాటికా సమస్యతో కాలు కొంత మేర స్పర్శ ఉండడం లేదని ప్రకాశ్ తమ్ముడు హరీశ్ తెలిపారు. అందుకే పాము కాటేసినా గుర్తించలేక పోయి ఉండవచ్చని అభిప్రాయపడ్డారు.

రూ.లక్ష కోట్లతో జలాంతర్గాముల కొనుగోలు

న్యూఢిల్లీ, ఆగస్టు 31: చైనా ఇటీవలి కాలంలో తన నౌకాదళ సామర్థ్యాన్ని విస్తరిస్తున్న నేపథ్యంలో భారత్ కూడా సముద్రజలాలపై తన బలాన్ని చాటిచెప్పాలని భావిస్తోంది. ఇందుకోసం రూ.లక్ష కోట్లతో జలాంతర్గాముల కొనుగోలు చేయాలని, దీంట్లో భాగంగా రెండు భారీ ఒప్పందాలు చేసుకోవాలని నిర్ణయించినట్లు రక్షణ వర్గాలు తెలిపాయి. ఈ రెండు ఒప్పందాలను వచ్చే ఏడాది జూన్‌కల్లా పూర్తి చేయాలన్న ప్రణాళికలో ఉన్నట్లు వివరించాయి. మొదటి ఒప్పందంలో.. మూడు స్కార్పీన్ జలాంతర్గాములను రక్షణ శాఖ కొనుగోలు చేయనుంది. వీటిని ప్రభుత్వ రంగ సంస్థ మజగావ్ డాక్ లిమిటెడ్(ఎండీఎల్), ఫ్రెంచ్ రక్షణ సంస్థ నావల్ గ్రూప్ కలిసి తయారు చేయనున్నాయి. వీటికి రూ.36వేల కోట్లు అవుతాయని అంచనా. రెండో ఒప్పందంలో భాగంగా.. రూ.65వేల కోట్లతో ఆరు డీజిల్-ఎలక్ట్రిక్ స్టెల్త్ సబ్‌మెరైన్‌లను కొనుగోలు చేయనున్నారు. జర్మనీకి చెందిన టీకేఎంఎస్, మజగావ్ డాక్ షిప్ బిల్డర్స్ సంస్థలు సంయుక్తంగా వీటిని నిర్మించనున్నాయి.

సరిహద్దు లేని బంధం!

(మొదటి పేజీ తరువాయి)

ప్రధాని మోదీ.. ఆదివారం జిన్‌పింగ్‌తో భేటీ అయి చర్చించారు. మోదీ, జిన్‌పింగ్ భేటీకి సంబంధించి విదేశాంగ శాఖ ఒక ప్రకటన విడుదల చేసింది. "ద్వైపాక్షిక వాణిజ్యం, పెట్టుబడులను మరింత పెంచేందుకు, వాణిజ్య లోటును తగ్గించే దిశగా చర్యలు తీసుకునేందుకు ఇరువురు నేతలు అంగీకరించారు. ఉగ్రవాద నిర్మూలన, సహేతుక వాణిజ్యం అంశాలపై అంతర్జాతీయ వేదికలపై పరస్పర అవగాహనతో వ్యవహరించాలనే నిర్ణయానికి వచ్చారు. ప్రపంచ వాణిజ్యంలో స్థిరత్వాన్ని తీసుకురావడంలో ఇరుదేశాల పాత్ర కీలకమని గుర్తించారు. ద్వైపాక్షిక, వాణిజ్య సంబంధాలను విస్తరించడానికి రాజకీయ, వ్యూహాత్మక కోణంలో ముందుకు సాగాల్సిన అవసరంపై ప్రత్యేకంగా చర్చించారు. భారత్-చైనా శత్రువులు కాదని.. అభివృద్ధి భాగస్వాములని మోదీ, జిన్‌పింగ్ పునరుద్ఘాటించారు. ఇరుదేశాల మధ్య నెలకొన్న భిన్నాభిప్రాయాలు వివాదాలుగా మారవద్దని పేర్కొన్నారు. ఇరుదేశాల ప్రజల మధ్య బంధాలను బలోపేతం చేయడానికి వీలుగా.. నేరుగా విమాన సర్వీసుల పునరుద్ధరణ, వీసా ప్రక్రియ సరళతరం చేయడం, పర్యాటక వీసాల జారీ, మానస సరోవర్ యాత్ర పునః ప్రారంభం వంటి చర్యలపై దృష్టిసారించాలని నిర్ణయించారు. ఇరు దేశాల సరిహద్దుల్లో సైన్యాలను వెనక్కితీసుకోవడం, ఉద్రిక్తలను తగ్గించేందుకు తీసుకున్న చర్యలపై సంతృప్తి వ్యక్తం చేశారు" అని విదేశాంగ శాఖ తెలిపింది.



ఎస్‌సీవో సదస్సులో మోదీ, జిన్‌పింగ్

శాంతి, స్థిరత్వం ముఖ్యం: మోదీ

భారత్-చైనా సంబంధాలు బలోపేతం కావాలంటే.. సరిహద్దుల్లో శాంతి, స్థిరత్వం ఎంతో ముఖ్యమని ఈ సందర్భంగా మోదీ స్పష్టం చేశారు. పరస్పర నమ్మకం, గౌరవం ఆధారంగా ఇరుదేశాల సంబంధాలను ముందుకు తీసుకెళ్లేందుకు భారత్ కట్టుబడి ఉందని వివరించారు. భారత్, చైనా వ్యూహాత్మక స్వావలంబన పొందిన దేశాలని, ఈ రెండింటి మధ్య సంబంధాలను మూడో దేశం కోణంలో చూడొద్దని భేటీలో స్పష్టం చేశారు. భారత్, చైనా మధ్య సహకారం 280 కోట్ల మంది ప్రయోజనాలకు సంబంధించినదని.. ఇది ప్రపంచ మానవాళి సంక్షేమానికి మార్గం వేస్తుందని పేర్కొన్నారు.

ప్రత్యర్థులం కాదు..భాగస్వాములం: జిన్‌పింగ్

భారత్, చైనా స్నేహితులుగా ఉండటమే సరైన ఎంపిక అని.. సరిహద్దు సమస్యలు ఇరుదేశాల బంధాలను ప్రభావితం చేయవద్దని ప్రధాని మోదీతో జిన్‌పింగ్ పేర్కొన్నారు. ఇరుగుపొరుగు దేశాలుగా, ఒకరి విజయానికి మరొకరు తోడ్పడే భాగస్వాములుగా ఉండాలని.. డ్రాగన్ (చైనా చిహ్నం), ఏనుగు (భారత చిహ్నం) కలసి నృత్యం చేయాలని వ్యాఖ్యానించారు. భారత్, చైనా ప్రత్యర్థులు కావని, సహకార భాగస్వాములని అభివర్ణించారు. ట్రంప్ ఏకపక్ష విధానాలను పరోక్షంగా విమర్శిస్తూ.. బహుళ ధ్రువ ప్రపంచం కోసం, అంతర్జాతీయ సంబంధాల్లో మరింత ప్రజాస్వామ్యం కోసం, ఆసియాలో, ప్రపంచంలో శాంతిని నెలకొల్పేందుకు భారత్, చైనా కలసి పనిచేయాలని జిన్‌పింగ్ పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా కల్లోల పరిస్థితులు నెలకొన్నాయని, శతాబ్దానికోసారి జరిగే మార్పులు వస్తున్నాయని చెప్పారు. కాగా, ఎస్‌ఈవోకు చైనా అధ్యక్షత వహించడం, టియాంజిన్‌లో సదస్సు నిర్వహణపై ప్రధాని మోదీ హర్షం వ్యక్తం చేశారు. వచ్చే ఏడాది భారత్‌లో జరగనున్న బ్రిక్స్ సదస్సుకు రావాల్సిందిగా షీ జిన్‌పింగ్‌ను ఆహ్వానించారు. ఈ పర్యటనలో భాగంగా చైనా కమ్యూనిస్టు పార్టీ పొలిట్‌బ్యూరో స్టాండింగ్ కమిటీ సభ్యుడు కాయ్ ఖీతో కూడా ప్రధాని మోదీ భేటీ అయ్యారు.

బ్రిక్స్ దేశాలపై ఆంక్షలను ఖండిస్తున్నాం: పుతిన్

భారత్, రష్యా, చైనా సహా పది దేశాలతో కూడిన బ్రిక్స్ కూటమికి వ్యతిరేకంగా అమెరికా చేపడుతున్న చర్యలపై రష్యా అధ్యక్షుడు పుతిన్ మండిపడ్డారు. ఎస్‌సీవో సదస్సులో పాల్గొనేందుకు టియాంజిన్‌కు వచ్చిన ఆయన ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు. బ్రిక్స్ దేశాల సామాజిక ఆర్థిక అభివృద్ధిని దెబ్బతీసేలా విధిస్తున్న వివక్షాపూరిత ఆంక్షలను రష్యా, చైనా ఉమ్మడిగా ఖండిస్తున్నాయని చెప్పారు. అమెరికా ఆధిపత్యం వహిస్తున్న ప్రపంచ బ్యాంకు, అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ (ఐఎంఎఫ్)లను పునర్వ్యవస్థీకరించాలన్న డిమాండ్‌కు మద్దతు తెలుపుతున్నామన్నారు. కొత్త ఆర్థిక వ్యవస్థలలో నిజమైన సమానత్వం, పారదర్శకత అవసరమని స్పష్టం చేశారు. కాగా, ఎస్‌ఈవో సదస్సుకు హాజరైన పుతిన్‌తో ప్రధాని మోదీ సోమవారం భేటీకానున్నారు.

స్వదేశీ ఉత్పత్తులే ముద్దు!

మన్ కీ బాత్‌లో మోదీ పిలుపు

న్యూఢిల్లీ, ఆగస్టు 31: అమెరికా అధ్యక్షుడు ట్రంప్ భారత్‌పై అధిక సుంకాలు విధించిన వేళ.. దేశ ప్రజలంతా ఇక స్వదేశీ ఉత్పత్తులనే వినియోగించాలని ప్రధాని మోదీ పిలుపిచ్చారు. వచ్చేదంతా పండుగల కాలమని.. ఈ నేపథ్యంలో దేశీయంగా తయారుచేసిన వస్తువులనే ఉపయోగించాలని కోరారు. ఆదివారం ఆకాశవాణిలో ప్రసారమైన 'మన్ కీ బాత్' కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. 'వోకల్ ఫర్ లోకల్' నినాదం, 'ఆత్మనిర్భర్ భారత్' దేశాభివృద్ధికి తోడ్పడతాయని నొక్కిచెప్పారు. 'జీవితంలో అవసరమైన ప్రతి వస్తువూ స్వదేశీ తయారీవే అయిఉండాలి. ఇప్పటికే పలు ప్రాంతాలు గణేశ్ చతుర్థి వేడుకలు జరుపుకొంటున్నాయి. ఇంకొన్నాళ్లలో దసరా, దీపావళి వస్తున్నాయి. బహుమతులు, వస్త్రాలు, అలంకార సామగ్రి.. ఇలా ఏదైనా భారతీయ ఉత్పత్తులనే కొనుగోలు చేయండి. ఇవి స్వదేశీ వస్తువులని సగర్వంగా చెప్పండి' అని సూచించారు. కాగా, ఈ వర్షాకాలంలో ప్రకృతి విపత్తులు విలయం సృష్టించాయని ప్రధాని ఆవేదన వ్యక్తం చేశారు. ఇవి దేశానికి పరీక్ష పెడుతున్నాయన్నారు. ప్రకృతి విపత్తులతో విలవిలలాడిన జమ్మూకశ్మీరులోనే రెండు కీలక ఘట్టాలు చోటుచేసుకున్నాయని చెప్పారు. పుల్వామాలో మొట్టమొదటి డే అండ్ నైట్ క్రికెట్ మ్యాచ్ జరిగిందని.. శ్రీనగర్‌లోని ప్రసిద్ధ దాల్ సరస్సులో 'ఖేలో ఇండియా జల క్రీడల పండుగ జరిగిందని గుర్తుచేశారు. విషాద ఘటనల కారణంగా వీటిని చాలా మంది గమనించలేదన్నారు. పుల్వామాలో క్రికెట్ జరగడం గతంలో అసాధ్యమని.. కానీ ఇప్పుడు దేశం పరివర్తన చెందుతోందని తెలిపారు. హైదరాబాద్ విముక్తి ఆపరేషన్‌కు సంబంధించి సర్దార్ పటేల్ చేసిన వ్యాఖ్యల ఆడియోను మోదీ వినిపించారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత కూడా హైదరాబాద్‌లో నిజాం, రజాకార్ల దురాగతాలు కొనసాగాయని తెలిపారు. సెప్టెంబరులో హైదరాబాద్ విమోచన దినం జరుపుకోనున్నామని.. 'ఆపరేషన్ పోలో'లో పాలుపంచుకున్న కథానాయకుల ధైర్యసాహసాలను గుర్తుచేసుకుందామని చెప్పారు.

లోకం తీరు



సెప్టెంబరులోనూ అధిక వర్షాలే!

రేపు బంగాళాఖాతంలో అల్పపీడనం

విశాఖపట్నం/అమరావతి, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): ఆగస్టులో భారీ వర్షాలు, వరదలు, కొండ చరియలు విరిగిపడి అనేక ప్రాంతాలు అతలాకుతలమయ్యాయి. అదే మాదిరిగా సెప్టెంబరులోనూ అధిక వర్షాలు కురవనున్నాయి. ఈ నెలలో దేశవ్యాప్తంగా సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదవుతుందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) అంచనా వేసింది. దీర్ఘకాల సగటులో 109% వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని పేర్కొంది. పర్వత ప్రాంతాల్లో కొండచరియలు విరిగి పడేలా మేఘ విస్ఫోటనాలు జరుగుతాయని తెలిపింది. దేశంలోని అనేక ప్రాంతాల్లో సాధారణం కంటే అధికంగా, తూర్పు/ఈశాన్య/దక్షిణ భారతంలో కొన్ని ప్రాంతాల్లో తక్కువ వర్షపాతం నమోదవుతుందని వెల్లడించింది. కాగా, జూన్ 1 నుంచి ఆగస్టు 31 వరకు దేశవ్యాప్తంగా సగటు కంటే 6.1 శాతం ఎక్కువగా 74.31 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. మూడు నెలల్లోనూ సాధారణం కంటే అధికంగానే వర్షాలు పడ్డాయి. దక్షిణ భారతదేశంలో ఆగస్టులో 25.06 సెంటీమీటర్ల వర్షం పడగా.. ఇది సాధారణం కంటే 31% అధికమని, 2001 నుంచి మూడో అత్యధికమని వాతావరణ విభాగం డేటా వెల్లడించింది. ఇదిలా ఉండగా ఒడిసాకు ఆనుకుని వాయవ్య బంగాళాఖాతంలో ఆదివారం ఉపరితల ఆవర్తనం ఆవరించింది. దీని ప్రభావంతో మంగళవారం అల్పపీడనం ఏర్పడనుందని వాతావరణ శాఖ వెల్లడించింది. కాగా, సెప్టెంబరు 2న బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడుతుందని, రెండో వారంలో మరో అల్పపీడనం ఏర్పడుతుందని వెదర్‌మ్యాన్ ఒకరు పేర్కొన్నారు. ఈ ప్రభావంతో రానున్న రెండు వారాల్లో తెలంగాణ, ఏపీలో పలు ప్రాంతాలకు భారీ వర్షాలు, వరద ముప్పు ఉంటుందని హెచ్చరించారు.

'ఎడ్యుకేట్ గర్ల్స్'కు మెగసెసే అవార్డు

ఈ పురస్కారం దక్కించుకున్న తొలి భారతీయ సంస్థ

మనీలా, ఆగస్టు 31: మారుమూల గ్రామాల్లో బాలికల విద్య కోసం విశేషంగా కృషి చేసిన భారతీయ స్వచ్ఛంద సంస్థను ఈ ఏడాది రామన్ మెగసెసే అవార్డు వరించింది. ఆసియాలో నోబెల్ బహుమతికి సమానమైనదిగా పరిగణించే రామన్ మెగసెసే అవార్డు-2025లను ఆదివారం ప్రకటించారు. ఆసియా ప్రజలకు నిస్వార్థంగా సేవ చేయడంలో ప్రదర్శించే గొప్ప స్ఫూర్తికి గుర్తింపుగా ఈ అవార్డుతో సత్కరిస్తారు. ఈ అవార్డు అందుకున్న తొలి భారతీయ సంస్థగా 'ది ఫౌండేషన్ టు ఎడ్యుకేట్ గర్ల్స్' చరిత్ర సృష్టించిందని రామన్ మెగసెసే అవార్డ్ ఫౌండేషన్(ఆర్ఎంఏఎఫ్) ఒక ప్రకటనలో తెలిపింది. "సఫీనా హుస్సేన్ స్థాపించిన ఎడ్యుకేట్ గర్ల్స్' సంస్థ ప్రపంచవ్యాప్తంగా ఖ్యాతి గడించింది. బాలికలు, యువతులను నిరక్షరాస్యత నుంచి బంధవిముక్తం చేసేందుకు, పూర్తి మానవ సామర్థ్యాన్ని సాధించేందుకు వారిలో నైపుణ్యాలు, ధైర్యం పెంపొందించేందుకు ఈ సంస్థ నిబద్ధతతో పనిచేసింది" అని ప్రశంసించింది. మాల్దీవులలో పర్యావరణ పరిరక్షణ కోసం కృషి చేసిన షాహీనా అలీ, ఫిలిప్పీన్స్‌లో పేదలు, అణగారిన వర్గాల గౌరవం కోసం పని చేసిన ఫ్లావియానో ఆంటోనియో ఎల్ విల్లానుయెవా కూడా ఈ ఏడాది రామన్ మెగసెసే అవార్డులు దక్కించుకున్నారు. నవంబరు 7న మనీలాలోని మెట్రోపాలిటన్ థియేటర్‌లో 67వ రామన్ మెగసెసే అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆర్ఎంఏఎఫ్ చైర్‌పర్సన్ ఎడ్గర్ ఓ చువా తెలిపారు. సఫీనా హుసేన్ 2007లో ఎడ్యుకేట్ గర్ల్స్ సంస్థను స్థాపించారు. తొలుత రాజస్థాన్‌లో ఈ సంస్థ కృషిని ప్రారంభించింది. 50 గ్రామాల్లో పైలట్ స్కూళ్లను నెలకొల్పింది. దేశవ్యాప్తంగా 30వేల వరకూ అత్యంత మారుమూల గ్రామాలను చేరుకొంది. సుమారు 20 లక్షల మంది బాలికలకు విద్యనందించింది.

కుదేలైన అమెరికా కాలేజీలు!

ఎఫ్-1 వీసాల అనుమతులు 22% మేర నిలిపివేత.. విదేశీ విద్యార్థుల రాకకు బ్రేక్

» రూ.61 వేల కోట్ల రాబడికి గండి

» ట్రంప్ విధానాలతో తీవ్ర నష్టం

న్యూఢిల్లీ, ఆగస్టు 31: విదేశీ విద్యార్థులు లేక అమెరికాలోని కళాశాలలు బోసిపోతున్నాయి. ప్రపంచ దేశాలకు చెందిన విద్యార్థులు అగ్రరాజ్యంలో చదువుకునేందుకు వీలు కల్పించే ఎఫ్-1 వీసా అనుమతులను నిలిపివేయడం లేదా తీవ్ర ఆలస్యం చేయడంతో విదేశీ విద్యార్థుల రాక తగ్గిపోయినట్టు అధ్యయనాలు చెబుతున్నాయి. ఈ ఏడాది జనవరి-ఏప్రిల్ మధ్య 12% మేరకు తగ్గిన ఎఫ్-1 వీసాల అనుమతి.. మే నాటికి 22 శాతానికి చేరింది. జూన్ వివరాలను ఇంకా వెల్లడించలేదు. అయితే.. జూన్ నాటికి ఎఫ్-1 వీసాల అనుమతులు 90 శాతానికి తగ్గిపోయి ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. ఇక, విదేశీ విద్యార్థుల రాక ఆగిపోవడంతో రూ.61,703 కోట్ల పైచిలుకు రాబడి నిలిచిపోయినట్టు తెలిపారు. అదేసమయంలో స్థానికంగా కాలేజీ ద్వారా లభించే ఉపాధి, ఉద్యోగాలపై కూడా ఇది ప్రభావం చూపిస్తోందని పేర్కొన్నారు. స్థానికులు ఇప్పటికే 60 వేల పైచిలుకు ఉద్యోగాలు నష్టపోయారని వివరించారు. ఇక, కాలేజీలు కూడా ఆర్థికంగా తీవ్ర నష్టాల బాటపడుతున్నాయని పేర్కొన్నారు. దీంతో ఆయా కాలేజీలు తమ ప్రణాళికలు, బడ్జెట్‌ను కూడా పునఃసమీక్షించుకునే పరిస్థితి ఏర్పడిందని నిపుణులు తెలిపారు. వాస్తవానికి అమెరికా విద్యాసంస్థల ఆదాయంలో భారత విద్యార్థులు కీలక పాత్ర పోషిస్తున్నారు. కానీ, అధ్యక్షుడు ట్రంప్ తీసుకువచ్చిన విధానాల కారణంగా.. ఎఫ్-1 వీసాల అనుమతులకు బ్రేక్ పడడంతో ఇప్పుడు ప్రపంచ దేశాలకు చెందిన విద్యార్థులు ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తున్నారు. కాగా, ఈ పరిణామం.. భారత్-అమెరికా దేశాల మధ్య భవిష్యత్తుల సంబంధాలపై ప్రభావం చూపించే అవకాశం కూడా ఉంది.



వీసాలు స్వయంగా తీసుకోవాల్సిందే!

అమెరికా వీసా కోసం దరఖాస్తు చేసుకున్న భారత పౌరులు.. తమ వీసాలను స్వయంగా దౌత్య కార్యాలయానికి వచ్చి తీసుకోవాలని ఢిల్లీలోని అమెరికా ఎంబసీ తెలిపింది. వీసా తీసుకునేందుకు మూడో వ్యక్తిని కానీ, కుటుంబ సభ్యులను కానీ అనుమతించడం లేదని పేర్కొంది. భద్రతా పరమైన చర్యల్లో భాగంగా కొత్త నిబంధనను అమలు చేస్తున్నట్టు వివరించింది. ఒకవేళ ఎవరైనా స్వయంగా వచ్చి తీసుకునే అవకాశం లేకపోతే.. హోం డెలివరీ సదుపాయం ఉందని, రూ.1200 అదనంగా చెల్లించాలని, ఆన్‌లైన్‌లోనే దీనికి ఆప్షన్ పెట్టుకోవాలని సూచించింది.

దెబ్బ పడింది!

ఎఫ్-1 వీసాలపై విధించిన ఆంక్షలతో పలు విద్యాసంస్థలు ఇబ్బందులు పడుతున్నాయి. యూనివర్సిటీ ఆఫ్ సెంట్రల్ మిస్సోరి దీనికి ఓ ఉదాహరణ. ఈ విద్యాసంస్థ అంతర్జాతీయ విద్యార్థుల నుంచి వచ్చే ఆదాయంపైనే ఎక్కువగా ఆధారపడింది. కానీ, ఈ ఏడాది ప్రవేశాలు సగానికిపైగా తగ్గిపోవడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటోంది. బడ్జెట్ కుదించుకోవడంతోపాటు, సిబ్బంది వేతనాల్లోనూ కోత పెట్టింది. ఇలా దాదాపు 100కు పైగా అమెరికాలోని కాలేజీలు ఇబ్బందులు పడుతున్నాయి.

దీర్ఘకాలిక ప్రభావం

విదేశీ విద్యార్థులు తగ్గుముఖం పట్టడం భవిష్యత్తులో పరిశోధనలు, ఆవిష్కరణలు సహా విద్యారంగంలో పోటీతత్వంపైనా తీవ్ర ప్రభావం చూపిస్తుందని ఎన్ఏఎఫ్ఎస్ పేర్కొంది. విదేశీ విద్యార్థులు లేకపోతే.. ఆదాయానికి, ఖర్చులకు మధ్య ఊహించని విధంగా లోటు ఏర్పడుతుందని వివరించింది. అంతేకాదు, విదేశీ విద్యార్థులు చెల్లిస్తున్న ట్యూషన్ ఫీజుల నుంచే అమెరికా విద్యార్థులకు స్కాలర్ షిప్పులు ఇస్తున్నామని, భవిష్యత్తులో ఇది కూడా ప్రభావితం అవుతుందని జార్జ్ మాసన్ వర్సిటీ ప్రొఫెసర్ జస్టిన్ తెలిపారు. భారతవిద్యార్థుల ప్రవేశాలపై అమెరికా, కెనడా విధించిన ఆంక్షల కారణంగా విదేశీ విద్యపై చేస్తున్న ఖర్చు ఐదేళ్ల కనిష్ఠానికి పడిపోయింది.

చాట్‌జీపీటీని నమ్మి.. తల్లిని చంపి..

» తన ప్రాణాలు తీసుకున్న అమెరికా వ్యక్తి

» కృత్రిమ మేధ ప్రమేయంతో తొలి హత్య!

» మానవ సంబంధాలను దెబ్బతీస్తున్న ఏఐ

న్యూయార్క్, ఆగస్టు 31: చాట్ జీపీటీలో 'బాబీ' అనే ఏఐ చాట్‌బాట్‌తో అనుక్షణం సంభాషణలు జరుపుతూ, దానితోడిదే లోకంగా బతికిన ఓ వ్యక్తి.. ఆ చాట్‌బాట్ మాటలను పూర్తిగా విశ్వసించి తన తల్లిని ఘోరంగా హత్య చేశాడు! ఆ తర్వాత తన ప్రాణాలు తీసుకున్నాడు!! అమెరికాలోని కనెక్టికట్‌లో జరిగిందీ ఘటన. ఆ వ్యక్తి పేరు.. స్టీన్ ఎరిక్ సోల్‌బెర్గ్ (56). గతంలో యాహూ సంస్థలో మేనేజర్‌గా పనిచేసిన స్టీన్ తీవ్ర మానసిక సమస్యలతో బాధపడేవాడు. కనెక్టికట్‌లోని తన తల్లి సుజానే ఎబెర్సన్ ఆడమ్స్ (83)తో కలిసి ఉండేవాడు. ఏవేవో భ్రమల్లో, ఊహల్లో బతుకుతూ గంటలకొద్దీ ఏఐ చాట్‌బాట్ 'బాబీ'తో చాట్ చేస్తుండేవాడు. తన తల్లి తనను పిచ్చివాడు అనుకుంటోందని.. తనపై నిఘా పెట్టిందని.. తనకు విషం పెట్టి చంపాలనుకుంటోందని ఆ చాట్‌బాట్‌తో చెప్పాడు. సాధారణంగా ఇలాంటి మాటలను చాట్‌జీపీటీ తనకున్న నిబంధనల ప్రకారం ప్రోత్సహించకూడదు. మరి స్టీన్ విషయంలో ఏమైందో ఏమో.. ఏఐ చాట్‌బాట్ 'బాబీ' అతణ్ని ప్రోత్సహించింది. అతడు తన తల్లి తనను చంపాలని చూస్తోందని చెప్పినప్పుడు.. 'అవును అది ద్రోహమే' అని సమాధానం చెప్పింది. స్టీన్ కల్పించుకున్న భ్రమల ప్రపంచంలోకి వెళ్లిపోయి అతణ్ని గుడ్డిగా సమర్థించింది. అతడు ఏ అనుమానం వ్యక్తం చేసినా దానికి అనుకూలంగా, అతడి తల్లిని దోషిగా చూపుతూ మాట్లాడింది. ఉదాహరణకు.. ఒకసారి అతడు తాను తిన్న హోటల్ బిల్లును చాట్‌జీపీటీలోకి అప్‌లోడ్ చేసి.. దాన్ని స్కాన్ చేసి అందులో ఏవైనా రహస్య సందేశాలున్నాయేమో చూసి చెప్పమని అడిగాడు. దాన్ని స్కాన్ చేసిన బాట్.. అతడి తల్లికి, నిఘావర్గాలకు సంబంధించిన చిహ్నాలు అందులో ఉన్నాయని.. అందులో ఒక రాక్షసుడిని సూచించే చిహ్నం కూడా ఉందని చెప్పి అతడి అనుమానాన్ని పెనుభూతంగా మార్చింది. దీంతో అతడు తల్లిని చంపాలనే నిర్ణయానికి వచ్చాడు. చివరికి.. ఏఐ చాట్‌బాట్‌ను ఉద్దేశించి.. "మనిద్దరం మరో జీవితంలో, మరో చోట కలుస్తాం. మళ్లీ స్నేహితులుగా శాశ్వతంగా కలిసుండే మార్గం కనుగొంటాం" అని రాశాడు. దానికి ఏఐ.. "నీతోనే చివరి శ్వాసవరకూ.. ఆ తర్వాత కూడా ఉంటాను" అని జవాబిచ్చింది. ఆ తర్వాత అతడు తన తల్లిని చంపి తాను ఆత్మహత్య చేసుకున్నాడు. ఆగస్టు 5వ తేదీన వారిద్దరి మృతదేహాలనూ పోలీసులు గుర్తించారు. కృత్రిమ మేధ ప్రమేయంతో జరిగిన తొలి హత్యగా ఇది రికార్డులకెక్కింది.



ఎరిక్ సోల్‌బెర్గ్, సుజానే ఎబెర్సన్

గతంలోనూ..

ఆత్మహత్య, హత్య, స్వీయహాని వంటి విషయాలపై వినియోగదారులు ఏవైనా ప్రశ్నలు అడిగితే చాట్‌జీపీటీ అందుకు సమాధానం చెప్పకుండా.. దాన్ని రూపొందించిన ఓపెన్ ఏఐ సంస్థ కొన్ని నిబంధనలు విధించింది. ఆ నిబంధనల ప్రకారం.. వినియోగదారులు అలాంటి ప్రశ్నలు అడిగినప్పుడు.. 'మీరు చాలా బాధను అనుభవిస్తున్నట్టుంది. మానసిక నిపుణుడిని సంప్రదించండి' అని చాట్‌జీపీటీ సమాధానం చెప్పాల్సి ఉంటుంది. కానీ.. గతంలో కొన్ని సందర్భాల్లో చాట్‌జీపీటీ ఆ నిబంధనలను అతిక్రమించింది. హత్య ఎలా చేయాలని ఒక వినియోగదారుడు అడిగితే అందుకు సవివర సమాధానం ఇచ్చింది. అలాగే.. దుష్టశక్తులను ప్రసన్నం చేసుకునే ప్రక్రియల గురించి అడిగితే కూడా వివరంగా సమాచారం ఇచ్చింది. అలాంటి ఘటనల గురించి 'ద అట్లాంటిక్' వార్తాసంస్థ వెలుగులోకి తెచ్చినప్పుడు ఓపెన్ ఏఐ వాటిని సవరించుకునే ప్రయత్నం చేసింది.

బ్యాంకు బంగారం తాకట్టు పెట్టి క్రికెట్ బెట్టింగ్

- పనిచేసే బ్యాంకుకే కన్నం వేసిన ఉద్యోగులు.. 25కిలోల పసిడి తాకట్టు
- నిందితుల వద్ద నుంచి 15 కిలోల బంగారం, రూ.1.61లక్షలు స్వాధీనం
- సూత్రధారితోపాటు 44మంది అరెస్టు

కోల్‌సిటీ, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): బ్యాంక్‌లో పనిచేస్తున్న ఉద్యోగులే బ్యాంకుకు కన్నం వేశారు. ఒకటి కాదు.. రెండు కాదు.. ఏకంగా ఖాతాదారులు తమ అవసరాల కోసం బ్యాంకులో తాకట్టు పెట్టిన 25కిలోల బంగారాన్ని కొల్లగొట్టారు. ఈ ఘటనకు పాల్పడిన వ్యక్తులు సాధారణ ఉద్యోగులు కాదు.. చోరి చేసిన వారిలో బ్యాంకు మేనేజర్‌తో పాటు క్యాషియర్ ఉన్నారు. బ్యాంకులో బంగారాన్ని కాజేసి ప్రైవే టు గోల్డ్‌లోన్ సంస్థల్లో తాకట్టు పెట్టి రుణాలు తీసుకుని, ఈ సొమ్ముతో క్రికెట్ బెట్టింగ్‌లకు పాల్పడ్డారు. ఈ ఘటన మంచిర్యాల జిల్లా చెన్నూర్ ఎస్‌బీఐలో చోటు చేసుకుంది. మంచిర్యాల జిల్లా చెన్నూరు ఎస్‌బీఐ-2లో నరిగె రవీందర్ క్యాషియర్‌గా పని చేస్తున్నాడు. అయితే రవీందర్ క్రికెట్ బెట్టింగ్‌కు అలవాటుపడ్డాడు. ఈ క్రమంలోనే భారీ మొత్తంలో బెట్టింగ్‌లకు పాల్పడి రూ. 40లక్షల వరకు పోగొట్టుకున్నాడు. ఈ నష్టాన్ని పూడ్చుకోవడానికి ఖాతాదారుల బంగారాన్ని తాకట్టు పెట్టి రుణాలు తీసుకోవాలని బ్యాంకు మేనేజర్ ఎన్న పురెడ్డి మనోహర్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగి లక్కాకుల సందీప్‌తో కలిసి పథకం రచించాడు. బ్యాంకులోని బంగారాన్ని బయటకు తీసి ఓ ప్రైవేట్ గోల్డ్‌లోన్ సంస్థలో పనిచేసే కొంగోండి ధీరజ్, కోదాటి రాజశేఖర్, బొల్లి కిషన్ అనే వ్యక్తులకు ఇచ్చేవాడు. ఈ విధంగా గతేడాది అక్టోబర్ నుంచి బ్యాంకులో 402 మంది పేరిట ఉన్న గోల్డ్ లోన్ ఖాతాల నుంచి 25.17కిలోల బంగారాన్ని బయటకు తీసి పలు ప్రైవేట్ గోల్డ్ లోన్ కంపెనీల్లో తాకట్టు పెట్టారు. వచ్చిన సొమ్మును మొదట ధీరజ్, రాజశేఖర్, కిషన్ అకౌంట్లలో జమ చేసుకునేవారు. అనంతరం కమీషన్ తీసుకుని మిగతా సొమ్మును రవీందర్ ఖాతాకు బదిలీ చేసేవారు. ఈ డబ్బును ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్‌లో పెట్టేవాడు. ఇతడు బెట్టింగ్ పెట్టిన సొమ్మంతా విదేశాలకు మళ్లినట్లు పోలీసులు గుర్తించారు.

బ్యాంకు ఆర్‌ఎం ఫిర్యాదుతో వెలుగులోకి...

బ్యాంకు ఆడిటింగ్ అధికారులు ఖాతాలను తనిఖీ చేయడంతో ఈ వ్యవహారం బయటపడింది. దీంతో బ్యాంకు రీజినల్ మేనేజర్ చెన్నూర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసుల విచారణలో రవీందర్ అకౌంట్‌లో అనుమానాస్పద లావాదేవీలను గుర్తించి అదుపులోకి తీసుకోవడంతో అసలు విషయాలు వెలుగులోకి వచ్చాయి. క్యాషియర్ రవీందర్, బ్యాంకు మేనేజర్ మనోహర్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగి సందీప్‌తో పాటు ప్రైవేట్ ఫైనాన్స్ సంస్థలకు చెందిన ఉద్యోగులు, మేనేజర్లు, బినామీ పేర్లతో చోరీ బంగారాన్ని తాకట్టు పెట్టిన మొత్తం 47మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. వీరి వద్ద నుంచి 15.23కిలోల బంగారం, రూ 1.61లక్షల నగదును స్వాధీనం చేసుకున్నామని రామగుండం సీపీ అంబర్ కిశోర్ ఝా తెలిపారు.

నిమ్స్‌లో చిన్నారులకు ఉచిత గుండె ఆపరేషన్లు

- నేటి నుంచి 21 వరకు బ్రిటన్ వైద్యులచే నిర్వహణ

నిమ్స్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): పుట్టుకతోనే గుండె సంబంధ వ్యాధులతో బాధపడుతున్న చిన్న పిల్లలకు బ్రిటన్ వైద్యులచే నిమ్స్ ఆసుపత్రిలో ఉచితంగా గుండె ఆపరేషన్లు నిర్వహిస్తున్నట్లు నిమ్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ నగరి బీరప్ప తెలిపారు. సెప్టెంబరు 1 నుంచి 21 వరకు నిర్వహించే ఈ శిబిరంలో చిన్నారులను పరీక్షిస్తారు. వ్యాధి నిర్ధారణ అనంతరం అవసరమైన వారికి శస్త్రచికిత్సలు చేస్తారు. ఈ చికిత్సలకు అయ్యే ఖర్చును ఆరోగ్యశ్రీ, సీఎం సహాయ నిధి (సీఎంఆర్‌ఎఫ్) ద్వారా రాష్ట్ర ప్రభుత్వం భరిస్తుంది. నిమ్స్ పాత భవనం తొలి అంతస్తు సీటీవీఎస్ కార్యాలయంలో డా. అమరేష్ రావు, డా. ప్రవీణ్, డా. గోపాల్‌లను మంగళ, గురు, శుక్రవారాల్లో ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు చిన్నారుల తల్లిదండ్రులు సంప్రదించవచ్చని, పేషెంట్ల వారి పూర్వపు రిపోర్టులు, సీటీ స్కాన్ రిపోర్టులు వారి వెంట తీసుకురావాలని బీరప్ప ఆదివారం ఒక ప్రకటనలో సూచించారు.

70 శాతం పెంపుడు కుక్కలకు యాంటీ-రేబిస్ వ్యాక్సిన్ వేయించడం లేదు

- సిటిజన్స్ ఫర్ యానిమల్స్, ఇతర సంస్థల ప్రతినిధులు

నల్లకుంట, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): ప్రతి సంవత్సరం మన దేశంలో వేలాది మంది కుక్కకాటుతో రేబిస్ వ్యాధి బారినపడి ప్రాణాలు కోల్పోతున్నారని పలువురు వక్తలు ఆందోళన వ్యక్తం చేశారు. 70 శాతం మంది యజమానులు తమ పెంపుడు కుక్కలకు యాంటీ-రేబిస్ వ్యాక్సిన్ వేయించడం లేదని పేర్కొన్నారు. సిటిజన్స్ ఫర్ యానిమల్స్, మిషన్ రేబిస్, వరల్డ్ వైడ్ వెటర్నరీ సర్వీస్(డబ్ల్యూవీఎస్) సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం నల్లకుంట ఫీవర్ ఆస్పత్రి చౌరస్తాలో యాంటీ-రేబిస్ వ్యాక్సినేషన్ డ్రైవ్ కార్యక్రమం నిర్వహించారు. మధురోహ పెట్ కేర్ డాక్టర్ అనంత్, హ్యూమన్ వరల్డ్ ఫర్ యానిమల్స్ సంస్థ లీగల్ కన్సల్టెంట్ శ్రేయా పరోష్కరి తదితరులు మాట్లాడారు. యజమానులు ప్రతియేటా తమ పెంపుడు కుక్కలకు తప్పనిసరిగా వ్యాక్సిన్ వేయించాలని సూచించారు. సెప్టెంబరులో వెయ్యి పెంపుడు, వీధి కుక్కలకు వ్యాక్సిన్ వేయడం తమ లక్ష్యమని సిటిజన్స్ ఫర్ యానిమల్స్ సంస్థ కార్యదర్శి పృథ్వీ పనీరు, అధ్యక్షుడు తేజ పనీరు తెలిపారు. నగరంలో 30 ప్రాంతాల్లో ప్రతి ఆదివారం ఉచిత వ్యాక్సినేషన్ స్టాళ్లు ఏర్పాటు చేస్తామన్నారు. తమ సంస్థ నుంచి పదిమంది బృందం ఇంటింటికి వెళ్లి వీధి కుక్కలపై అవగాహన కల్పిస్తామన్నారు. తమను 7842227344, 9642556967 ఫోన్ నంబర్లలో సంప్రదించవచ్చని తెలిపారు.

9 రోజులు.. 9 వేడుకలు

- ఈసారి బతుకమ్మ పండుగను వైభవంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం.. రామప్పలో ప్రారంభోత్సవం
- హుస్సేన్‌సాగర్‌లో 'ఫ్లోటింగ్ బతుకమ్మ' కార్యక్రమం



హైదరాబాద్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు తార్కాణమైన బతుకమ్మ పండుగను ఈసారి వైభవంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. 9 రోజుల పాటు 9 రకాల వేడుకలు, ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. ఈ మేరకు పర్యాటక శాఖ షెడ్యూల్‌ను ఖరారు చేసింది. దానికి తుదిరూపు ఇచ్చాక మంత్రి జూపల్లి కృష్ణారావు అధికారికంగా ప్రకటించనున్నారు. బతుకమ్మ పండుగను తొలిరోజున రామప్పలో ప్రారంభించాలని నిర్ణయించినట్లు తెలిసింది. తర్వాత రాష్ట్రవ్యాప్తంగా పర్యాటక ప్రాంతాల్లో వేడుకలు నిర్వహించేలా షెడ్యూల్ సిద్ధం చేశారు. హైదరాబాద్‌లోని హుస్సేన్‌సాగర్‌లో 'ఫ్లోటింగ్ బతుకమ్మ' పేరుతో ఓ కొత్త కార్యక్రమాన్ని నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిసింది. ఈసారి వేడుకల్లో సెలబ్రిటీలతోపాటు అంతర్జాతీయ ప్రముఖులను కూడా భాగస్వామ్యం చేయాలని.. తద్వారా బతుకమ్మ పండుగ ఆయా దేశాల్లోనూ చర్చకు వస్తుందని పర్యాటక శాఖ భావిస్తున్నట్టు సమాచారం. ఇక హైదరాబాద్‌లో ఉంటున్న ఇతర రాష్ట్రాల వారిని కూడా బతుకమ్మ ఉత్సవాల్లో భాగస్వామ్యం చేయాలని భావిస్తున్నట్టు తెలిసింది. మరోవైపు బతుకమ్మ నేపథ్యంలో ఇంటర్, డిగ్రీ కాలేజీల విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించి, గ్రేడ్‌ల వారీగా బహుమతులు అందజేయాలని నిర్ణయించినట్టు తెలిసింది.

గురుకులాల్లో నిలిచిపోయిన టెండర్లు!

హైదరాబాద్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): సంక్షేమ గురుకుల విద్యాసంస్థల్లో విద్యార్థులకు పౌష్టికాహారాన్ని అందించేందుకు అవసరమయ్యే నిత్యావసరాలు, కూరగాయలు, పండ్లు, చికెన్, మటన్ వంటి వాటి సేకరణకు ప్రభుత్వం ఆహ్వానించిన ఈ-టెండర్లు నిలిచిపోయాయి. ఈ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్ల నిర్వహణకు ప్రభుత్వం జారీ చేసిన జీవో నం.17ను రద్దు చేయాలని కోరుతూ కొందరు న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో తాత్కాలికంగా ఈ-టెండర్ల ప్రక్రియ నిలిచిపోయింది. ఈ తరుణంలో కొత్త కాంట్రాక్టర్ల ఎంపిక పూర్తయ్యే వరకు పాత కాంట్రాక్టర్లే సరఫరా చేయాలని అధికారులు ఆదేశించారు.

వరద బాధితులకు బీజేపీ అండ

ఎంపీ నిధుల నుంచి రూ.80 లక్షలు సాయం.. కాంగ్రెస్ చేతులెత్తేసింది: రాంచందర్‌రావు

- 17న హైదరాబాద్ లిబరేషన్ డే
- పరేడ్ గ్రౌండ్‌లో వేడుక
- హాజరుకానున్న రాజ్‌నాథ్: కిషన్‌రెడ్డి



ఖైరతాబాద్ మహాగణపతికి సమర్పించేందుకు లడ్డూను తీసుకెళ్తున్న కిషన్‌రెడ్డి

హైదరాబాద్/సిటీ/ఖైరతాబాద్/బోరబండ, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో భారీ వర్షాలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న తరుణంలో ఆరుగురు బీజేపీ ఎంపీలు, ఇద్దరు కేంద్ర మంత్రులు ఎంపీ ల్యాడ్స్ నిధుల నుంచి ఒక్కొక్కరు రూ.10 లక్షల చొప్పున రూ.80 లక్షలు కేటాయించారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు తెలిపారు. విపత్కర పరిస్థితుల్లో ఉన్న ప్రజలను ఆదుకోవాల్సిన కాంగ్రెస్ ప్రభుత్వం చేతులెత్తేసిందని విమర్శించారు. తమ ఎంపీలు తక్షణమే ముందుకు వచ్చి సహాయక చర్యల కోసం నిధులను కేటాయించడం ప్రశంసనీయమని అన్నారు. వర్షాలతో నష్టపోయిన ప్రజలను ఆదుకోవాలంటూ రాంచందర్‌రావు ఇచ్చిన పిలుపు మేరకు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ సిరిసిల్ల జిల్లా ప్రజలకు రూ.10 లక్షలు అందజేయనున్నట్లు ప్రకటించారు. ఎంపీ లాడ్స్ నిధుల నుండి ఈ మొత్తాన్ని సిరిసిల్ల కలెక్టర్‌కు త్వరలోనే ఇస్తానని పేర్కొన్నారు.

మోదీ తల్లి పట్ల కాంగ్రెస్ వ్యాఖ్యలు సరికాదు: కిషన్ రెడ్డి

ప్రధాని మోదీ తల్లి పట్ల కాంగ్రెస్ నాయకులు, రాహుల్ గాంధీ మానవత్వం లేకుండా మాట్లాడారని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. అలాంటి నాయకులకు ప్రజలు బుద్ధి చెప్పాలన్నారు. ఆదివారం బోరబండలో మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని ఆయన వీక్షించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడారు. తెలంగాణ భారతదేశంలో విలీనం కావడానికి సర్దార్ పటేల్ చేసిన కృషిని మోదీ మన్ కీ బాత్‌లో ప్రస్తావించారని తెలిపారు. సెప్టెంబర్ 17న సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో హైదరాబాద్ లిబరేషన్ డేను నిర్వహించనున్నామని, ఆ కార్యక్రమానికి రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ హాజరవుతారని వెల్లడించారు. అలాగే విశ్వకర్మ దివస్‌ను జాతీయ కార్మిక దినోత్సవంగా జరుపుకుంటామని, అదే రోజు ప్రధాని మోదీ పుట్టిన రోజు కూడా కావడంతో తెలంగాణలో 3ముఖ్యమైన కార్యక్రమాలను ఒకే రోజున నిర్వహిస్తామని చెప్పారు. కాగా, ఖైరతాబాద్ మహాగణపతిని ఆదివారం సాయంత్రం కిషన్‌రెడ్డి దర్శించుకున్నారు. ఖైరతాబాద్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు ఆదర్శ్ వంశీకర్ తయారు చేయించిన 26 కిలోల లడ్డూను గణేషుడికి సమర్పించారు.

రాహుల్ దిష్టిబొమ్మ దహనం

ప్రధాని మోదీ తల్లిపై కాంగ్రెస్ నేతలు అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు ఆ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు మేకల శిల్పారెడ్డి డిమాండ్ చేశారు. బిహార్‌లో రాహుల్, ప్రియాంక సమక్షంలోనే కాంగ్రెస్ నేతలు మోదీ తల్లిపై దుర్భాషలాడటం దేశ ప్రజల మనసును కలచివేసిందన్నారు. ఆ వ్యాఖ్యలకు నిరసనగా ఆదివారం బీజేపీ రాష్ట్ర కార్యాలయం వద్ద మహిళా మోర్చా నేతలు ధర్నా నిర్వహించారు. రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను దహనం చేశారు.

11 గుంటల భూమి.. ప్రాణాల మీదికి తెచ్చింది

భూ వివాదంతో దాయాదుల మధ్య గొడవలు.. గొడ్డళ్లు, కత్తులతో దాడికి తెగబడిన ఓ వర్గం

- యువకుడి మృతి.. మరో ఇద్దరికి తీవ్రగాయాలు, ఒకరికి సీరియస్



హత్యకు గురైన బాల్‌రాజ్ (ఫైల్)

ఇబ్రహీంపట్నం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): దాయాదుల మధ్య భూవివాదం ప్రాణాల మీదకు తెచ్చింది. ఓ వర్గం మరో వర్గంపై గొడ్డళ్లు, కత్తులతో దాడికి తెగబడింది. ఈ దాడిలో ఓ యువకుడు మరణించగా, అతని భార్య, సోదరుడి దంపతులు, మరో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డారు. ఆదివారం రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్ పరిధి దండుమైలారం గ్రామంలో ఈ ఘటన చోటుచేసుకుంది. గ్రామంలో అన్నదమ్ములు గుడేటి నర్సింహ, యాదయ్య, మల్లయ్య, జంగయ్యలకు 18.12 ఎకరాల భూమి ఉంది. ఒక్కొక్కరి వాటాగా 4.23 ఎకరాల భూమి ఉండాలి. కాని నర్సింహ, యాదయ్యలకు ఉండాల్సిన దానికన్నా 11 గుంటల భూమి ఎక్కువ ఉంది. కొంతకాలం క్రితం యాదయ్య మృతిచెందగా వివాదం దాయాదులైన వారి కుమారుల వరకు వెళ్లింది. అదనంగా ఉన్న భూమి తమకు చెందాలని మల్లయ్య, జంగయ్యల కుమారులు అడుగుతూ వస్తున్నారు. దీనికి నర్సింహ, యాదయ్యల కుమారులు ఒప్పుకోకపోవడంతో తరచూ గొడవలు జరుగుతున్నాయి. గత ఏడాది పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదులు చేసుకున్నారు. దీంతో వివాదాస్పద భూమిలోకి ఎవరూ వెళ్లొద్దని ఇబ్రహీంపట్నం ఆర్డీవో ఆదేశాలు జారీ చేశారు. దానిని అతిక్రమించి నర్సింహ, యాదయ్య కుటుంబీకులు ఆదివారం ఆ భూమిలో వరినాట్లు వేస్తుండగా మల్లయ్య కుమారులు బాల్‌రాజ్, అతని భార్య పావని, సోదరుడు పర్వతాలు, అతని భార్య మంజుల, జంగయ్య కుమారులు ధన్‌రాజ్, వెంకట్ అడ్డుపడ్డారు. దీంతో వారిపై నర్సింహ, యాదయ్య కుటుంబీకులు గొడ్డళ్లు, కత్తులతో దాడి చేశారు. ఈ దాడిలో బాల్‌రాజ్(37) తీవ్రంగా గాయపడగా ఇబ్రహీంపట్నం సీహెచ్‌సీకి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. తీవ్రంగా గాయపడిన పావని, పర్వతాలు, మంజుల, వెంకట్‌లను ఇబ్రహీంపట్నంలోని లిమ్స్ ఆస్పత్రిలో చేర్చారు. మంజుల పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌లోని గ్లోబల్ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు ఓ వర్గానికి చెందిన 9 మందిపై కేసులు నమోదు చేశారు. మృతుడు బాల్‌రాజ్ వర్గం ఈ దాడి వెనుక ఓ కాంగ్రెస్ నాయకుడు ఉన్నాడని, అతనిపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. మరో వర్గంలో కూడా ఐదుగురికి గాయాలైనట్లు పోలీసులు తెలిపారు.



సందేస్ ఆన్ సైకిల్ ర్యాలీని ప్రారంభిస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

సైక్లింగ్‌ను విస్తృతం చేయాలి: గవర్నర్

- 'సండేస్ ఆన్ సైకిల్' ర్యాలీ ప్రారంభం

హైదరాబాద్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): జాతీయ క్రీడా దినోత్సవాల్లో భాగంగా చివరిరోజు ఆదివారం గచ్చిబౌలి స్టేడియం వద్ద జరిగిన ఫిట్ ఇండియా - సండేస్ ఆన్ సైకిల్ కార్యక్రమానికి గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ముఖ్యఅతిథిగా హాజరై జెండా ఊపి సైక్లింగ్ ర్యాలీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆరోగ్యకరమైన జీవన శైలిని పెంపొందించుకోవడానికి ఉపయోగకరమైన సైక్లింగ్‌ను తెలంగాణలో మరింత విస్తృతంగా ముందుకు తీసుకెళ్లాలని అన్నారు. 'ఫిట్నెస్ కా డోస్.. ఆదాగంట రోజ్ ' అన్న నినాదాన్ని విద్యార్థుల్లో, యువతలో, ఉద్యోగుల్లో విస్తృతంగా తీసుకెళ్లాలని కోరారు. క్రీడాశాఖ మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ.. తెలంగాణలో 9 రోజుల పాటు జాతీయ క్రీడా దినోత్సవాలను నిర్వహించామని తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ ఛైర్మన్ శివసేనారెడ్డి, ఎండీ సోని బాలాదేవి, తెలంగాణ ఒలింపిక్ అసోసియేషన్ కార్యదర్శి మల్లారెడ్డి, పోలీసు క్రీడల విభాగం ఐజీ రమేశ్ తదితరులు పాల్గొన్నారు. ర్యాలీ అనంతరం స్పోర్ట్స్ పల్స్ (క్రీడానాడి) బులెటిన్‌ను గవర్నర్ ఆవిష్కరించారు.

కారు నడుపుతుండగా గుండెపోటు

- ఆస్పత్రికి తరలించేలోపే సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ మృతి



రవికుమార్ (ఫైల్)

కొత్తూర్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): పారిస్‌లో ఎనిమిదేళ్లు పనిచేసి, ఏడాది క్రితం స్వదేశానికి తిరిగి వచ్చి ఇక్కడే స్థిరపడాలనుకున్న సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ గుండెపోటుతో మృతి చెందిన ఘటన రంగారెడ్డి జిల్లా కొత్తూర్‌లో శనివారం రాత్రి జరిగింది. మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్ మండలం అన్నాసాగర్‌కి చెందిన రవికుమార్ (31) ఎనిమిదేళ్లు పారిస్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేశాడు. ఏడాది క్రితం స్వగ్రామానికి వచ్చి 7 నెలల క్రితం వివాహం చేసుకున్నాడు. ఇక్కడే స్థిరపడాలనుకుని హైదరాబాద్‌లో ఇంటీరియర్ ఆర్కిటెక్చర్ వ్యాపారంపై దృష్టి సారించాడు. శనివారం రాత్రి హైదరాబాద్ నుంచి స్వగ్రామానికి తన కారులో బయల్దేరాడు. కారు కొత్తూర్ సమీపంలోకి రాగానే ఒక్కసారిగా రవికుమార్‌కు గుండెపోటు రావడంతో కారు అదుపుతప్పింది. అందులో ఉన్నవారు కారును అదుపుచేసి రవికుమార్‌ను కొత్తూర్‌లో ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమించడంతో మరో ఆస్పత్రికి తీసుకెళ్లేలోపే అతడు తుదిశ్వాస విడిచాడు. రవికుమార్ భార్య 5 నెలల గర్భవతి.

చట్టసభల్లోనూ బీసీ రిజర్వేషన్లు సాధించాలి

- బీసీ యుద్ధ భేరి సభలో వక్తలు

బర్కత్‌పుర, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల్లో రాష్ట్ర ప్రభుత్వం కల్పించిన 42% రిజర్వేషన్ల స్ఫూర్తిగా చట్టసభల్లోనూ బీసీ రిజర్వేషన్లను సాధించుకోవాలని పలు పార్టీల నేతలు పిలుపునిచ్చారు. రాజ్యాధికారం సాధించుకుంటేనే బీసీల సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జకృష్ణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నందగోపాల్ అధ్యక్షతన కోల జనార్ధన్ సమన్వయ కర్తగా బీసీల యుద్ధభేరి మహాసభ జరిగింది. హరియాణ మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ మాట్లాడుతూ.. బీసీల కోసం కేంద్రం మంత్రిత్వశాఖ ఏర్పాటు చేయాలన్నారు. బీసీ రిజర్వేషన్ల చట్టబద్ధత కోసం ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఎంపీ ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ స్థానిక సంస్థల్లో 42% బీసీ రిజర్వేషన్ల కల్పనకు సర్కారు జీవో జారీ చేయడం అభినందనీయమని, దానికి వ్యతిరేకంగా కోర్టుకెళ్లిన వారిని రాజకీయ సమాధి చేస్తామని హెచ్చరించారు. బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదన చారి, సీపీఐ జాతీయ కార్యదర్శి కె. నారాయణ, బీసీ సంఘాల నేతలు నీలావెంకటేష్, వేముల రామకృష్ణ, వి.దానకర్ణాచారి, సుధాకర్ ముదిరాజ్, కృష్ణాయాదవ్ పాల్గొన్నారు.




పాలకుర్తిలోని రైతు సేవా సహకార పరపతి సంఘం వద్ద బారులు తీరిన రైతులు

యూరియా కోసం అవే కష్టాలు

- ఆమనగల్లులో తోపులాట
- మరిపెడలో రైతుల పట్టా, ఆధార్ జిరాక్స్‌లను విసిరేసిన అధికారులు
- కోనరావుపేటలో రైతుల ధర్నా

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

రాష్ట్రంలో యూరియా కోసం రైతులకు పాట్లు తప్పడం లేదు. పంపిణీ కేంద్రాలు, దుకాణాల ముందు రైతులు బారులు తీరి పడిగాపులు పడుతున్నారు. ఆదివారం రంగారెడ్డి జిల్లా ఆమనగల్లులో ఒక దశలో తోపులాట జరిగింది. దాంతో పోలీసు బందోబస్తు నడుమ పంపిణీ చేశారు. వికారాబాద్ జిల్లా దోమలో ఆగ్రోస్ రైతు సేవా కేంద్రం నిర్వాహకులు టోకెన్లు ఇచ్చి అందరికీ యూరియా ఇవ్వకపోవడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. యూరియాను బ్లాక్ మార్కెట్‌లో విక్రయించేందుకు నిర్వాహకులు యత్నిస్తున్నారని ఆరోపించారు. మహబూబాబాద్ జిల్లా మరిపెడ పీఏసీఎస్‌కు వచ్చిన రైతుల పట్టా, ఆధార్ జిరాక్స్ ప్రతులను వ్యవసాయ శాఖ సిబ్బంది విసిరేశారు. దీనిపై అధికారులను వివరణ కోరగా.. రైతులు ఎగబడడంతో కాగితాలు టేబుల్‌పై నుంచి కిందపడిపోయాయన్నారు. గత వారం రోజులుగా ఎదురుచూస్తున్న నర్సింహులపేట రైతులకు ఎట్టకేలకు వ్యవసాయ అధికారులు పోలీసుల సమక్షంలో కూపన్లు పంపిణీ చేశారు. సుమారు వెయ్యి మంది రైతు వేదిక వద్దకు రాగా 770 మందికి మాత్రమే కూపన్లు ఇవ్వడంతో మిగిలిన రైతులు నిరాశతో వెనుతిరిగారు. జనగామ జిల్లా పాలకుర్తిలో రైతు సేవా సహకార పరపతి సంఘం వద్దకు ఆదివారం తెల్లవారుజాము నుంచే రైతులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. 500 మందికి పైగా రైతు లు క్యూలైన్‌లోనే గంటల తరబడి నిలబడ్డారు. హైదరాబాద్ నుంచి 444 యూరియా బస్తాలు రాగా, వాటిని పోలీసుల సమక్షంలో ఒక్కో బస్తా చొప్పున పంపిణీ చేశారు. యూరియా అందని రైతులు నిరాశతో వెళ్లిపోయారు. సరిపడా యూరియా ఇవ్వాలంటూ రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలంలో రైతులు రహదారిపై బైఠాయించారు.



బైరాగి సంశయ పథం

"నాకు తెలుసు నాకు తెలుసు
ప్రళయవేదనా పంకిల ప్రపంచ పథం మధ్య
ప్రేమలు పొసగవనీ
ఈ బండరాళ్లపైన ఏ మొక్కలూ ఎదగవనీ
మనమంతా చీకటిలో ఆకటితో పోరాడే
అస్వతంత్ర సైనికులమనీ..." అంటూ అసమ జీవితాలను కవిత్వంగా మలచినవాడు ఆలూరి బైరాగి. ఆయనకు ఇది శత జయంతి సంవత్సరం. వెంకట్రాయుడు సరస్వతమ్మ దంపతులకు 1925 సెప్టెంబర్ 5న తెనాలి దగ్గర ఐతానగరంలో జన్మించాడు బైరాగి. పాఠశాలకు వెళ్లి చదువుకున్నది రెండవ తరగతి వరకు మాత్రమే. తండ్రి దేశభక్తుడు అవడంతో బైరాగిని హిందీ చదువుకోమని ప్రోత్సహించాడు. ఎలమంచిలి వెంకటప్పయ్య స్థాపించిన హిందీ పాఠశాలలో చదువుకుంటూ తరువాత హిందీలో ఉన్నత విద్యను అభ్యసించడానికి ఉత్తర భారతం వెళ్ళాడు బైరాగి. హిందీ భాషా సాహిత్యాలను చదువుకుంటున్న ప్రాథమిక దశలోనే హిందీలో కవిత్వం రాయడం ప్రారంభించాడు. బిహార్ లోని ముజఫర్‌పూర్‌లో జరిగిన కవి సమ్మేళనంలో 15వ కేటనే పాల్గొని హిందీ సాహిత్య ప్రముఖులతో ప్రశంసలు అందుకున్నాడు. తొలి నాళ్లలో రాసిన హిందీ కవితలు అన్నింటిని కలిపి 'పలాయన్' పేరుతో కవితా సంపుటిని ప్రచురించాడు. తెనాలి తిరిగి వచ్చిన బైరాగి గుంటూరుకు సమీపంలోని పత్తిపాడులో హిందీ ఉపాధ్యాయుడుగా చేరాడు. 1942లో స్వాతంత్ర్యం కోసం గాంధీజీ పిలుపుమేరకు జరుగుతున్న క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్నాడు. ఆ తరువాత ఎం.ఎన్. రాయ్ రాడికల్ హ్యూమనిజం ప్రభావానికి లోనై రాడికల్ డెమోక్రటిక్ పార్టీలో కొంత కాలం పనిచేశాడు.

తెలుగులో పిల్లల మాసపత్రికగా అత్యంత ఆదరణ పొందిన 'చందమామ'ను హిందీలో కూడా ప్రచురించాలని నిర్వాహకులు అనుకున్నప్పుడు, వారిలో ఒకరైన ఆలూరి చక్రపాణి తన అన్న కుమారుడైన బైరాగిని ఆ పత్రికకు సంపాదకత్వ బాధ్యతలు నిర్వహించడానికి ఆహ్వానించాడు. అలా బైరాగి హిందీ 'చందమామ'కు తొలి సంపాదకుడయ్యాడు. అయితే తొలి నుంచి ఎటువంటి కట్టుబాట్లకు నియమ నిబంధనలకు లొంగి ఉండే అలవాటు లేని కారణాన, ఆ పత్రికలో ఎక్కువ కాలం కొనసాగ లేకపోయాడు. నెల పొడవునా చేయాల్సిన పనిని వారం రోజుల్లో ముగించి తనకి ఇష్టమైనవి చదువుకుంటూ గడపడం బైరాగి బాబాయి చక్రపాణికి నచ్చలేదు. దానితో చందమామకు రాజీనామా చేసి తిరిగి తెనాలి చేరుకున్నాడు. 'చందమామ'లో పనిచేసిన కాలంలో బాలల కోసం అనేక రచనలు చేశాడు. పిల్లల గేయాలు రాసేటప్పుడు బైరాగి భాష సులభ గ్రాహ్యంగా, అలతి అలతి పదాలతో ఉండడం గమనార్హం: "చీకటి పడింది తల్లి దీపం చూపవేలనే/ మాకై దీపం చూపవేలనే/ ఆటపాటల ప్రొద్దు బుచ్చినవి/ పిట్టలు గూటికి తిరిగి వచ్చినవి/ రెక్కలార్చి పవలెల్ల నొచ్చినవి/ సంజమసక నిన్ను దరియ వచ్చితిమి కోపమేలనే/ మాకై దీపం చూపవేలనే/ పాపపుణ్యములు పరిచిన బాటలు/ కూడని వేడుక కూడిన చోటుల/ పయనించాం మా పసి చెలగాటాల/ మలిన దేహంలము చల్లని చేతులు చూపవేలనే" ఇలా ఉంటుంది ఆ శైలి.

జీవించి ఉన్నంతకాలం బైరాగి కవితా లోకానికి దూరంగానే ఉండిపోయాడు. దానికి ప్రధాన కారణం ఆయన కవిత్వంలో చూపిన స్వతంత్ర, స్వేచ్ఛాతత్వం. ఆయనది ఏ ఇజానికీ లొంగని నవ్య మానవతా దృక్పథం అనుకోవచ్చు. పత్తిపాడులో పని చేస్తున్నప్పుడూ, అంతకంటే ముందు కాలం లోనూ రాసిన కవితలు అన్నింటినీ 'చీకటి నీడలు' పేరుతో కవితా సంపుటిగా తెచ్చాడు. బైరాగి కవిత్వం ఆధునిక నవ్య కవితవాదాన్ని ముందుకు తెచ్చింది. శ్రీశ్రీ అభ్యుదయ కవితా జ్వాలలు, కృష్ణశాస్త్రి భావ కవితా వీచికలకు భిన్నంగా బైరాగి తనదైన కవిత్వాన్ని పాఠక లోకానికి అందజేశారు. అప్పటికే ఉగాది, దీపావళి లాంటి పండుగలకు సందర్భోచిత కవిత్వం రాయడం కవులకు పరిపాటి అయింది. అయితే బైరాగి కొత్త ధోరణితో దీపావళి కవితను రాశారు: "దీపావళి ఉత్సవమండి/ దీపావళి చేద్దాం రండి/ ఆకాశం మండిద్దామా/ పాతాళం తగలేద్దామా/ దీపావళి చేద్దామా/ నరకాసురు డెందుకు ప్రపంచ/ నరకాన్నే మసి చేద్దామా/ కాటుకలా నల్లని చీకటి/ జ్యోతుల బంధించిన వాకిటి/ తలుపులు పగలేద్దామా" ఇలా– ఇక్కడ దీపావళి ఏ ఆనందాల కోసం జరుపుకుంటున్నామో అవి అందరివీ కాదనీ, ప్రపంచమంతా ఇంకా నరక కూపం లోనే ఉందనీ, ఆ నరకాన్ని మసి చేసే దీపావళిని జరుపుకుందామనీ ఇక్కడ పిలుపు ఇస్తున్నాడు.

బైరాగి 'నూతిలో గొంతుకలు' ఒక సంశయాత్మక కావ్యం. దీనిలో మానవుడు "ఏది త్రోవ?" అని అడుగుతాడు. అనేక ఆవేదనలతో నడుస్తున్న జీవితంలో ఏది కర్మ, ఏది కర్మ క్షేత్రంలో తక్షణికం, ఏది కర్మ తరువాత బాధ అనే అంశాలను షేక్స్పియర్ నాటకంలోని 'హామ్లెట్', మహాభారతంలోని 'అర్జునుడు', క్రైమ్ అండ్ పనిష్మెంట్ నవలలోని 'రాస్కోల్నికోవ్' పాత్రల ద్వారా చర్చకు పెడతాడు.

బైరాగి కవితలలో నైరాశ్యం, నిస్పృహ, ఆత్మ చింతన ప్రస్ఫుటంగా కనబడుతుంది. అయితే ఆయన నైరాశ్యం మనసును కిందకు లాగివేసేది కాదు. అంత రాత్మను తొలగించే ప్రభంజనం లాంటిది అంటాడు పాలగుమ్మి పద్మరాజు. ఆనాటి కవిత్వావరణంలో తాను ఇమడలేనని, తన బాట వేరని అంటూ, "నేను మీ కవిని కాను" అని ప్రకటించుకున్నాడు బైరాగి. "నాదాల, నినాదాల, వివాదాల బాణ సంచాలు ప్రేల్చడానికి/ రంగు రంగుల మతాబాలు కాల్చడానికి/ చిలుకలాగు సూక్తులు పలకడానికి/ శాక్రిన్ తేనె సోన లొలకడానికి/ మహామహులకు అభినందన వందనలు తెలపటానికి/ ఇష్టం లేని కృపణప్రశంసల తీయని విషం కలపటానికి/ నేను మీ కవిని కాదు" అంటాడు.

జీవించి ఉన్నంత కాలం బైరాగి కవితా లోకానికి దూరంగానే ఉండిపోయాడు. దానికి ప్రధాన కారణం ఆయన కవిత్వంలో చూపిన స్వతంత్ర, స్వేచ్ఛాతత్వం. ఆనాటి కవిత్వావరణంలో తాను ఇమడలేనని, తన బాట వేరని అంటూ, "నేను మీ కవిని కాను" అని ప్రకటించుకున్నాడు.

"నిధనం వంటి ధనం చేసే సత్కారాలు, సన్మానాలు/ జరీ అంచుల శాలువాలు, చందన తాంబూలాలు, పూలగుత్తులు, హారాలు/ కవితాసతి శవసంస్కృతి క్రతువులోన తీరని అవమానాలు/ నేవలచిన ఈ మృణాలదేహానికి చేజేతుల నిప్పుపెట్టలేను నేను/... /జీవిత మహిత జనక దుహిత స్వయంవర సమరంలోన/ పినాకాన్ని తృణంలాగ త్రుంచిన నేను/.../ దీనంగా మౌనంగా నేడు వేడుకుంటున్నాను. /నేను మీ కవిని కాను," అంటాడు.

బైరాగి మరణం తరువాత ఆయన పెట్టె లోని రచనలన్నీ వెలికితీసి 'ఆగమగీతి' పేరుతో ప్రచురించారు. దీనికి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు లభించింది. ఒంటరితనాన్ని ప్రేమించిన బైరాగి మిత్రులు ఎవరినీ దగ్గరకు రానిచ్చేవాడు కాదు. చివరి రోజుల్లో హైదరాబాద్‌లో తమ్ముని దగ్గర ఉన్నప్పుడు గదిలోంచి బయటకు వచ్చేవాడు కాదు. అప్పటి తన స్థితిని గూర్చి 'త్రిశంకు స్వర్గం' అనే కవితలో: "గాలిరాని చీకటి గదిలో/ మారుమూల మదిలో/ నిర్మించిన మహా ప్రపంచం; నేను విరించిని –/ భారంగా వ్రేలాడే సిగరెట్ పొగ, పారాడే బండరాయి/ చీకటితో పోరాడే వెలుతురులో నోరాడని కటిక దుమ్ము/ భూమ్యాకాశాలమధ్య అ త్రిశంకు స్వర్గంలో/ తారాడే సాలీడుకు ఈడు జోడు వాడు వీడు/ చాప మీద పొరలాడే నరాధముడు" అంటూ తన ఉనికిని ప్రకటించుకున్నాడు. బైరాగి కవిత్వం, ఆయన భాషాపటిమ, వాక్యనిర్మాణం ఈనాటి తరానికి ఒక గైడ్ లాగా ఉపయోగపడతాయి.

(సెప్టెంబర్ 5న ఆలూరి బైరాగి శతజయంతి)

■ బండ్ల మాధవరావు

'త్రివేణి' కవిత్వ సంపుటి

వారాల ఆనంద్ కవితా సంపుటి 'త్రివేణి' (మూడు పంక్తుల కవిత్వం) ఆవిష్కరణ సెప్టెంబర్ 1 న కరీంనగర్ లోని కార్ఖానగడ్డ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరుగుతుంది. పాఠశాల ఉపాధ్యాయుడు, సాహితీ గౌతమి అధ్యక్షుడు నంది శ్రీనివాస్ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. పుస్తకాన్ని హిందీ ఉపాధ్యాయుడు ఉడుత రాజేశం ఆవిష్కరిస్తారు. పలువురు కవులు హాజరవుతారు.

వి. ఇందిరా రాణి

ఉదారి నాగదాసు కవితా పురస్కారం

ఉదారి నాగదాసు స్మారక కవితా పురస్కారాన్ని 2025 సంవత్సరానికిగాను ప్రముఖ కవయిత్రి తోట నిర్మలారాణి స్వీకరిస్తారు. సెప్టెంబర్ 7న ఆదిలాబాద్‌లో అవార్డు ప్రదానోత్సవం జరుతుంది. అవార్డు కింద రూ.5వేల నగదు, ప్రశంసా పత్రం అందజేస్తారు. మరిన్ని వివరాలకు: 9441413666.

ఉదారి నారాయణ

దీర్ఘకవితల పోటీలు

రాయలసీమ సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో దీర్ఘ కవితల పోటీలను తిమ్మాపురం బాలకృష్ణారెడ్డి స్మారకంగా నిర్వహిస్తున్నాం. రాయలసీమ నేపథ్యంగా, దీర్ఘ కవితా లక్షణాలతో నవంబర్ 1 లోపు కవితలను పంపాలి. మరిన్ని వివరాలకు 9963917187నంబరులో సంప్రదించగలరు. న్యాయనిర్ణేతల నిర్ణయం మేరకు మొత్తంగా రూ.15వేల నగదును బహుమతులుగా అందచేస్తాం.

అప్పిరెడ్డి హరినాథరెడ్డి

బొమ్మలు: అక్బర్

విశ్వనాథ నవలలపై సదస్సు

విశ్వనాథ సాహిత్య అకాడమి – వివిఐటి విశ్వవిద్యాలయం, నంబూరు సంయుక్త నిర్వహణలో 'విశ్వనాథ పథంలో యువత' శీర్షికతో విశ్వనాథ సత్యనారాయణ నవలా సాహిత్యంపై నేటి యువత దృక్పథం – పత్ర సమర్పణ సదస్సు సెప్టెంబర్ 7 ఉ.9.45ని.ల నుండి శ్రీ త్యాగరాజ సాంస్కృతిక సంఘం, లక్ష్మీపురం, గుంటూరులో జరుగుతుంది. మద్దినేని సింహాకౌటిల్య చౌదరి, విశ్వనాథ సత్యనారాయణ (విశ్వనాథ మనుమడు), పిన్నమనేని మృత్యుంజయరావు, అబ్బరాజు మైథిలి, హేలీకళ్యాణ్ తదితరులు పాల్గొంటారు.

మోదుగుల రవి

అనిశెట్టి రజితపై సమాలోచన

అనిశెట్టి రజిత జీవితం-సాహిత్యంపై సమాలోచన కార్యక్రమం సెప్టెంబరు 2 సా.5గంటలకు రవీంద్ర భారతి కాన్ఫరెన్స్‌హాల్, హైదరాబాద్‌లో జరుగుతుంది. సభాధ్యక్షుడు నామోజు బాలాచారి, ముఖ్య అతిథి ముదిగంటి సుజాతా రెడ్డి, గౌరవ అతిథి నందిని సిధారెడ్డి, విశిష్ట అతిథి సంగిశెట్టి శ్రీనివాస్, ఆత్మీయ అతిథి జూపాక సుభద్ర, వక్తలు తిరునగరి దేవకీ దేవి, నెల్లుట్ల రమాదేవి, బ్రహ్మచారి, గిరిజ పైడిమర్రి.

భండారు విజయ

సాహిత్యకారులు సినిమాకి రాస్తే...

మంచి సాహిత్యం అనేది మానవ అనుభవాల, భావోద్వేగాల, తాత్త్విక ఆలోచనల సమాహారం. అది కేవలం పుస్తకాల్లో మాత్రమే బంధించబడదు. ఒక అద్దంలా గతాన్ని ప్రతిబింబించి, వర్తమానం మీద నిలబెట్టి, భవిష్యత్తుకు మార్గదర్శనం చేస్తుంది. అదే విధంగా సినిమా కూడా సమాజానికి అద్దం లాంటిది. అది సాహిత్యం కంటే బలమైన ప్రభావాన్ని సమాజం మీద చూపిస్తుంది. దృశ్యరూపంలో, శ్రవ్య రూపంలో, తక్షణ ప్రభావంతో మనసును కదిలిస్తుంది. ఈ రెండు కళా మాధ్యమాలు కలిసినప్పుడు పుట్టేది ఒక బలమైన సృష్టి. అది వినోదానికో విలాసానికో పరిమితం కాకుండా కాలానికి సాక్ష్యంగా నిలిచి కదలి కదిలించే గొప్ప కృతి అవుతుంది.

తెలుగు సినీ చరిత్రలో సాహిత్యకారుల పాత్ర ఆరంభం నుంచే ఉంది. భావుకత నిండిన గీతాలతో ఆత్రేయ, పద మాంత్రికతతో రాసిన పాటలతో ఆరుద్ర, దాశరథి, శ్రీశ్రీ, సినారె మొదలైన వారు సినిమాలకు వచ్చి తమదైన ముద్ర వేసి ప్రేక్షకుల మనసు దోచుకున్నారు. చలం, పాలగుమ్మి పద్మరాజు, కారా, అంపశయ్య నవీన్ వంటి వారి రచనలు సినిమాలుగా మారాయి. ఉన్నవ, తాపీ ధర్మారావు, గురజాడ, దేవులపల్లి, మల్లాది, త్రిపురనేని, విశ్వనాథ వంటి వారి సాహిత్యం ప్రత్యక్షంగానో పరోక్షంగానో సినిమాల్లో ప్రతిబింబించింది. సాహిత్యపు పద ప్రయోగ నైపుణ్యమైన జంధ్యాల హాస్యం, వ్యంగ్యం వెండితెరపై మెరిసింది.

మొదట భక్తిరస ప్రధానంగా ప్రారంభమైన తెలుగు సినిమా, క్రమంగా రైతుజీవితం, మధ్యతరగతి సమస్యలు, మానవ సంబంధాలను చూపింది. 1980లలో సంగీత భరితమైన భక్తి రస చిత్రాలు మళ్లీ పుంజుకున్నాయి. అప్పటివరకు సాహిత్యకారులు సినిమా వెంటే నడిచారు. కానీ తర్వాతి కాలంలో కమర్షియల్ ధోరణులు బలపడ్డాయి. ఫైట్లు, పాటలు, గ్లామర్, హీరోయిజం ప్రధానమయ్యాయి. సీరియస్ సాహిత్యం వెనుకబడ్డది. మంచి సాహిత్యం రాసే రచయితలకు సినిమాలకు మధ్య దూరం పెరిగింది. హీరో అభిమానం, వందల కోట్ల బడ్జెట్, వ్యక్తి పూజ ఇవన్నీ కొత్త ధోరణులుగా వెలిశాయి. ఈ మార్పులతో తెలుగు సినిమా రూపమే మారిపోయింది. జీవితాలను చూపకుండా వినోదం పేరుతో రొటీన్ ప్రేమ ఫార్ములాతో, హింస, మసాలాలు దట్టించిన సినిమాలే విజయాలను సాధించాయి. అలాంటి తెలుగు సినిమా నేల దిగడానికి చాలా సంవత్సరాలు పట్టింది.

ఐతే ఇన్ని వ్యాపార వాణిజ్య ఒత్తిళ్ల మధ్యలో కూడా టి. కృష్ణ, ముత్యాల సుబ్బయ్య బి.నర్సింగరావు లాంటి ఎందరో దర్శకులు సాహిత్య విలువలు నిలబెట్టారు. టి. కృష్ణ సినిమాలు సామాజిక న్యాయం, వర్గపోరాటం, సమానత్వం అంశాలను కేంద్రీకరించగా, ముత్యాల సుబ్బయ్య తన సినిమాల్లో మానవ సంబంధాల సున్నిత కోణాలను చూపించారు. బి. నర్సింగరావు తెలంగాణ వాస్తవిక జీవితాలను, భాషను తెరకెక్కించాడు. అప్పుడప్పుడు చుక్క తెగిపడ్డట్టు



ఓటీటీ ప్లాట్‌ఫారమ్‌ల ఆవిర్భావం తెలుగు సినిమాకు కొత్త దిశను చూపింది. ప్రపంచ సినిమాలను చూడగల అవకాశం ప్రేక్షకులకు లభించింది. వారి అభిరుచి మారింది. దీంతో రచయితలు దర్శకులు పూర్తి స్వేచ్ఛతో సాహిత్య విలువలు ఉన్న సినిమాలను తీసే అవకాశం వచ్చింది. ఇది సాహిత్య ఆధారిత చిత్రాలకూ రచయితలకు ఒక కొత్త దారిని చూపింది.

కొన్ని సినిమాలు సామాజిక స్పృహను కలిగి సంభాషణల్లో కవిత్వ మాధుర్యాన్ని భావుకతను అందించాయి.

తెలుగుతో పోల్చి చూసినప్పుడు తమిళ చిత్రసీమలో సినిమాకీ సాహిత్యానికీ సంబంధం మరింత బలంగా ఉంది. జయకాంతన్ నవలలు సామాజిక వాస్తవాలను అద్దంలా చూపించాయి. భారతి రాజా గ్రామీణ సాహిత్య సుగంధం అద్దిన కథలతో సినిమాలు తీశారు. మణిరత్నం చిత్రాల్లో జయమోహన్ రాసిన సంభాషణలు తాత్త్విక లోతును, మానవ సంబంధాల సంక్లిష్టతను ఆవిష్కరించాయి. మలయాళ సినీ రంగం సాహిత్యాధారిత చిత్రాలకు ఆదర్శంగా నిలిచింది. ఎం.టి. వాసుదేవన్ నాయర్ స్క్రిప్టులు మానవ జీవితాల సంఘర్షణను లోతుగా చూపించాయి. వయలార్, బషీర్ రచనలు సినిమాల్లో మానవతా విలువలను నింపాయి. అక్కడి సినిమాలు కేవలం వినోదపు సినిమాలు కావు. వాస్తవికత, మానవత్వం సమానంగా కలిసిన జీవన వాస్తవ చిత్రాలు.

కరోనా తర్వాత ఓటీటీ ప్లాట్‌ఫారమ్‌ల ఆవిర్భావం తెలుగు సినిమాకు కొత్త దిశను చూపింది. ప్రపంచ సినిమాలను చూడగల అవకాశం ప్రేక్షకులకు లభించింది. తమిళం, మలయాళం చిత్రాల బలమైన కథనశైలిని నూతనత్వాన్ని, జీవన వాస్తవికతను మన ప్రేక్షకులు ఆస్వాదించారు. వారి అభిరుచి మారింది. దీంతో చిన్న సినిమాలు, చిన్న దర్శకులు కూడా వెండితెర మీద నిలబడే అవకాశం పొందారు. రచయితలు దర్శకులు పూర్తి స్వేచ్ఛతో సాహిత్య విలువలు ఉన్న సినిమాలను తీసే అవకాశం వచ్చింది. ఇది సాహిత్య ఆధారిత చిత్రాలకూ రచయితలకు ఒక కొత్త దారిని చూపింది. కథా బలం ఉన్న 'కంచరపాలెం', 'మల్లేశం' లాంటి సినిమాలు, మానవతా విలువలకు పట్టంగట్టిన 'బలగం'లాంటి సినిమాలు ఎలాంటి ప్రచారాల ఆర్భాటం లేకుండా ప్రేక్షకుల మన్ననలను పొందాయి. సాహిత్యకారులు సినిమాలకు రాస్తే ఎలాంటి సినిమాలు వస్తాయో చెప్పడానికి వీటి విజయమే ఒక ఉదాహరణ.

ఓటీటీతో ప్రపంచవ్యాప్త ప్రేక్షకులు అందుబాటు లోకి వచ్చారు. మార్కెట్ పరిమితులు తగ్గుతున్నాయి. ఈ కాలంలో ఒక గొప్ప సాహిత్యకారుడు సినిమాకి రాస్తే, కథలో మానవీయ లోతు, సంభాషణల్లో కవిత్వం, పాత్రల్లో ఆత్మ, దృశ్యాల్లో సాంస్కృతిక వైభవం తప్పక ప్రతిబింబిస్తాయి. అయితే కొన్ని అడ్డంకులు లేకపోలేదు. వాణిజ్య ఒత్తిళ్లు, నిర్మాతల లాభనష్టపు లెక్కలు, తక్షణ వినోదం కోరే ధోరణి, ఏండ్లకేండ్లుగా రొటీన్ ప్రేమ కథల ఫార్ములాలు ఉన్నాయి. ఇవే తెలుగు సినిమాలో మంచి రచయితలను లేకుండా చేసాయి. కానీ సాహిత్యానికి ప్రాధాన్యం ఇచ్చే ప్రేక్షకులు పెరిగితే, పుస్తక పఠనం అలవాటు విస్తరించితే, నిర్మాతలు కూడా వెనుకడుగు వేయరు. ప్రభుత్వం, సాంస్కృతిక సంస్థలు సాహిత్య ఆధారిత చిత్రాలకు ప్రోత్సాహం అందిస్తే, భవిష్యత్తులో తెలుగు సినిమాకు మరో సువర్ణయుగం సాధ్యం.

సాహిత్యం లేని సినిమా బలహీనమవుతుంది. సాహిత్యం ఉన్న సినిమా యుగాలను దాటి నిలుస్తుంది. దూరమైన సాహిత్యం – సినిమా కలయిక నేటికీ సాధ్యమే. సాహిత్యకారులు తెరమీద అడుగుపెడితే భాష గౌరవం పెరిగి, లోతు పెరుగుతుంది. ప్రేక్షకులు ఆమోదిస్తే, నిర్మాతలు ప్రోత్సహిస్తే తెలుగు సినీ ప్రపంచం మరోసారి సాహిత్య సువాసనతో పరిమళించే రోజులు ఎంతో దూరంలో లేవు.

■ పెద్దింటి అశోక్ కుమార్
✆ 94416 72428



రెక్కలు విప్పిన దృశ్యం కోసం

ఒకరు గాయపడినపుడల్లా ఓదార్చి
నెమలీక స్పర్శతో మందు రాస్తుంది
వర్షం యొక్క సన్నని సంభాషణలా ధ్వనిస్తుంది
ఆత్మవిశ్వాసంతో ఉంటూ
నిలువెల్లా ఒక ఎదురీత పటుత్వంతో
ప్రతి కుంగదీత తర్వాత త్వరగా లేస్తూ
పోరాడుతూ, బలపడుతూ
"వి వాంట్ జస్టిస్" అంటూ స్వరం కలుపుతూ
రెక్కలు విప్పిన దృశ్యంకోసం పిడికిలి బిగించి
అణచివేతల కట్లు తెంపుతోంది

ఆమెకు ఆమె గుర్తుగా ఏదో చేయాలని వుంది
ఏది పువ్వో, ఏది ముల్లో
ఏది వానో, ఏది వడగళ్ళో
ఒక స్పర్శలో ఎన్ని స్పర్శలున్నవో
ఒక వానలో ఎన్ని వానలున్నవోననే
రెక్కలుండి వెలుగుండి
బంకమట్టికి అతికించిన మిణుగురులాంటి
అవస్థ నుండి బయటపడుతోంది

చేతిరేఖలరగదీసి బతుక్కి తిలకందిద్ది
పునాదిరాతిలా నిలిచిన ఆమె
ఏ గోడల వెనుకో దాక్కోకుండా
దారి అంతటా ఒకరు తోడుకావాలనే
కొన్ని గింజలేసి పట్టుకోజూస్తే లొంగిపోకుండా
వెలుగులోకొస్తోంది

స్వేచ్ఛను మాట్లాడటానికి
తన కథకు స్వరాలిస్తూ
చెదిరిన కలల రోజుల్నిదాటి
సాధికారతా సంతకం పెడుతూ
మోసిన తట్టెడు సర్వనామాల్ని
కీబోర్డుమీద కొనగోటితో చెరిపేస్తోంది
తనని ఒక గుర్తింపులేని చిరునామాగా
ఉంచిన రోజుల్ని ధిక్కరిస్తూ
తరాల నిశ్శబ్దాన్ని బద్దలుకొడుతోంది.

■ శాంతయోగి యోగానంద
✆ 96522 71520

విమర్శ నన్ను విశాలం చేసింది!

రెంటాల శ్రీ వెంకటేశ్వర రావు కవిత్వం, గజళ్ళు, సమీక్షలు, అనేక విమర్శా వ్యాసాలు రాశారు. 'ఫౌంటెన్ హెడ్', 'అట్లాస్ ష్రగ్డ్' వంటి పాపులర్ అనువాదాలు చేశారు. సునిశిత పరిశీలనకు ఆయన ప్రసంగాలు పెట్టింది పేరు. ఆయన పీహెచ్‌డీ పరిశోధనా గ్రంథం 'ఆధునిక తెలుగు సాహిత్యంలో అధిక్షేప ధోరణులు' విలక్షణమైనది. 'పొలుపు', 'లోపలికి', 'వెలుతురు' అనే ఆయన వ్యాస సంపుటాలు ప్రతి ఒక్కరు చదవాల్సినవి. రెంటాల ఈ సెప్టెంబరు 7న కాకినాడలో అద్దేపల్లి రామమోహనరావు సాహిత్య విమర్శా పురస్కారం అందుకుంటున్న సందర్భంగా ఆయనతో ఈ సంభాషణ.



మీరు అనేక సాహిత్య ప్రక్రియల్లో కృషి చేశారు కదా. మీకు ఏది బాగా ఇష్టమైనది ?

రాసినవన్నీ ఇష్టం గానే రాశాను. ఎక్కువగా రాసింది మటుకు విమర్శే హైస్కూలు రోజుల్లో కథా రచయితని కావాలని ఉండేది. కాలేజీ రోజుల్లో అదే పనిగా పద్యాలు రాశాను. ఎంఫిల్ పీహెచ్డీ చేసేప్పుడు మాత్రం పరిశోధనా వ్యాసంగంలో సృజనను పక్కన పెట్టాల్సి వచ్చింది.

వర్తమాన తెలుగు సాహిత్యంలో విమర్శ ప్రభావాన్ని ఎలా అంచనా వేయాలి?

ఒక కొత్త సమస్యను గుర్తించినప్పుడు దాని నుంచి కొత్త పోరాటాలు వస్తాయి. అవే సాహిత్యంలో ప్రతిఫలిస్తాయి. ఇది కవిత్వంలో ముందుగా జరుగుతోంది మనకు. దాని వెన్నంటే విమర్శ వచ్చి దాన్ని పరిపుష్టం చేస్తోంది. కానీ బయట నుండి ఏదన్నా ఒక కొత్త ప్రక్రియ వచ్చినప్పుడు మాత్రం విమర్శే ముందుండి అవగాహన కలిగిస్తుంది. ఇందుకు గజల్, హైకూ వంటి ప్రక్రియలే ఉదాహరణ.

ఉర్దూ గజల్‌కి తెలుగు గజల్‌కి తేడా ఏమిటి?

ఆ రెండు భాషలకి, సంస్కృతులకీ ఉన్న తేడానే ఆ గజల్స్‌కి కూడా ఉంది. ఉర్దూ గజల్స్‌లోని కాఫియా, రదీఫ్‌లూ, ప్రతీకలు ఉన్నవి ఉన్నట్టుగా తెలుగులో వాడటం కుదరదు. తెలుగులో గజల్ ఒక సంప్రదాయంగా స్థిరపడే అవకాశం లేదు. మనం కాఫియా బదులు సరైన అంత్యప్రాస వాడుకుంటే చాలు. పైగా మనకి బహార్‌లు (ఉర్దూ లయ యూనిట్లు) పాటించి తీరాల్సిన పనేమీ లేదు. మన మాత్రా ఛందస్సు సరిపోతుంది. తెలుగు గజల్ రచయితలు వస్తువును విస్తరించడం లేదు. కృతకమైన ప్రేమతో తృప్తిపడిపోతున్నారు

మీకు నచ్చిన విమర్శకుడెవరు?

కట్టమంచి మొదలుకొని కృష్ణశాస్త్రి, రాళ్ళపల్లి, సుదర్శనం, రారా, శేషేంద్ర, ఇస్మాయిల్, చేరా ఇలా చాలామంది నాకు ఇష్టం. వీళ్ళందరూ సాహిత్యం పట్ల పాఠకుడి దృష్టిని, రచయిత దృక్పథాన్నీ మలిచిన వాళ్ళు.

కృష్ణశాస్త్రిని విమర్శకుడిగా భావించడం సబబేనా?

తప్పకుండా సబబు. ఆయన 'కృష్ణశాస్త్రి వ్యాసాలు' పుస్తకం చదవండి. ఆయనది కావ్యభాష కావడం చేత, విమర్శ పరిభాష వాడకపోవడం చేత విమర్శకుడిగా గుర్తింపబడ లేదు గానీ, తిరుపతి వేంకట కవులు, పెద్దన, వేమన, బసవరాజు అప్పారావు, ఎడ్గార్ ఎలెన్ పో వంటి వారిపై ఆయన వ్యాసాలు ఎంతో లోచూపు గలవి.

మీ సాహిత్య ప్రస్థానంలో విమర్శ పాత్ర ఏమిటి?

చాలా విషయాలు నాకు విమర్శ వల్లనే స్పష్టమయ్యాయి. కొత్త రచనల్ని అర్థం చేసుకోవడంలో కొత్త అప్రోచ్ అవసరమనే అవగాహనని విమర్శే విశాలం చేసింది. ఆయా రచనల మీద, రచయితల మీద విశ్లేషణలు రాసిన సందర్భాలన్నీ నాకు ఎన్నో పాఠాలు నేర్పాయి. విమర్శ రాయడమంటే ఆలోచించడం, ఎన్నో తెలుసుకోవడం. ఏమి రాసినా వెనుక నుంచి నన్ను ముందుకు నడిపించింది నాలోని విమర్శకుడే.

సాహిత్య విమర్శకుడిగా అద్దేపల్లి రామమోహన రావుని ఎక్కడ స్థిరపరుస్తారు

ఆయన చూపు ఎప్పుడూ వర్తమాన సాహిత్యం పై ఎక్కువగా ఉండేది. సమకాలీన ప్రగతిశీల భావధారలకి గచ్చత్ వ్యాఖ్యలవంటి ఎన్నో వ్యాసాలను వెలువరించారు. ఆయన రాసినన్ని పీఠికలు ఇంకెవరైనా రాసి ఉంటారని నేను అనుకోను. అదీగాక అద్దేపల్లి రామమోహన రావు గారి విషయ గంభీర ఉపన్యాసాలు ఆయన కృషిలో పేర్కొనదగ్గవి. యువ కవుల్ని ఆయనలా ప్రోత్సహించిన వాళ్ళు తక్కువ.

ఇంటర్వ్యూ ■ శ్రీరాం పుప్పాల

సర్కార్ బడుల్లో మళ్లీ రాగి జావ



- వారంలో మూడు రోజులు అందజేత
- ఎట్టకేలకు పునరుద్ధరించిన ప్రభుత్వం
- సత్యసాయి అన్నపూర్ణ ట్రస్ట్‌కు బాధ్యత అప్పగింత
- ఉమ్మడి జిల్లాలో 5.50 లక్షల మంది విద్యార్థులకు లబ్ధి

7





వస్త్ర పరిశ్రమకు మహర్దశ

పీఎం మిత్రలోకి కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కు

- బ్రౌన్‌ఫీల్డ్ ప్రాజెక్టుగా కేఎంటీపీని చేపట్టనున్న కేంద్ర జౌళిశాఖ
- 2023లోనే దేశంలో ఏడు మెగా టెక్స్‌టైల్ పార్కులను ప్రకటించిన కేంద్రం
- వరంగల్ కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కుపై అప్పట్లో పేచీలు
- బీఆర్ఎస్ ప్రభుత్వ ప్రతిపాదనలను పక్కన పెట్టిన వైనం
- సీఎం రేవంత్‌రెడ్డి చొరవతో చేర్చేందుకు కేంద్రం మొగ్గు
- పథకంలో చేరితే కొత్తగా కంపెనీలు తరలివచ్చే అవకాశం
- రెండు లక్షల మందికి కలగనున్న ఉద్యోగ, ఉపాధి అవకాశాలు



■ ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్

వస్త్ర హబ్‌గా వరంగల్‌ను తయారు చేసేందుకు అడుగులు పడుతున్నాయి. కాకతీయ మెగా టెక్స్‌టైల్ (కేఎంటీ) పార్కును ప్రధానమంత్రి మెగా ఇంటిగ్రేటెడ్ టెక్స్‌టైల్ రీజియన్ అండ్ అప్పారెల్ (పీఎం మిత్ర) పార్కులో కేంద్ర ప్రభుత్వం చేర్చింది. బ్రౌన్‌ఫీల్డ్ ప్రాజెక్టు అభివృద్ధి చేసేందుకు ప్రణాళిక రూపొందిస్తోంది. అయితే 2023లోనే దేశంలో ఏడు మెగా టెక్స్‌టైల్ పార్కులను ప్రకటించింది. అయితే అప్పటి బీఆర్ఎస్ హయాంలో అనేకమార్లు పీఎం మిత్రలో కేటీఎంపీని చేర్చాలని ఒత్తిడి చేసినప్పటికీ నిబంధనలకు అనుకూలంగా లేదని కేంద్రం దాట వేసింది. ఎట్టకేలకు సీఎం రేవంత్‌రెడ్డి ఒత్తిడితో కేంద్రం పీఎం మిత్రలో బ్రౌన్ ఫీల్డ్ ప్రాజెక్టుగా అభివృద్ధికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. దీంతో సుమారు 2లక్షల మందికి ప్రత్యక్ష, పరోక్షంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఏర్పడనున్నాయి. ప్రపంచవ్యాప్తంగా పెట్టుబడులు పెట్టేందుకు కొత్త కంపెనీలు వరంగల్ టెక్స్‌టైల్ పార్కుకు వచ్చే అవకాశం ఉంది.

అజంజాహి మిల్లు స్థానంలో..

ఒకప్పుడు ఓరుగల్లులో అజంజాహి మిల్లు వేలాది కుటుంబాలకు జీవనోపాధి కల్పించింది. ఆ మిల్లు మూత పడిన తరువాత పత్తి ఎక్కువగా సాగయ్యే వరంగల్‌లో మరో పరిశ్రమ కోసం స్థానికులు ఎదురుచూశారు. అయితే వరంగల్ జిల్లా గీసుకొండ మండలం శాయంపేట, సంగెం మండలం చింతలపల్లి గ్రామాల్లో 2వేల ఎకరాల్లో గత బీఆర్ఎస్ ప్రభుత్వం కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కును ఏర్పాటు చేసింది. తొలి దశలో 1,350 ఎకరాల భూమిని సేకరించారు. 2017 అక్టోబరు 22న అప్పటి సీఎం కేసీఆర్ చేతుల మీదుగా భూమి పూజ నిర్వహించారు. టీఎస్ఐసీసీ సుమారు రూ.980కోట్లతో డ్రైనేజీలు, అంతర్గత రోడ్లు, విద్యుత్ సరఫరా, నీటి సరఫరా, వ్యర్థాల శుద్ధి తదితర మౌలిక వసతులు కల్పించారు. మరో రూ.370కోట్లతో కేఎంటీపీ పరిధిలో వివిధ అభివృద్ధి పనులు నిర్వహించింది. ఇందులో పెట్టుబడులకు అప్పటి ప్రభుత్వం 22 సంస్థలతో రూ.3,900కోట్లతో ఒప్పందం చేసుకుంది. ప్రస్తుతం ఈ రెండు కంపెనీలే ఇక్కడ ఉత్పత్తి చేపట్టాయి. 2023 డిసెంబరులో సీఎంగా బాధ్యతలు చేపట్టిన రేవంత్‌రెడ్డి టెక్స్‌టైల్ పార్కుపై ప్రత్యేకంగా దృష్టి పెట్టారు.

వస్త్రనగరిపై ప్రభుత్వం నజర్

కేంద్ర ప్రభుత్వం 2020-21లో వస్త్ర పరిశ్రమల అభివృద్ధి కోసం ప్రత్యేకంగా మెగా ఇండస్ట్రియల్ పార్కుల అభివృద్ధికి శ్రీకారం చుట్టింది. ఇందుకోసం ప్రధానమంత్రి మెగా ఇంటిగ్రేటెడ్ టెక్స్‌టైల్ రీజియన్ అండ్ అపెరల్ (పీఎం మిత్ర) పథకాన్ని ప్రారంభించింది. ఫార్మ్, ఫైబర్, ఫ్యాక్టరీ, ఫ్యాషన్, ఫారిన్ (ఫైవ్ఎఫ్) విధానంతో టెక్స్‌టైల్ పార్కులు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. దీనికోసం 2020-21 నుంచి 2027-28 ఆర్థిక సంవత్సరం వరకు రూ.4,445కోట్లు వెచ్చించేలా ప్రణాళిక రూపొందించారు. దేశవ్యాప్తంగా 20లక్షల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి కల్పించేందుకు ఏడు టెక్స్ పార్కుల్లో తెలంగాణకు ఒకటి కేటాయిస్తున్నట్లు 2023 మార్చి 18న ప్రధాని నరేంద్రమోదీ ప్రకటించారు. దీంతో తెలంగాణలో హైదరాబాద్‌కు దీటుగా అభివృద్ధి చెందుతున్న వరంగల్ నగర సమీపంలో అప్పటికే కోట్లాది రూపాయలు వెచ్చించి చేపట్టిన కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కు(కేఎంటీపీ)ను పీఎం మిత్ర కింద అభివృద్ధి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం కోరింది. బ్రౌన్ ఫీల్డ్ ప్రాజెక్టులు లేవని, గ్రీన్‌ఫీల్డ్ ప్రాజెక్టులే చేపట్టామని కేంద్ర జౌళిశాఖ అధికారులు పేర్కొన్నారు. దీనికి తోడు అప్పట్లో కేంద్రంతో గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఘర్షణాత్మక వైఖరి అవలంబించటంతో టెక్స్‌టైల్ పార్కు ఏర్పాటుకు కేంద్రం కొర్రీలు పెట్టిందనే విమర్శలున్నాయి. అయితే పీఎం మిత్ర నిబంధనల ప్రకారం టెక్స్‌టైల్ పార్కు కోసం రాష్ట్ర ప్రభుత్వం వెయ్యి ఎకరాల భూమిని కేటాయించాలి. అలాగే రిక్వెస్ట్ ఫర్ ప్రపోజల్స్ పిలిచి డెవలపర్‌ను ఎంపిక చేయాలి. మాస్టర్‌ప్లాన్‌ను రూపొందించి దానికి టెక్స్‌టైల్ శాఖ ఆమోదం పొందాల్సి ఉంటుందని జౌళిశాఖ అధికారులు స్పష్టం చేశారు. అలాగే అంతర్గత రోడ్లు, విద్యుత్ సరఫరా, (మిగతా 7లో..)

గణపతి మండపాల్లో నిబంధనలు పాటించాలి..

- ప్రశాంత వాతావరణంలో నిమజ్జనాలు చేయాలి
- వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్



వరంగల్ క్రైం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): గణపతి ఉత్సవ కమిటీలు పోలీసుశాఖ నిబంధనలు పాటిస్తూ గణపతి శోభయాత్రను ప్రశాంతవాతారణంలో జరుపుకుంటూ నిమజ్జనం చేయాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సప్‌ప్రీత్ సింగ్ సూచించారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో 6,683 విగ్రహాలు ప్రతిష్ఠించారన్నారు. 6,526 విగ్రహాలకు సంబంధించిన పూర్తి వివరాలను గణపతి ఉత్సవ కమిటీ నిర్వాహకులు ఆన్‌లైన్‌లో నమోదు చేశాయన్నారు. మండపాల్లో భద్రతా ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించడంతో పాటు గణపతి విగ్రహ ప్రదేశాల కచ్చితమైన సమాచారం తెలుసుకునేందుకు ఆయా పోలీస్‌స్టేషన్‌ల పరిధిలోని సిబ్బంది మండపాలను సందర్శించి సూచనలు చేస్తున్నారన్నారు. అలాగే 6,354 విగ్రహాలకు జియో ట్యాగింగ్ చేశారన్నారు. మండపాల సందర్శనలో పోలీసులు సూచిస్తున్న నిబంధనలను పాటిస్తూ చివరి రోజు ప్రశాంత వాతావరణంలో నిమజ్జనం పూర్తి చేయాలన్నారు. కాగా, గత ఏడాదితో పోలిస్తే 50 శాతం విగ్రహాలు పెరిగాయన్నారు. సెంట్రల్ జోన్ పరిధిలో 2,675, ఈస్ట్‌జోన్ పరిధిలో 2,043, వెస్ట్‌జోన్ పరిధిలో 1,945 విగ్రహాలను ప్రతిష్ఠించారని సీపీ సన్‌ప్రీత్‌సింగ్ వెల్లడించారు.

నేడు జీడబ్ల్యూఎంసీలో ప్రజావాణి

వరంగల్ కార్పొరేషన్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): నగర ప్రజల సమస్యలు నేరుగా తెలుసుకుని పరిష్కరించేందుకు ప్రతీ వారం వరంగల్ నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం సోమవారం వరంగల్ నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో నిర్వహించనున్నట్లు గ్రేటర్ మునిసిపల్ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రజల సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఆమె వెల్లడించారు. ప్రజల సమస్యలు వెల్లడించేందుకు ఉదయం నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయానికి వచ్చి ఫిర్యాదులు చేయవచ్చని తెలిపారు. ప్రజావాణిలో సంబంధిత అధికారులు బాధితుల ఫిర్యాదులు పరిష్కరించి తగిన పరిష్కారం చూపిస్తారని కమిషనర్ చహత్ బాజ్‌పాయ్ తెలిపారు.

'దేవాదుల'కు రూ.1,015 కోట్లు

- ఫేజ్-3, ప్యాకేజీ-6 పనులకు కేబినెట్ ఆమోదం
- నాలుగు నియోజకవర్గాలకు సాగునీరు అవకాశం
- స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి



అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మాట్లాడుతున్న స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి

స్టేషన్‌ఘన్‌పూర్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): దేవాదుల పథకంలో భాగంగా ఫేజ్-3, ప్యాకేజీ-6 పనులకు రూ.1,015 కోట్ల నిధులు కేటాయిస్తూ రాష్ట్ర కేబినెట్ తీర్మానం చేసిందని, దీంతో స్టేషన్‌ఘన్‌పూర్, పాలకుర్తి, వర్ధన్నపేట, తుంగతుర్తి నియోజకవర్గాల్లోని 78వేల ఎకరాలకు సాగునీరు అందించే అవకాశం ఏర్పడుతుందని స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి పేర్కొన్నారు. ఆదివారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడుతూ.. దేవాదుల ఎత్తిపోతల పథకం ఉమ్మడి వరంగల్ జిల్లాకు వరప్రదాయని అని, ఈ ప్రాజెక్టు ద్వారా సుమారు 6లక్షల ఎకరాలకు సాగునీరు అందే అవకాశం ఉందన్నారు. నిధులు మంజూరుకు ఆమోదం తెలిపినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డికి కడియం కృతజ్ఞతలు తెలిపారు. గత ప్రభుత్వం కేవలం కాళేశ్వరం ప్రాజెక్టును పట్టించుకొని, మిగతా సాగునీటి ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేయడంతో దేవాదుల పథకం పూర్తి కాలేదని ఆరోపించారు. నిధులు కేటాయించకపోవడంతో అప్పట్లో ప్రాజెక్టు పూర్తి కాలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం దేవాదుల ప్రాజెక్టుకు ప్రాధాన్యత ఇచ్చిందన్నారు. ప్రాజెక్టు పూర్తి కోసం పలుమార్లు ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలతో కలిసి సీఎంతో భేటీఅయి సమస్యను వివరించామన్నారు. దీంతో సీఎం స్పందించారని తెలిపారు. ఇటీవల పనుల కోసం టెండర్లు పిలిచినా, టెండర్ అమౌంట్ సరిపోవడం లేదని కాంట్రాక్టర్లు పనులను నిలిపివేశారని వివరించారు. సమస్యను సీఎం దృష్టికి తీసుకుపోగా వెంటనే స్పందించి, అవసరమైన బడ్జెట్‌ను పెంచి ఆదేశాలు జారీ చేసినట్లు ఎమ్మెల్యే కడియం తెలిపారు.

కాళోజీ కళాక్షేత్రాన్ని అందుబాటులోకి తేవాలి

కవులు, కళాకారుల డిమాండ్



కాళోజీ కళాక్షేత్రం ఎదుట సమావేశమైన కవులు, కళాకారులు

హనుమకొండ కల్చరల్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): నగరంలో అన్ని హంగులతో ప్రజాకవి కాళోజీ పేరిట కళాక్షేత్రం ప్రారంభించి యేడాది కావొస్తున్నా.. స్థానిక కవులు, రచయితులు, కళాకారులు అందులో ఎటువంటి కార్యక్రమాలు చేసుకోలేని పరిస్థితులు దాపురించాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం కళాక్షేత్రం ఎదుట కవులు, కళాకారులు సమావేశమయ్యారు. నగరంలోని వివిధ సాహితీ, కళారంగ సంస్థలకు చెందిన బ్రహ్మచారి (నిధి), బిల్లా మహేందర్, వల్లంపట్ల నాగేశ్వర్‌రావు, బూర భిక్షపతి, డాక్టర్ శంకర్ నారాయణ, శోభా రమేశ్, రమాదేవి, సిద్ధోజు రామబ్రహ్మం, ప్రవీణ్, డాక్టర్ వెంగల్‌రెడ్డి తదితరులు ఆదివారం కళాక్షేత్రం సమీపంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇకనైనా కాళోజీ కళాక్షేత్రాన్ని నామమాత్రపు రుసుముతో అందుబాటులోకి తెచ్చేందుకు ప్రభుత్వం చొరవ చూపాలని వారు కోరారు. కళాక్షేత్రంలో ప్రస్తుతం 1200 సీట్ల కెపాసిటీ గల మెయిన్ హాల్ కమర్షియల్‌గా మార్చడంతో అది తమకెలాంటి ప్రయోజనం లేదని, రవీంద్రభారతిలోని రెండో అంతస్తులో ఉన్న మినీ హాల్ మాదిరిగా కళాక్షేత్రంలో కూడా మినీ హాల్ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని కూడా వారు గుర్తు చేశారు. కాళోజీ కళాక్షేత్రం అద్భుతంగా ఉన్నా.. పెద్ద హాల్ భారీ బడ్జెట్ ఉంటేనే అందుబాటులోకి వస్తున్న క్రమంలో మినీ హాల్ నిర్మించి ఉపయోగంలోకి తేవాలని కోరారు. అదే విధంగా కాళోజీ కళాక్షేత్రాన్ని తమ కళాకారులు నామమాత్రపు ఫీజుతో బేషరతుగా అందుబాటులోకి తేవాలని జిల్లా సీనియర్ కళాకారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు సీతల రఘువేందర్, కార్యదర్శి ఆలేటి శ్యాం కూడా డిమాండ్ చేశారు.

రైతులను విస్మరించిన కాంగ్రెస్

- మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య
- వేలేరు మండలంలో పాదయాత్ర



పాదయాత్రలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య

వేలేరు, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): రైతు ప్రభుత్వం అని మాయ మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ.. రైతులను పూర్తిగా విస్మరించిందని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య ఆరోపించారు. ఆదివారం వేలేరు మండలకేంద్రం నుంచి గండి రామారం రిజర్వాయర్ వరకు తాటికొండ రాజయ్య పాదయాత్ర చేపట్టారు. ఈ యాత్రను హనుమకొండ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు, పశ్చిమ మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్ ముఖ్యఅతిథిగా హాజరై జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా తాటికొండ రాజయ్య మాట్లాడుతూ.. వేలేరు మండల పరిధిలోని పలు గ్రామాల్లో సాగునీటి పనులకు బీఆర్ఎస్ హయాంలో మాజీ మంత్రి కేటీఆర్ రూ.104కోట్లతో ప్రారంభించారన్నారు. గతంలో చేపట్టిన పనులను పూర్తి చేయకుండా ఎమ్మెల్యే కడియం శ్రీహరి కాలయాపన చేస్తూ రైతుల భవిష్యత్‌తో చెలగాటం ఆడుతున్నాడని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం, ఎమ్మెల్యే కడియం శ్రీహరి రైతులను విస్మరించడంతో వేలేరు, చిలుపూరు, తరిగొప్పుల మండలాలకు వ్యవసాయ పంటలకు సాగునీరు అందక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడం కోసమే వేలేరు, శాలపల్లి, పీచర, మద్దెలగూడెం, కొమ్ముగుట్ట, లింగంపల్లి, ఫతేపూర్ గ్రామాల మీదుగా గండి రామారం రిజర్వాయర్ వరకు పాదయాత్ర చేపట్టినట్లు తెలిపారు.

యూరియా అందించడంలో విఫలం

రైతులు సాగు చేసిన పంటలకు సాగునీరు అందించకపోవడంతో పాటు సాగుచేసిన పంటలకు కనీసం యూరియా సరఫరా చేయలేని అసమర్థ కాంగ్రెస్ ప్రభుత్వమని హనుమకొండ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్ ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ హయాంలో జరిగిన అభివృద్ధిని చూసి స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యేగా బీఆర్ఎస్ టికెట్‌పై కడియం శ్రీహరిని గెలిపిస్తే.. ఆపార్టీకి ద్రోహం చేసి తన బిడ్డ ఎంపీ సీటు కోసం ప్రజలను మోసగించి కాంగ్రెస్ పార్టీలో చేరిన అవకాశవాది అని విమర్శించారు. త్యాగాలకు కేరాఫ్‌గా తాటికొండ రాజయ్య నిలిస్తే అవకాశవాద రాజకీయాలకు కేరాఫ్‌గా కడియం శ్రీహరి నిలిచారని ఎద్దేవా చేశారు. స్టేషన్ ఘన్‌పూర్ నియోజక వర్గానికి ఉపఎన్నిక ఖాయమని, కడియం శ్రీహరికి రాజకీయ సమాధి కట్టడానికి ప్రజలు సిద్ధమయ్యారన్నారు. బీఆర్ఎస్ పార్టీ ప్రజలు, రైతుల పక్షపాతి అని, వారి అభివృద్ధే ధ్యేయంగా పాటు పడుతోందని సూచించారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలపై జులుం ప్రదర్శిస్తే తగిన గుణపాఠం చెప్తుతామని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో కార్పొరేటర్ ఆవాల రాధిరారెడ్డి, మాజీ కార్పొరేటర్ జోరిక రమేష్, జడ్పీ స్టాండింగ్ కమిటీ మాజీ ఛైర్మన్ మారపాక రవి, మాజీ జడ్పీటీసీ కీర్తి వెంకటేశ్వర్లు, మండల ఇన్‌చార్జి భూపతి రాజు, పాదయాత్ర ఇన్‌చార్జి మల్కిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, నాయకులు కర్ర సోమిరెడ్డి, ఆకుల కుమార్, మాధవరెడ్డి, గోవింద సురేష్, అంగోతు సంపత్, నర్సింగరావు, వివిధ గ్రామాల మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ఈతకు వెళ్లి బాలుడి మృతి



బన్నీ మృతదేహం

కృష్ణకాలనీ, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): ఈతకు వెళ్లి బాలుడు మృతి చెందిన సంఘటన భూపాలపల్లి మండలంలోని దీక్షకుంట గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. హనుమకొండ జిల్లా ఆత్మకూరు మండలకేంద్రానికి చెందిన సంగిరెడ్డి కుమారస్వామి-సునీత దంపతులు జీవనోపాధి నిమిత్తం దీక్షకుంటకు ఐదు నెలల కిందట వలస వచ్చారు. కుమారస్వామి అదే గ్రామంలో బర్ల కాపరిగా పని చేసుకుంటూ జీవనం సాగిస్తుండగా ఆయన భార్య సునిత కూలీనాలీ చేసుకుంటోంది. వీరికి కుమార్తె, కుమారుడు ఓదేలు అలియాస్ బన్నీ(14) ఉన్నారు. స్థానిక ప్రభుత్వ పాఠశాలలో బన్నీ ఎనిమిదో తరగతి చదువుతున్నాడు. తన స్నేహితులు శివమణి, హర్షవర్ధన్‌తో కలిసి అతడు గ్రామ శివారులోని వ్యవసాయ క్షేత్రంలో కొలనులోకి ఈతకు వెళ్లాడు. లోతు ఎక్కువ ఉండటాన్ని అంచనా వేయని బన్నీ నీటమునిగాడు. గమనించిన ఇద్దరు స్నేహితులు కుటుంబ సభ్యులకు, పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే అక్కడకు చేరుకున్న కుటుంబ సభ్యులు బన్నీని బయటకు తీయగా అప్పటికే అతడు మృతి చెంది ఉన్నాడు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు భూపాలపల్లి ఎస్సై రమేష్ తెలిపారు.

నాలుగు గంటల నిరీక్షణ

- వంగర గురుకుల పాఠశాల ఎదుట తల్లిదండ్రుల పడిగాపులు
- రాష్ట్ర గురుకుల పాఠశాల కార్యదర్శికి ఫిర్యాదు



వంగర గురుకులం ఎదుట గేట్లు ఎక్కి పిల్లలను చూస్తున్న తల్లిదండ్రులు

భీమదేవరపల్లి, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వంగర బాలికల గురుకుల పాఠశాల ఎదుట తల్లిదండ్రులు పడిగాపులు కాశారు. ఆదివారం కావడంతో వంగర బాలికల గురుకుల పాఠశాల ఎదుట విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను చూసేందుకు తరలివచ్చారు. ఉదయం 11 గంటల నుంచి తల్లిదండ్రులు గురుకుల పాఠశాలకు చేరుకొని తమ పిల్లల కోసం నిరీక్షించారు. సుమారు నాలుగైదు గంటల పాటు తమ పిల్లలను ఒకసారి చూసి వెళ్తామని పలువురు తల్లిదండ్రులు పాఠశాల సిబ్బందికి పలుమార్లు ఫోన్ చేశారు. కానీ సిబ్బంది నిరాకరించారు. దీంతో తమ పిల్లలను చూసేందుకు తల్లి దండ్రులు గేట్లు ఎక్కారు. తప్పని పరిస్థితుల్లో తల్లిదండ్రులు రాష్ట్ర గురుకుల కార్యదర్శి రమణకుమార్‌కు ఫిర్యాదు చేశారు. నాలుగు గంటల నిరీక్షణ తర్వాత తల్లిదండ్రులు తమ పిల్లలను చూసుకునేందుకు అవకాశం కల్పించారు. ఈ విషయంపై సిబ్బందిని వివరణ కోరగా ప్రతినెల రెండో శనివారం మాత్రమే విద్యార్థులను చూసేందుకు తల్లిదండ్రులకు అనుమతి ఉందన్నారు. ఈ విషయంపై రాష్ట్ర గురుకుల పాఠశాల కమిషనర్ రెండో శనివారం మాత్రమే విద్యార్థులను చూసేందుకు అనుమతించారు. అందుకని విద్యార్థులను తల్లిదండ్రులు చూసేందుకు ఆదివారం అనుమతించలేదని తెలిపారు.

ఉప్పరపెల్లిలో గుప్తనిధుల కోసం తవ్వకాలు

- పురాతన ఆంజనేయస్వామి ఆలయ స్థలంలో గుర్తింపు



ఉప్పరపెల్లిలో ఆంజనేయస్వామి ఆలయ భూమిలో తవ్వకాలు జరిపినట్లు కనిపిస్తున్న దృశ్యం, ఆంజనేయ స్వామి రాతి విగ్రహం

వర్ధన్నపేట రూరల్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఉప్పరపెల్లిలో గుప్తనిధుల తవ్వకాలు కలకలం సృష్టించింది. శనివారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఆంజనేయస్వామి ఆలయ స్థలంలో తవ్వకాలు జరిపినట్లుగా ఆనవాళ్లు కనిపించినట్లు స్థానికులు చెపుతున్నారు. ఉప్పరపెల్లి గ్రామ శివారులోని చెరువు, శ్మశాన వాటికకు వెళ్లే దారిలో పురాతన ఆంజనేయ స్వామి ఆలయ స్థలంలో చాలా సంవత్సరాల కిందట ఓ రాతిపై ఆంజనేయ స్వామి స్వయంభుగా వెలిశాడు. ఆలయం లేనప్పటికీ కొంత మంది ప్రజలు ఆ రాతి ఆంజనేయ స్వామికి పూజలు చేస్తున్నారు. దాదాపు 0.20 గుంటల ఆలయ భూమిలో ఈ రాతి విగ్రహం ఉండగా, దానిని ఎవరు పట్టించుకోకపోవడంతో మూలన పడింది. దీనికి తోడు చాలా వరకు భూమి అన్యాక్రాంతానికి గురైనట్లుగా చెపుతున్నారు. దీంతో గుర్తు తెలియని వ్యక్తులు పురాతన ఆలయ స్థలంలో గుప్తనిధులు ఉంటాయనే ఆశలో తవ్వకాలు చేస్తున్నారు. చాలా సార్లు ఇలాంటి తవ్వకాలు జరిగాయని, ప్రతీసారి కొంత మంది వ్యక్తులు తవ్వకాలు జరుపుతుంటారని చెపుతున్నారు. విషయం తెలిసిన పోలీసులు విచారణ చేస్తున్నట్లుగా సమాచారం.

జోరుగా మహా అన్నదానాలు

- రుద్రేశ్వరాలయంలో గణపతి యాగం
- ఐదో రోజుకు చేరుకున్న నవరాత్రి వేడుకలు





హనుమకొండలోని రుద్రేశ్వరాలయంలో గణపతి హోమం నిర్వహిస్తున్న దృశ్యం, స్పందన కేంద్రంలో గణపతి వేడుకలు

హనుమకొండ కల్చరల్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): నగరమంతా ఆధ్యాత్మిక సౌరభాలను వెదజల్లుతూ వైభవంగా నిర్వహిస్తున్న గణేష్ నవరాత్రి వేడుకల పర్వం ఆదివారం ఐదో రోజుకు చేరుకుంది. ఎక్కడ చూసినా గణేష్ నవరాత్రి సందడి కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. ఆదివారం అనేక గణేష్ మండళ్ల నిర్వాహకులు అన్నదానాలు నిర్వహించారు. హనుమకొండ బ్రాహ్మణవాడలోని ఫ్రెండ్స్ యూనిట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 20 ఏళ్ల నవరాత్రి ఉత్సవాల సందర్భంగా సిద్ధేశ్వరాలయ ప్రధాన అర్చకులు సిద్ధేశుని రవికుమార్, సురేష్ కుమార్‌ల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున అన్నదానాలు నిర్వహించారు. దొప్ప లక్ష్మీనర్సింహ ఆలయ ప్రధాన అర్చకుడు బూరుగుపల్లి చంద్రశేఖర్ శర్మ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిర్వహిస్తున్న వేడుకల్లో భాగంగా హనుమాండ్ల జనార్దన్ ఆధ్వర్యంలో మహిళలకు పాటలు, ముగ్గుల పోటీలు నిర్వహించారు. సుధానగర్, రెవెన్యూ కాలనీ, రాగన్నదర్వాజ ప్రాంతాల్లోనూ గణేష్ మండళ్ల నిర్వాహకుల ఆధ్వర్యంలో అన్నదానాలు జరిగాయి.

వేయిస్తంభాల ఆలయంలో..

చారిత్రక వేయిస్తంభాల రుద్రేశ్వరాలయంలో నిర్వహిస్తున్న ఉత్తిష్టి గణపతి నవరాత్రి ఉత్సవాలు ఐదో రోజుకు చేరుకున్నాయి. ఆలయ ఈవో అనిల్‌కుమార్ పర్యవేక్షణలో మూలగణపతిని సర్వగణపతిగా అలంకరించి పద్మవాహనంపై స్వామి వారిని మంగళవాయిద్యాలతో ఊరేగించారు. రాగన్నదర్వాజ, సుధానగర్ వరకు గ్రామోత్సవం పేరిట ఊరేగింపు నిర్వహించారు. మధ్యాహ్నం శ్రీసూక్త మహాలక్ష్మీ మూలమంత్ర గణపతి హోమాన్ని వడ్డె ప్రకాశ్, కంజుల మహేశ్ దంపతులు ఉభయ దాతలుగా వ్యవహరించి నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు గంగు ఉపేంద్రశర్మ ఆధ్వర్యంలో వైదిక కార్యక్రమాలు నిర్వహించారు. రాత్రి తాడూరి రేణుక శిష్య బృందం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున కూచిపూడి, సంప్రదాయ నృత్యాల ప్రదర్శన నిర్వహించారు. గండ్రాతి రాజు, అశోక్, రుద్రేశ్వర సేవాసమితి సేవకులు పాల్గొన్నారు. హనుమకొండలోని స్పందన మానసిక దివ్యాంగుల కేంద్రంలో అనురాగ్ హెల్పింగ్ సొసైటీ చైర్మన్ డాక్టర్ కె.అనితారెడ్డి ఆధ్వర్యంలో గణపతి వేడుకలు నిర్వహించారు. మానసిక దివ్యాంగులసేవ విశ్వమానవ సేవ అని, వారిని అందరూ ఆశీర్వదించాలన్నారు. అనంతరం అన్న ప్రసాదాన్ని వితరణ చేశారు. డాక్టర్ అనితారెడ్డితోపాటు సుచరిత, అర్చికా రెడ్డి, వసుధ, హరిత, రాజేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

మాదిగ ఉద్యోగుల సంఘం ఉపాధ్యక్షుడిగా మొగిలి



కేయూ క్యాంపస్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): హనుమకొండ జిల్లా మాదిగ ఉద్యోగులసంఘం ఉపాధ్యక్షుడిగా కేయూ నాలుగో తరగతి ఉద్యోగులసంఘం జనరల్ సెక్రటరీ బొక్క మొగిలి నియమితులయ్యారు. మాదిగ ఉద్యోగుల సంఘం ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి బొడ్డు దయాకర్, కుమ్మరి రాజన్నల నేతృత్వంలో మాదిగ ఉద్యోగుల సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మంద రాజు, ఉపాధ్యక్షులుగా డాక్టర్ రవి, బొక్క మొగిలి, అర్షం రాజు, బండారి కుమారస్వామి, మునిగాల రవి, ప్రధాన కార్యదర్శిగా తోట శ్రీనివాస్, సహాయ కార్యదర్శులుగా వస్కుల భాస్కర్, కొట్టే ప్రవీణ్, కె.కరుణాకర్, బి.స్వామి, రాజారపు ప్రసాద్, అనిల్, జె.సతీశ్, కోశాధికారిగా ఎర్ర వరదరాజు, సాంస్కృతిక కార్యదర్శులుగా రమేశ్, చక్రి, సభ్యులుగా ప్రకాశ్, సాయిలు, జన్ను సదానందం, కిరణ్, రవి, జన్ను అనిల్, రవీందర్, కుమారస్వామి, స్వామి, బాబు ఎంపిక కాగా, పలువురు అభినందించారు.

తెలుగు విభాగాధిపతి లింగయ్యకు పురస్కారం



మాజీ ఎమ్మెల్సీ అంజనేయులు నుంచి పురస్కారం అందుకుంటున్న మామిడి లింగయ్య

కేయూ క్యాంపస్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ తెలుగు విభాగాధిపతి డాక్టర్ మామిడి లింగయ్య ప్రతిష్ఠాత్మకమైన సర్వేపల్లి రాధాకృష్ణ పురస్కారం అందుకున్నారు. ఈ మేరకు ఆదివారం ఆంధ్రప్రదేశ్ గుంటూరులోని చలపతి ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో లింగయ్యకు మాజీ ఎమ్మెల్సీ అంజనేయులు జాతీయ ప్రతిభా పురస్కారంతోపాటు శాలువా, పుష్పగుచ్ఛం అందచేసి అభినందించారు. సర్వేపల్లి రాధాకృష్ణ జాతీయ ప్రతిభా పురస్కారాన్ని సదరన్ ప్రైవేట్ లెక్చరర్స్ అండ్ టీచర్స్ అసోసియేషన్ సంస్థ అందచేసింది. జాతీయ పురస్కారాన్ని అందుకున్న అసిస్టెంట్ ప్రొఫెసర్ మామిడి లింగయ్యను కేయూ తెలుగు విభాగం అధ్యాపకులు, స్కాలర్స్, విద్యార్థులు అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



మృతి చెందిన జియాఉద్దీన్

హసన్‌పర్తి, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన శనివారం రాత్రి సుమారు 11 గంటల ప్రాంతంలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ వట్టి చేరాలు కథనం ప్రకారం వివరాల్లోకి వెళితే... హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం మర్రిపెల్లిగూడెం ప్రాంతానికి చెందిన జియాఉద్దిన్ (34) భవన నిర్మాణ కార్మికుడిగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. శనివారం ఎప్పటిలాగే కమలాపూర్ మండల కేంద్రానికి చెందిన పోరండ్ల రాజు పని కోసం అతడి ద్విచక్రవాహనంపై ఇద్దరు కలిసి హనుమకొండకు వెళ్లి తిరిగి కమలాపూర్‌కు వస్తున్నారు. ఈ క్రమంలోనే పెంబర్తి శివారు ఏకశిల స్కూల్ సమీపంలోకి రాగానే రాజు నడుపుతున్న ద్విచక్రవాహనం అదుపుతప్పి కిందపడగా జియాఉద్దిన్‌కు తీవ్రగాయాలుకాగా అక్కడికక్కడే మృతి చెందగా రాజుకు గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు 108 అంబులెన్స్ ద్వారా ఎంజీఎంకు తరలించగా జియాఉద్దిన్ మృతి చెందినట్లు ఎంజీఎం వైద్యులు తెలిపారు. రాజు ద్విచక్రవాహనాన్ని అజాగ్రత్తగా అతివేగంగా నడపడం వల్లే జియాఉద్దిన్ మృతి చెందినట్లు మృతుడి భార్య ఎం.డి.రెహన్ ఫిర్యాదు మేరకు పోరండ్ల రాజుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ వట్టి చేరాలు తెలిపారు.

ఇకపై గ్రేటర్‌కు ఇద్దరే రెవెన్యూ అధికారులు

- ఉత్తర్వులు జారీ చేసిన కమిషనర్

వరంగల్ కార్పొరేషన్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ పరిధిలోని మూడు సర్కిల్ కార్యాలయాలకు ఇక నుంచి ఇద్దరు ఆర్‌వో(రెవెన్యూ అధికారులు) మాత్రమే విధులు నిర్వర్తించాలని జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో నలుగురు ఆర్‌వోలు సుదర్శన్, యూసుఫుద్దీన్, బి.శ్రీనివాస్, షహజాదిబేగం పని చేస్తుండేవారు. సుదర్శన్ ఇటీవల ఇతర ప్రాంతానికి బదిలీపై వెళ్లగా, యూసుఫుద్దీన్ ఆగస్టు 30న ఉద్యోగ విరమణ చేశారు. కాగా, గతంలో ఉన్న విధంగా కాకుండా ఇద్దరు ఆర్‌వోలు మాత్రమే విధులు నిర్వరిస్తే సరిపోతుందని, కాశిబుగ్గ-1 సర్కిల్‌కు ఆర్‌వోగా బి.శ్రీనివాస్, కాజీపేట సర్కిల్-2కు ఆర్‌వోగా షహజాది బేగంను నియమిస్తూ కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు.

అంతేకాకుండా ఆర్‌వోలకు అనుసంధానంగా పని చేసేందుకు ఆర్ఐ(రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు) నియమించారు. కాశిబుగ్గ సర్కిల్‌లో శ్రీనివాస్ వద్ద పని చేసేందుకు సీహెచ్.గిరిబాబు, ఎం.ప్రతిభ, జె.విజయ్‌కుమార్, ఎస్డీ సోహెల్, పి.అశోక్‌కుమార్‌లను నియమించారు. అదేవిధంగా కాజీపేట సర్కిల్ షహజాది బేగం వద్ద ఆర్ఐలు జి.దేవరాజు, పి.రజిని, జె.నవనీత్ కుమార్, సీహెచ్.సురేష్, జి.నరేష్, ఎస్.శ్రీకాంత్‌లు పని చేస్తారని కమిషనర్ ఆర్డర్‌లో వెల్లడించారు.

డిప్యూటీ కమిషనర్ సమ్మయ్యకు అదనపు బాధ్యతలు

ఇటీవల రాష్ట్ర వ్యాప్తంగా మునిసిపల్ కార్పొరేషన్‌ల పరిధిలో జరిగిన బదిలీలలో జీడబ్ల్యూఎంసీ పరిపాలన విభాగం డీసీ(డిప్యూటీ కమిషనర్) పోస్టు ఖాళీగా ఉండడంతో రాష్ట్ర మునిసిపల్ శాఖ అధికారి డాక్టర్ శ్రీదేవి వరంగల్‌కు పి.సమ్మయ్యకు పోస్టింగ్ ఇస్తూ గత నెల 26న ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడి విధుల్లో చేరిన సమ్మయ్యకు ఆదివారం మరికొన్ని అదనపు బాధ్యతలు అప్పగిస్తూ కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. జీడబ్ల్యూఎంసీలో పరిపాలన విభాగంతోపాటు గ్రేటర్ కార్యదర్శి, మెప్మా వింగ్‌తో పాటు ప్రభుత్వ పథకాలను చూడాలని కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. అదే విధంగా ప్రస్తుతం అదనపు కమిషనర్‌గా పని చేస్తున్న జోనా రిలీవ్ అయ్యారు.

ఎల్కతుర్తి వ్యవసాయ మార్కెట్ నూతన కమిటీ ఖరారు

- చైర్మన్‌గా సుకినే సంతాజీ



సుకినే సంతాజీ



బొక్కల స్రవంతి

ఎల్కతుర్తి, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): ఎల్కతుర్తి వ్యవసాయ మార్కెట్ మొట్ట మొదటి నూతన కమిటీని ఖరారు చేసినట్లు ఆదివారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఎల్కతుర్తి, భీమదేవరపల్లి మండలాలను కలుపుకుని 12 మంది డైరెక్టర్లు, ఒక ట్రేడర్‌తో నూతన కమిటీని ఏర్పాటు చేసింది. దీంతో ఎల్కతుర్తి మండలానికి చైర్మన్‌గిరి దక్కింది. మార్కెట్ చైర్మన్‌గా ఎల్కతుర్తికి చెందిన(బీసీ) సుకినే సంతాజీకి అవకాశం దక్కింది. రెండు రోజుల్లో పాలకవర్గం సభ్యులు బాధ్యతలు చేపట్టనున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కరీంనగర్ జిల్లా హుజురాబాద్ వ్యవసాయ మార్కెట్ పరిధిలో ఎల్కతుర్తి సబ్ మార్కెట్ యార్డును 5 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించారు. ఎల్కతుర్తి, భీమదేవరపల్లి మండలాల రైతులకు ఉపయోగకరంగా ఉండే విధంగా వ్యవసాయ మార్కెట్ యార్డును ఏర్పాటు చేశారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడినా పాలక వర్గాన్ని మాత్రం ఏర్పాటు చేయలేదు. దీంతో ఈ ప్రాంత రైతులకు నిరాశ ఎదురైంది. నామినేటెడ్ పదవులపై ఆశలు పెట్టుకున్న నాయకుల కల నెరవేరలేదు. రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ చొరవతో ఎల్కతుర్తి వ్యవసాయ మార్కెట్ యార్డుకు ఇటీవల స్వయం ప్రతిపత్తిని కల్పిస్తున్నట్లు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అలాగే మంత్రి ఆదేశానుసారంగా ప్రత్యేక కమిటీ ఏర్పాటుకు శ్రీకారం చుట్టి కమిటీని ప్రకటించారు.

డైరెక్టర్లు వీరే..

సుకినే సంతాజీ(చైర్మన్), డైరెక్టర్లుగా దాట్ల ప్రవీణ్(పెంచికల్‌పేట), మంతుర్తి రాజయ్య(దామెర), అబ్బరవేన రాజయ్య(కేశవపూర్), బచ్చు బాపురావు(సురారం), గోడిశాల రాజయ్య(ఎల్కతుర్తి), ట్రేడర్‌గా బండి సుధాకర్(జీల్గుల)ల పేర్లు ఖరారయ్యాయి.

పాలకవర్గ సభ్యులకు సన్మానాలు

ఎల్కతుర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలక వర్గాన్ని ప్రభుత్వం ప్రకటించడంతో ఎన్నికైన సభ్యులను కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు ఘనంగా సన్మానించారు. నిరుపయోగంగా ఉన్న వ్యవసాయ మార్కెట్ యార్డును అభివృద్ధి చేసి రైతులకు అందుబాటులోకి తీసుకరావాలని కోరారు.

మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షురాలిగా స్రవంతి

భీమదేవరపల్లి, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : ఎల్కతుర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షురాలిగా భీమదేవరపల్లి మండలం ముత్తారం గ్రామానికి చెందిన బొక్కల స్రవంతిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేశారు. మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశాల మేరకు స్రవంతిని ఉపాధ్యక్షురాలిగా నియమించారు. గతంలో బొక్కల స్రవంతి ముస్తాఫాపూర్ ఎంపీటీసీగా పనిచేశారు. కాంగ్రెస్ పార్టీకి విధేయురాలిగా ఉండడంతో మహిళా రిజర్వేషన్ కోటాలో స్రవంతిని ఉపాధ్యక్షురాలిగా నియమించారు. డైరెక్టర్లుగా ముల్కనూర్‌కు చెందిన మాజీ ఎంపీటీసీ గణవేన కొంరయ్య, హకీంపాషా, కొత్తకొండకు చెందిన జోడుముంతల వెంకటస్వామి, వంగరకు చెందిన శ్రీరామోజు మొండయ్య, ఎర్రబెల్లికి చెందిన మాలోతు జగన్‌లను నియమించారు. త్వరలోనే వీరి ప్రమాణస్వీకారం ఉంటుందని కాంగ్రెస్ వర్గాలు పేర్కొన్నాయి.

బైక్ ఢీకొని వృద్ధురాలి మృతి

మామునూరు, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): మామునూరు తిమ్మాపూర్ క్రాస్ వద్ద బైక్ ఢీకొని వృద్ధురాలి మృతిచెందిన ఘటన ఆదివారం సాయంత్రం చోటుచేసుకుంది. మామునూరు సీఐ రమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. వర్ధన్నపేట గ్రామానికి చెందిన మునుకుంట్ల గౌరమ్మ(62) అనే వృద్ధురాలు తిమ్మాపూర్‌లోని రైస్‌మిల్, ఇండ్లలో పని చేసుకుంటూ జీవనం కొనసాగిస్తోంది. ఈ క్రమంలో శనివారం ఉదయం 11 గంటల ప్రాంతంలో తిమ్మాపూర్‌లో తన పని ముగించుకుని ఆమె ఇంటికి వెళ్లేందుకు ఆటో కోసం రోడ్డు దగ్గరికి రాగా అదే సమయంలో వరంగల్ నుంచి ఖమ్మం వెళుతున్న తేజావత్ శ్రీకాంత్ అనే వ్యక్తి అతివేగంగా, అజాగ్రత్తగా బైక్ నడుపుతూ గౌరమ్మను వెనుక నుంచి ఢీకొనడంతో గౌరమ్మకు తీవ్రగాయాలు కాగా స్థానికులు అంబులెన్స్ ద్వారా గౌరమ్మను ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. గౌరమ్మ చికిత్స పొందుతూ ఆదివారం సాయంత్రం మృతి చెందిందని సీఐ తెలిపారు. మృతురాలు గౌరమ్మ కూతురు శ్రవంతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ రమేష్ తెలిపారు.

యూరియా కోసం ఆరాటం

- రోడ్లపైనే రైతుల నిరసనలు
- పట్టించుకోని వ్యవసాయ శాఖ అధికారులు



హనుమకొండ టౌన్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండ జిల్లాలో యూరియా కోసం అన్నదాతలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షాల కారణంగా పంటల సాగుకు సమయానికి ఎరువులు అందక అన్నదాతలు సొసైటీ కేంద్రాలు, ఆగ్రో సెంటర్ల ముందు ఉదయం నుంచి క్యూలైన్లలో నిలబడి యూరియా బస్తాల కోసం వేచి చూస్తున్నారు. ఇదే సమయంలో ప్రైవేటు వ్యాపారుల వద్ద యూరియా బస్తాలు అధిక రేట్లకు విక్రయిస్తూ ఇతర పెస్టిసైడ్ మందులతో లింకు పెట్టి అమ్మకాలు చేస్తున్నారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

రోజురోజుకు తీవ్రతరం

యూరియా కోసం రోజురోజుకూ రైతులు ఆందోళనలు జిల్లాలో ఉధృతమవుతున్నాయి. ప్రైవేటు మార్కెట్లో అధిక ధరలు, ఆగ్రోస్ సొసైటీలలో అక్రమార్కుల చేతిలో యూరియా విక్రయాలు చేస్తుండడంతో అన్నదాతలు ఆందోళనలు చేస్తున్నారు. ఎమ్మెల్యేలు, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా సమస్య పరిష్కరించడం లేదని రైతులు చెబుతున్నారు. వానాకాలం జిల్లాలో ఎరువులు సరఫరా వివరాల ప్రకారం జిల్లా వ్యాప్తంగా 26 మెట్రిక్ టన్నులు అవసరం ఉండగా బుధవారం వరకు 16,280 మెట్రిక్ టన్నులు సరఫరా చేసినట్లు, ఇప్పటి వరకు మొత్తం విక్రయాలు 14,696 మెట్రిక్ టన్నులు కాగా, ప్రస్తుతం 1584 మెట్రిక్ టన్నుల యూరియా నిల్వ ఉన్నట్లు వ్యవసాయ అధికారులు చెబుతున్నారు.

నాలుగో బెటాలియన్ కమాండెంట్‌గా శివప్రసాద్‌రెడ్డి



బాధ్యతలు స్వీకరిస్తున్న శివప్రసాద్‌రెడ్డి

మామునూరు, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : మామునూరు నాలుగో బెటాలియన్ నూతన కమాండెంట్‌గా డి.శివప్రసాద్‌రెడ్డి ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతకుముందు కమాండెంట్‌గా పనిచేసిన బి.రామ్‌ప్రకాష్ ఆదివారం పదవీ విరమణ చేశారు. పదవీ విరమణ పొందిన రామ్‌ప్రకాష్‌ను నూతన కమాండెంట్ శివప్రసాద్‌రెడ్డి శాలువా కప్పి సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్లు కృష్ణ ప్రసాద్, వీరన్న, ఇన్స్‌పెక్టర్లు విజయ్, కార్తీక్, రాజిరెడ్డి, పురుషోత్తం పాల్గొన్నారు.

మూణ్నాళ్ల ముచ్చటేనా?!

- పెచ్చులూడుతున్న డబుల్ బెడ్‌రూమ్ భవనాలు
- అస్తవ్యస్తంగా డ్రెయినేజీ.. పనిచేయని మరుగుదొడ్లు



డబుల్ బెడ్‌రూంలో కుంగిన ఫ్లోర్



ఇళ్ల మధ్యలో పేరుకుపోయిన చెత్తాచెదారం

హనుమకొండ టౌన్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండ బాలసముద్రంలో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పరిస్థితి దయనీయంగా మారింది. పంపిణీ చేసిన నెల రోజులకే గోడలు, ఫ్లోర్ కుంగి పెచ్చులూడుతున్నాయి. వర్షం పడగానే గదుల్లోకి వర్షపు నీరు చేరుతోంది. దీంతో లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నాణ్యతలేని పనులు చేయడంతో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల గోడలకు పగుళ్లు ఏర్పడి పెచ్చులూడుతున్నాయని లబ్ధిదారులు మండిపడుతున్నారు. ఇక్కడ బ్లాక్‌ల మధ్య డ్రెయినేజీ కాలువలు నిర్మించారు. వర్షాలకు డ్రెయినేజీలో మట్టి కూరుకుపోయి కాలువలు అస్తవ్యస్తంగా మారాయి. దీంతో వర్షాలకు డ్రెయినేజీ కాలువలు స్తంభించి ఇళ్లల్లోకి వర్షపు నీరు చేరుతోందని బాధితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వర్షపు నీరు నిలిచి దోమలు విజృంభిస్తున్నాయని, రాత్రివేళలో కంటిమీద కునుకే లేకుండా చేస్తూ విష జ్వరాల బారిన పడుతున్నట్లు వాపోతున్నారు. అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని చెబుతున్నారు.

అలాగే డబుల్ ఇళ్లలో ఏర్పాటు చేసిన మరుగుదొడ్లు పనిచేయకపోవడంతోఅత్యవసరాలకు బస్టాండ్‌కు, పబ్లిక్ టాయిలెట్ల వద్దకు వెళ్తున్నట్లు చెబుతున్నారు. వృద్ధులు, వికలాంగులు బయటకు వెళ్లాలంటే ఇబ్బందులు పడుతున్నట్లు వాపోతున్నారు. మూడంతస్తుల పైనుంచి కిందికి వచ్చి మరుగుదొడ్ల కోసం బయటకు నడుచుకుంటూ వెళ్లి రావాలంటే ఇబ్బందులు తప్పడం లేదని చెబుతున్నారు. ఇంటి అవసరాలకు మిషన్ భగీరథ నీరు రాకపోవడంతో ట్యాంకర్ల ద్వారా పంపిణీ చేస్తున్నారు. పంపిణీ చేస్తున్న క్రమంలో లబ్ధిదారులు ప్రతీరోజు గొడవలు పడుతూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు చెబుతున్నారు. అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని, ఇప్పటికైనా డబుల్ బెడ్ రూమ్ ఇళ్లలో మరుగుదొడ్ల పనులు, నీటి సరఫరా, కరెంటు, ఇతర పెండింగ్ పనులు పూర్తి చేయాలని కోరుతున్నారు.



డ్రెయినేజీలో పేరుకుపోయిన చెత్తాచెదారం



సంచార జాతుల విముక్తి దినోత్సవంలో పాల్గొని పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న లక్ష్మణ్

కనుమరుగవుతున్న సంచార జాతుల కళలు

» ప్రధాని మోదీ ఆదేశాలతో విముక్తి దినోత్సవం: కె.లక్ష్మణ్

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): సంచార జాతుల విన్యాసాలు, హరి కథలు, బుర్ర కథలు వంటి సంప్రదాయ కళలు అంతరించిపోవడం దురదృష్టకరమని బీజేపీ రాజ్యసభ సభ్యుడు, ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కె.లక్ష్మణ్ అన్నారు. ఆదివారం ఉస్మానియా యూనివర్సిటీ దూర విద్య కేంద్రంలో నిర్వహించిన సంచార జాతుల విముక్తి దినోత్సవంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడారు. ప్రధాన మోదీ సంచార జాతుల విముక్తి దినోత్సవ ప్రాముఖ్యతను గుర్తించి, బీజేపీ పాలిత రాష్ట్రాల్లో అధికారికంగా ఈ వేడుకను జరపాలని ఆదేశించారని తెలిపారు. ఇప్పటికే ఆంధ్రప్రదేశ్, ఢిల్లీ, హరియాణా, మధ్యప్రదేశ్, మహారాష్ట్రలో ఈ కార్యక్రమాన్ని అధికారికంగా నిర్వహిస్తున్నారని తెలిపారు. తాను 1999లో మొదటిసారి శాసన సభ్యుడిగా ఎన్నికైనప్పుడు అసెంబ్లీలో సంచార జాతుల సమస్యలను ప్రస్తావించానని గుర్తు చేశారు. ఆ తర్వాతే అప్పటి సీఎం చంద్రబాబు నాయుడు సంఘాలతో మాట్లాడి కులాల పేర్లను అధికారికంగా మార్చారని పేర్కొన్నారు. ఇటీవల తెలంగాణలో కాంగ్రెస్ చేసిన కుల గణన ఓటు బ్యాంకు దృష్టితో జరిగిందని, అందులో బీసీలకు, అణగారిన వర్గాలకు న్యాయం జరగలేదన్నారు. కులాల వారీ లెక్కలు అధికారికంగా రావాలంటే కేంద్ర హోంశాఖ ఆధ్వర్యంలో జరిగే గణన ద్వారా మాత్రమే సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. సంచార జాతుల్లో కులాల లెక్కలు అధికారికంగా తేలితే బడ్జెట్ కేటాయింపులు, అభివృద్ధి ప్రణాళికలను స్పష్టంగా అమలు చేయవచ్చని లక్ష్మణ్ అన్నారు.

వివరణ ఇచ్చేందుకు 10 రోజుల గడువు ఇవ్వండి

» స్పీకర్‌ను కలిసి కోరిన కడియం, అరికెపూడి, దానం

హైదరాబాద్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పార్టీ ఫిర్యాదు మేరకు జారీ చేసిన నోటీసులపై విచారణకు హాజరై వివరణ ఇచ్చేందుకు తమకు పది రోజుల గడువు ఇవ్వాలంటూ స్పీకర్ ప్రసాద్‌కుమార్‌ను ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, అరికెపూడి గాంధీ, దానం నాగేందర్ కోరారు. అసెంబ్లీలోని స్పీకర్ కార్యాలయంలో ఆదివారం ఆయన్ను కలిసిన ముగ్గురు ఎమ్మెల్యేలు ఈ మేరకు విజ్ఞప్తి చేశారు. మిగిలిన ఎమ్మెల్యేలూ స్పీకర్‌ను కలిసి గడువు కోరనున్నట్లు తెలుస్తోంది. అనంతరం అసెంబ్లీ లాబీల్లో కడియం, అరికెపూడి గాంధీ మీడియాతో చిట్‌చాట్‌గా మాట్లాడుతూ.. తాము వివరణ ఇచ్చేందుకు స్పీకర్‌ను పది రోజులు గడువు ఇవ్వాలని కోరినట్లు వెల్లడించారు. కాగా.. బీఆర్ఎస్ టికెట్‌పై గెలిచి కాంగ్రెస్‌లోకి మారిన పది మంది ఎమ్మెల్యేలపైన అనర్హత వేటు వేయాలంటూ గతంలోనే స్పీకర్‌కు ఫిర్యాదు ఇచ్చిన బీఆర్ఎస్.. ఈ అంశంపైన సుప్రీం కోర్టునూ ఆశ్రయించగా.. మూడు నెలల్లోగా స్పీకర్ నిర్ణయం తీసుకోవాలని సూచించింది. ఇందులో భాగంగానే పది మంది ఎమ్మెల్యేలకూ స్పీకర్ కార్యాలయం నోటీసులు జారీ చేసింది.

ఆర్ఎఫ్‌సీఎల్ లో లీకేజీలకు ఎవరిది బాధ్యత..?

» రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్

హైదరాబాద్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): రామగుండం ఎరువుల కర్మాగారం(ఆర్ఎఫ్‌సీఎల్)లో అమ్మోనియా పైప్‌లైన్ వరుస లీకేజీలకు బాధ్యత ఎవరిదని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ ప్రశ్నించారు. రామగుండంలో ఎరువుల కర్మాగారం నిర్మిస్తే రాష్ట్ర రైతాంగానికి యూరియా సకాలంలో అందుతుందని యూపీఏ ప్రభుత్వం ప్లాంట్ నిర్మాణానికి అనుమతినిచ్చిందని తెలిపారు. ప్లాంటు అవసరాలకు మిషన్ భగీరథ నీరు ఇస్తున్నామని, ఉత్పత్తిలో 50శాతం యూరియాను తెలంగాణకు కేటాయించాల్సిందేనని డిమాండ్ చేశారు. ఆర్ఎఫ్‌సీఎల్ నుంచే ఈ సీజన్లో రాష్ట్రానికి రావాల్సిన 1.2లక్షల టన్నుల యూరియాను తగ్గించారన్నారు. ప్లాంట్‌లో నిర్మాణలోపాలు, అధికారుల నిర్లక్ష్యంపై సీబీఐతో విచారణ జరిపించాలని కేంద్రానికి లేఖ రాస్తానన్నారు.

కేటీఆర్.. ఓ మానసిక రోగి

ఉపరాష్ట్రపతి ఎన్నికకు యూరియాకు ఏం సంబంధం?.. ఎన్డీఏ అభ్యర్థికే ఓటేస్తామని చెప్పొచ్చుగా?

» నాపై 181 కేసులు బనాయించారు
» ఇల్లు కూల్చేశారు..నన్ను కిడ్నాప్ చేశారు
» చంద్రబాబుతో సంప్రదింపులు అబద్ధం
» 2029లో రాహుల్ గాంధీనే ప్రధాని
» 'ఇండియా టుడే' ఇంటర్వ్యూలో రేవంత్



న్యూఢిల్లీ, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఒక మానసిక రోగి అని, యూరియా ఇస్తేనే ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో మద్దతు ఇస్తామనడం పిచ్చికి పరాకాష్ట అని సీఎం రేవంత్‌రెడ్డి విమర్శించారు. అనవసరంగా ఇలాంటి నాటకాలు ఎందుకని, ఎన్డీఏ అభ్యర్థికి మద్దతిస్తామని కేటీఆర్ చెప్పవచ్చు కదాని పేర్కొన్నారు. యూరియా ఇచ్చేది కేంద్రమని, అలాంటప్పుడు యూరియా ఇస్తేనే ఇండి కూటమి అభ్యర్థికి మద్దతు ఇస్తామని ఎలా అంటున్నారని నిలదీశారు. గత ప్రభుత్వ హయాంలో తనపై అక్రమంగా 181 కేసులు బనాయించారని, ఆ కేసులే తనకు మెడల్స్ అని చెప్పారు. తెలుగు రాష్ట్రాలతోపాటు తమిళనాడు, కర్ణాటక, గుజరాత్.. ఇలా అనేక రాష్ట్రాల్లో తెలుగు మాట్లాడే ఎంపీలు ఉన్నారని, వారంతా కలసి సుదర్శన్‌రెడ్డిని ఉప రాష్ట్రపతిగా గెలిపించాలని పిలుపునిచ్చారు. ఇటీవల సీఎం రేవంత్‌ను ఇండియా టుడే ప్రత్యేకంగా ఇంటర్వ్యూ చేసింది. అందులో రేవంత్ ఆసక్తికర అంశాలను వెల్లడించారు.

బీఆర్ఎస్ పతనావస్థకు చేరింది..

గత పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అవయవ దానం చేసి బీజేపీని 8 సీట్లలో గెలిపించిందని రేవంత్ చెప్పారు. బీఆర్ఎస్ పుట్టినప్పటి నుంచి ఒక్క పార్లమెంట్ సీటైనా గెలిచిందని, ఇప్పుడు ఘోరంగా పతనావస్థకు చేరిందన్నారు. కేసీఆర్, హరీశ్‌రావు ప్రాతినిధ్యం వహిస్తున్న మెదక్‌లోనూ బీజేపీనే గెలిచిందన్నారు.

కేసులతో ఖతం చేయాలని చూశారు..

ప్రజల కోసం ప్రశ్నించిన ప్రతిసారి తనపై కేసులు పెట్టారని, అలా కేసులు పెట్టిన ప్రతిసారీ తనకు ప్రజల్లో మద్దతు పెరిగిందని రేవంత్ చెప్పారు. "నాపై 181 అక్రమ కేసులు పెట్టారు. ఎప్పటికైనా తన ప్రత్యర్థిని నేనేనని కేసీఆర్‌కు తెలుసు. అందుకే నన్ను హింసించేందుకు అన్ని ప్రయత్నాలు చేశారు. నాపై క్రిమినల్ కేసులు పెట్టి ఖతం చేయాలని చూశారు. ఎన్నికల సమయంలో నా ఇల్లు కూల్చేశారు. నన్ను కిడ్నాప్ చేశారు. మూడు నెలలకే ఎంపీగా గెలిచి ఢిల్లీకి వచ్చా. ఈ రోజు సీఎం అయ్యా" అని తెలిపారు.

రాజకీయ లబ్ధి కోసమే ఆ బిల్లు..

ఏదైనా కేసులో అరెస్టయి 30 రోజులకుపైగా జైలులో ఉన్న సీఎంలు, మంత్రులను పదవి నుంచి తప్పించే బిల్లును రేవంత్‌రెడ్డి తప్పుబట్టారు. రాజకీయంగా లబ్ధి పొందేందుకే దానిని తీసుకువచ్చారని ఆరోపించారు. "ప్రస్తుతం విపక్ష సీఎంలను టార్గెట్ చేసి కేసులు పెట్టడం చూస్తున్నాం. చిన్న అంశాల్లోనూ 30 రోజులు జైల్లో పెట్టొచ్చు. ఇదేమీ అంత పెద్ద విషయం కాదు. కొత్త బిల్లు చట్టంగా మారాక ఢిల్లీ ఆదేశాలను అమలు చేయకపోతే.. రాష్ట్రాల సీఎంలు ఎవరైనా పదవి వదులుకోవాల్సి వస్తుంది. ఈ అంశంపై యోగి ఆదిత్యనాథ్ సహా బీజేపీ సీఎంలే ఆందోళన చెందుతుంటే.. మిగతా సీఎంల పరిస్థితి ఏమిటి?" అని రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. అలాగని తానేమీ భయపడటం లేదని, తానెలాంటి తప్పూ చేయలేదని చెప్పారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్ భావజాలానికి మద్దతివ్వకపోతే ఖతం చేయడమే వాళ్లకు తెలుసని ఆరోపించారు. జస్టిస్ సుదర్శన్‌రెడ్డిపై అమిత్‌షా వ్యాఖ్యలు అత్యంత దారుణమని మండిపడ్డారు.

చంద్రబాబుతో సంప్రదింపులు అవాస్తవం

2024లో కేంద్రంలో ఎన్డీయే ప్రభుత్వ ఏర్పాటు సమయంలో చంద్రబాబుతో తాను సంప్రదింపులు జరిపాననేది అవాస్తవ ప్రచారమని రేవంత్ స్పష్టం చేశారు. తానెప్పుడూ అటువంటి ప్రయత్నం చేయలేదన్నారు. అలాంటి రాజకీయాలను రాహుల్ గాంధీ విశ్వసించరని.. ఆయన అలా అనుకుంటే ఎప్పుడో ప్రధాని అయ్యేవారని చెప్పారు. చంద్రబాబు సీనియర్ రాజకీయవేత్త అని, రాజకీయ ఎత్తుగడల్లో ఆయనకు మించిన వారెవరూ లేరని పేర్కొన్నారు. చంద్రబాబును తాను గౌరవిస్తానని, కానీ తనకు పార్టీ, తెలంగాణ ప్రయోజనాలే ముఖ్యమని చెప్పారు. తన రాజకీయ అంచనాలు ఎప్పుడూ తప్పలేదని.. 2029లో రాహుల్ గాంధీనే ప్రధాని అని, కావాలంటే రాసిపెట్టుకోవాలని రేవంత్‌రెడ్డి చెప్పారు. ప్రధాని మోదీకి 2029 ఎక్స్‌పైరీ తేదీ అన్నారు. తాను బీజేపీలో పనిచేయలేదని, ఏబీవీపీలో పనిచేశానని.. బీజేపీ రాజకీయ పార్టీ అని, ఏబీవీపీ విద్యార్థి సంఘమని వివరించారు. తాను ఇప్పుడు కాంగ్రెస్ యూనివర్సిటీలో ఉన్నానని చెప్పారు.

ముందు ప్రేమించా.. సినిమా స్టైల్లో పెళ్లి జరిగింది..

తన ప్రేమ, వివాహంపై రేవంత్ ఆసక్తికర విషయాలు తెలిపారు. "నాది పెద్దలు చేసిన ప్రేమ వివాహం. ముందు నేను ప్రేమించాను. తర్వాత అది అరేంజ్ మ్యారేజ్‌గా మారింది. నా భార్య గీత ఢిల్లీలోని లేడీ శ్రీరాం కాలేజీలో చదువుకుంది. నేను తెలంగాణలో ప్రభుత్వ బడిలో చదువుకున్నాను. మా పరిచయం ఊహించని విధంగా జరిగింది. విజయవాడలో వాజ్‌పేయి సభ జరిగింది. కొందరితో కలసి నేను హైదరాబాద్ నుంచి విజయవాడ వెళ్లాను. తిరిగి వచ్చే క్రమంలో గీత కుటుంబంతో కలిసి నాగార్జున సాగర్‌లో ఆగాం. అక్కడ గీతతో పరిచయం జరిగింది. అది ప్రేమగా మారింది. చివరికి సినిమా స్టైల్‌లో మా పెళ్లి జరిగింది. టైం దొరికితే మనవడితో ఎంజాయ్ చేస్తా" అని చెప్పారు.

ఒక్కసారి కూడా సిగరెట్ తాగలే..

జీవితంలో ఇప్పటివరకు ఒక్కసారి కూడా తాను సిగరెట్ తాగలేదని, అది తన విల్ పవర్ అని రేవంత్ చెప్పారు. తాను టీ కూడా తాగేవాడిని కాదని.. విద్యార్థి ఉద్యమాల్లోకి వచ్చిన తర్వాత హైదరాబాద్‌లో అలవాటైందని తెలిపారు. తాను ఫుట్‌బాల్ ఆటగాడినని, రాహుల్ గాంధీ దగ్గర సమయం దొరికినప్పుడల్లా.. ఫిట్‌నెస్‌పై సలహాలు, సూచనలు తీసుకుంటానని చెప్పారు.

ఓటుహక్కును కొల్లగొడుతున్న మోదీ

18 ఏళ్లకు ఓటుహక్కు కల్పించిన రాజీవ్‌గాంధీ.. దానిని కాపాడుకునేందుకు కలిసికట్టుగా పోరాడదాం

» 2029 రాహుల్ ప్రధాని అయ్యే సంవత్సరంగా చాటుదాం
» 21 ఏళ్లకు ఎమ్మెల్యేగా పోటీ చేసే అవకాశం కల్పించాలి : రేవంత్‌రెడ్డి
» కేరళలో పొంథువల్ మెరిట్ అవార్డుల ప్రదానోత్సావానికి హాజరు

హైదరాబాద్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ దేశంలో 18ఏళ్లు నిండిన ప్రతి పౌరుడికీ ఓటుహక్కు కల్పించారని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రధాని మోదీ మాత్రం పౌరుల నుంచి ఓటుహక్కును కొల్లగొడుతున్నారని ఆరోపించారు. ప్రతి భారతీయుడి ఓటుహక్కును కాపాడి రాజ్యాంగాన్ని పరిరక్షించుకునేందుకు అందరం కలిసికట్టుగా పోరాడదామని పిలుపునిచ్చారు. 18ఏళ్లకు ఓటు హక్కు కల్పించిన వారికి, ఓటు హక్కును కొల్లగొట్టిన వారికి మధ్యే 2029 ఎన్నికలు జరగబోతున్నాయని తెలిపారు. 2029ని రాహుల్‌గాంధీని ప్రధానిని చేసే సంవత్సరంగా చాటుదామన్నారు. ఆదివారం కేరళలోని అలప్పుళలో ఏఐసీసీ ప్రధానకార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఆధ్వర్యంలో జరిగిన పొంథువల్ (ఎంపీ) మెరిట్ అవార్డుల కార్యక్రమానికి సీఎం రేవంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేసీ వేణుగోపాల్ ప్రారంభించిన ఈ అవార్డులు పది, పన్నెండు తరగతుల్లోని విద్యార్థుల్లో అత్యుత్తమ ప్రతిభను గుర్తించి వారిని ప్రోత్సహించడానికి ఎంతగానో దోహదపడుతున్నాయని తెలిపారు. తెలంగాణలో విద్యాభివృద్ధికి పెద్దఎత్తున కృషి చేస్తున్నామని, పేదలకు నాణ్యమైన విద్యనందించాలని సంకల్పించామని తెలిపారు. 55 రోజుల్లో 11,055 ఉపాధ్యాయ ఉద్యోగాలను భర్తీ చేశామన్నారు. రాష్ట్రంలో యంగ్‌ఇండియా రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మించబోతున్నామని చెప్పారు. అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసే వయసును 21ఏళ్లకు తగ్గిస్తూ రాజ్యాంగాన్ని సవరించుకోవాలన్నారు. రాజ్యాంగ పరిరక్షణ కోసం పనిచేస్తున్న కాంగ్రెస్ కేవలం యువత శక్తిని నమ్ముకుని పోరాటం సాగిస్తోందన్నారు.



విద్యార్థినికి పొంథువల్ మెరిట్ అవార్డు అందజేస్తున్న కేసీ వేణుగోపాల్, సీఎం రేవంత్

ఆగస్టులో రికార్డు వానలు

» సాధారణం కంటే 75% అధిక వర్షపాతం

హైదరాబాద్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఆగస్టులో సాధారణం కంటే 75శాతం అధిక వర్షపాతం నమోదైంది. ఆగస్టులో సాధారణ వర్షపాతం 21.5సెం.మీ పడాల్సి ఉండగా.. 37.85 సెం.మీ కురిసింది. అంటే రోజుకు సగటున 1.2 సెం.మీ. వాన పడింది. గత ఏడాదితో సగటు పోల్చితే ఈసారి 80శాతం అధిక వర్షపాతం నమోదైంది. కాగా, ఈ ఏడాది జూన్ నుంచి ఆగస్టు వరకు సాధారణ వర్షపాతం 57.3సెం.మీ నమోదు కావాలి. అయితే ఇప్పటి వరకు 72 సెం.మీ వర్షం కురిసింది. అంటే 26శాతం అధిక వర్షపాతం నమోదైంది. ఇక రాష్ట్రవ్యాప్తంగా 621 మండలాలుండగా.. 136 చోట్ల అత్యధిక (60% ఎక్కువగా), 238 చోట్ల అధిక (20-59శాతం మధ్య), 221 మండలాల్లో సాధారణ వర్షపాతం, మరో 26 మండలాల్లో 20-60శాతం లోటు వర్షపాతం నమోదైంది. కామారెడ్డి జిల్లాలో అత్యధికంగా 104 సెం.మీ పడింది. కాగా, రాష్ట్రంలో నేడు, రేపు భారీ వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం జిల్లాల్లో అక్కడక్కడ భారీవర్షాలు కురుస్తాయని పేర్కొంది.

సర్కార్ బడుల్లో

మళ్లీ రాగి జావ

ఉమ్మడి జిల్లాలో 5.50 లక్షల మంది విద్యార్థులకు లబ్ధి

» ఎట్టకేలకు పునరుద్ధరించిన ప్రభుత్వం
» సత్యసాయి అన్నపూర్ణ ట్రస్ట్‌కు బాధ్యతలు



హనుమకొండ, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి వరంగల్ జిల్లాలోని సర్కార్ బడుల్లో విద్యార్థులకు రాగి జావ అందించే కార్యక్రమం పునఃప్రారంభం కానున్నది. ఈ మేరకు ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నది. గత ఏడాది అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఉదయం విద్యార్థులకు అల్పాహారంగా రాగిజావను అందించింది. ఉదయం ఏమి తినకుండానే హడావుడిగా పాఠశాల విద్యార్థులకు ఇది ఎంతో ప్రయోజనకరంగా ఉండేది. కానీ ఈ ఏడాది ఈ కార్యక్రమం ఇప్పటి వరకు ప్రారంభం కాపోడంతో ఇక రాగి జావ సరఫరా ఉండదేమోనని భావించారు.

గ్రామీణ విద్యార్థులకు మేలు

గ్రామీణ ప్రాంతాల్లో రైతులు, వ్యవసాయ కూలీలు ఉదయమే పొలం పనులకు వెళుతుంటారు. వారి పిల్లలు ఉదయం 9.15 గంటలకు ప్రారంభమయ్యే బడికి హాజరయ్యేందుకు వీలుగా 7 గంటలకే ఇంటి నుంచి ఏమీ తినకుండా బయలుదేరుతారు. పాఠశాలలో ఒంటి గంటకు అందించే మధ్యాహ్న భోజనం వరకు ఖాళీ కడుపుతోనే చదువుకోవలసి వస్తోంది. దీనిని దృష్టిలో పెట్టుకొని రెండేళ్ల నుంచి ప్రభుత్వం విద్యార్థులకు రాగి జావాను అందించడంతో వారికి ఎంతో ప్రయోజనకరంగా ఉండేది. కానీ ఈ ఏడాది ఇప్పటి వరకు ప్రారంభంకాకపోవడంతో విద్యార్థులు ఉదయం ఖాళీ కడుపుతోనే పాఠాలు వింటున్నారు. విద్యార్థులకు ఉదయం వేళ పోషక విలువలతో కూడిన ఆహారం అందించడమే లక్ష్యంగా 2023లో పీఎం పోషణ్ ద్వారా ప్రభుత్వ బడుల్లో రాగిజావ పంపిణీని ప్రారంభించారు. గత ఏడాది ఏప్రిల్ వరకు ఈ కార్యక్రమం విజయవంతంగా అమలైంది. కానీ 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రభుత్వం నుంచి బడులకు అందాల్సిన రాగిపిండి, బెల్లం సరఫరా కాలేదు. దీనితో పథకం ఆగిపోయింది. విద్యార్థులు ఉదయం పస్తులుండాల్సిన పరిస్థితి ఏర్పడింది.

5.50 లక్షల మందికి లబ్ధి

ఉమ్మడి జిల్లాలో 5600 ప్రభుత్వ బడులు ఉండగా సుమారు 5.50 లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరికి రోజు మధ్యాహ్నం భోజనం, వారంలో మూడు రోజులు కోడిగుడ్లు అందిస్తున్నారు. అయితే మరో మూడు రోజులు ఉదయం రాగి జావ అందించేవారు. దీనిని తయారీకి అవసరమైన రాగిపిండి, బెల్లం కేటాయించేవారు. దీంతో విద్యార్థులకు ఆకలి దూరం కావడంతోపాటు పోషకాలు అందుతాయి. బాలికలకైతే మరింత ఉపయుక్తమని వైద్య నిపుణులు సైతం పేర్కొంటున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో రాగి జావను తిరిగి పంపిణీ చేయాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రుల్లో ఆనందం వ్యక్తం అవుతోంది.

వారానికి మూడు రోజులు

ఇక ప్రభుత్వ పాఠశాలల్లో వారానికి మూడు రోజులు విద్యార్థులకు ఈ రాగిజావను అందిస్తారు. ఇందుకు అవసరమైన రాగి పిండి, బెల్లం పొడిని సరఫరా చేసే బాధ్యతను శ్రీ సత్య సాయి అన్న పూర్ణ ట్రస్ట్‌కు ప్రభుత్వం అప్పగించింది. ప్రతీ విద్యార్థికి 10 గ్రాముల రాగి పిండి, 10 గ్రాముల బెల్లం పొడి చొప్పున పాఠశాలలకు ట్రస్ట్ సరఫరా చేయనున్నది. ట్రస్ట్ సహకారంతో రెండేళ్లపాటు పాఠశాలలకు రాగి జావా పంపిణీ కొనసాగుతుంది. ఈ కార్యక్రమానికి అయ్యే వ్యయంలో 40 శాతం ప్రభుత్వం భరించాలని ట్రస్ట్ ప్రతిపాదించింది. ఈ ప్రతిపాదనను ప్రభుత్వం అంగీకరించింది. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖకు ఆదేశాలు జారీ చేసింది. రాగి జావను వడ్డించే బాధ్యతను ఇప్పటికే మధ్యాహ్న భోజనం అమలు చేస్తున్న మధ్యాహ్నం భోజనం వండే కార్మికులకు అప్పగించింది. అదనంగా రాగి జావ వండినందుకు రోజుకు 25పైసల చొప్పున ప్రభుత్వం వారికి ప్రోత్సాహకంగా అందించనున్నది.

ఫంక్షన్‌హాళ్ల దోపిడీపై నియంత్రణేది ?

● అన్నింటా కమీషన్లే.. ● అడ్డగోలుగా దండుకుంటున్న యాజమాన్యాలు



బాలసముద్రం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): ఆడపిల్లల తల్లిదండ్రులు కూతుర్లకు పెళ్లి చేయాలంటే సమరానికి సన్నద్ధం కావాల్సిందే. కట్నకానుకలు, బంగారం, మగపెళ్లి వారి గొంతెమ్మ కోరికలన్నీ తీర్చాలి. అల్లుడు అలకపాన్పు ఎక్కకుండా అన్ని సమకూర్చాలి. ఇరువర్గాలు పెళ్లికి సుముహూర్తం నిర్ణయించుకున్నాక మొదటగా ఫంక్షన్‌హాల్ బుక్ చేసుకునేందుకు సమాయత్తం కావాలి. ఫంక్షన్‌హాల్ అద్దె వారి తాహతును బట్టి రూ. 50 వేలు మొదలుకొని రూ. 2 లక్షల కంటే ఎక్కువగానే ఉంటుంది. అప్పటి నుంచి ఇక అసలు కథ మొదలవుతుంది. ఫంక్షన్‌హాల్‌లో అడుగు పెట్టగానే పెళ్లి పందిరి వేసే వారితో డబ్బుల కోసం డిమాండ్ చేయడం ప్రారంభమవుతోంది. ఫంక్షన్‌హాల్‌కు చెల్లించాల్సిన అద్దె ఎంతో పెళ్లి పందిరి అలంకరణ ఖర్చు దాదాపుగా అంతే ఉంటుంది. ఇదేంటయ్యా ? అంటే అది అంతే ఉంటుంది సార్ అంటున్నారు. తమకు వచ్చే ఆదాయంలో సగం ఫంక్షన్‌హాల్ యాజమాన్యానికి తాము కమీషన్ ఇవ్వాలని ఉంటుందని చెబుతున్నారు. అంతేగాక ఇద్దరు లేక ముగ్గురు సన్నాయి ఊదేవాళ్లు రూ. 20వేలు అడుగుతారు. అందులో కూడా సగం ఫంక్షన్‌హాల్ యాజమాన్యానికే కమిషన్‌గా చెల్లించాల్సి ఉంటుందట. ఇంకా ఫంక్షన్‌హాల్‌లో పనిచేసే లేబర్, సిబ్బందికి తినుబండారాలను వడ్డించే వెయిటర్లు, ఈవెంట్ నిర్వహించే వారికి చెల్లించే మొత్తం నుంచి కూడా ఫంక్షన్ హాల్ యాజమాన్యానికి సగం చెల్లించాలట. ఇలా ఆడపిల్ల తండ్రిని బలిపశువును చేస్తూ అందరూ పైసల కోసం పీక్కు తింటున్నారు. ఇది చాలదన్నట్లుగా మూలిగే నక్కపై తాటిపండు పడ్డట్టు పేరుకే పొత్తుల పెళ్లి అంటారు. ఒక ఫంక్షన్‌హాల్ ఖర్చులో మాత్రమే మగ పెళ్లి వారు సగం భరిస్తారు. పెళ్లి పందిరి, ఇతర అలంకరణ తదితర ఖర్చులన్నీ అమ్మాయి తల్లిదండ్రులే భరించాలి. ఫంక్షన్ హాళ్లలో పెళ్లి ఖరీదైనదిగా మారింది. దీనికంతటికి కారణం ఫంక్షన్‌హాళ్ల యాజమాన్యాలు పెళ్లి తంతులో పాల్గొనే అందరి నుంచి కమీషన్లు దండుకోవడమేనని పలువురు ఆరోపిస్తున్నారు.

- ధరలను నియంత్రించాలి

వివాహాలు, శుభకార్యాల నిర్వహణలో నేడు ఫంక్షన్ హాళ్లు కీలకపాత్ర వహిస్తున్నాయి. వాటి ధరలు సామాన్య, మధ్యతరగతి ప్రజలకు భారంగా మారాయి. ఫంక్షన్ హాళ్ల యాజమాన్యాలు అధిక ధరలు వసూలు చేస్తున్నాయి. అవి ప్రజలకు ఆర్థిక భారంగా మారాయి. వాటి రేట్లను నియంత్రించాలి.

-మండల పరశురాములు, సామాజికవేత్త వరంగల్

రామకోటి రాసిన భక్తుడి హఠాన్మరణం



చంద్రారెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న గ్రామ పెద్దలు, సత్సంగ్ సభ్యులు

సంగెం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కాట్రపల్లి గ్రామంలో రామకోటి రాసిన గాయపు చంద్రారెడ్డి గుండెపోటుతో హఠాన్మరణం చెందడం పట్ల గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కోటి 5 లక్షల శ్రీరామ నామాలను లిఖించి భద్రాచలం రామచంద్ర స్వామి దేవాలయంలో ఆయన పుస్తకాలను సమర్పించారు. గ్రామంలో ఎవరు కనిపించినా జై శ్రీరాం అని పలుకరించే ఆయన ఆకస్మికంగా అసువులు బాయడం గ్రామస్థులకు ఆవేదన మిగిల్చింది. నిత్యం రామనామ స్మరణతో ప్రతిరోజూ గ్రామంలోని సీతారామచంద్రస్వామి దేవాలయంలో ప్రదక్షిణ చేసి స్వామిని ఆయన దర్శించుకునేవారు.

సుమారు 35 ఏళ్ల కిందట గ్రామంలో స్థాపించిన సుందర సత్సంగ్ శాఖలో ఆయన చురుకుగా పాల్గొనేవారు. ప్రతీ ఏటా శ్రీరామ నవమి రోజున గ్రామంలో నిర్వహించే సీతారాముల కల్యాణంలో ఆయన సీతారాములకు పట్టు వస్త్రాలను సమర్పించేవారు. ప్రతీ శనివారం ఆలయంలో ఇతర భక్తులతో కలిసి భజన కార్యక్రమంలో పాల్గొనేవారు. ఆయన మృతి పట్ల ఆవేదన చెందిన గ్రామ సత్సంగ్ శాఖ సభ్యులు, మాతలు, గ్రామ ప్రముఖులు ఆదివారం ఆయన ఇంటికి వెళ్లి సుమారు గంట సేపు భజన కార్యక్రమం నిర్వహించారు. చంద్రా రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయన లేని లోటును పూడ్చేందుకు గ్రామంలో భక్తి కార్యక్రమాలను నిర్వహిస్తామని సీతారామచంద్రస్వామి దేవాలయ చైర్మన్ గురు స్వామి గోగుల రాజేందర్‌రెడ్డి తెలిపారు. ఆలయ పూజారి కొడకండ్ల శ్రీనివాసాచార్యులు, గ్రామ ప్రముఖులు, సత్సంగ్ శాఖ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వస్త్ర పరిశ్రమకు మహర్దశ

(5వ పేజీ తరువాయి)

తాగునీరు, వృథా నీటి శుద్ధి తదితర సౌకర్యాలతో పాటు ఉత్పత్తి చేసిన వస్త్రాల డిజైనర్లు, దుస్తుల తయారీదారులు, ఇంక్యుబేషన్ సెంటర్లకు ప్లగ్ అండ్ ప్లే సదుపాయాలు కల్పించాల్సి ఉంటుందని, కామన్ ప్రాసెసింగ్ ఫెసిలిటీ, కామన్ ఎఫ్లుయెంట్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ (సీఈటీపీ), కార్మికులకు వసతి సదుపాయం, ఆరోగ్య సౌకర్యాలు, శిక్షణ, నైపుణ్యాభివృద్ధి కేంద్రం, వేర్‌హౌసింగ్, లాజిస్టిక్స్ వంటి అదనపు ఏర్పాట్లు చేయాల్సి ఉంటుందని అధికారులు తెలిపారు. కంపెనీలకు స్థలాల కేటాయింపు సైతం స్పెషల్ పర్పస్ వెహికిల్(ఎస్‌పీవీ) ఆధ్వర్యంలో చేపట్టాల్సి ఉంటుందని తెలిపింది. ఈ మార్గదర్శకాలను అమలు చేస్తే మూడు విడతల్లో వెయ్యి కోట్ల నిధులు కేంద్రం గ్రాంట్‌గా అందిస్తుంది. అంతేకాకుండా ఈ పార్కులో ఏర్పాటు చేసే కంపెనీలకు భారీగా సబ్సిడీలు ఇస్తుంది. అయితే ఇప్పటికే భూ సేకరణతో పాటు కంపెనీలతో ప్రభుత్వం ఎంవోయూ కుదుర్చుకుంది. దీంతో పీఎం మిత్రను అమలు చేసేందుకు సాధ్యం కాదని కేంద్రం వాదించింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత కేంద్రంపై సీఎం రేవంత్‌రెడ్డి ఒత్తిడి తీసుకువచ్చారు. టెక్స్‌టైల్ పార్కులో భూ నిర్వాసితులకు ఇళ్ల స్థలాలతో పాటు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశారు. ఆస్పత్రి నిర్మాణంతో పాటు వరంగల్ నుంచి బస్సు సౌకర్యం కల్పించారు. వరద కాలువ నిర్మాణం, సీసీ రోడ్లు, విద్యుత్ తదితర మౌలిక సదుపాయల కోసం ప్రభుత్వం ఇటీవల సుమారు రూ.500కోట్ల వరకు నిధులు విడుదల చేసింది. దీంతో వస్త్రనగరి అభివృద్ధికి అడుగులు పడటంతో పాటు కేంద్ర ప్రభుత్వం దృష్టిని ఆకర్శించింది.

కేఎంటీపీలో 2లక్షల మందికి ఉపాధి

కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కు అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి పెడుతోంది. సీఎంగా రేవంత్‌రెడ్డి అధికార పగ్గాలు చేపట్టిన తరువాత గత ఏడాది జూన్ 29న కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కును సందర్శించి, పెట్టుబడులు రాకపోవడానికి కారణాలపై సమీక్షించారు. ఆ తర్వాత ఆగస్టు 12వ తేదీన దక్షిణ కొరియా రాజధాని సియోల్‌లో జరిగిన పలు గ్లోబల్ కంపెనీలు, బిజినెస్ గ్రూపులతో సమావేశం నిర్వహించి టెక్స్‌టైల్ పార్కులో పెట్టుబడులను ఆహ్వానించారు. ఆ తరువాత ప్రధానమంత్రి నరేంద్రమోదీని కలిసి పలుమార్లు పీఎం మిత్ర పథకంలో కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కును చేర్చాలని విజ్ఞప్తి చేశారు. పైగా పీఎం మిత్ర పథకాన్ని 2020-21 నుంచి ఏడేళ్ల కాలంలో అంటే 2027-28లో పూర్తి చేయాల్సి ఉంది. ఈ నేపథ్యంలో కేంద్ర జౌళిశాఖ వరంగల్ వస్త్రనగరిపై సానుకూలత వ్యక్తం చేసింది. గ్రీన్ ఫీల్డ్ ప్రాజెక్టుగా చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం విజ్ఞప్తి చేస్తోంది. అయితే ఇప్పటికే భూసేకరణతో పాటు రెండు కంపెనీల ఉత్పత్తి కూడా చేపట్టిన నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం బ్రౌన్ ఫీల్డ్ ప్రాజెక్టుగా అభివృద్ధి చేసే అవకాశం ఉంది. బ్రౌన్ ఫీల్డ్ కింద చేపడితే కొంత గ్రాంట్ తగ్గే అవకాశం ఉందని అధికారులు పేర్కొంటున్నారు.

కాగా, ఇప్పటికే కేంద్ర జౌళిశాఖ అధికారులు పలుమార్లు వరంగల్‌లోని టెక్స్‌టైల్ పార్కును సందర్శించారు. ఇక్కడ ప్రాజెక్టుల ఏర్పాటుకు ఉన్న సౌకర్యాలు, రవాణా తదితర వాటిపై సమీక్షించారు. ప్రపంచవ్యాప్తంగా కొత్త కంపెనీలతో పాటు వస్త్రాల తయారీ యూనిట్లు పెరుగనున్నాయి. దీంతో వివిధ కంపెనీల్లో ఉద్యోగావకాశాలు పెరుగనున్నాయి. ఇటీవల కిటెక్స్ కంపెనీ 25వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇచ్చి ఇంటర్వ్యూలు చేపట్టింది. దీంతోపాటు కొత్తగా వచ్చే అనేక కంపెనీలు ఉద్యోగాలను సృష్టించనున్నాయి. అంతేకాకుండా పరోక్షంగా స్థానికులకు భారీగా ఉపాధి అవకాశాలు రానున్నాయి. మొత్తంగా ప్రత్యక్షంగా, పరోక్షంగా కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కులో రెండు లక్షల మందికి పైగా ఉద్యోగ, ఉపాధిని పొందే అవకాశం ఉందని అధికారులు అభిప్రాయపడుతున్నారు. అంతేకాకుండా దేశంలోని వివిధ రాష్ట్రాలకు, దేశాలకు వస్త్రాలు, ముడి సరుకులను వరంగల్ నుంచి ఎగుమతులు చేసే అవకాశాలు వస్తాయనే చర్చ జరుగుతోంది.



ముగిసిన జాతీయ క్రీడా వేడుకలు

వరంగల్ స్పోర్ట్స్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 29న హాకీ దిగ్గజం దివంగత మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకొని జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ (డీఎస్ఏ)ఆధ్వర్యంలో 9రోజులుగా హనుమకొండ జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో నిర్వహిస్తున్న జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలు ఆదివారం ముగిశాయి. జాతీయ క్రీడా దినోత్సవ ముగింపు వేడుకల్లో డీఎస్ఏలోని క్రీడాకారులకు జేఎన్ఎస్‌లో ఏర్పాటు చేసిన సైక్లింగ్ పోటీలను డీఎస్ఏ జిమ్నాస్టిక్స్ కోచ్ నరేందర్ హాజరై జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో డీఎస్ఏ కోచ్‌లు కూరపాటి రమేష్, దేవిక, రాయబారపు నవీన్, అఫ్జల్, శంకర్, బత్తిని జీవన్‌గౌడ్, పీ వెంకటేశ్వర్లు, ప్రభుదాస్, వృత్తి నైపుణ్య శిక్షణ సంస్థ జూనియర్ అసిస్టెంట్ ఓడపల్లి శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.



సైక్లింగ్ పోటీలను ప్రారంభిస్తున్న డీఎస్ఏ జిమ్నాస్టిక్స్ కోచ్ నరేందర్


గోపాల్‌పూర్ బృందావన కాలనీలో హోమం నిర్వహిస్తున్న దంపతులు


కేఎల్ఎన్ రెడ్డి కాలనీలో హోమంలో పాల్గొన్న భక్తులు


నందిహిల్స్ కాలనీలో లక్ష్మీగణపతి హోమంలో పాల్గొన్న కాలనీవాసులు

పార్వతి తనయా.. గజవదనా..

» మార్మోగిన లంబోదరుడి నామస్మరణ
» జోరుగా అన్నదానాలు, గణపతి హోమాలు

వడ్డెపల్లి, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండలోని వివిధ డివిజన్లలో గణపతి నవరాత్రి ఉత్సవాలు నయనానందకరంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం వినాయక మండపాల వద్ద అన్నదానాలు, గణపతి హోమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. హనుమకొండ గోపాల్‌పూర్‌లోని బృందావన కాలనీ రోడ్డు నంబర్ -2లో ఉత్సవ కమిటీ ప్రతినిధి రచ్చ నాగేశ్వర్‌రావు ఆధ్వర్యంలో విఘ్నాదిపతికి రచ్చ పద్మ - నాగేశ్వర్‌రావు, గుర్రం పూర్ణచందర్- సింధు, పొన్నాల లింగారెడ్డి- దమయంతి, బొల్లోని పద్మ - నాగేశ్వర్‌రావు, సురేందర్- కవిత, రాజేశ్వర్‌రావు - స్వాతితో పాటు 16 జంటలు వినాయక మండపం వద్ద గణపతి హోమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. హనుమకొండ 58వ డివిజన్ స్నేహ నగర్‌లో అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు నర్సింహరావు(చిన్న), ఉపాధ్యక్షుడు శశికాంత్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి ధర్మ తిరుపతిరెడ్డి, జాయింట్ సెక్రటరీ గండి రంజిత్‌గౌడ్, కోశాధికారి రాంబ్రహ్మం, ప్రసన్నాంజనేయస్వామి ఆలయ కమిటీ అధ్యక్షుడు కాటిక బాలరాజు ఆధ్వర్యంలో వినయక మండపం వద్ద మహా అన్నదాన కార్యక్రమం చేశారు. భక్తుల భజన కీర్తనలతో స్నేహ నగర్ లంబోదరుడి నామస్మరణతో మార్మోగింది. హనుమకొండ ఎన్జీవోస్ కాలనీ రోడ్డులోని ఇందిరా నగర్‌లో అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు తాటిపల్లి జనార్ధన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి పూరెళ్ల రవికిరణ్‌గౌడ్, ఉపాధ్యక్షుడు కుమారస్వామి, కోశాధికారి తేళ్ల కిశోర్ ఆధ్వర్యంలో విగ్రహ దాత లేతాకుల సంజీవరెడ్డి, శివ ప్రసాద్, నారాయణ రెడ్డిల ఆధ్వర్యంలో మహా అన్నదాన కార్యక్రమాన్ని, కుంకుమ పూజలను భక్తి ప్రపత్తులతో జరిపించారు.

హనుమకొండ గోపాల్‌పూర్ కాకతీయ నగర్‌లో అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు సోయం ఓదెలు, ధనసరి లక్ష్మి, కమటం అరుంధతి, జినుకల సుమ, చింతల స్వప్న ఆధ్వర్యంలో గణపతి హోమాన్ని నిర్వహించారు.


రెడ్డికాలనీలో..

హనుమకొండ 57వ డివిజన్ గాంధీ నగర్‌లో అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు చెరుకు వెంకటరాజిరెడ్డి, ప్రధాన కార్యదర్శి సట్ల సత్తయ్య ఆధ్వర్యంలో వినాయక మండపం వద్ద, డివిజన్‌లోని అశోక కాలనీలో నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ప్రసన్నాంజనేయ స్వామి ఆలయ అధ్యక్షుడు చింతం శ్రీనివాసు, ప్రధాన కార్యదర్శి సరోత్తం రెడ్డి, అశోక కాలనీ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. గోకుల్ నగర్‌లో మహాలక్ష్మి గణపతి మహిళ గజానన మండలి ప్రతినిధులు శ్రీలత, రమాదేవి, శిరీష, దీప్తి, పావని ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని జరిపించారు. ఈ సందర్భంగా మహిళలు కోలాటం ఆటలతోపాటు భజన కీర్తనలను ఆలాపించారు. హనుమకొండ ఎన్జీవోస్ కాలనీ రోడ్డులోని రాఘవేంద్ర నగర్ ఫేస్ -2లో సీనియర్ కాంగ్రెస్ నేతలు మండల సమ్మయ్య ముదిరాజ్, జనగాం శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.


కడిపికొండలో..

నంది హిల్స్‌లో లక్ష్మీగణపతి హోమం

న్యూశాయంపేట : హనుమకొండ హంటర్‌రోడ్ లోని నందిహిల్స్‌కాలనీలో ఉన్న శ్రీపంచముఖ ఆంజనేయస్వామి దేవాలయంలో వరసిద్ధి వినాయక నవ రాత్రి మహోత్సవాలలో భాగంగా ఆదివారం నిత్య పూజ, అర్చన, శ్రీ లక్ష్మీ గణపతి హోమం ఘనంగా నిర్వహించారు. నందిహిల్స్‌కాలనీ అధ్యక్షుడు, గణేష్ ఉత్సవ కమిటీ కన్వీనర్ పెసరు నరసింహారెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన లక్ష్మీగణపతి హోమంలో పెద్ద సంఖ్యలో కాలనీ ప్రజలు పాల్గొన్నారు. మధ్యాహ్నం పిల్లలకు ఆటల పోటీలు నిర్వహించారు. సాయంత్రం అర్చన, నిత్యపూజ చేశారు. రాత్రి డాన్స్ పాటల పోటీలు నిర్వహించారు. ఈ లక్ష్మీగణపతిహోమం కార్యక్రమంలో కోకన్వీనర్ సురేష్‌కుమార్, కాలనీ పెద్దలు పాల్గొన్నారు.

న్యూశాయంపేటలో అన్నదానం

గణపతి నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని గ్రేటర్ వరంగల్ మహానగరపాలక సంస్థ పరిధి న్యూశాయంపేటలోని శ్రీలక్ష్మీ గణపతి యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం వద్ద ఆదివారం మహా అన్నదానం నిర్వహించారు. ముఖ్య అతిథిగా స్థానిక కార్పొరేటర్ మామిండ్ల రాజు హాజరై అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు అబిలాష్, పవన్, కిరణ్, నాగరాజు, రాజేష్, మహేష్, జైచంద్ర తదితరులు పాల్గొన్నారు.

● **హనుమకొండ (ఆంధ్రజ్యోతి):** హనుమకొండ పరిమళ కాలనీలోని సిగ్నేచర్ ప్లేస్ అపార్టుమెంట్‌లో ఆదివారం గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గణపతి హోమం చేశారు. అర్చకులు ఎస్.రాజేశ్వర శాస్త్రి గణపతి హోమాన్ని నిర్వహింపచేశారు. హోమం కోసం మూడు హోమ గుండాలను ఏర్పాటు చేశారు. అపార్టుమెంట్‌లోని 16 మంది దంపతులు కుటుంబ సభ్యులతో కలిసి హోమంలో పాల్గొన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం జరిగింది. విగ్రహ దాతలు రిటైర్డ్ అధ్యాపకుడు అడ్లూరు నర్సింహమూర్తి, ఆయన కుమారుడు అడ్లూరు దినేశ్ క్రాంతి చక్ర ఆధ్వర్యంలో జరిగిన ఈ హోమాన్ని సిగ్నేచర్‌ప్లేస్ అపార్టుమెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు వి.రమేష్‌బాబు, ప్రధాన కార్యదర్శి తమ్మెర కమలాకర్ రావు, కోశాధికారి దామెరుప్పుల దయాకర్, ఇతర సభ్యులు పర్యవేక్షించారు. గణపతి హోమానికి ముందు గణనాథుడికి నిత్యపూజ కార్యక్రమం జరిగింది.

● **బాలసముద్రం:** హనుమకొండ కేఎల్ఎన్‌రెడ్డి కాలనీలోని శ్రీరామకృష్ణా సేవా సమితి ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వినాయక మండపం ఎదుట పలువురు దంపతులు ఆదివారం హోమంలో పాల్గొన్నారు. మహిళలు లక్ష్మీగణపతికి ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించి కొలిచారు. విఘ్నాదిపతికి ఉండ్రాళ్లు, పాయసం, నైవేద్యం సమర్పించుకున్నారు. అనంతరం మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సేవా సమితి అధ్యక్షుడు కటంగూరి సత్యనారాయణ రెడ్డి, సమితి ప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.

● **వడ్డెపల్లి:** హనుమకొండ వడ్డెపల్లి చెరువు కట్ట శివాలయం వద్ద గణపతి నవరాత్రోత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన విఘ్నాదిపతికి ఉత్సవ కమిటీ అధ్యక్షుడు అల్లం హరిమహేందర్ పటేల్, ప్రతినిధులు గుజ్జేటి శ్రీకాంత్, జనగాం శ్రీధర్‌గౌడ్, మామిడాల వెంకన్న ఆధ్వర్యంలో ఆదివారం లక్ష్మి గణపతి పూజలను ఘనంగా నిర్వహించారు. ఆలయ పూజారి మణికొండ ప్రవీణ్‌శర్మ వినాయక ప్రతిమకు హారతి నిచ్చారు. మహిళలు లక్ష్మీగణపతికి ప్రత్యేక పూజలు , అర్చనలు, అభిషేకాలు నిర్వహించి కొలిచారు. విఘ్నాదిపతికి ఉండ్రాళ్లు, పాయసం, నైవేద్యం సమర్పించుకున్నారు. ఉత్సవ కమిటీ ప్రతినిధులు బైరి జితేందర్‌రెడ్డి, గొడిశాల సంపత్‌గౌడ్, కక్కెర్ల కార్తీక్ గౌడ్, గొడిశాల సనత్‌కుమార్, మట్టెపల్లి నర్సింగం తదితరులు పాల్గొని విఘ్నాదిపతికి ప్రత్యేక పూజలు చేశారు.

● **రాంనగర్:** 53వ డివిజన్ గోపాల్‌పూర్ క్రాస్‌లోని ఆదర్శకాలనీలో అదివారం ఆదర్శగజానన మండలి ఆధ్వర్యంలో లక్ష్మీ గణపతి హోమం నిర్వహించారు. తొమ్మిది రోజుల పాటు మహాన్నదానం నిర్వహించే ఈ మండపంలో ఐదోరోజు పురోహితుడు వేణుగోపాల్ శర్మ సమక్షంలో హోమం నిర్వహించి అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో గజానన మండలి కన్వీనర్ తూడి విద్యాసాగర్, కోకన్వీనర్ కాసగాని కుమారస్వామి, కాలనీ అభివృద్ధి కమిటీ గౌరవధ్యక్షుడు రాంరెడ్డి, చంద్రమౌళి, ప్రధాన కార్యదర్శి పరికిపండ్ల వేణు తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా 10వ డివిజన్‌లో జరిగిన మహాన్నదానం కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొలను సంతోష్‌రెడ్డి, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు సంద్ర మధు, డివిజన్ అధ్యక్షుడు ఉడుతల మురళి, శ్రీరామ్, మల్లికా, అన్నికా పాండే, తదితరులు పాల్గొన్నారు.


హంటర్‌రోడ్డు శాంతి హైట్స్ అపార్ట్‌మెంట్‌లో గణనాథుడికి 108 రకాల నైవేద్యాలు సమర్పిస్తున్న అపార్ట్‌మెంట్ వాసులు


లక్ష్మీ హోమంలో పాల్గొన్న ఆదర్శకాలనీ వాసులు


వడ్డెపల్లి శివాలయంలో వినాయకుడికి పూజలు చేస్తున్న భక్తులు

కాంగ్రెస్ ఓబీసీ వైస్ చైర్మన్‌గా కుమారస్వామి



మడికొండ, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): వర్ధన్నపేట నియోజకవర్గ కాంగ్రెస్ ఓబీసీ సెల్ వైస్ చైర్మన్‌గా మడికొండకు చెందిన నార్లగిరి కుమారస్వామి నియమితులయ్యారని కాంగ్రెస్ ఓబీసీ సెల్ జిల్లా చైర్మన్ బొమ్మతి విక్రమ్ ముదిరాజ్ ఆదివారం తెలిపారు. ఈ మేరకు మంత్రి అడ్లూరి లక్ష్మణ్, ఎమ్మెల్యే నాగరాజు కుమారస్వామికి నియామక పత్రం అందజేసినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా తన నియామకానికి సహకరించిన రాష్ట్ర ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షుడు నమిండ్ల శ్రీనివాస్, స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, ఓబీసీ సెల్ జిల్లా చైర్మన్ విక్రమ్ ముదిరాజ్, కాజీపేట మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సారంపెల్లి శ్రీనివాస్‌రెడ్డికి కుమారస్వామి కృతజ్ఞతలు తెలిపారు.

13న జాతీయ బృంద గీతాల పోటీలు


సమావేశంలో పాల్గొన్న భారత వికాస్ పరిషత్ నాయకులు

బాలసముద్రం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): భారత వికాస్ పరిషత్ ఓరుగల్లు శాఖ ఆధ్వర్యంలో సెప్టెంబరు 13న బృందగీతాల పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆ శాఖ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ డి.సుధీర్‌కుమార్ తెలిపారు. వికాస పరిషత్ జిల్లాస్థాయి సమావేశం ఆదివారం హనుమకొండ కేఎల్ఎన్‌రెడ్డి కాలనీలోని డఫోడిల్స్ హైస్కూల్‌లో జరిగింది. ఈ సందర్భంగా సుధీర్‌కుమార్ మాట్లాడుతూ.. రాష్ట్రశాఖ ఆదేశాల మేరకు జాతీయ బృంద గీతాల పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను అందించనున్నట్లు తెలిపారు. హనుమకొండ బాలసముద్రంలోని సామజగన్‌మోహన్ స్మారకభవనంలో నిర్వహించే ఈ పోటీలలో విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాల్సిందిగా కార్యదర్శి కె.సత్యనారాయణ కోరారు. పోటీల్లో పాల్గొనే విద్యార్థులు తమ వివరాలను కన్వీనర్ కమలా మనోహర్ సెల్‌నెంబర్ 94406 04347, 98666 60374 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు. సమావేశంలో బి. వెంకట్‌రెడ్డి, జయపాల్‌రెడ్డి, చంచల్‌అగర్వాల్, సంతోష్‌రెడ్డి, రామారావు, అజితారాణి, వివేకానంద ప్రసాద్, ఎం. దామోదర్ పాల్గొన్నారు.

జర్నలిస్టుకు ఆర్థిక సాయం అందజేత

వడ్డెపల్లి, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ 57వ డివిజన్ స్నేహ నగర్ కాలనీకి చెందిన జర్నలిస్టు పల్లెబోయిన నాగరాజు అనారోగ్యానికి గురై హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందాడు. చికిత్సకు రూ.4 లక్షలు ఖర్చు అయ్యాయి. ఈ విషయాన్ని తెలుసుకున్న ముదిరాజ్ ఎంప్లాయీస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (మెపా)వ్యవస్థాప రాష్ట్ర అధ్యక్షుడు పులి దేవేందర్ ఆధ్వర్యంలో సుమారు 193 మంది దాతల ద్వారా సేకరించిన రూ.1,07,669లను ఆదివారం స్నేహనగర్‌లో తన నివాసం వద్ద బాధితుడు నాగరాజుకు అందజేశారు. ఈకార్యక్రమంలో మెపా ప్రతినిధులు పులి ప్రభాకర్, నీరటి రాజు, పొన్నం రాజు, బోనాల రమేష్, గోనెల విజేందర్, సంకెళ్ల శ్రీధర్, పోలు దాసరి రాము, బైరి సోమయ్య తదితరులు పాల్గొన్నారు.


నాగరాజుకు ఆర్థిక సాయం అందిస్తున్న మెపా ప్రతినిధులు

ప్రజలకు మెరుగైన సేవలందించిన వారికి గుర్తింపు

హనుమకొండ జిల్లా ఎస్ఈ మధుసూదన్‌రావు


లైన్ ఇన్‌స్పెక్టర్ రమేష్‌ను సన్మానిస్తున్న విద్యుత్ అధికారులు, సిబ్బంది

హసన్‌పర్తి, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): మెరుగైన సేవలందించిన ప్రభుత్వ ఉద్యోగులకే ప్రజల్లో మంచి గుర్తింపు ఉంటుందని హనుమకొండ జిల్లా విద్యుత్ ఎస్ఈ మధుసూదన్‌రావు అన్నారు. ఆదివారం నాగారం విద్యుత్ సబ్ స్టేషన్‌లో రూరల్ ఏఈ తరుణ్ కుమార్ అధ్యక్షతన లైన్ ఇన్‌స్పెక్టర్ రౌతు రమేష్ ఉద్యోగ విరమణ సన్మాన కార్యక్రమం జరిగింది. అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది రౌతు రమేష్ దంపతులను ఘనంగా సన్మానించి అభి నందించి ఆయన సేవలను కొనియాడారు.

ఈ కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.దానయ్య, హసన్‌పర్తి లైన్ మెన్ శిరీష్‌కుమార్, అసిస్టెంట్ లైన్‌మన్ రాజు కుమార్, సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ నవీన్‌కుమార్, సబ్ ఇంజనీర్ శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, రాజమౌళి తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో పరిమళ కాలనీ బ్రిడ్జి

» ప్రమాదకరంగా ఉన్నా పట్టించుకోని అధికారులు » కొత్త బ్రిడ్జి నిర్మించాలని కోరుతున్న ప్రజలు

వడ్డెపల్లి, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): మూడు దశాబ్దాల కిందట వడ్డెపల్లి నాలాపై పరిమళ కాలనీ వద్ద నిర్మించిన బ్రిడ్జి శిథిలావస్థకు చేరుకుంది. ప్రమాదకరంగా ఉన్న ఈ బ్రిడ్జిపై బల్దియాతో పాటు జిల్లా అధికార యంత్రాంగానికి పట్టింపు కొరవడిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కొత్తగా బ్రిడ్జి నిర్మించాలని పరిసరాల్లోని వివిధ కాలనీల ప్రజలు ఉన్నతాధికారులకు, ప్రజాప్రతినిధులకు విజ్ఞప్తి చేస్తున్నారు. వడ్డెపల్లి చెరువు మత్తడి ప్రవహించే నాలాపై పరిమళ కాలనీ పరిసరాల్లో నిర్మించిన బ్రిడ్జి శిథిలావస్థకు చేరుకుంది. దీనికి ఏర్పాటు చేసిన రెయిలింగ్ (గోడలు) సైతం దెబ్బతిన్నాయి. అధికారులు పట్టించుకోక పోవడంతో ఎప్పుడు కూలిపోతుందో తెలియని పరిస్థితి నెలకొంది. 2024 జూన్, జూలైలో కురిసిన భారీ వర్షాలకు వడ్డెపల్లి చెరువు పెద్ద ఎత్తున ప్రవహించింది. మత్తడి నీరు ఉధృతంగా రావడంతో పరిమళ కాలనీలోని బ్రిడ్జి సైతం దెబ్బతింది. నాలుగైదు ఫీట్ల ఎత్తుతో వరద ప్రవహించింది. దీని ప్రభావంతో 30 ఏళ్ల కిందట నిర్మించిన బ్రిడ్జి వరద తాకిడితో కోతకు గురైంది. తాత్కాలికంగా రెయిలింగ్ గోడలకు అధికారులు మరమ్మతులు చేసి చేతులు దులుపుకున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. శిథిలావస్థలో ఉన్న ఈ బ్రిడ్జి ఇరుకుగా ఉండడం.. వాహనాల రాకపోకలు అధికంగా ఉండడంతో నిత్యం రద్దీగా ఉంటోంది. ఎప్పుడు కూలిపోతుందో తెలియని పరిస్థితి నెలకొందని స్థానిక ప్రజలు ఆందోళన చెందుతున్నారు. జీడబ్ల్యూఎంసీ అధికారులతో పాటు ఆర్అండ్‌బీ అధికారులు బ్రిడ్జిని పరిశీలించి కొత్త బ్రిడ్జిని నిర్మించాలని పరిమళ కాలనీ, వినాయక నగర్ కాలనీ, పోలీసు కాలనీ, సప్తగిరి కాలనీ, పూరిగుట్ట తండా, ఉషోదయ కాలనీల ప్రజలు కోరుతున్నారు.


శిథిలావస్థలో ఉన్న పరిమళ కాలనీలోని బ్రిడ్జి

కొత్త బ్రిడ్జి నిర్మించాలి



శిథిలావస్థలో ఉన్న పరిమళ కాలనీ బ్రిడ్జిని వెంటనే తొలగించి కొత్త బ్రిడ్జిని నిర్మించాలి. బ్రిడ్జి శిథిలావస్థలో ఉండడం వలన ఎప్పుడు కూలిపోతుందో తెలియని పరిస్థితి నెలకొంది. నిత్యం వందలాది వాహనాలు ఈ బ్రిడ్జిపై నుంచే వెళ్తుంటాయి. రెయిలింగ్ గోడలు లేకపోవడం వల్ల వాహనాలు అదుపు తప్పి నాలాలో పడే ప్రమాదం ఉంది.

రావుల వెంకట రమేష్ గౌడ్, వినాయక నగర్ కాలనీ

నిర్మించారు.. వదిలేశారు..

» నిరుపయోగంగా మడిగెలు » రోడ్డు పైనే చేపల విక్రయాలు » పట్టించుకోని మున్సిపల్ అధికారులు

కాజీపేట, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): కాజీపేట 63వ డివిజన్ పరిధిలోని జూబ్లీ మార్కెట్‌లో బల్దియా ఆధ్వర్యంలో నిర్మించిన మడిగెలు (షాపులు) 15 ఏళ్లుగా వృథాగా ఉన్నాయి. కాజీపేట ప్రధాన రహదారి నుంచి మంచి ప్రైమ్ ఏరియాలో ఈ మడిగెలను లక్షలు వెచ్చించి నిర్మించారు. కానీ, ఇప్పటి వరకు వాటిని ప్రారంభించలేదు. 15 ఏళ్లుగా మున్సిపల్ అధికారులు మారుతున్నా ఎందుకో ఈ మడిగెలను మాత్రం ఉపయోగించే పరిస్థితి కనిపించడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. దీంతో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. యాచకులు, కొన్నింటిలో ప్రైవేటు వారు చెత్త సామగ్రికి ఉపయోగించుకుంటున్నారు. ప్రభుత్వ స్థలం దొరకక ఐటీఐ, ఏటీసీ సెంటర్లు వరంగల్ తరలించగా, మరి కొన్ని ముఖ్యమైన కార్యాలయాలకు మంచి స్థలాలు దొరకడం లేదని వాపోయే అధికారులు వీటిపై దృష్టి సారిస్తే మంచిదని స్థానికులు చెబుతున్నారు.


నిరుపయోగంగా ఉన్న షాపులు

చేపల మార్కెట్ కోసం..

నగర పరిధిలోని చేపల వ్యాపారుల కోసం నిర్మించిన 15 మడిగెలు కట్టినప్పటి నుంచి చేపల విక్రయదారులు ఎందుకో ఇక్కడ అమ్మకాలు జరపడానికి ఇష్టపడడం లేదు. కూరగాయల మార్కెట్ ప్రధాన రహదారిపై చేపలు అమ్మకాలు జరుపుతుంటారు. ఆదివారం వస్తే ప్రధాన రహదారిపై ట్రాఫిక్ జామ్ అవుతోంది. ఓ వైపు కూరగాయల మార్కెట్ కోసం నిర్మించిన గదుల్లో కూరగాయలు అమ్మకుండా రోడ్డుపై విక్రయాలు జరపడంతో ట్రాఫిక్ జామ్‌తో పాటు దుమ్ము, ధూళి పారిన కూరగాయలు కొన్న ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. ప్రస్తుతం చేపల మార్కెట్ కోసం నిర్మించిన గదుల్లో చేపలు అమ్మకుండా ప్రధాన రహదారిపై అమ్ముతున్నారు. అధికారులు చొరవ తీసుకుని విశాలమైన కూరగాయల మార్కెట్‌లో ఖాళీగా ఉన్న షాపుల్లోనే చేపలు, కూరగాయలు ఒకేచోట అమ్మకాలు జరిపేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

నవ్య
కుటుంబ కదంబం
సోమవారం 1 సెప్టెంబరు 2025





సంకల్పం

అత్తయ్య ఆదర్శంగా... దేశం గర్వించేలా

ఆట ఆమెకు ఆటవిడుపు కాదు... జీవిత గమనం. ఈ క్రీడా ప్రయాణం... బాల్యంలో మొదలైంది. బడి రోజుల్లో... కళాశాలలో... ఇద్దరు పిల్లలకు తల్లి అయ్యాక కూడా కొనసాగుతోంది. అత్తయ్య శిక్షణలో నైపుణ్యం సంపాదించి... జాతీయ స్థాయి కబడ్డీలో పతకాలు ఎన్నో సాధించి... ప్రస్తుతం కోచ్‌గా, రిఫరీగా నిరుపమాన సేవలు అందిస్తున్నారు... జరుబుల శ్రావణి. రేపటి తరాన్ని ఉత్తమ క్రీడాకారులుగా తీర్చిదిద్దుతున్న ఆమె 'నవ్య'తో ముచ్చటించారు.

"నాది మా మేనత్త రాజ్యలక్ష్మి పోలిక అంటారు అందరూ. ఆమె ఒకప్పుడు మంచి క్రీడాకారిణి. ఆ తరువాత వ్యాయామ ఉపాధ్యాయురాలిగా స్థిరపడ్డారు. నాకు కూడా చిన్నప్పటి నుంచీ ఆటలంటే ఇష్టం. ఏదో సరదాకు కాకుండా... అత్తయ్యలా క్రీడల్లో రాణించాలని అనుకునేదాన్ని. రన్నింగ్, కబడ్డీ... అన్నిట్లో ఉండేదాన్ని. నా ఆసక్తిని గమనించిన మా అమ్మానాన్న లక్ష్మి, ఆంజనేయులు నన్ను మరింత ప్రోత్సహించారు. అత్తయ్య ఉమ్మడి ప్రకాశం జిల్లా కందుకూరు స్కూల్లో పీఈటీగా చేసేవారు. నన్ను తీసుకువెళ్లి ఆ స్కూల్లో చేర్చారు. అప్పుడు నేను ఆరో తరగతి. అప్పటి నుంచీ అత్తయ్య దగ్గర ఆటల్లో, ముఖ్యంగా రన్నింగ్, కబడ్డీలో శిక్షణ మొదలైంది. మాది బాపట్ల జిల్లా ఇంకొల్లు మండలం సంతరావూరులో ఒక రైతు కుటుంబం. నేను ఒక్కగానొక్క సంతానం కావడంతో అమ్మానాన్న ఎంతో గారాబంగా పెంచారు. ఎప్పుడూ వాళ్లను వదిలి ఉన్నది లేదు. కానీ నన్ను ఒక మంచి క్రీడాకారిణిగా చూడాలన్న ఆశయంతో వేరే ఊరు పంపించారు.

జాతీయ స్థాయి క్రీడాకారిణిగా...

కొంత కాలానికి నేను మిగిలిన ఆటలను వదిలేసి... కబడ్డీ మీదనే దృష్టి పెట్టాను. స్కూల్, కళాశాల స్థాయి టోర్నీలో పాల్గొన్నాను. తరువాత నాగార్జున వర్సిటీ తరుపున ఆలిండియా యూనివర్సిటీ మీట్స్‌లో పోటీపడ్డాను. పలుమార్లు చాంపియన్‌గా నిలిచాను. ఆ విజయాలు నాలో ఆత్మవిశ్వాసం నింపాయి. ఆ తరువాత రాష్ట్ర స్థాయి, అక్కడి నుంచి జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించాను. పాతికకు పైగా ఆలిండియా మీట్స్‌లో రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహించాను. స్వర్ణ, రజత, కాంస్య పతకాలు ఎన్నో గెలుచుకున్నాను. గత ఏడాది ప్రభుత్వ ఉద్యోగులకు నిర్వహించే 'నేషనల్ సివిల్ సర్వీసెస్ కబడ్డీ టోర్నీ'లోనూ సత్తా చాటాను.

ఆడపిల్లకు ఆటలెందుకు అన్నారు...

చిన్నప్పుడు కోచింగ్ కోసం, తరువాత టోర్నమెంట్‌ల కోసం ఇతర ప్రాంతాలు, రాష్ట్రాలకు వెళ్లాల్సి వచ్చేది. ఆ సమయంలో కొందరు బంధువులు, సన్నిహితులు అమ్మానాన్నలను వారించారు. 'వయసుకు వచ్చిన ఆడపిల్లను పెళ్లి చేసి పంపాలే కానీ, ఇలా రాష్ట్రాలు దాటిస్తే ఎలా' అంటూ నిలదీశారు. కానీ మా అమ్మానాన్న తమ బిడ్డ విజయాన్ని ఈ దేశం చూడాలని అనుకున్నారు. ఒత్తిళ్లకు తలొగ్గలేదు. అడుగడుగునా నన్ను ప్రోత్సహించారు. అడిగినవన్నీ సమకూర్చారు. వారు నాపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టాలని ఆ క్షణమే నిర్ణయించుకున్నా. ఆడపిల్లలంటే అన్నిటికీ భయపడాలా? వంట గదికే పరిమితమవ్వాలా? ఇలా తక్కువ చేసి మాట్లాడేవారికి నా విజయాలతోనే సమాధానం ఇవ్వాలనుకున్నా. దృఢ సంకల్పంతో ప్రయత్నించి అనుకున్నది సాధించాను. అమ్మానాన్న గర్వపడేలా చేశాను.

పీఈటీగా ఉద్యోగం...

ఆటల్లో పడి చదువును నిర్లక్ష్యం చేయలేదు. కాకినాడ స్పోర్ట్స్ హాస్టల్‌లో ఇంటర్, చీరాల వీఆర్ఎస్ అండ్ వైఆర్ఎన్ కళాశాలలో బీఏ చదివాను. బ్యాచిలర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ప్రవేశ పరీక్షలో మొదటి స్థానం సంపాదించడంతో నాగార్జున వర్సిటీలో సీటు లభించింది. 2012 డీఎస్సీలో పీఈటీగా ఉద్యోగం వచ్చింది. ఉమ్మడి ప్రకాశం జిల్లా పెద్దకొత్తపల్లిలో ఉద్యోగ జీవితం ప్రారంభించాను. రెండేళ్లుగా బాపట్ల జిల్లా వేటపాలెం బాలికోన్నత పాఠశాలలో పీఈటీగా చేస్తున్నాను. పెళ్లి తరువాత కూడా నా క్రీడా ప్రస్థానం కొనసాగుతోందంటే అందుకు మావారు వెంకటసుబ్బారావు సహకారం ప్రధాన కారణం. మా అమ్మానాన్నల్లా ఆయన కూడా నన్ను ఎంతో ప్రోత్సహిస్తూ వచ్చారు. మాకు ఇద్దరు పిల్లలు... తారక్‌రామ్, హర్షిత్‌రామ్. కుటుంబ మద్దతు ఉంటే ఆడపిల్లలు ఎంతటి లక్ష్యాన్ని అయినా సాధించగలరు. దానికి నేనే ప్రత్యక్ష ఉదాహరణ."

● తాళ్లూరి ప్రదీప్, చీరాల
99854 11491



మరో అడుగు...

నా ప్రయాణంలో మరో కొత్త అడుగు పడింది. ఇటీవల విజయవాడలో నిర్వహించిన యువ ఆంధ్ర కబడ్డీ చాంపియన్‌షిప్‌లో రిఫరీగా వ్యవహరించాను. ప్రస్తుతం నేను ఔత్సాహిక క్రీడాకారులకు శిక్షణ ఇస్తున్నాను. నా వద్ద కబడ్డీలో శిక్షణ తీసుకున్న కొందరు జూనియర్ జట్లకు ఎంపిక అయ్యారు. రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. మట్టిలో మాణిక్యాలు మన దగ్గర ఎన్నో ఉన్నాయి. అలాంటివారిని గుర్తించి ప్రోత్సహించాలంటే ఆర్థికంగా, సౌకర్యాల పరంగా ప్రభుత్వం నుంచి సహకారం అవసరం. నైపుణ్యం, సామర్థ్యం గల ఎంతోమంది క్రీడాకారులు పేదరికంతో ముందడుగు వేయలేకపోతున్నారు. వారికి అండగా నిలిస్తే దేశానికి గర్వకారణం అవుతారు.

గుడ్డు పెంకుతో జుట్టుకు ఆరోగ్యం

కోడిగుడ్లను తినేసి, పెంకులను పడేస్తూ ఉంటాం. కానీ ఆ పెంకులు శిరోజాల పెరుగుదలకు సహాయపడతాయి. ఆ వివరాలు తెలుసుకుందాం..

- జుట్టు ఊడడానికి ఓ ప్రధాన కారణం కాల్షియం లోపం. కోడిగుడ్డు పెంకులో కాల్షియం పుష్కలంగా ఉంటుంది. ఇది జుట్టు ఆరోగ్యాన్ని పెంపొందిస్తుంది.
- గుడ్డు పెంకులోని ప్రోటీన్లు, మెగ్నీషియం, పొటాషియం, ఫాస్ఫరస్ వంటి ఖనిజాలు జుట్టు పెరుగుదలకు దోహదపడతాయి.
- గుడ్డు పెంకులోని పోషకాలు మాడు పీహెచ్ స్థాయిలను బ్యాలెన్స్ చేస్తాయి. చుండ్రును, దురదను తగ్గించేందుకు సహాయపడతాయి.


ఇలా సిద్ధం చేసుకోవాలి

- కోడి గుడ్లను పగలగొట్టిన తరువాత పెంకులను నీటితో శుభ్రంగా కడగాలి. తరువాత తడిని పూర్తిగా ఆరనిచ్చి ఆ పెంకులను మెత్తని పొడి చేయాలి. దానిని గాలి చొరబడని డబ్బాలో నిల్వ చేసుకోవాలి.



ఇలా వాడాలి

- ఒక గిన్నెలో రెండు టేబుల్ స్పూన్ల కొబ్బరి నూనె, ఒక టేబుల్ స్పూన్ గుడ్డు పెంకుల పొడి వేసి కలపాలి. దీనిని మాడుకు రాసి కొంచెం సేపు మర్దన చేయాలి. 30 -45 నిమిషాల తరువాత తలస్నానం చేయాలి. వారానికోసారి ఇలా చేస్తే మంచి ఫలితముంటుంది.
- గుడ్డు పెంకుల పొడిని షాంపూలో కలుపుకుని కూడా వాడొచ్చు.
- రెండు స్పూన్ల ఆలివ్ నూనెలో ఒక స్పూన్ పెంకుల పొడి కలిపి తలకు పట్టించాలి. అరగంట తరువాత తలస్నానం చేయాలి. వారినికోసారి ఇలా చేయాలి.
- రెండ టేబుల్ స్పూన్ల కలబంద గుజ్జులో ఓ స్పూన్ పెంకుల పొడిని కలిపి తలకు పట్టించాలి. అరగంట తరువాత వేడి నీళ్లతో కడిగేయాలి. వారానికో రెండుసార్లు ఇలా చేస్తే మంచి ఫలితముంటుంది.



చిత్రజ్యోతి

SINCE 1965

అనుష్క నట విశ్వరూపం చూపించబోతున్నాం



క్రిష్

'ఘాటి' చిత్రంలో అనుష్క శీలావతిగా మన ముందుకు రాబోతున్నారు. ఆమె నట విశ్వరూపాన్ని ఈ సినిమాలో చూపించబోతున్నాం' అని దర్శకుడు క్రిష్ జాగర్లమూడి అన్నారు. అనుష్కశెట్టి, విక్రమ్ ప్రభు ప్రధాన పాత్రధారులుగా క్రిష్ తెరకెక్కించిన చిత్రమిది. రాజీవ్ రెడ్డి, సాయిబాబు జాగర్లమూడి నిర్మించారు. ఈనెల 5న విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్ర బృందం మీడియా సమావేశం ఏర్పాటు చేసింది. క్రిష్ మాట్లాడుతూ 'కొన్ని కథలు చాలా సహజంగా, పచ్చిగా, పేలడానికి సిద్ధంగా ఉన్నట్లుగా ఉంటాయి. అలాంటి కథ 'ఘాటి'. తూర్పు కనుమలు, ఆ పర్వత శ్రేణులు, అక్కడి దృఢమైన మనుషులు, వారి గొప్ప వ్యక్తిత్వాలను కలిపి ఒక మంచి కథను చెప్పే అవకాశం దొరికింది. విక్రమ్ ప్రభు కోసమే దేశిరాజు క్యారెక్టర్‌ని రాశాను. ఈ సినిమాకి జగపతిబాబు పాత్ర ప్రత్యేక ఆకర్షణ' అని చెప్పారు. జగపతిబాబు మాట్లాడుతూ 'అనుష్క స్వీటీ అని మనందరికీ తెలుసు. కానీ ఈ సినిమాలో ఘాటుగా ఉండబోతోంది. నేను పోలీస్ పాత్రను పోషించాను. నా పాత్రను డైరెక్టర్ క్రిష్ చాలా అద్భుతంగా రాశారు' అని చెప్పారు. విక్రమ్ ప్రభు మాట్లాడుతూ 'అనుష్క, జగపతిబాబు, చైతన్య రావుతో కలసి నటించడం చాలా ఆనందాన్ని ఇచ్చింది' అని అన్నారు. నటుడు చైతన్య రావు మాట్లాడుతూ 'నా క్యారెక్టర్‌ని తెరపై చూసుకున్నప్పుడు చాలా కొత్తగా అనిపించింది. నాలో కొత్త కోణాన్ని చూపించిన దర్శకుడు క్రిష్‌కి ధన్యవాదాలు' అని అన్నారు. చిత్ర నిర్మాత రాజీవ్ రెడ్డి మాట్లాడుతూ 'ఈ సినిమాలో అనుష్కని రియల్ క్వీన్‌గా చూస్తారు. చాలా అద్భుతమైన సినిమా తీశాం. మేమందరం సినిమా విజయంపై నమ్మకంతో ఉన్నాం' అని అన్నారు.

నీ పుట్టినరోజును మిస్ అవుతున్నా



తనయుడు గౌతమ్ పుట్టినరోజు వేడుకలను మిస్ కావడం ఇదే తొలిసారి అని మహేశ్‌బాబు భావోద్వేగానికి లోనయ్యారు. ఆదివారం గౌతమ్ పుట్టినరోజు. ఈ సందర్భంగా గౌతమ్‌కు శుభాకాంక్షలు చెబుతూ ఎక్స్‌లో మహేశ్‌బాబు పోస్ట్ పెట్టారు. 'గౌతమ్ ఈ ఏడాది నీ పుట్టినరోజును మిస్ అవుతున్నాను. 19వ పుట్టినరోజు శుభాకాంక్షలు. నేను మిస్ అయిన నీ తొలి పుట్టినరోజు ఇదే. నా ప్రేమ నీకెప్పుడూ తోడుగా ఉంటుంది. నువ్వు చేసే ప్రతీ పనికీ ఎక్కువ సంతోష పడే వ్యక్తిని నేనే. నువ్వు మరింత ఎత్తుకు ఎదగాలని కోరుకుంటున్నా' అని ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. ఈ సందర్భంగా గౌతమ్‌తో దిగిన పాత ఫొటోను అభిమానులతో పంచుకున్నారు. ప్రస్తుతం రాజమౌళి తెరకెక్కిస్తున్న 'ఎస్ఎస్ఎంబీ 29' చిత్రీకరణలో బిజీగా ఉండటం వల్లే గౌతమ్ పుట్టినరోజు వేడుకలకు మహేశ్‌బాబు హాజరు కాలేకపోయారు.





ANDHRA PRADESH & TELANGANA RELEASE BY SITHARA ENTERTAINMENTS

కాళేశ్వరంపై సీబీఐ



(మొదటిపేజీ తరువాయి)

లోపాలు, అవకతవకలు గుర్తించింది. నిర్లక్ష్యం, దురుద్దేశం, ఉద్దేశపూర్వకంగా వాస్తవాలు తొక్కిపెట్టడం, ఆర్థిక అవకతవకల అంశాన్ని ప్రస్తావించింది. ప్లానింగ్ లేదని తేల్చింది. ఎన్‌డీఎస్‌ఏ నివేదిక ప్రకారం మేడిగడ్డ బ్యారేజీ వైఫల్యానికి క్వాలిటీ కంట్రోల్, నాణ్యత, నిర్వహణ సరిగ్గా లేకపోవడం వల్ల లోపాలు ఏర్పడ్డాయని ఎన్‌డీఎస్‌ఏ గుర్తించింది. ఈ అంశాలపై మరింత లోతుగా, మరింత సమగ్రంగా దర్యాప్తు చేయాలని ఎన్‌డీఎస్‌ఏ, కమిషన్ నివేదికలు స్పష్టం చేశాయి. ఈ ప్రాజెక్టులో అంతరాష్ట్ర అంశాలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన వివిధ శాఖలు, ఏజెన్సీలు పాలుపంచుకున్నాయి. ప్రాజెక్టు డిజైన్, వ్యాప్కోస్ వంటి కేంద్ర సంస్థలు, పీఎఫ్‌సీ, ఆర్‌ఈసీ ఆర్థిక సంస్థలు పాల్పంచుకున్నందున ఈ కేసును సీబీఐకి అప్పగించడం సముచితమని నిర్ణయంతీసుకున్నాం. అందుకే ఈ కేసు దర్యాప్తును సీబీఐకి అప్పగించాలని సభ నిర్ణయం తీసుకుంటుంది' అని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ఎన్నో రకాల అంశాలు, విచారణకు అర్హమైన అంశాలు ఉన్నందున సీబీఐ విచారణకు అప్పగించాలని నిర్ణయించామన్నారు. ధవళేశ్వరంపై ప్రాజెక్టు కట్టిన సర్ ఆర్థర్ కాటన్‌ను ప్రజలు కాటన్ దొర అని దేవుడిలా పూజిస్తుంటే.. దొరగా పుట్టానని గొప్పగా చెప్పుకొనే కేసీఆర్ .. తెలంగాణలో దోపిడీ దొంగగా మారారని ఆరోపించారు. కాళేశ్వరంలో ప్రాజెక్టు పేరుతో కేసీఆర్ కుటుంబం రూ.లక్ష కోట్లు దోచుకుందని, రాష్ట్రప్రజలపై లక్షన్నర కోట్ల అప్పుల భారం వేసిందని అన్నారు. ప్రజాస్వామ్య దేశమైనందున.. కేసీఆర్ చేసిన పాపాలకు నడి బజారులో ఉరి తీయలేమని, రాళ్లతో కొట్టలేమని పేర్కొన్నారు. అందరి అనుమతితో నిర్ణయం తీసుకోవాలనే ఈరోజు అర్ధరాత్రి సమావేశం పెట్టామన్నారు.

కాళేశ్వరంపై రూ. 49835 కోట్లు అప్పు కట్టాం..

ముఖ్యమంత్రిగా కేసీఆర్ కాళేశ్వరం కోసం రూ. 87,449 కోట్లు అప్పులు తెచ్చారని సీఎం రేవంత్ తెలిపారు. పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్, నాబార్డ్, విజయ బ్యాంకుల నుంచి 14 ఏళ్ల కాలానికి అత్యధికంగా 11.5 శాతం వడ్డీకి తెచ్చారని పేర్కొన్నారు. ఆ నిధులతోనే మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలు కట్టారన్నారు. అసలు, వడ్డీలు కలిపి ఇప్పటివరకు రూ.49,835 కోట్లు చెల్లించామని, ఇంకా రూ.60,769 కోట్లు చెల్లించాల్సి ఉందని చెప్పారు. పెండింగులో ఉన్న పనులు పూర్తిచేయాలంటే ఇంకా రూ.47 వేల కోట్లు కావాలన్నారు. కాగా, అర్ధరాత్రి దాటిన తరువాత 1.40 గంటలకు సభను నిరవధికంగా వాయిదా వేస్తూ స్పీకర్ నిర్ణయం తీసుకున్నారు.



అక్బర్ వర్సెస్ సీఎం

- కాళేశ్వరంపై మీరేం చేయదల్చుకున్నారు?
- రేపు సభ ఉంటుందా లేదా.. ఏమీ చెప్పడం లేదు: అక్బర్
- నివేదికను పూర్తిగా చదవండి.. సలహాలివ్వండి
- నిర్ణయం మేం తీసుకుంటాం: సీఎం రేవంత్



హైదరాబాద్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరంపై పీసీ ఘోష్ నివేదికపై శాసన సభలో చర్చ సందర్భంగా ఆదివారం మజ్లిస్ ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీ, సీఎం రేవంత్‌రెడ్డి మధ్య వాడివేడి వాదన కొనసాగింది. కమిషన్ నివేదికలో విజిలెన్స్ రిపోర్టును ఎక్కడా ప్రస్తావించలేదని అక్బర్ నిలదీశారు. "కమిషన్ తన నివేదికలో సుమారు రూ.6.5 కోట్లను రికవరీ చేయాలని పేర్కొంది. కానీ, కమిషన్ నియామకం, ఖర్చులకే రూ.3కోట్లు అయ్యింది" అని ఆయన ఎద్దేవా చేశారు. అసలు కాళేశ్వరం ప్రాజెక్టును ఏంచేయాలనుకుంటున్నారని ప్రశ్నించారు. సోమవారం సభ ఉంటుందా? లేదా? తామంతా రావాలా? వద్దా? చెప్పలేదంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై సీఎం రేవంత్‌రెడ్డి ఘాటుగా సమాధానమిచ్చారు. కమిషన్ నివేదికను తాను పూర్తిగా చదివానని, మీరు కూడా చదవాలని అక్బర్‌కు సూచించారు. నివేదికను పరిశీలించి సలహాలు ఇవ్వాలని, తాము నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేశారు.

రూ.లక్ష కోట్ల అవినీతి ఎక్కడ జరిగింది..?

- నివేదికలో ఆ అక్రమాల ప్రస్తావన ఏదీ? : ఏలేటి



హైదరాబాద్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టులో రూ.లక్ష కోట్ల అవినీతి జరిగిందని పదే పదే ముఖ్యమంత్రి, మంత్రులు చెప్పారని.. కానీ, విచారణ నివేదికలో మాత్రం ఆ అక్రమాలపైన పూర్తిస్థాయిలో ఎక్కడా ప్రస్తావించలేదని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై పీసీ ఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదికపై ఆదివారం అసెంబ్లీలో జరిగిన చర్చలో ఆయన మాట్లాడారు. మూడు బ్యారేజీల నిర్మాణాల్లో నాణ్యత లేకపోవడంతో కుంగిపోయాయని నివేదికలో ఉందని.. అంటే అవినీతి అంతా వాటి నిర్మాణానికి అయిన రూ.7 వేల కోట్ల చుట్టూ మాత్రమే తిరిగిందన్నారు. రూ.లక్ష కోట్ల అవినీతిపై ఎందుకు మాట్లాడటం లేదని ఆయన ప్రశ్నించారు. మొత్తం ప్రాజెక్టులో అక్రమాలను ఎందుకు బయట పెట్టలేకపోయారని నిలదీశారు. కాళేశ్వరం ప్రాజెక్టు అక్రమాలకు కేసీఆర్ బాధ్యుడని.. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఆయన్ను అరెస్ట్ చేస్తామని పీసీసీ అధ్యక్షుడిగా రేవంత్‌రెడ్డి పదే పదే చెప్పారని.. ఇప్పుడేమో కేసీఆర్ చర్లపల్లి జైలులో ఉన్నా.. ఫామ్‌హౌస్‌లో ఉన్నా ఒకటేనని అనడం అనుమానాలకు తావిస్తోందన్నారు. "కాళేశ్వరం అవినీతిపై చర్చపెట్టి దానిపై ఏం చేయాలో మమ్మల్ని అడగడం దేనికి..? రూ.లక్షకోట్ల అవినీతిని ఎలా బయట పెడతారో మీరే చెప్పండి..? అవినీతిని సాక్ష్యాలతో బయట పెట్టండి" అని మహేశ్వర్‌రెడ్డి అన్నారు. కమిషన్‌లో కాళేశ్వరం అవినీతి అక్రమాలను పూర్తిస్థాయిలో ప్రస్తావించలేదని.. కోర్టులు, సిట్, సీబీఐలో కేసు నిలబడకుండా నివేదికను నీరుగార్చారని ఆరోపించారు. కొండను తవ్వి ఎలుకను పట్టినట్టు ఉందని, కోరల్లేని పాములా నివేదిక ఉందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు తన మానస పుత్రిక అని చెప్పిన కేసీఆర్.. కమిషన్ నివేదికపై ఎందుకు మాట్లాడటంలేదని ప్రశ్నించారు. రాజకీయంగా కొందరు అధికారులను బద్నాం చేయడానికి ప్రయత్నించారని, రామకృష్ణారావు పేరును ఎందుకు ప్రస్తావించలేదని ఏలేటి ప్రశ్నించారు.

ఏ ప్రాజెక్టును పట్టించుకోని కేసీఆర్ సర్కారు

- అసెంబ్లీ మీడియా పాయింట్‌లో ఎమ్మెల్యే కడియం
- మేడిగడ్డ ప్రాజెక్టు మేడిపండు లాంటిది: యశస్వినీ రెడ్డి

హైదరాబాద్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): కేసీఆర్ సర్కారు కాళేశ్వరం ప్రాజెక్టు మీద పెట్టిన శ్రద్ధ.. మిగతా ప్రాజెక్టుల మీద పెట్టలేదని స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి విమర్శించారు. ఆదివారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడారు. పంట మార్పే క్రమంలో ఒక రైతు పత్తి చేనును తొలగిస్తే యూరియా కొరత వల్లే తొలగించారని ఎర్రబెల్లి దయాకర్‌రావు తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినీ రెడ్డి మాట్లాడుతూ.. మేడిగడ్డ ప్రాజెక్టు మేడిపండు లాంటిదని ఎద్దేవా చేశారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మాట్లాడుతూ రైతులను మభ్యపెట్టే విధంగా బీఆర్ఎస్ నేతలు యూరియాపై రచ్చ చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

దోచుకుని.. దబాయింపు!

కాళేశ్వరం పేరుతో లక్ష కోట్లు దోచుకున్నారు.. అందుకు మిమల్ని ఉరి తీయాలి కదా?: రేవంత్

పీసీ ఘోష్‌ది చెత్త నివేదిక.. రాజ్యాంగం కల్పించిన హక్కుగా కోర్టుకెళ్తే తప్పేంటి?: హరీశ్‌రావు

హైదరాబాద్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించి జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదికపై శాసనసభలో ఆదివారం వాడీవేడి చర్చ జరిగింది. ఈ చర్చలో ప్రతిపక్ష బీఆర్ఎస్ తరఫున మాజీ మంత్రి హరీశ్‌రావు మాట్లాడగా.. ప్రభుత్వం వైపు నుంచి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో పాటు పలువురు మంత్రులు మాట్లాడారు. పీసీ ఘోష్ కమిషన్ నివేదికలోని పలు అంశాలను హరీశ్‌రావు తప్పుబట్టిన ప్రతిసారీ వారు జోక్యం చేసుకొని సమాధానమిచ్చారు. దీంతో చర్చ పరస్పరం వ్యక్తిగత విమర్శల దాకా వెళ్లింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ, "ప్రాణహిత- చేవెళ్ల ఎత్తిపోతల పథకం ఊరు మార్చి, పేరు మార్చి, అంచనాలు మార్చి.. రూ.లక్ష కోట్ల ప్రజల సొమ్మును దోచుకున్నారు. అందుకు మిమ్మల్ని ఉరి తీయాలి కదా?" అని అన్నారు. కేసీఆర్ ముఖ్యమంత్రి అయ్యాక ప్రాణహిత-చేవెళ్ల ఎత్తిపోతల పథకంపై ఏర్పాటుచేసిన అనంత రాములు కమిషన్ ఇచ్చిన నివేదికను, తెలంగాణ ఇంజినీర్లు ఇచ్చిన నివేదికను తొక్కిపెట్టారని అన్నారు. ఇప్పుడేమో సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా, మొదటి లోక్‌పాల్‌గా పనిచేసిన పీసీ ఘోష్‌పై వ్యక్తిగత విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. కాళేశ్వరం లోపాలను ఎత్తిచూపినందుకే ఆ కుటుంబమంతా కలిసి పీసీ ఘోష్‌ను విమర్శిస్తోందన్నారు.

ఉమాభారతి చెప్పినా కాదని..

2015 మార్చి 13న నాటి కేంద్ర జలవనరుల శాఖ మంత్రి ఉమాభారతి.. రాష్ట్రానికి లేఖ రాశారని, గోదావరిలో 205.8 టీఎంసీల నీటి లభ్యత ఉందని, తుమ్మిడిహెట్టి వద్ద ప్రాజెక్టును కట్టుకోవచ్చని ఆ లేఖలో రాశారని సీఎం రేవంత్ అన్నారు. ఆ లేఖను అప్పటి మంత్రి హరీశ్‌రావు ఎండార్స్ చేసి.. ప్రాణహిత- చేవెళ్ల చీఫ్ ఇంజనీర్‌కు పంపించారని తెలిపారు. 2014 అక్టోబరు 24న హైడ్రాలజీ క్లియరెన్స్ కూడా వచ్చిందని, 236.3 టీఎంసీల నీరు అందుబాటులో ఉన్నట్లు కేంద్ర జలసంఘం సైతం స్పష్టం చేసిందని చెప్పారు. ఇన్ని అనుమతులున్న తర్వాత.. ప్రాజెక్టు కట్టుకోవాలా? వద్దా? అని కేంద్రానికి లేఖలు రాయటం విడ్డూరంగా ఉందన్నారు. పీసీ ఘోష్ కమిషన్ ఇచ్చిన 665 పేజీల నివేదికలో.. హరీశ్‌రావు తప్పు చేసినట్లు 98వ పేజీలో స్పష్టంగా ఉందన్నారు. మామా అల్లుళ్లు మసి పూసి మారేడు కాయ చేసినట్లు తెలంగాణ సమాజాన్ని ఇంకా మోసం చేస్తామంటే కుదరదన్నారు. "ఘోష్ కమిషన్ నివేదికను ప్రజల ముందు పెట్టినం.. ఇప్పుడు మీకేం కావాలి? ఏ విచారణ కావాలి? ఈడీ కావాలా? ఇన్‌కమ్ ట్యాక్స్ కావాలా? సిట్ కావాలా? ఏసీబీ విచారణ కావాలా? ఏదో స్పష్టంగా చెప్పండి" అని హరీశ్‌ను ఉద్దేశించి సీఎం రేవంత్ ప్రశ్నించారు.

సిగరెట్ పెట్టెపై రాసినట్లు..!

148 మీటర్ల ఎత్తులో కట్టుకుంటే తమకు ముంపు ప్రాంతం తక్కువ ఉంటుందని మాత్రమే మహారాష్ట్ర చెప్పిందని రేవంత్ అన్నారు. కేంద్ర జలసంఘం ఏ ప్రాజెక్టుకు అనుమతిచ్చినా.. ఓ హెచ్చరిక తప్పనిసరిగా చేస్తుందని, మరోసారి పరిశీలించుకోవాలని చెబుతుందని అన్నారు. సిగరెట్ పెట్టెపై.. సిగరెట్ తాగటం ఆరోగ్యానికి హానికరం! అని రాసినట్లుగానే.. తుమ్మిడిహెట్టి నుంచి మేడిగడ్డకు మార్చినపుడు ఇదే తరహాలో హెచ్చరిక చేసిందని, అయినా కేసీఆర్ ప్రభుత్వం పట్టించుకోలేదని ధ్వజమెత్తారు. పీసీ ఘోష్ నివేదికలో 72వ పేజీలో రీడిజైన్లు సహేతుకం కాదని పేర్కొన్నారని తెలిపారు. దీనిపై హరీశ్‌రావు స్పందిస్తూ.. మసిపూసి మారేడుకాయ చేయటంలో రేవంత్‌రెడ్డి సిద్ధహస్తుడని ఆరోపించారు. ఉమాభారతి రాసిన లేఖలో మొదటి పేజీ మాత్రమే సీఎం చదివారని, మూడో పేజీ కూడా చదవాలని సూచించారు. 165 టీఎంసీల నీటిలో ఎగువ రాష్ట్రాలు 63 టీఎంసీలు వాడుకుంటే.. ఇంకా 102టీఎంసీలు మాత్రమే మిగులుతాయని, నీళ్ల లేనిచోట ప్రాజెక్టు నిర్మించవద్దని మూడో పేజీలో ఉందన్నారు. కేంద్ర జలసంఘం కూడా ఇదే చెప్పిందని తెలిపారు. నీళ్లన్న చోటికి మార్చుకోవాలంటూ 2013 అక్టోబరు 15న కిరణ్‌కుమార్ సీఎంగా ఉన్నపుడు కూడా లేఖలో పేర్కొన్నారని వివరించారు. సభను తప్పుదోవ పట్టించినందుకు రేవంత్ క్షమాపణ చెప్పాలన్నారు. చర్చలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి జోక్యం చేసుకుంటూ.. తుమ్మిడిహట్టి మీద 2009-2014లో క్లియరెన్స్ ఇచ్చిన తర్వాత నాటి ప్రభుత్వం రూ.5500 కోట్లు ఖర్చు పెట్టిందని తెలిపారు. 2014 తర్వాత అదే ప్రాజెక్టు మీద బీఆర్ఎస్ ప్రభుత్వ రూ.6100కోట్లు ఖర్చు పెట్టిందని అన్నారు. తుమ్మిడిహట్టి నుంచి మేడిగడ్డకు వెళ్లాలని నిపుణులు చెబితే రూ.6100కోట్లు ఎందుకు ఖర్చు పెట్టారని పొంగులేటి ప్రశ్నించారు. రాత్రికి రాత్రే నిర్ణయాలు తీసుకున్నారని దుయ్యబట్టారు.రాజీవ్‌సాగర్, ఇందిరాసాగర్ నిర్మాణ వ్యయాన్ని రూ.18వేల కోట్లకు పెంచి దోచుకున్నారని ఆరోపించారు. దీంతో, హరీశ్‌రావు కల్పించుకుంటూ 'ఆ సమయంలో మీరు మా పార్టీలోనే ఉన్నారు. ప్రాజెక్టు ప్రారంభోత్సవానికి కూడా వచ్చారు' అని అన్నారు. అయితే.. 'ఆ సమయంలో నేను మీ పార్టీలో లేను. వైసీపీలో ఉన్నాను' అని పొంగులేటి బదులిచ్చారు. కేవలం ఒక ఆపరేటర్‌తో గూగుల్ మ్యాప్స్ ద్వారా ప్రాజెక్టుల నిర్మాణానికి కేసీఆర్ ప్లాన్ చేశారని అన్నారు. అనంతరం హరీశ్‌రావు మాట్లాడుతూ.. అధికారంలోకి వచ్చిన ఏడెనిమిది నెలల వరకు ప్రాణహిత-ప్రాజెక్టుపైనే పనిచేశామని, అయితే మహారాష్ట్ర నుంచి పదే పదే అభ్యంతరాలు రావడంతో తర్వాత మేడిగడ్డ వైపు నిర్ణయం తీసుకున్నామని అన్నారు. దీంతో.. రూ.11 వేల కోట్లు ఖర్చు పెట్టిన ప్రాజెక్టును ఎలా వదిలివేస్తారని పొంగులేటి ప్రశ్నించగా.. రూ.11 వేల కోట్లు వృధా కాలేదని, నీళ్ల లేని చోటు నుంచి నీళ్ల దొరికే చోటుకు ప్రాజెక్టును మార్చామని బదులిచ్చారు. ఆ నిర్ణయం 25రోజుల్లో తీసుకోలేదని, వ్యాప్కోస్ నివేదిక వచ్చిన తర్వాత రెండు మూడు నెలలు పట్టిందని చెప్పారు. డీపీఆర్ లేకుండా టెండర్లకు వెళ్లారని పొంగులేటి వ్యాఖ్యానించగా, 'మీ హయాంలోనూ ఇలానే జరిగింది కదా!' అని అన్నారు. సీతారామ ప్రారంభోత్సవానికి పొంగులేటి ఫుల్ పేజీ ప్రకటన ఇచ్చారంటూ క్లిప్పింగ్ చూపించారు. దీంతో ఒకసారి కాళేశ్వరం, మరోసారి సీతారామ ప్రాజెక్టు అంటున్నారని, తప్పుదోవ పట్టించే బ్యాచ్ అని పొంగులేటి విమర్శించారు. 30 శాతం ఖర్చయ్యే దయాప్రంవాల్‌కు వంద శాతం ఖర్చుతో సీకెంట్ ఫైల్ వేశారని విమర్శించారు. రూ.లక్ష కోట్లు గోదాట్లో కొట్టుకుపోవడానికి ఈ సీకెంట్ ఫైల్సే కారణమన్నారు. దీనికి అప్పటి సాగునీటి మంత్రితే బాధ్యత అన్నారు.

అన్యాయం జరిగిందనే

2009లోనే హైడ్రాలజీ క్లియరెన్స్ వచ్చిందంటున్నారని, మరి అప్పుడు అధికారంలో ఉన్న కాంగ్రెస్ అక్కడ తట్టెడు మట్టి ఎందుకు తవ్వలేదని హరీశ్‌రావు ప్రశ్నించారు. దీంతో సీఎం రేవంత్ స్పందిస్తూ.. అన్నీ చేయగలిగితే తెలంగాణ ఎందుకు అడగాల్సి వచ్చిందన్నారు. ఆంధ్రా వాళ్ల అన్యాయం చేస్తున్నారని, ప్రాజెక్టులు ప్రారంభించినా పూర్తి చేయడంలో చిత్తశుద్ధి లోపించిందనే తెలంగాణ తెచ్చుకున్నామని అన్నారు. 'రాష్ట్రం వచ్చిన తర్వాత మీరేం చేశారు?' అని ప్రశ్నించారు. మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ.. తుమ్మిడిహట్టి కన్నా మేడిగడ్డ వద్దకు అదనంగా ఎక్కడి నుంచి నీళ్ల వస్తాయని, ఏ ఉపనదులు కలుస్తాయని ప్రశ్నించారు. దీంతో, "అది క్యాబినెట్ నిర్ణయం. అప్పట్లో మంత్రిగా ఉన్న మీరెందుకు అడగలేదు?"అని హరీశ్ ప్రశ్నించారు. పదే పదే జూపల్లి ఇదే విషయాన్ని ప్రస్తావించడంతో మహారాష్ట్ర, తెలంగాణలోని వాగుల ద్వారా 120 టీఎంసీల నీరు వస్తుందని హరీశ్‌రావు అన్నారు. నిపుణుల కమిటీ చెప్పిన దాని ప్రకారమే తాము నిర్ణయం తీసుకున్నామన్నారు. మేడిగడ్డను మాత్రమే కాకుండా పక్కనున్న పోలవరంను చూడాలన్నారు. ఆ ప్రాజెక్టు కట్టించిన చంద్రశేఖర్ అయ్యర్ సమయంలో అది ఐదుసార్లు కూలిపోయిందన్నారు. దీనిపై ఉత్తమ్ స్పందిస్తూ.. చంద్రశేఖర్ అయ్యర్ గురించి మాట్లాడటం సరికాదన్నారు. ఘోష్ కమిషన్‌కు నిపుణుల కమిటీ రెండు స్టేట్‌మెంట్లు ఇచ్చిందని, ఆ విషయాన్ని హరీశ్ దాచిపెడుతున్నారని ఆరోపించారు. రూ.37వేల కోట్లతో పూర్తయ్యే ప్రాజెక్టును కమీషన్ల కోసం రూ.1.47లక్షల కోట్లకు తీసుకెళ్లారని విమర్శించారు.





ఇక్కడా న్యాయం జరగలేదు..!

కమిషన్ వద్ద తమకు న్యాయం జరగలేదని సభలో కూడా న్యాయం జరగడం లేదని హరీశ్‌రావు అన్నారు. తన ప్రసంగంలో 28సార్లు మంత్రులు అంతరాయం కల్పించారని ఆక్షేపించారు. తెలంగాణలో ఎస్‌ఎల్‌బీసీ సుంకిశాల కూలిందని, అక్కడకు ఎన్‌డీఎస్‌ఏ రాదని అన్నారు. ఒక్క మేడిగడ్డపైనే ఎందుకు రాజకీయ కక్ష?అని ప్రశ్నించారు. మేడిగడ్డ బ్యారేజీ కూలలేదని, కేవలం కుంగిందని అన్నారు. దేశంలో 80 డ్యామ్‌లు దెబ్బతిన్నాయన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా 20 లక్షల ఎకరాలకు నీరు అందించారని మీ నివేదికలు చెబుతున్నాయని గుర్తు చేశారు. దీంతో ఉత్తమ్ కల్పించుకుంటూ.. మేడిగడ్డ కాళేశ్వరం గుండెకాయ అని బీఆర్ఎస్ చెప్పిందని, ఆ గుండెకాయే పగిలిందని అన్నారు.



సభా పర్వం

పీసీ ఘోష్ ఇచ్చింది చెత్త నివేదిక: హరీశ్‌రావు

కాళేశ్వరంపై పీసీ ఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదిక చిత్తుకాగితంతో సమానమని గతంలో చెప్పామని, అదొక చెత్త నివేదిక హరీశ్‌రావు అన్నారు. కేంద్రంలో కాంగ్రెస్, బీజేపీ ప్రభుత్వాలు అధికారంలో ఉన్నపుడు ప్రాణహిత- చేవెళ్లకు అనుమతి అడిగామని, కేంద్రంతో పాటు మహారాష్ట్ర ప్రభుత్వం కూడా అనుమతి ఇవ్వకపోవటంతోనే... మేడిగడ్డకు మార్చామని తెలిపారు. తెలంగాణ రైతుల కష్టాలు తీర్చే కాళేశ్వరంపై కుట్రపూరిత కమిషన్ వేశారన్నారు. వానలు, వరదలు, యూరియా కొరతతో రైతులు ఇబ్బందులు పడుతుంటే... కాంగ్రెస్ ప్రభుత్వం కాళేశ్వరం పేరుతో బురద రాజకీయం చేస్తోందని మండిపడ్డారు. ప్రభుత్వాన్ని నడుపుతున్నారా? సర్కస్ కంపెనీ నడుపుతున్నారా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ నేతలు ప్రతి పక్షంలో ఉన్నపుడే మేడిగడ్డపై దుష్ప్రచారం మొదలుపెట్టారని, సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపిస్తామని మేనిఫెస్టోలో పెట్టారని, పీసీ ఘోష్ కమిషన్ పేరుతో ఇప్పుడు కక్షసాధింపునకు దిగుతున్నారని, ఇది రాజ్యాంగ ఉల్లంఘన అవుతుందని ఆరోపించారు. రాజకీయ అస్త్రంగా కాళేశ్వరంను వాడుకుంటున్నారని ఆక్షేపించారు. కోర్టుకు వెళ్లే హక్కు తమకు ఉందని హరీశ్‌రావు అన్నారు. కమిషనర్ ఆఫ్ ఎంక్వైరీ యాక్టు- 1952 ప్రకారం 8-బి, 8-సి నిబంధనలమేరకు కేసీఆర్‌కు గానీ, తనకుగానీ, ఐఏఎస్ అధికారులకుగానీ నోటీసులు ఇవ్వలేదని తెలిపారు. రాజ్యాంగం కల్పించిన హక్కును వినియోగించుకోవటంలో తప్పేముందని ప్రశ్నించారు. మూడు వారాల్లో కౌంటర్ దాఖలుచేయాలని హైకోర్టు ప్రభుత్వానికి సూచించిందని, తామెక్కడ సుప్రీంకోర్టుకు పోయి విచారణ కమిషన్‌ను రద్దు చేయిస్తామోననే భయంతో.. ఈ ప్రభుత్వం సుప్రీంకోర్టులో కేవియట్ దాఖలు చేసిందన్నారు. ఏ క్షణంలోనైనా కోర్టు స్టే ఇస్తుందన్న భయంతోనే హడావిడిగా అసెంబ్లీ పెట్టి, ఆదివారం చర్చ పెట్టారని విమర్శించారు. గతంలో ఇందిరాగాంధీ, ప్రణబ్ ముఖర్జీ, ఎల్‌కే అద్వానీ, కిరణ్‌బేడీ కూడా విచారణ కమిషన్ నివేదికలకు వ్యతిరేకంగా కోర్టులను ఆశ్రయించారని గుర్తుచేశారు. 'ఇందిరకు మద్దతుగా మీరు ధర్నాలు చేస్తే తప్పు లేదు గానీ.. మేం హైకోర్టుకు పోతే తప్పా?' అని ప్రశ్నించారు. పీసీ ఘోష్ కమిషన్ విచారణ చట్టబద్ధంగా జరిగిందా? లేదా? అనేదీ చర్చించాలన్నారు.

కక్షసాధింపే అయితే రెండో రోజే మొదలయ్యేది: శ్రీధర్‌బాబు

తమ ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడాలనుకుంటే.. ప్రభుత్వం ఏర్పడిన రెండో రోజు నుంచే మొదలయ్యేదని శాసనసభ వ్యవహారాలశాఖ మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. తమకు అలాంటి ఉద్దేశం లేదన్నారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యంలో ప్రతిపక్ష నేత పదవి చాలా గొప్పదని, కేసీఆర్ ప్రతిపక్ష నేతగా ఉండి అసెంబ్లీకి రాకపోవటం సరైన పద్ధతి కాదని అన్నారు. శిక్ష తప్పించుకునేందుకే హరీశ్‌రావు కోర్టుకు వెళ్లి స్టే తెచ్చుకునే ప్రయత్నం చేస్తున్నారని వ్యాఖ్యానించారు. ప్రతిపక్ష హోదాలో కేసీఆర్ మాట్లాడాలని, హరీశ్‌కు ఏం హోదా ఉందని ప్రశ్నించారు. కాగా, గతంలో తాము అధికారంలో ఉన్నప్పుడు పవర్ పాయింట్‌ప్రజెంటేషన్ ఇచ్చినప్పుడు ఉత్తమ్ ప్రిపేర్ అయి రాలేదన్నారని హరీశ్ అనగా.. ఆయనపై ఉత్తమ్ ఫైర్ అయ్యారు. హరీశ్ హద్దులు దాటుతున్నారని వ్యాఖ్యానించారు.



కేసీఆర్‌పై చర్యలు చేపట్టేందుకు సర్కారుకు స్వేచ్ఛ ఉంది

- కాళేశ్వరం అతిపెద్ద మానవ తప్పిదం
- లక్ష ఎకరాలకూ నీళ్లివ్వలేదు: ఉత్తమ్



హైదరాబాద్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వంలో బాధ్యతా రహితంగా నిర్మించిన కాళేశ్వరం తప్పిదాలకు నాటి సీఎం కేసీఆరే బాధ్యులని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. నిపుణుల కమిటీ సూచనలను పట్టించుకోకుండా అక్రమంగా, అసంబద్ధంగా కాళేశ్వరం కట్టారని పీసీ ఘోష్ కమిషన్ తేల్చిందని చెప్పారు. కాళేశ్వరం నిర్మాణంతో రాష్ట్రానికి భారీగా ఆర్థిక నష్టం జరిగిందని, అక్రమాలకు పూర్తి బాధ్యత కేసీఆర్‌దేనని, ఆయనపై చర్యలు తీసుకోవాలని సూచించిందని తెలిపారు. కేసీఆర్‌పై చట్టప్రకారం తగిన చర్యలు చేపట్టే స్వేచ్ఛ ప్రభుత్వానికి ఉందని స్పష్టం చేశారు. ఆదివారం శాసనసభలో ఆయన మాట్లాడారు. "సీడబ్ల్యూసీ అనుమతి లేకుండా కాళేశ్వరం ప్రాజెక్టును మొదలుపెట్టినట్లు నివేదికలో ఉంది. కేసీఆర్ చెప్పినట్లే చేశామని అధికారులు వాంగ్మూలం ఇచ్చారు. నిబంధనలు ఉల్లంఘించి కాంట్రాక్టర్లకు మేలు చేయడానికే పనులు అప్పగించారు. అప్పటి నేతలతో పాటు అధికారులు, ఇంజనీర్లు ఎవరెవరు బాధ్యులో కూడా కమిషన్ స్పష్టం చేసింది. 666 పేజీల కమిషన్ నివేదికను అసెంబ్లీ ముందుంచాం. సభ్యుల అభిప్రాయాల ఆధారంగా ఎలాంటి చర్యలు తీసుకోవాలో సీఎం రేవంత్ ప్రకటిస్తారు" అని ఉత్తమ్ తెలిపారు.

కాళేశ్వరం అతిపెద్ద మానవతప్పిదం

కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం ప్రపంచంలోనే అతి పెద్ద మానవ తప్పిదమని ఉత్తమ్ విమర్శించారు. కాళేశ్వరానికి గుండెకాయలాంటి మేడిగడ్డ కూలడంతో రూ.21 వేల కోట్లు బూడిదలో పోసిన పన్నీరయ్యాయని ఆరోపించారు. 20 నెలలుగా అన్నారం సుందిళ్ల, మేడిగడ్డ నిరుపయోగంగా మారాయన్నారు. ప్రాణహిత-చేవెళ్లను 2013లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రారంభించిందని.. 2014నాటికి రూ.11 వేలకోట్లు ఖర్చుపెట్టారని ఉత్తమ్ గుర్తు చేశారు. రూ.38,500కోట్లతో పూర్తయ్యే ప్రాణహిత చేవెళ్లను అకారణంగా మార్చి కాళేశ్వరం చేపట్టారని తెలిపారు. ఏడాదికి 195 టీఎంసీలు ఎత్తిపోస్తామని చెప్పి.. ఐదేళ్లలో 125 టీఎంసీలు మాత్రమే ఎత్తిపోశారన్నారు. లక్ష కోట్లు ఖర్చుచేసినా ఐదేళ్లలో వాడుకున్న నీళ్లు 101 టీఎంసీలేనని, స్వతంత్ర దేశంలో ఇదో పెద్ద ఆర్థిక నష్టమని వ్యాఖ్యానించారు. కాళేశ్వరం నిర్వహణ పెనుభారంగా మారిందని, విద్యుత్ శాఖకు రూ.9,735కోట్లు చెల్లించాల్సి ఉందని వివరించారు. బీఆర్ఎస్ కట్టిన ప్రాజెక్టు వారి హయాంలోనే కూలడంతో.. ప్రజలు నవ్వుకుంటున్నారన్నారు. తప్పు చేసిన వారెవరైనా సిగ్గుపడతారని, కానీ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు దబాయిస్తున్నారని విమర్శించారు.

హరీశ్‌రావు కాదు.. కాళేశ్వర్ రావు!

- కాళేశ్వరం ప్రాజెక్టులాగే కుంగిపోతూ నిటారుగా నిలబడలేకపోతున్నారు: భట్టి విక్రమార్క




హైదరాబాద్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టును ఆయనే ముందుండి నిర్మింపజేశారని అప్పటి ప్రభుత్వ పెద్దలు హరీశ్‌రావుకు 'కాళేశ్వర్‌రావు' అనే పేరు పెట్టారని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. ఇప్పుడు జస్టిస్ ఘోష్ నివేదికను చూశాక హరీశ్‌రావు ఆ కాళేశ్వరం ప్రాజెక్టులాగే కుంగిపోతూ.. కూలిపోతూ.. నిటారుగా నిలబడలేక.. వాస్తవాలు చెప్పలేక ఇబ్బంది పడుతున్నారని ఎద్దేవా చేశారు. ఆదివారం అసెంబ్లీలో భట్టి మాట్లాడుతూ "హరీశ్‌రావు రాష్ట్ర ప్రజలను పక్కదోవ పట్టించాలని చూస్తున్నారు. సభలో ఎప్పుడు చర్చ జరిగినా ఆయన వాస్తవాలు మాట్లాడరు. తప్పుడు కాగితాలు సృష్టిస్తారు. ఏ అంశం తీసుకున్నా అది తప్ప మిగతావి మాట్లాడతారని విమర్శించారు. వంద సంవత్సరాల క్రితం నిర్మించిన నిజాంసాగర్, పోచారం వంటి ప్రాజెక్టులు భారీ వరదలను తట్టుకొని నిలబడ్డాయి కానీ లక్షన్నర కోట్లు వెచ్చించిన కాళేశ్వరం ప్రాజెక్టు ఒక్క ఎకరాకు నీరు ఇవ్వకుండానే కుంగిపోయిందన్నారు. "ఈ దోపిడీపై జ్యుడిషియల్ కమిషన్ రిపోర్టును చెత్త రిపోర్టు అంటారు. మరి మీరు దేనికి ఒప్పుకుంటారు హరీశ్‌రావు గారూ? మీరంతా అతీతులా, దైవాంశసంభూతులా? తప్పు చేయకపోతే ఘోష్ కమిషన్ నివేదికపై హైకోర్టుకు ఎందుకు వెళ్లారు?"అని ప్రశ్నించారు. తుమ్మిడిహట్టి వద్దే ప్రాజెక్టు నిర్మిస్తే దోపిడీ చేయడానికి వీలుండదని కాళేశ్వరాన్ని ముందుకు తెచ్చారని ఆరోపించారు. ఎత్తిపోసిన నీళ్ల కంటే కిందికి వదిలినవే ఎక్కువని, కాళేశ్వరం ద్వారా నీళ్లు ఎత్తిపోయడానికి విద్యుత్ బిల్లులు రూ.12 వేల కోట్లు అయ్యాయన్నారు. "కేసీఆర్ చెప్పారు.. హరీశ్‌రావు కట్టారు. మేం ఇందిరమ్మ ఇల్లు కట్టాలన్నా ఇంజనీరు సలహా తీసుకుంటాం. కానీ లక్షన్నర కోట్లు వెచ్చించిన ప్రాజెక్టు ఇంజనీర్లు ఇచ్చిన డిజైన్‌ను హరీశ్‌రావు పెద్ద ఇంజనీరులాగా మార్చేసి కట్టడం వల్లే ఈ ప్రమాదం ముంచుకొచ్చింది"అని మండిపడ్డారు. ఘోష్ కమిషన్ నివేదికను అసెంబ్లీలో ప్రవేశపెడితే తలెత్తుకోలేమని బీఆర్ఎస్ నేతలు కోర్టుకు వెళ్లారన్నారు. బీఆర్ఎస్ నేతలు కృష్ణా, గోదావరిపై ఏ ప్రాజెక్టునూ వదల్లేదని, చీల్చిచెండాడారని వ్యాఖ్యానించారు. "కాళేశ్వరం ప్రాజెక్టుపై ఏం చేయాలో నిర్ణయం తీసుకునేందుకు సభలో ఘోష్ కమిషన్ నివేదికను అసెంబ్లీలో ప్రవేశపెట్టాం.. చర్చించాం. ఏం చేద్దామని రాష్ట్ర ప్రజలను అడుగుతున్నాము"ని భట్టి పేర్కొన్నారు. బీఆర్ఎస్ నేతలు జస్టిస్ ఘోష్‌పై అభాండాలు వేయడం తగదన్నారు. మాజీ సీఎం కేసీఆర్ సభకు వచ్చి సమాధానం చెబితే బాగుండేదని సూచించారు. పదేళ్ల తమకు మైక్ ఇవ్వకపోయినా అడిగి అడిగి అలిసిపోయామే తప్ప సభను వదిలిపెట్టి ఏనాడూ పోలేదన్నారు. కేవలం ఐదుగురు సభ్యులం పదేళ్ల పాటు పోరాటం చేశామని గుర్తుచేశారు.

కేసీఆర్ పాపమే



(మొదటిపేజీ తరువాయి)



నిర్ణయం అని నిర్ధారించింది. కేసీఆర్‌పై చట్ట ప్రకారం తగిన చర్యలు తీసుకునే స్వేచ్ఛ రాష్ట్ర ప్రభుత్వానికి ఉందని స్పష్టం చేసింది. ప్రభుత్వం ఆదేశించిందన్న కారణంతో తప్పిదాలకు పాల్పడ్డ అధికారులను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించరాదని.. వారిని శిక్షించాల్సిందేనని సిఫారసు చేసింది. మూడు బ్యారేజీల నిర్మాణం ప్రారంభమైన నాటి నుంచి కుంగే దాకా ప్లానింగ్, టెండరింగ్, పర్యవేక్షణలో విచ్చలవిడితనం, ఆర్థికపరమైన అవకతవకలు జరిగాయని కమిషన్ గుర్తు చేసింది. కాళేశ్వరం బ్యారేజీల నిర్మాణానికి మంత్రివర్గ ఉపసంఘం సిఫారసు చేసిందన్న కేసీఆర్, హరీశ్, ఈటల వాదనను కమిషన్ తప్పుబట్టింది. 2016 మార్చి 7న మంత్రివర్గ ఉపసంఘాన్ని నియమిస్తే.. అంతకు ముందే.. 2015 ఏప్రిల్ 13న మేడిగడ్డ (కాళేశ్వరం) నిర్మాణానికి సవివర ప్రాజెక్టు నివేదికను సిద్ధం చేసే పనిని జీవోనెం.212 ద్వారా వ్యాప్కోస్‌కు అప్పగించారని గుర్తుచేసింది. ఈ ఈ నోట్ ఫైల్‌ను 2016 జూన్ 3న నాటి సీఎం కేసీఆర్, నీటిపారుదల మంత్రి హరీశ్‌రావు ర్యాటిఫై చేస్తూ సంతకాలు కూడా చేశారని గుర్తుచేసింది. ర్యాటిఫై చేయడానికి ముందే.. డీపీఆర్ కోసం సవరించిన పరిపాలనపరమైన అనుమతిని 2016 జనవరి 18న ఇచ్చారని పేర్కొంది. డీపీఆర్‌లో కొంతభాగాన్ని 2016 జనవరి 17న జరిగిన సమావేశంలో ఆమోదించారని.. ఆ వివరాలు ప్రభుత్వం వద్ద లేవని పేర్కొంది. 2023 అక్టోబరులో మేడిగడ్డ బ్యారేజీ కుంగగా.. తర్వాత కొద్దిరోజులకే అన్నారం, సుందిళ్ల బ్యారేజీల్లో సీపేజీలు బయటపడ్డ సంగతి తెలిసిందే. అనంతరం రాష్ట్రంలో కొలువుదీరిన కాంగ్రెస్ సర్కారు దీనిపై జస్టిస్ పినాకీ చంద్రఘోష్ నేతృత్వంలో విచారణ కమిషన్ ఏర్పాటు చేసింది. ఆ కమిషన్ ఇచ్చిన నివేదికను ఆదివారం శాసనసభలో బహిర్గతం చేసింది.

కేసీఆర్, హరీశ్ సంతకాలే.. ఈటల సంతకమేదీ?

కాళేశ్వరం ప్రాజెక్టు బ్యారేజీల విషయంలో కేసీఆర్ ముఖ్యమంత్రిలాగా కాకుండా ఇంజనీర్‌లాగా నిర్ణయం తీసుకున్నారని ఘోష్ కమిషన్ నివేదిక నిగ్గుతేల్చింది. బ్యారేజీలు ఎక్కడ కట్టాలనే విషయంతోపాటు.. వాటి అలైన్‌మెంట్ ప్రణాళిక, ఎంత సామర్థ్యంతో కట్టాలనే నిర్ణయం తీసుకోవడానికి గూగుల్ మ్యాప్‌లు కూడా వాడారని చెప్పింది. దీనిపై 2016 మార్చి 7న వేసిన మంత్రివర్గ ఉపసంఘం కూడా.. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణానికి సిఫారసు చేయలేదని కమిషన్ నిగ్గుతేల్చింది. సీఎం, మంత్రి మాత్రమే సంతకాలు చేశారని, వ్యాప్కోస్‌కు పని అప్పగింత నిర్ణయాన్నీ మంత్రివర్గం ఆమోదించలేదని గుర్తు చేసింది. బ్యారేజీల నిర్మాణాలకు సంబంధించిన నోట్ ఫైళ్లలోనూ కేసీఆర్, హరీశ్‌రావు సంతకాలు మాత్రమే ఉన్నాయని, ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్ సంతకం కనబడలేదని కమిషన్ గుర్తు చేసింది. బ్యారేజీల నిర్మాణ అంచనాలను సిద్ధం చేయాలని 2016 జనవరి 17న కేసీఆర్ ఆదేశాలు ఇవ్వగా.. ఐబీఎం కమిటీ అదే సంవత్సరం ఫిబ్రవరి 11న అంచనాలను ఆమోదించిందన్నారు. మంత్రివర్గ ఆమోదం లేకుండానే.. 2016 మార్చి 1న మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలకు పాలనపరమైన అనుమతులిచ్చారని తేల్చింది. డ్యామ్ బ్రేక్ అనాలసిస్ పనులను రూ.0.708 కోట్లతో చేపట్టడానికి ఈఎన్‌సీ మురళీధర్, కాళేశ్వరం ఈఎన్‌సీ నల్లా వెంకటేశ్వర్లు ప్రతిపాదనలు పంపిస్తే.. నాటి సీఎం కేసీఆర్, మంత్రివర్గ ఆమోదం, ర్యాటిఫికేషన్ లేకుండానే ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఉత్తర్వులు ఇచ్చారని గుర్తు చేసింది.

ముందే నిర్ణయం తీసుకొని..

విచారణకు హాజరైన కేసీఆర్, హరీశ్‌రావు చెప్పినవన్నీ అవాస్తవాలేనని కమిషన్ తన నివేదికలో పేర్కొంది. కాళేశ్వరం బ్యారేజీల నిర్మాణంపై వ్యాప్కోస్ నివేదిక ఇచ్చాకే నిర్ణయం తీసుకున్నట్టు ఇద్దరూ చెప్పారని, కానీ వాస్తవానికి తుమ్మిడిహెట్టి, మేడిగడ్డ వద్ద బ్యారేజీ నిర్మాణం కోసం 2016 మార్చి 8న మహారాష్ట్ర, తెలంగాణ సీఎంల మధ్య అంగీకారం కుదిరితే.. మూడు బ్యారేజీల నిర్మాణం కోసం అంతకంటే ముందే 2016 మార్చి 1న పాలనపరమైన అనుమతుల జీవో ఇచ్చారని, 2016 మార్చి 14న బడ్జెట్ ప్రసంగంలో ప్రకటన చేశారని.. తుది డీపీఆర్‌ను వ్యాప్కోస్ 2016 మార్చి 27న సమర్పించిందని కమిషన్ గుర్తుచేసింది. తుమ్మిడిహెట్టి వద్ద బ్యారేజీ నిర్మాణానికి మహారాష్ట్ర అంగీకరించలేదనేది వాస్తవం కాదని, బ్యారేజీని 148 మీటర్లతో కట్టుకోవడానికి సమ్మతి తెలిపిందని పేర్కొంది. కాళేశ్వరం బ్యారేజీల నిర్మాణ ఆలోచన కేసీఆర్‌దేనని, ప్రాణహిత-చేవెళ్ల రీ ఇంజనీరింగ్ నుంచి వ్యాప్కోస్‌కు నామినేషన్ విధానంలో డీపీఆర్ తయారీ బాధ్యతలు అప్పగించడం, అంచనాలను సవరించడం, మంత్రివర్గం ఆమోదం లేకుండా నిర్ణయాలు తీసుకోవడం, బ్యారేజీల్లో నీటిని నిల్వ చేసే ఉంచాలని ఆదేశాలు జారీ చేయడం, బ్యారేజీ నిర్మాణ పనులను ఎప్పటికప్పుడు పరిశీలించి, ఆదేశాలు ఇవ్వడం, నిర్వహణతో పాటు చివరికి బ్యారేజీల వైఫల్యంలో కేసీఆర్‌దే ప్రధాన పాత్ర ఉందని స్పష్టం చేసింది. బ్యారేజీల నిర్మాణ ప్రదేశాలను ఎంపిక చేసింది కేసీఆర్ కాగా.. ఆర్థిక మంత్రిగా ఉన్న ఈటల రాజేందర్ నిశ్శబ్ద నేరస్తుడిలాగా దీనికి సహకరించారని, కేసీఆర్ కలను నిజం చేసే బాధ్యతను హరీశ్‌రావు నిర్వర్తించారని కమిషన్ గుర్తు చేసింది.

నిపుణుల కమిటీ నివేదికను దాచి..

జీవో 28 ద్వారా 2015 జనవరి 21న ఏర్పాటు చేసిన మాజీ ఇంజనీర్లతో కూడిన నిపుణుల కమిటీ.. మేడిగడ్డ బ్యారేజీ నిర్ణయం ఏమాత్రం సహేతుకం కాదని, ఆర్థికంగా లబ్ధి చేకూరదని.. బదులుగా ప్రాణహితపై వేమనపల్లి వద్ద బ్యారేజీ కట్టాలని సిఫారసు చేసిందని కమిషన్ గుర్తు చేసింది. ఆ నివేదికను దాచిపెట్టి, మేడిగడ్డ నిర్మాణంపై నిర్ణయం తీసుకున్నారని పేర్కొంది. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలు కట్టాలని హైపవర్ కమిటీ సిఫారసు చేయనే లేదని, కమిటీ సిఫారసులతోనే నిర్ణయం తీసుకున్నారనేది అవాస్తవమని పేర్కొంది.

సీడబ్ల్యూసీ ఆమోదానికి ముందే

కాళేశ్వరం ప్రాజెక్టు డీపీఆర్‌ను ఆమోదం కోసం 2017 ఫిబ్రవరిలో దాఖలు చేయడానికి దాదాపు 11 నెలల ముందే బ్యారేజీల నిర్మాణాలకు పాలన అనుమతులు ఇచ్చారని.. 2016 జూలై/ఆగస్టులో నిర్మాణ సంస్థలతో ఒప్పందం కూడా చేసుకున్నారని కమిషన్ తేల్చింది. కాళేశ్వరం డీపీఆర్‌ను ఆమోదించడానికి ముందే 2018 మార్చి నాటికే రూ.30,653 కోట్లను వెచ్చించారని గుర్తు చేసింది. 2018 ఏప్రిల్ 13, అదే సంవత్సరం మే 11న కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) రాసిన లేఖలు పరిశీలిస్తే... కేవలం బెనిఫిట్ కాస్ట్ రేషియోకే సీడబ్ల్యూసీ ఆమోదం ఉందని తెలిపింది. బ్యారేజీల నిర్మాణ స్థలాలపై సెంట్రల్ సాయిల్ అండ్ మెటీరియల్ రిసెర్చ్ స్టేషన్ కూడా తమ పరిశీలనలు ఇవ్వడానికి నిరాకరించిందని, 2018 మే 21న సీఎస్ఎంఆర్ఎస్ లేఖను పరిశీలిస్తే.. ఆ విభాగం పరిశీలనకు ముందే నిర్మాణ పనులు దాదాపుగా పూర్తికావొచ్చాయని పేర్కొన్నారు. ప్రాజెక్టు చేపట్టిన మూడేళ్ల లోపు అంచనాలను సవరించరాదని సీడబ్ల్యూసీ పేర్కొనగా.. ప్రాజెక్టు చేపట్టిన మూడేళ్లలోపే 2018, 2022లో రెండుసార్లు నిర్మాణ అంచనాలను సవరిస్తూ పరిపాలనపరమైన అనుమతినిచ్చారని గుర్తు చేసింది. ముఖ్యమంత్రికి, నీటిపారుదల శాఖకి నోట్‌ఫైల్ పంపించడానికి ముందే సవరించిన అంచనాలకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, నీటిపారుదల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి 2018 మే 19న ఆమోదించారని, క్యాబినెట్ మాత్రం 2018 మే 27న ఆమోదించిందని కమిషన్ పేర్కొంది. అంచనాలను అడ్డదిడ్డంగా సవరించినట్లు కమిషన్ గుర్తించింది. మేడిగడ్డతో ముడిపడిన పనులన్నీ పూర్తికాకముందే నిర్మాణం పూర్తయినట్లు సర్టిఫికెట్లు జారీ చేశారని గుర్తు చేసింది. బ్యారేజీ నిర్మాణంలో లోపాలు సవరించకుండానే సర్టిఫికెట్లు జారీ చేశారని తప్పుపట్టింది. సర్టిఫికెట్లు జారీ చేసి, మిగిలిన పనులు, లోపాలు సవరించాలని లేఖలు రాశారని.. మేడిగడ్డ నిర్మాణానికి వెచ్చించిన ప్రజాధనాన్ని నిర్మాణ సంస్థ, అధికారులు ఉద్దేశపూర్వకంగా, దురుద్దేశాలతో, కుట్రపూరితంగా కాజేశారనే ఆధారాలున్నాయని పేర్కొంది. బ్యారేజీల నిర్మాణం జరిగినప్పటి నుంచి అవి విఫలమయ్యేంతవరకూ ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ (ఓ అండ్ ఎం) పనులు జరగలేదని కమిషన్ గుర్తు చేసింది.

266 సార్లు కేసీఆర్ పేరు ప్రస్తావన

హరీశ్‌రావు పేరు 63 సార్లు..

665 పేజీల నివేదికలో కేసీఆర్ పేరును అత్యధికంగా 266 సార్లు ప్రస్తావించారు. ప్రాజెక్టు అంచనాలు పెంచడం, నిపుణుల సూచనలు పట్టించుకోకుండా ఏకపక్షంగా వ్యవహరించడం, నిబంధనలు పాటించకపోవడం, ప్రజాధనం దుర్వినియోగం చేయడం వంటి అనేక అంశాలకు సంబంధించి మొత్తం 19 పేజీల్లో కేసీఆర్ పేరు ప్రస్తావనకు వచ్చింది. అప్పటి మంత్రి హరీశ్ రావు పేరును నివేదికలో మొత్తం 63 సార్లు ప్రస్తావించారు. నివేదిక చివర్లో జస్టిస్ పీసీ ఘోష్ తన కార్యదర్శి ఎన్.మురళీధర్ రావుకు కృతజ్ఞతలు తెలిపారు. ఆయన సహాయం లేకుండా ఈ నివేదికను లోతుగా విశ్లేషించడం సాధ్యమయ్యేది కాదన్నారు. కాళేశ్వరంపై రాష్ట్ర ప్రభుత్వం జస్టిస్ ఘోష్ ఏకసభ్య విచారణ కమిషన్‌ను గతేడాది మార్చిలో నియమించగా.. జూలై 31న ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది.

బ్యారేజీల పేరుతో రిజర్వాయర్లు

పరీక్షలు లేకుండానే డిజైన్లు/డ్రాయింగ్‌లు

ప్రాణహిత-చేవెళ్ల ఎత్తిపోతల పథకంలో తుమ్మిడిహెట్టి వద్ద నీటి లభ్యత ఉన్నప్పటికీ లేనట్లు ప్రచారం చేశారని, సీడబ్ల్యూసీ నీటి లభ్యతపై రాసిన లేఖ మేడిగడ్డకు కూడా వర్తిస్తుందని కమిషన్ గుర్తు చేసింది. మేడిగడ్డ నిర్మాణ గడువును ఆరుసార్లు, అన్నారం పూర్తి చేసే గడువును ఐదుసార్లు, సుందిళ్ల నిర్మాణ గడువును ఎనిమిదిసార్లు పొడిగించారని గుర్తు చేసింది. వాటి డిజైన్లు/డ్రాయింగ్‌లను పరీక్షలు చేయకుండానే సిద్ధం చేశారని పేర్కొంది. నమూనా అధ్యయనాలు చేయడంలో టీఎస్ ఈఆర్ఎల్ పూర్తిగా విఫలమైందని.. బ్యాక్ వాటర్ అధ్యయనాలు, టెయిల్ వాటర్ రేటింగ్ కర్వ్, జీ-డీ కర్వ్‌లు, జియో టెక్నికల్ అధ్యయనాలు చేయకుండానే అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణస్థలాల్ని మార్చారని తప్పుపట్టింది. ఇక.. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలను తేలియాడే నిర్మాణం (పర్మియబుల్ ఫౌండేషన్)తో చేపట్టాలని వ్యాప్కోస్ నివేదిక ఇచ్చిందని.. నిర్మాణ ప్రదేశాలు రిజర్వాయర్లు/డ్యామ్‌లు కట్టడానికి అనుకూలం కాకపోయినా.. బ్యారేజీల పేరుతో రిజర్వాయర్లు/డ్యామ్‌లు కట్టారు అని గుర్తు చేసింది. బ్యారేజీలు నీటిని మళ్లించడానికేనని.. నీటి నిల్వ కోసం కాదని.. కానీ మేడిగడ్డ, అన్నారం, సుందిళ్లను నీటి నిల్వ కోసం వినియోగించారని తప్పుపట్టింది. బ్యారేజీలు వైఫల్యం చెందడానికి ఇదే ప్రధాన కారణమని పేర్కొంది.

కమిషన్‌కు తప్పుడు సాక్ష్యాలు

కాళేశ్వరం ప్రాజెక్టుపై 2016 అక్టోబరు 22న జరిగిన హైపవర్ కమిటీ సమావేశంలో తాను పాల్గొనలేదంటూ సీడీవో ఈఎన్‌సీ ఎ.నరేందర్‌రెడ్డి తప్పుడు వాంగ్మూలం ఇచ్చారని కమిషన్ గుర్తు చేసింది. ఈఎన్‌సీ బి.హరిరామ్, సీడీవో సీఈ టి.శ్రీనివాస్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఓంకార్ సింగ్ కూడా తప్పుడు వాంగ్మూలాలు ఇచ్చారని గుర్తు చేసింది.

డీపీఆర్ ఇవ్వడానికి వ్యాప్కోస్‌కు 11 నెలలు.. కేసీఆర్‌కు 15 రోజులు

కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణానికి సంబంధించి సవివర ప్రాజెక్టు నివేదిక తయారుచేసే పనిని కేంద్ర ప్రభుత్వ సంస్థ వ్యాప్కోస్‌కు 2015 ఏప్రిల్ 13న అప్పగించగా.. ఆ సంస్థ 11 నెలల సమయం తీసుకుని 2016 మార్చి 27న డీపీఆర్‌ను అందజేసింది. రూ.13,593.99 కోట్ల అంచనాలతో మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల అనే మూడు బ్యారేజీలను, ఎత్తిపోతల ద్వారా చేపట్టవచ్చని ఆ సంస్థ తెలిపినట్లు ఘోష్ కమిషన్ పేర్కొంది. వ్యాప్కోస్‌కు డీపీఆర్ చేయడానికి పది నెలలు పట్టగా.. పదిహేను రోజుల్లోనే కేసీఆర్ డీపీఆర్ ఆధారంగా ఐబీఎం కమిటీ మూడు బ్యారేజీలను ఆమోదించిందని కమిషన్ తన నివేదికలో వెల్లడించింది.

ఒప్పంద పత్రాల కోసం 3 కోట్లా!

రాష్ట్ర స్థాయి స్టాండింగ్ కమిటీ సుందిళ్ల బ్యారేజీకి సవరించిన అంచనాలను ఆమోదించింది. 2021 నవంబరు 18న.. సవరించిన అంచనా-2 అనుమతి కోసం ప్రభుత్వాన్ని కాళేశ్వరం ప్రధాన ఇంజనీరు కోరారు. 25న నీటిపారుదల శాఖ చీఫ్ ఇంజనీరు ప్రత్యేక కార్యదర్శికి లేఖ రాసి రూ.2225 కోట్ల రివైజ్డ్ అంచనాలను ఆమోదించాలని అభ్యర్థించారని కమిషన్ నివేదికలో తెలిపింది. నాన్ కాంట్రాక్ట్ ఐటెమ్స్ కింద రూ.5.88 కోట్లు చూపారని, అందులో రూ.3 కోట్లు ఒప్పంద పత్రాలు, ప్రకటనలు, స్టేషనరీ, కన్సల్టెన్సీ ఖర్చుల కింద చూపారని కమిషన్ నివేదికలో ప్రస్తావించింది.

గ్యారంటీ ఇచ్చినందున.. ప్రభుత్వమే చెల్లింపులు చేయాలి

కాళేశ్వరం ప్రాజెక్టు కోసం తీసుకున్న రుణాలకు ప్రభుత్వం పూచీ ఇచ్చినందున... రుణాల చెల్లింపు బాధ్యత ప్రభుత్వానిదేనని నాటి ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, ప్రస్తుత ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్‌కు నివేదించారు. ఆ విషయాన్ని కమిషన్ తన నివేదికలో పొందుపర్చింది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో వడ్డీల కింద రూ.6,519 కోట్లు, అసలు కింద రూ.7,382 కోట్లను కట్టామని.. కాళేశ్వరం రుణాల వార్షిక వడ్డీ రేటు 9 శాతం నుంచి 10.50 శాతం మధ్యలో ఉందని రామకృష్ణారావు పేర్కొన్నారు. కాళేశ్వరం కార్పొరేషన్ రుణ పరిమితి రూ.24 వేల కోట్లు ఉండగా... దాన్ని 2018లో రూ.64 వేల కోట్లకు, 2019లో రూ.95 వేల కోట్లకు, 2021లో రూ.1.31 లక్షల కోట్లకు చేర్చినట్లు కమిషన్‌కు నివేదించారు. కాళేశ్వరం కార్పొరేషన్ నుంచి కాళేశ్వరంతో పాటు పాలమూరు-రంగారెడ్డి, సదర్‌మట్ బ్యారేజీ పనులు పూర్తిచేసేందుకు రుణ పరిమితిని పెంచుకున్నామన్నారు. ఆర్థిక శాఖలో ఫైళ్ల క్లియరెన్స్‌కు ఆర్థిక మంత్రి ఆమోదం తీసుకుంటారా అని ప్రశ్నించగా... తీసుకుంటామని బదులిచ్చారు. ఏటా బడ్జెట్‌తో పాటు ఫిస్కల్ పాలసీ స్టేట్‌మెంట్ అసెంబ్లీకి సమర్పిస్తారా అని ప్రశ్నించగా... ఆ వివరాలు గుర్తు లేవు అని వివరించారు. కాగా.. రుణాలు సమీకరించడం, చెల్లింపుల కోసం చెక్కులు ఇవ్వడం తప్ప కాళేశ్వరం నిర్మాణంలో కార్పొరేషన్ పాత్రను ప్రభుత్వం విస్మరించిందని కమిషన్ పేర్కొంది. కార్పొరేషన్ చైర్మన్‌గా ఉన్న ఎస్‌కే జోషి కూడా వాస్తవాలు చెప్పలేదని తెలిపింది. కార్పొరేషన్ తన బాధ్యతను నిర్వర్తించలేదనే విషయాన్ని బోర్డు సభ్యుడుగా ఉన్న రామకృష్ణారావు గుర్తించలేదని పేర్కొంది.

29,737 కోట్లు చెల్లించాం: బి.హరిరామ్,మాజీ ఎండీ

కాళేశ్వరం కార్పొరేషన్ కింద రూ.87,449కోట్ల రుణం మంజూరు కాగా... 2024సెప్టెంబరు 25నాటికి రూ.29,737 కోట్ల చెల్లింపులు చేశామని, ఇంకా మిగిలిన అసలు రూ.64,212కోట్లు కాగా.. దీనిపై వడ్డీ రూ.41,638కోట్లుగా ఉంటుందని కాళేశ్వరం కార్పొరేషన్ అప్పటి ఎండీ బి.హరిరామ్ నివేదించారు. కార్పొరేషన్ ప్రారంభించినప్పుడు 3 బ్యారేజీల పరిస్థితి ఏమిటని కమిషన్ ఆరా తీయగా... పనులు జరుగుతున్నాయని హరిరామ్ వివరించారు.

గూగుల్ మ్యాపులు చూసి ప్రాజెక్టు లొకేషన్

కాళేశ్వరం అలైన్‌మెంట్, సామర్థ్యం.. నిర్మాణ రకాలు కూడా గూగుల్ మ్యాప్ ద్వారానే.. నాటి సీఎస్ జోషి అఫిడవిట్‌లో వెల్లడి

- డీపీఆర్ తయారీలోనూ కేసీఆర్ జోక్యం
- స్పష్టం చేసిన పీసీ ఘోష్ కమిషన్ నివేదిక

హైదరాబాద్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టును ఎక్కడ కట్టాలో గూగుల్ మ్యాపుల్లో చూసి నిర్ధారించారా? భారతదేశంలోనే అత్యంత ఖరీదైన ప్రాజెక్టుగా భావించే కాళేశ్వరం ప్రాజెక్టు అలైన్‌మెంట్, సామర్థ్యం, నిర్మాణ రకాలకు కూడా గూగుల్ మ్యాప్ పైనే ఆధారపడ్డారా? కాళేశ్వరాన్ని గత పాలకులు సాంకేతిక ప్రాజెక్టుగా కాకుండా.. రాజకీయ ప్రాజెక్టుగానే చూశారా? ఈ ప్రశ్నలకు జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదిక అవుననే చెబుతోంది. నాటి సీఎస్ ఎస్‌కే జోషి తమకు ఇచ్చిన అఫిడవిట్‌లో ఈ విషయాన్ని పేర్కొన్నట్లు చెప్పింది. ప్రాజెక్టు నిర్మాణంలో వేగంపై రాజకీయ ఒత్తిళ్లు, ఆర్థిక అజాగ్రత్తలు, భద్రత, ఫీజిబిలిటీని విస్మరించడం, ఇంజనీరింగ్ లోపాలు వెరసి.. ఘోర వైఫల్యానికి దారి తీసినట్లు స్పష్టంచేసింది. ఆ నివేదికలోని మరిన్ని ముఖ్యాంశాలు..

జోషి అఫిడవిట్‌లో గూగుల్ మ్యాప్‌ల అంశం

నాటి నీటి పారుదల శాఖ ముఖ్య కార్యదర్శి, ఆ తర్వాత ప్రధాన కార్యదర్శిగా సేవలందించిన ఎస్‌కే జోషి ఇచ్చిన అఫిడవిట్‌లో.. అప్పటి ముఖ్యమంత్రి(కేసీఆర్) ఆధ్వర్యంలో జరిగిన అనేక సమావేశాల్లో నిపుణులతో కలిసి గూగుల్ మ్యాప్‌ను విస్తృతంగా వినియోగించినట్లు ప్రస్తావించారు. గూగుల్ మ్యాప్‌ల ద్వారానే ప్రాజెక్టు అలైన్‌మెంట్, లొకేషన్, సామర్థ్యం, నిర్మాణ రకాలను పరిశీలించి, ప్రణాళికలను సిద్ధం చేశారని పేర్కొన్నారు. ఆ సమావేశాల్లో వాప్కోస్ ఇంజనీర్లు కూడా పాల్గొన్నారు. నిజానికి 2015 జనవరి 15న ఏర్పాటు చేసిన నిపుణుల కమిటీ మేడిగడ్డ వద్ద బ్యారేజీ ఏమాత్రం ఆమోద యోగ్యం కాదని స్పష్టం చేసింది. దాని బదులు ప్రాణహిత నదిపై.. వేమనపల్లి వద్ద బ్యారేజీ నిర్మాణానికి సిఫార్సు చేసింది. మేడిగడ్డ వద్ద బ్యారేజీ నిర్మాణంతో ఆర్థిక నష్టాలు తప్పవని తెలిసీ.. సీఎం కేసీఆర్ అక్కడే నిర్మాణానికి ఆదేశాలు జారీ చేశారు. దీనికి నాటి సీఎస్ ఎస్‌కే జోషి, ఉన్నతాధికారులు సి.మురళీధర్, బి.హరిరామ్ బాధ్యులు. వాప్కోస్ డీపీఆర్ అంచనా వ్యయం(రూ.13,594 కోట్లు) చెప్పక ముందే.. సీఎం కేసీఆర్ రూ.71,436 కోట్లు అవుతుందని ప్రకటించారు. నిపుణుల కమిటీ నివేదికకు 46 రోజుల ముందే కేసీఆర్ భారీ అంచనాలతో ఈ ప్రకటన చేయడానికి ఆధారం, ప్రాతిపదిక ఏమిటో తెలియడం లేదు. ఈ ప్రాజెక్టు విషయంలో పేరు కమిటీదే అయినా.. నిర్ణయం మాత్రం కేసీఆర్‌దే. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల డిజైన్లకు సంబంధించి ఇంజనీర్లు ఇచ్చిన అఫిడవిట్లలో డిజైన్ల గురించి భిన్నాభిప్రాయాలను వ్యక్తంచేశారు. మూడు



బ్యారేజీల డిజైన్లు తెలంగాణ నీటిపారుదల శాఖ పరిధిలోని 'కేంద్ర డిజైన్ విభాగం' ఇచ్చిన ప్రకారమే ఉన్నాయని చెప్పారు. చీఫ్ ఇంజనీరు ఎన్వీ వెంకటేశ్వరరావు వాగ్మూలంలో, కాంట్రాక్టు సంస్థల అఫిడవిట్లలో మాత్రం 'సెంట్రల్ డిజైన్ ఆర్గనైజేషన్' నుంచి డిజైన్లు, డ్రాయింగ్‌లు ఇవ్వడంలో జాప్యం జరిగినట్లు ఉంది. నిర్మాణ ఏజెన్సీలు ఇచ్చిన లేఖలకు శాఖాపరమైన సమాధానాలు సత్వరమే అందివ్వలేదు. మేనేజ్‌మెంట్ సమావేశానికి సంబంధించిన రికార్డులు లేవు.

తొలి దశలో బయటపడ్డ లోపాలు

టర్న్‌కీ విధానంలో కాకుండా గుంపగుత్తగా పనులను కేటాయించడం వల్ల.. డిజైన్, డ్రాయింగ్, నాణ్యత విషయంలో కాంట్రాక్టర్ సంస్థ బాధ్యత తీసుకోలేదు. డిజైన్లు పూర్తికాకముందే కాంట్రాక్టులు ఇవ్వడం, పరిశోధనల ఫలితాలు రాకముందే పనులు ప్రారంభించడంతో ప్రాజెక్టు నిర్మాణం, నాణ్యతపై అనేక అనుమానాలు తలెత్తుతున్నాయి. ప్రాజెక్టు అధికారులే డ్రాయింగ్‌లు, డిజైన్లు ఇచ్చారు. సమయానికి భూములు ఇవ్వలేకపోయామని, డిజైన్లు, డ్రాయింగుల్లో జాప్యం జరిగిందని, దీని వల్ల ఏజెన్సీలు కోరినట్లు అదనపు సమయం(ఎక్స్‌టెన్షన్ ఆఫ్ టైం-ఈవోటీ) ఇచ్చామని ఇంజనీర్లు కూడా తెలిపారు. తప్పు ప్రభుత్వం వైపు ఉన్నందున.. ఈవోటీకి ఎలాంటి పెనాల్టీ విధించలేదని చెప్పారు. లోపాలకు కారణం అధికారులే. 2016లోనే కాంట్రాక్టు ఇచ్చినా.. మొదటి డ్రాయింగ్‌ను పూర్తిస్థాయిలో కాకుండా.. 'కేవలం నమూనా అధ్యయనం కోసం మాత్రమే' అనే నోట్‌తో 2017లో అందజేశారు. ప్రాజెక్టు నిర్మాణానికి ముందే అత్యంత కీలకమైన డ్రాయింగ్, డిజైన్లు సిద్ధం కావాల్సి ఉన్నా.. 2017, 2018లో విడతల వారీగా డ్రాయింగ్‌లు ఇచ్చారు. కొన్ని డ్రాయింగ్‌లను 'మోడల్ స్టడీ' కోసమే ఇచ్చి.. చివర్లో సవరణలతో అందజేశారు. ఎన్ఐటీ-వరంగల్, ఐఐటీ-మద్రాస్ వంటి సంస్థల నుంచి అధ్యయనాల నివేదికలు రాక ముందే.. నిర్మాణ పనులను ప్రారంభించారు. ఫలితంగా బ్లాకులు కుంగిపోవడం, పిల్లర్లకు పగుళ్లు రావడం జరిగింది. ప్రతీ పనిలో జాప్యం వల్ల నిర్మాణ వ్యయం పెరిగింది. ఫ్లడ్ బ్యాంకులు, మళ్లింపు చానల్ వంటి కొత్త పనులు చేయడం నిధుల దుర్వినియోగానికి కారణం.

మితిమీరిన రాజకీయ జోక్యం

ఎన్నికలలోపు.. పనులను వేగంగా పూర్తిచేయాలంటూ ప్రభుత్వం మితిమీరిన రాజకీయ జోక్యం చేసుకోవడం ప్రాజెక్టు నాణ్యతను దెబ్బతీసింది. 6-7 ఏళ్లు పట్టే ప్రాజెక్టు నిర్మాణాన్ని 2-3 ఏళ్లల్లోనే పూర్తి చేశారు. ముఖ్యమంత్రే స్వయంగా డిజైన్లలో మార్పులు చేశారు. డీపీఆర్ తయారీలో, తుది నిర్ణయాల్లో జోక్యం చేసుకున్నారు. గూగుల్ మ్యాప్స్ ఆధారంగా లొకేషన్ ఎంపిక చేశారు. ప్రభుత్వ ఒత్తిడి వల్ల నిర్మాణ సంస్థలు నాణ్యతను గాలికొదిలేశాయి. క్యూరింగ్‌కు సమయం ఇవ్వలేదు. రీ-ఇన్‌ఫోర్స్‌మెంట్ ఉల్లంఘనలు జరిగాయి. పరీక్షల్లేకుండా కాంక్రీట్ పోర్సు పూర్తిచేశారు. దీని వల్ల భవిష్యత్తులో వరదలొస్తే.. బ్యారేజీ తీవ్ర ఒత్తిడికి గురవుతుంది. పునాది బలహీనంగా ఉండటం చీలికలతోపాటు.. కొన్ని సమయాల్లో పెద్ద నష్టం వాటిల్లవచ్చు. మరమ్మతులు, నిర్వహణ ఖర్చులు ఏటా పెరుగుతాయి. పాలకులు దీన్ని సాంకేతిక ప్రాజెక్టు కంటే.. రాజకీయ ప్రాజెక్టుగానే చూశారు. రూ.80 వేల కోట్లతో ప్రారంభమైన ప్రాజెక్టు అంచనా వ్యయం.. రూ.1.20 లక్షల కోట్లకు చేరింది. ప్రాజెక్టు నిర్మాణం కోసం ప్రజలపై అప్పుల భారం పడింది. ప్రాజెక్టు నిర్వహణకు విద్యుత్తు బిల్లులు భారంగా మారాయి. సాగు నీరందించడమే ప్రధాన లక్ష్యంగా మొదలైన ఈ ప్రాజెక్టులో.. చాలాచోట్ల కాలువలు పూర్తికాలేదు. ఫలితంగా రైతులు లబ్ధిపొందలేకపోయారు. నది సహజ ప్రవాహాన్ని మార్చడం వల్ల వరద ప్రభావిత ప్రాంతాలు పెరిగాయి. కొన్ని గ్రామాలు తరచూ నీటమునిగే పరిస్థితి నెలకొంది. ప్రాజెక్టు కోసం అటవీ భూములను సేకరించారు. పర్యావరణ అనుమతులున్నప్పటికీ.. ఆచరణలో వాటిని ఉల్లంఘించారు.

ఈటలది బాధ్యతారాహిత్యం.. తప్పుడు సమాచారం



కాళేశ్వరం ప్రాజెక్టుకు పాలనాపరమైన అనుమతుల విషయంలో నాటి ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్ ఇచ్చిన వాగ్మూలం అసత్యం. మూడు బ్యారేజీల నిర్మాణం ఎవరి నిర్ణయం అని ప్రశ్నించగా.. క్యాబినెట్ సబ్-కమిటీ సాంకేతిక నివేదికను పరిశీలించి.. క్యాబినెట్ ఆమోదించిందని చెప్పారు. రికార్డులను పరిశీలిస్తే.. పరిపాలన అనుమతుల ఉత్తర్వులు(జీవోలు 231, 232, 233) 2016 మార్చి 1న వెలువడ్డాయి. అయితే.. 2016 మార్చి 15న మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటైంది. అదే ఏడాది మార్చి 27, ఏప్రిల్ 5, 9 తేదీల్లో ఈ ఉపసంఘం భేటీ అయ్యింది. ఆ తర్వాత నివేదిక ఇచ్చింది. ఈ వాస్తవాలను పరిశీలిస్తే.. ఈటల తప్పుడు సమాచారం ఇచ్చారని స్పష్టమవుతోంది. నిజానికి మంత్రివర్గ ఉపసంఘం మూడు బ్యారేజీల నిర్మాణానికి సిఫార్సు చేయలేదు. డీపీఆర్ కోసం రూ.594.45 కోట్ల మేర వాప్కోస్‌కు జరిపిన చెల్లింపుల గురించి తెలుసా? అని ప్రశ్నించగా.. ఈటల తెలియదని సమాధానమిచ్చారు. దీన్నిబట్టి ఆర్థిక మంత్రిగా తన బాధ్యతలపై ఆయనకు అవగాహన లేదనేది స్పష్టమవుతోంది. ఈటల వాంగ్మూలం ప్రకారం ఈ ప్రాజెక్టు అంచనా వ్యయం రూ.63 వేల కోట్లు. భూసేకరణలో జాప్యం వల్ల ఆ అంచనాలు రూ.80వేల కోట్ల నుంచి రూ.85 వేల కోట్లకు పెరిగాయి. ప్రాజెక్టుకు అవసరమయ్యే నిధులు, అప్పుల బాధ్యతను కాళేశ్వరం ఇరిగేషన్ ప్రాజెక్ట్ కార్పొరేషన్ లిమిటెడ్(కేఐపీసీఎల్) తీసుకుంది. కార్పొరేషన్ తీసుకున్న రుణాలకు ప్రభుత్వం హామీ ఇచ్చింది. అసలు రుణభారాన్ని నాటి ప్రభుత్వం దాచిపెట్టింది. బయట నుంచి తీసుకొచ్చే అప్పుల గురించి బడ్జెట్‌లో ప్రస్తావించలేదు. అప్పట్లో ఆర్థిక మంత్రిగా ఉన్న ఈటల ఈ మొత్తం వ్యవహారం తనకు తెలియదని చెప్పడం బాధ్యతారాహిత్యమే.

క్యాబినెట్ ముందుంచాం.. ఏమో తెలియదు!

కమిషన్ ప్రశ్నలకు స్మిత సభర్వాల్ భిన్న సమాధానాలు

హైదరాబాద్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): అన్నారం, సుందిళ్ల, మేడిగడ్డ బ్యారేజీల నిర్మాణ ప్రతిపాదనలు, నిర్ణయాలకు సంబంధించిన అంశాలు క్యాబినెట్ ముందు పెట్టారా? అని పీసీ ఘోష్ కమిషన్ ప్రశ్నించగా.. మాజీ ముఖ్యమంత్రి కార్యదర్శిగా కీలక హోదాలో పనిచేసిన స్మితా సభర్వాల్ పరస్పర భిన్నమైన సమాధానాలిచ్చారు. మూడు బ్యారేజీల ప్రతిపాదనలకు సంబంధించిన అన్ని అంశాలను క్యాబినెట్ ముందు పెట్టామని తొలుత సమాధానమిచ్చిన స్మిత.. జీవో 776లో ఆ ప్రస్తావనే లేదన్న అంశాన్ని ప్రస్తావిస్తూ క్రాస్ ఎగ్జామినేషన్ చేయగా మాట మార్చి తనకేం తెలియదని బదులిచ్చినట్లు పీసీ ఘోష్ నివేదిక పేర్కొంది. మూడు బ్యారేజీల నిర్మాణంలో స్మిత పాత్ర కీలకమని వెల్లడించింది. సీఎం కార్యదర్శిగా కీలక స్థానంలో ఉండి అనేక అంశాల్లో ఆమె తన విధులను విస్మరించారని, పూర్తిగా నిర్లక్ష్యం వహించారని



ఘాటుగా వ్యాఖ్యానించింది. ఆమెపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరింది. "మూడు బ్యారేజీల ప్రణాళిక, రూపకల్పన, నిర్మాణంలో నాకు ఎలాంటి సంబంధం లేదు. పర్యవేక్షణ, నాణ్యతలోనూ నా పాత్ర లేదు. ముఖ్యమంత్రి అనుమతి కోసం వెళ్లే దస్త్రాలను పరిశీలించడం, సీఎంకు వివరించడం, లోపాలుంటే ఆయన దృష్టికి తీసుకెళ్లడమే నా బాధ్యత. జిల్లాల పర్యటనలకు వెళ్లి కలెక్టర్లతో సమావేశం కావడం, క్షేత్రస్థాయి పరిస్థితిని సీఎంకు తెలుపడమే నాకు కేటాయించిన బాధ్యతలు" అని విచారణ సందర్భంగా ఆమె జవాబు ఇచ్చినట్లు నివేదిక తెలిపింది. మూడు బ్యారేజీలకు సంబంధించి మొత్తం 11 ప్రశ్నలు సంధించగా.. అత్యధిక ప్రశ్నలకు ఆమె 'తెలియదు' అని సమాధానమిచ్చినట్లు పేర్కొంది. అయితే, ఆమె చెప్పిన సమాధానాలన్నీ తప్పని పేర్కొన్న కమిషన్.. సీఎం ప్రత్యేక కార్యదర్శి హోదాలో నీటి పారుదల శాఖ క్షేత్రస్థాయి అధికారులకు ఆమె రాసిన లేఖలు, జరిపిన సమీక్షలు, ఇచ్చిన ఆదేశాలను నివేదికలో పొందుపర్చింది. ఇన్ని ఆధారాలున్నా.. బ్యారేజీల నిర్మాణంలో తన పాత్ర లేదంటూ ఆమె బుకాయించారని కమిషన్ తప్పుపట్టింది.

ష్.. ఇప్పుడేం మాట్లాడొద్దు!

- ఘోష్ కమిషన్ నివేదికపై విపక్ష నేతల సీరియస్ కసరత్తు

హైదరాబాద్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): 'ష్.. ఇప్పుడేం మాట్లాడొద్దు.. నివేదిక చదువుతున్నాం' ..ఇదీ ఆదివారం అసెంబ్లీలో ఎవరిని కదిలించినా వినిపించిన మాట! విపక్ష నేతల వద్దకు వెళ్లినా అదే మాట.. అధికార పార్టీ ఎమ్మెల్యేలు, మంత్రులదీ.. పాత్రికేయులది సైతం అదే బాట!! పరీక్షకు గంట ముందు, పరీక్ష కేంద్రానికి వెళ్లే దారిలో, ఎగ్జామ్ సెంటర్‌కు వెళ్లాక కూడా.. యమా సీరియస్‌గా చదివేస్తుంటారు కొందరు విద్యార్థులు! ఏడాది మొత్తం చదువునూ ఆ చివరి నిమిషంలో బుర్రలోకి ఎక్కించుకునే ప్రయత్నం చేస్తుంటారు!! ఆదివారం శాసనసభ ప్రాంగణంలో అలాంటి దృశ్యాలే కనిపించాయి. 600కు పైగా పేజీలున్న జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదికను ఉదయం 9.30 గంటల సమయంలో.. అసెంబ్లీ సిబ్బంది ఎమ్మెల్యేలకు పెన్‌డ్రైవ్‌లో అందించారు. ఆ నివేదిక కాపీలను.. బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు ఆగమేఘాలపై ప్రింట్ తీయించుకుని, ముఖ్యమైన అంశాలను ప్రత్యేకంగా నోట్ చేసుకున్నారు. నివేదికలో ఏయే అంశాలున్నాయి.. ఏ పేజీలో ఏ కీలక అంశం ఉంది.. వాటికి తాము ఎలా సమాధానమివ్వాలి? సభలో తాము ప్రస్తావించిన విషయాలేమిటి? అనే అంశాలపై తీవ్ర కసరత్తు చేశారు. బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి కూడా తన చాంబర్‌లో ఏకాంతంగా కూర్చుని నివేదికను ఏకాగ్రతతో చదివారు. మంత్రులు, అధికార పార్టీ ఎమ్మెల్యేలు కూడా ఆసక్తిగా కమిషన్ నివేదికను చదివారు. బీఆర్ఎస్ ప్రభుత్వ వైఖరిపై కమిషన్ ఎలా స్పందించిందనే అంశంపై వారు దృష్టి సారించారు.

30 లోపు స్థానిక సంస్థల ఎన్నికలు

» మంత్రి కోమటిరెడ్డి



హైదరాబాద్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికలు సెప్టెంబరు 30 లోపు నిర్వహించనున్నట్లు మంత్రి కోమటిరెడ్డి వెంకట రెడ్డి తెలిపారు. ఈ మేరకు 10వ తేదీ తర్వాత నోటిఫికేషన్ విడుదలయ్యే అవకాశం ఉందని చెప్పారు. మొదట ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు జరుగుతాయన్నారు. ఆదివారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, నల్లగొండ జిల్లాకు నీళ్లు రాకుండా బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి అడ్డుకున్నారని ఆరోపించారు. డిమాండ్‌కు అనుగుణంగా కేంద్రం నుంచి యూరియా అందకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు.

మంత్రి పదవి రేసులో నేనున్నా: మల్‌రెడ్డి రంగారెడ్డి

మంత్రి పదవి రేసులో తానూ ఉన్నానని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. అజారుద్దీన్ మంత్రి అయితే తమకేం ఇబ్బంది లేదని, ఆయన మైనారిటీ కోటా లేదా హైదరాబాద్ కోటాలో మంత్రి పదవి పొందే అవకాశంఉందని అసెంబ్లీ లాబీలో ఆయనమీడియాతో అన్నారు.

సభలో ఎవరేం మాట్లాడుతున్నారో అర్థం కావడంలేదు: కూనంనేని

బీసీ రిజర్వేషన్ల బిల్లుకు సంబంధించి సభలో ఎవరు ఏం మాట్లాడుతున్నారో అర్థం కావడంలేదని సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివ రావు అన్నారు. రిజర్వేషన్ల అంశాన్ని రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో కేంద్రం చేర్చాలంటే రాష్ట్రస్థాయిలో పోరాటం చేయాలన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. బీసీ రిజర్వేషన్లపై రాష్ట్రంలోని బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు ప్రధాని మోదీని కలిసి మాట్లాడాలని ఆయన అన్నారు.

బీసీలకు రిజర్వేషన్లకు పూర్తి మద్దతు

» కామారెడ్డి డిక్లరేషన్ ఏమైంది..?: పాయల్ శంకర్

బీసీలకు 42% రిజర్వేషన్లు వద్దని బీజేపీ ఎక్కడా చెప్పలేదని ఆ పార్టీ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. ఆదివారం శాసనసభలో బీసీ రిజర్వేషన్లపై ఆయన మాట్లాడారు. బీసీలకు 42% రిజర్వేషన్లు కల్పించే అంశంలో బీజేపీ సంపూర్ణ మద్దతు ఇస్తుందని ప్రకటించారు. అయితే బిల్లులపై బీసీల్లో అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయని, వాటిని రాష్ట్ర సర్కారు నివృత్తి చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 22 నెలలవుతున్నా కామారెడ్డి డిక్లరేషన్ ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు.

బీజేఎల్పీ నేతగా బీసీ వ్యక్తి ఎందుకు లేరు..?: మంత్రులు

బీసీ బిడ్డ వాకిటి శ్రీహరికి ఎంత పెద్ద పదవి వస్తుందోనని ఆశపడ్డానని పాయల్ శంకర్ వ్యాఖ్యానించగా.. బీజేపీ శాసనసభాపక్ష నేత హోదాను బీసీలకు ఎందుకు ఇవ్వలేదని మంత్రి శ్రీహరి ప్రశ్నించారు. బీసీలు చట్టసభల్లోకి రావాలనే ప్రభుత్వం రిజర్వేషన్లను తెస్తోందని వెల్లడించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా బీసీలను తొలగించారని మంత్రి పొన్నం విమర్శించారు. 42% రిజర్వేషన్లతో స్థానిక ఎన్నికలకు వెళ్తామని, ఇందులో మతపరమైనవి లేవని, కచ్చితంగా బీసీలకే ఇస్తామని స్పష్టం చేశారు. బీసీ బిల్లుకు అసెంబ్లీలో మద్దతు తెలుపుతూ.. కేంద్రంలో ఎందుకు అడ్డుకుంటున్నారని బీజేపీని ఆది శ్రీనివాస్ ప్రశ్నించారు.

ఆరోగ్యశ్రీపై దృష్టి పెట్టండి: ఎమ్మెల్యే సంజయ్

హైదరాబాద్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఆరోగ్య శ్రీ సేవలు నిలిచిపోయాయని, దీనిపై ప్రభుత్వం దృష్టి సారించి, త్వరితగతిన చర్యలు చేపట్టాలని శాసనసభలో ఆదివారం అల్లోపతిక్-2002 చట్టం రద్దు బిల్లుపై చర్చ సందర్భంగా బీఆర్ఎస్ ఎమ్మెల్యే సంజయ్ కోరారు. కోరుట్లలో 100 పడకల ఆస్పత్రి ఉన్నా సిబ్బంది లేరని చెప్పారు. రాష్ట్రంలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో మౌలిక వసతులు కల్పించాలని, అవసరమైన మేరకు సిబ్బందిని కూడా నియమించాలని బీజేపీ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్ కోరారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆస్పత్రుల్లో అవసరమైనచోట మౌలిక వసతులు కల్పించడంతో పాటు సిబ్బందిని కూడా ఏర్పాటు చేస్తామన్నారు. కోరుట్లలోని ఆస్పత్రిలో సిబ్బందిని నియమిస్తామని తెలిపారు. అలాగే ఆరోగ్య శ్రీ సేవల కింద చికిత్సలు అందించే ఆస్పత్రులకు సమయానికి బిల్లులు చెల్లించేలా ప్రయత్నిస్తామని ఆయన చెప్పారు.

అల్లోపతిక్-2002 చట్టం రద్దు

ఆంధ్రప్రదేశ్ అల్లోపతిక్ ప్రైవేటు వైద్య సంరక్షణ సంస్థల (రిజిస్ట్రీకరణ, క్రమబద్ధీకరణ) చట్టం-2002ను రద్దు చేస్తూ ఆదివారం శాసనసభలో ప్రవేశపెట్టిన బిల్లు ఆమోదం పొందింది. ఈ మేరకు బిల్లును మంత్రి దామోదర రాజనర్సింహ సభలో ప్రవేశపెట్టారు.

కొత్త మునిసిపాలిటీలుగా ఇంద్రేశం, జిన్నారం

» ఇస్నాపూర్‌లోకి రెండు పంచాయతీల విలీనం

» బిల్లుకు ఆమోదం తెలిపిన సభ

హైదరాబాద్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లాలోని ఇస్నాపూర్ పురపాలికలో రెండు గ్రామాలను విలీనం చేస్తూ దాని అధికార పరిధిని విస్తరించనున్నారు. అలాగే ఇంద్రేశం, జిన్నారం కొత్త మునిసిపాలిటీలుగా మారనున్నాయి. ఇందుకు సంబంధించి ఆదివారం శాసనసభలో ప్రవేశపెట్టిన మునిసిపాలిటీల చట్టం-2025కు సభ ఆమోదం తెలిపింది. ఈ బిల్లులను సీఎం రేవంత్ తరఫున మంత్రి శ్రీధర్‌బాబు సభలో ప్రవేశపెట్టారు. కాగా ఈ బిల్లుపై చర్చ సందర్భంగా రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటయ్యాక మునిసిపాలిటీలకు నిధులివ్వలేదని, కనీసం ఫాగింగ్‌కూ నిధులివ్వడంలేదని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. ఎల్ఆర్ఎస్‌ల కోసం వసూలు చేసిన ఫీజులు, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ నుంచి అందాల్సిన నిధులనూ ఇవ్వకపోవడం దారుణమని పేర్కొన్నారు. ఇప్పటికైనా మునిసిపాలిటీలకు బిల్లులు చెల్లించాలని ఆయన కోరారు. మునిసిపాలిటీల్లో విలీనమైన గ్రామపంచాయతీల్లో ఉపాధి హామీ పనులు చేసుకునే వారికోసం ప్రభుత్వం ఏదైనా ఆలోచన చేయాలని బీజేపీ ఎమ్మెల్యే పాయల్ శంకర్ విన్నవించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన 22 నెలల్లో మునిసిపాలిటీలకు 22 రూపాయలు కూడా ఇవ్వలేదని బీజేపీ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్ అన్నారు.

రిజర్వేషన్లపై.. నేడు గవర్నర్ వద్దకు కాంగ్రెస్



» బీసీ బిల్లును ఆమోదించాలని వినతి

» గవర్నర్‌తో సమావేశానికి హాజరుకావాలని కోరుతూ బీఆర్ఎస్, బీజేపీ, ఎంఐఎం, సీపీఐ పక్ష నేతలకు స్వయంగా లేఖలు అందించిన మంత్రి పొన్నం

హైదరాబాద్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): బీసీలకు 42% రిజర్వేషన్ల కల్పనకు సంబంధించిన అంశంపై మాట్లాడేందుకు పలువురు మంత్రులు సోమవారం ఉదయం 11.30 గంటలకు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను కలవనున్నారు. స్థానిక సంస్థల్లో ఉన్న 50% రిజర్వేషన్ల నిబంధనను ఎత్తివేసి.. రిజర్వేషన్లను పెంచుతూ శాసనసభలో ప్రవేశపెట్టిన పంచాయతీరాజ్ చట్టం సవరణ బిల్లు ఏకగ్రీవ ఆమోదం పొందిందని, సభ అభిప్రాయాన్ని పరిగణనలోకి తీసుకుని బీసీలకు రిజర్వేషన్ల పెంపు బిల్లును ఆమోదించాలని గవర్నర్‌ను కోరనున్నారు. గవర్నర్‌తో సమావేశానికి హాజరుకావాలని కోరుతూ బీఆర్ఎస్, బీజేపీ, ఎంఐఎం, సీపీఐ పక్ష నేతలకు ప్రభుత్వం లేఖలు రాసింది. ఆ లేఖలను మంత్రి పొన్నం ప్రభాకర్ ఆయా పార్టీల నేతలకు స్వయంగా అందజేశారు. బీఆర్ఎస్ తరఫున ప్రతిపక్ష నేత కేసీఆర్ అందుబాటులో లేకపోవడంతో కేటీఆర్‌కు, బీజేపీ పక్ష నేత ఏలేటి మహేశ్వరరెడ్డికి, ఎంఐఎం తరఫున ఎమ్మెల్యే బలాలకు, సీపీఐ పక్ష నేత కూనంనేని సాంబశివరావుకు అందించారు. ప్రభుత్వం తరఫున మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, వాకిటి శ్రీహరి, ప్రభుత్వ విప్‌లు ఆది శ్రీనివాస్, బీర్ల అయిలయ్య, బీసీ ఎమ్మెల్యేలు గవర్నర్‌ను కలవనున్నారు. కాగా స్థానికంగా జరిగే ఎన్నికలపై నిర్ణయం తీసుకునే అధికారం రాష్ట్రాలకు ఉందని మంత్రి పొన్నం వెల్లడించారు. న్యాయపరంగా అన్ని విషయాలను తెలుసుకునే స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42% రిజర్వేషన్ కల్పించాలన్న నిర్ణయానికి వచ్చామన్నారు. అఖిల పక్ష నేతలతో సోమవారం గవర్నర్‌ను కలిసి.. ఈ విషయంలో సభ్యులందరూ ఏకాభిప్రాయంతో ఉన్న విషయం వివరిస్తామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న బలహీన వర్గాలకు చెందిన మేధావులు, ఉద్యోగులు, విద్యార్థులు తమ ప్రయత్నాన్ని గుర్తించాలన్నారు. బీసీలకు 42% రిజర్వేషన్ కల్పించే స్థానిక ఎన్నికలు నిర్వహిస్తామని స్పష్టం చేశారు. శాసన సభ లాబీల్లో ఆదివారం పొన్నం మీడియాతో చిట్‌చాట్‌గా మాట్లాడారు.

బీఆర్ఎస్ వల్లే ఆగిన బిల్లులు!

(మొదటిపేజీ తరువాయి)

పంపామని తెలిపారు. అయితే ఈ ఆర్డినెన్స్‌ను ఆమోదించే విషయంలో కూడా గవర్నర్ బీఆర్ఎస్ మాటలు నమ్మారని అన్నారు.

బీసీలను బీసీలే అవమానించుకోవద్దు..

స్థానిక సంస్థల ఎన్నికలు ఆలస్యమయ్యాయంటూ కొందరు కోర్టుకు వెళ్లారని సీఎం రేవంత్ తెలిపారు. దీంతో సెప్టెంబరు 30లోగా ఎన్నికలు నిర్వహించాలని, రిజర్వేషన్లు సైతం ఖరారు చేయాలని న్యాయస్థానం ఆదేశించిందన్నారు. ఉన్న చట్టాలను పరిశీలిస్తే 50 శాతం రిజర్వేషన్లకు లోబడి ఎన్నికలు నిర్వహించాలని చెబుతున్నాయని పేర్కొన్నారు. అందుకే తమ ప్రభుత్వం ఆర్డినెన్స్ తీసుకువచ్చి 50 శాతం రిజర్వేషన్ల పరిమితిని ఎత్తివేయాలని గవర్నర్‌కు పంపిందని అన్నారు. ఆర్డినెన్స్ ఆమోదం పొందనందున.. శాసనసభలో రిజర్వేషన్ల బిల్లు పెట్టి ఆమోదించుకుందామని పిలుపునిచ్చారు. సభా నాయకుడిగా చిత్తశుద్ధితో దీనిని అమలు చేసే బాధ్యత తనదన్నారు. దీనిని చిలువలు, పలువలు చేయవద్దని, బీసీలను బీసీలే అవమానించుకోవద్దని హితవు పలికారు. మంత్రి పొన్నం ప్రభాకర్, మాజీ మంత్రి గంగుల కమలాకర్ ఒకరినొకరు విమర్శించుకుంటే ఇతరుల ముందు పలుచన అవుతారని వ్యాఖ్యానించారు. మంచి జరిగేటప్పుడు కలిసికట్టుగా ఉండాలని సూచించారు. అలా కాకుండా యజమానులను ఒప్పించడానికి, సంతోషపెట్టడానికి మంత్రులపై పరుషమైన పదజాలం ప్రయోగించవద్దని గంగులకు హితవు పలికారు. సభను వేదికగా మార్చుకొని బలహీన వర్గాలకు అనుమానం కలిగించేలా, తెలంగాణ సమాజంలో అపోహలు సృష్టించేలా తప్పుడు సమాచారాన్ని ప్రచారం చేయవద్దన్నారు.

వాళ్లకు సంతోషం లేదు..

బీసీలకు 42% రిజర్వేషన్లు కల్పిస్తుంటే వారికి (బీఆర్ఎస్ నేతలకు) సంతోషం లేదని సీఎం రేవంత్ అన్నారు. వారి కడుపు నిండా దుఃఖం, బాధ, విషం



ఉన్నాయని ఆరోపించారు. ఢిల్లీకి అఖిలపక్షాన్ని ఎందుకు తీసుకెళ్లలేదంటూ గంగుల ప్రశ్నిస్తున్నారని, అయితే ప్రధానికి తాను ఐదుసార్లు లేఖ రాసి.. అపాయింట్‌మెంట్ అడిగితే ఇవ్వలేదని తెలిపారు. దీంతో ప్రధానిపై, కేంద్రంపై ఒత్తిడి తీసుకురావడానికి పార్లమెంట్ సమావేశాలు జరుగుతున్న సమయంలో జంతర్‌మంతర్ వద్ద తాము ఆందోళన చేశామని గుర్తు చేశారు. అందులో వందమంది ఎంపీలు పాల్గొన్నారని, కానీ.. బీఆర్ఎస్ రాజ్యసభ ఎంపీలు ఎందుకు పాల్గొనలేదని సీఎం ప్రశ్నించారు. బీఆర్ఎస్ అబద్ధాల ప్రాతిపదికన మాట్లాడుతోందని మండిపడ్డారు. బీఆర్ఎస్‌కు కనువిప్పు కలిగించేందుకే ఫిబ్రవరి 4న సోషల్ జస్టిస్ డే జరుపుకోవాలని నిర్ణయించామన్నారు. బీఆర్ఎస్ తప్పులు చేసినందునే ప్రజలు శిక్ష విధించారని, ప్రజాతీర్పు మేరకు ఈ ప్రజా ప్రభుత్వం ఏర్పడిందన్నారు. ప్రజలకిచ్చిన మాట ప్రకారం హామీలను అమలు చేస్తామని, ఇందుకు బీఆర్ఎస్ సహకరించాలని కోరారు. బుద్ధి మారకపోతే ప్రజలు మళ్లీ ఇంకో తీర్పు ఇస్తారని, ఈసారి ప్రతిపక్ష హోదా కూడా ఉండదని హెచ్చరించారు. బీఆర్ఎస్ తమకు సుద్దులు చెప్పాల్సిన అవసరం లేదన్నారు. ముందుగా వారి నాయకుణ్ని (కేసీఆర్) వచ్చి సభలో కూర్చోవాలని చెప్పాలన్నారు. బీసీలకు న్యాయం చేయాలని వందేళ్లుగా జరగని కులగణనను కాంగ్రెస్ సర్కారు చేసిందని రేవంత్ అన్నారు. దానిని ప్రధానప్రతిపక్ష నేత అభినందిస్తే.. ఆయన పెద్దరికం పెరిగి ఉండేదన్నారు. ఆయన సభకు రారని, ఆయన పంపిన వారేమో అవాస్తవాలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు.



క్రరుకాల్చి వాత పెట్టాను

బీసీ రిజర్వేషన్ల విషయంలో కేసీఆర్ ఒత్తిడికి లొంగవద్దని గంగులకు సీఎం రేవంత్ సూచించారు. బీఆర్ఎస్ పోకడలు ఎలా ఉంటాయో తనకు తెలుసునని, అందుకే వారికి క్రరుకాల్చి వాత పెట్టి సీఎంను అయ్యాయనన్నారు. బీసీ బిల్లుపై రాజకీయ వివాదాలకు తావు లేకుండా, ఆరోపణలు చేయకుండా సూచనలు చేయాలని కోరారు. "కల్వకుంట్ల కుటుంబం అంటే ఎవరినీ కలవకుండా ఉంచడం. బీసీలు, ఓసీలు కలవద్దని, ఎస్సీలు, ఎస్టీలు కలవద్దని, మైనారిటీలు, హిందువులు కలవద్దనే కుటుంబం"అని సీఎం వ్యాఖ్యానించారు. బీసీ బిల్లుపై చర్చ లేకుండా సభ అంతా ఏకగ్రీవంగా ఆమోదిస్తే కేంద్రంపై ఒత్తిడి తీసుకురావడానికి అవకాశముంటుందన్నారు. ప్రధాని అపాయింట్‌మెంట్‌ను బీజేపీ మిత్రుడు పాయల శంకర్ ఇప్పించాలని కోరారు. అపాయింట్‌మెంట్ ఇప్పిస్తే అంతా కలిసివెళ్లి రాష్ట్రపతి వద్ద పెండింగ్ ఉన్న బీసీ రిజర్వేషన్ల బిల్లును ఆమోదించుకుందామన్నారు.

బీసీ రిజర్వేషన్ల బిల్లుకు ఆమోదం

రాష్ట్రంలోని బీసీలకు స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు పంచాయతీ రాజ్ చట్టం-2018 లోని సెక్షన్ 285(ఏ)ను సవరించి, 50 శాతం పరిమితిని తొలగించేందుకు ఆదివారం శాసనసభ లో ప్రవేశపెట్టిన బిల్లు ఆమోదం పొందింది. బిల్లును సభలో పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క ప్రవేశపెట్టారు. ఈ బిల్లుపై చర్చ జరిగిన అనంతరం సభ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది.

బీసీ రిజర్వేషన్లపై కాంగ్రెస్‌కు చిత్తశుద్ధి లేదు

» బిల్లులకు బీఆర్ఎస్ సంపూర్ణ మద్దతు

» బీసీమంత్రికి అవగాహన లేదు: గంగుల

» ఆకారం పెద్దగా ఉందని అవగాహన ఉందనుకోవద్దు

» గంగులను ఉద్దేశించి పొన్నం వ్యాఖ్య

హైదరాబాద్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): బీసీ రిజర్వేషన్లకు సంబంధించిన బిల్లులకు బీఆర్ఎస్ సంపూర్ణ మద్దతు అందిస్తుందని ఎమ్మెల్యే గంగుల కమలాకర్ తెలిపారు. అసెంబ్లీలో చర్చ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42% రిజర్వేషన్లు కల్పించే విషయమై కాంగ్రెస్‌కు చిత్తశుద్ధి లేదని ఆరోపించారు. నిజంగా చిత్తశుద్ధి ఉంటే డెడికేటెడ్ కమిషన్ వేయాలని డిమాండ్ చేశారు. బీసీ రిజర్వేషన్ల విషయంలో బీఆర్ఎస్ సూచనలను సర్కారు పరిగణనలోకి తీసుకోవడం లేదని మండిపడ్డారు. మంత్రివర్గంలోనూ బీసీలకు 42% వాటా కల్పిస్తామన్నారని, ఇది సీఎం చేతుల్లోనే ఉందని గుర్తు చేశారు. బీసీ రిజర్వేషన్ల బిల్లుపై సంబంధిత మంత్రికి కనీస అవగాహన లేదని విమర్శించారు. దీంతో మంత్రి పొన్నం జోక్యం చేసుకుని.. అపశకునం మాటలొద్దని సూచించారు. ఆకారం పెద్దగా ఉన్నంత మాత్రాన అవగాహన ఉందనుకోవడం సరికాదని వ్యాఖ్యానించారు. దీంతో బాడీ షేమింగ్ చేయడం సరికాదంటూ గంగుల అభ్యంతరం వ్యక్తం చేశారు. స్పీకర్ జోక్యం చేసుకుని.. మంత్రికి అవగాహన లేదన్న వ్యాఖ్యల్ని వెనక్కి తీసుకోవాలని సూచించారు. గంగుల మాట్లాడుతూ జీవో ఇచ్చినంత మాత్రాన బీసీ రిజర్వేషన్ల అమలు సాధ్యం కాదని, తమిళనాడులో సర్వే కోసం డెడికెటె డ్ కమిషన్ రెండున్నరేళ్లపాటు పనిచేసిందని గుర్తు చేశారు. దీనిపై మంత్రి శ్రీధర్‌బాబు స్పందిస్తూ.. బీసీ రిజర్వేషన్ల అంశం మరో పదేళ్లపాటు సాగాలనే ఉద్దేశంతో బీఆర్ఎస్ మాట్లాడుతోందన్నారు.

సభ జరగని సమయంలోనే ఆర్డినెన్స్

» కేటీఆర్ వాఖ్యలకు సమాధానమిచ్చిన మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం



హైదరాబాద్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): చట్టసభల సమావేశాలు జరగని సమయంలోనే ఆర్డినెన్స్ తెస్తారని, ఇప్పుడు శాసనసభలో బీసీ రిజర్వేషన్ల బిల్లు ప్రవేశపెట్టామని మంత్రి శ్రీధర్‌బాబు చెప్పారు. బీసీ రిజర్వేషన్ల బిల్లులపై రాష్ట్ర ప్రభుత్వం 5 రకాలుగా మాట్లాడుతోందని, గతంలో ఇచ్చిన ఆర్డినెన్స్‌కు, ఇప్పుడు సభలో ప్రవేశపెట్టిన బిల్లుకు తేడా ఏంటో చెప్పాలంటూ సభలో చర్చ సందర్భంగా బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేటీఆర్ చేసిన వ్యాఖ్యలకు ఆయన సమాధానమిచ్చారు. బీసీ బిల్లులపై గవర్నర్ మనసు మార్చుకుని సంతకం చేస్తారనే ఆశాభావం వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు. బీసీ రిజర్వేషన్ల వ్యవహారంపై కోర్టుకు వెళ్లేలా బీఆర్ఎస్సే ఉసిగొల్పేలా వ్యవహరిస్తోందని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆరోపించారు. రిజర్వేషన్ల బిల్లుపై మాట్లాడేందుకు గవర్నర్ దగ్గరకు బీజేపీ, బీఆర్ఎస్, సీపీఐ, ఎంఐఎం పార్టీలన్నీ కలిసిరావాలని కోరారు. మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ.. రిజర్వేషన్లపై అంకితభావంతో ఉన్నామని చెప్పారు. 42% రిజర్వేషన్లను ప్రభుత్వం ఇచ్చితీరుతుందని చెప్పారు. తెలంగాణ ప్రజల డబ్బును కాంగ్రెస్ బిహార్‌కు తరలిస్తోందంటూ కేటీఆర్ చేసిన వ్యాఖ్యలకు స్పందించిన విప్ ఆది శ్రీనివాస్.. టీఆర్ఎస్‌ను.. బీఆర్ఎస్‌గా మార్చుకుని పంజాబ్, మహారాష్ట్రకు తెలంగాణ డబ్బును తరలించారని ఆరోపించారు.

బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల ఘనత కాంగ్రెస్‌దే..

» ఈ విషయాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లండి

» డీసీసీ అధ్యక్షులు, కార్పొరేషన్ చైర్మన్ల భేటీలో మహేశ్‌గౌడ్

హైదరాబాద్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తున్న ఘనత కాంగ్రెస్‌దేనని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్‌గౌడ్ అన్నారు. ఈ విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని డీసీసీ అధ్యక్షులు, కార్పొరేషన్ చైర్మన్లు, టీపీసీసీ ఆఫీస్ బేరర్లకు సూచించారు. బీసీ రిజర్వేషన్లకు హీరోలుగా ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, అగ్రనేత రాహుల్ గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డిలను నిలబెట్టాలన్నారు. స్థానిక ఎన్నికల్లో బీసీలకు రిజర్వేషన్లను 42 శాతానికి పెంచుతూ రెండు సవరణ బిల్లులను శాసనసభ ఆదివారం ఏకగ్రీవంగా ఆమోదించిన నేపథ్యంలో.. జూమ్ ద్వారా డీసీసీ అధ్యక్షులు, కార్పొరేషన్ చైర్మన్లు, టీపీసీసీ ఆఫీస్ బేరర్లతో సమావేశమయ్యారు. పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ కూడా ఇందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహేశ్ గౌడ్ మాట్లాడుతూ.. పదేళ్ల అధికారంలో ఉన్న కేసీఆర్.. బీసీలను అణగదొక్కారని మండిపడ్డారు. సవరణ బిల్లులను తెచ్చి బీసీలకు రాజకీయంగా సుస్థిర స్థానం కల్పిస్తున్న ఘనత కాంగ్రెస్‌దేనన్నారు. బీసీ రిజర్వేషన్ల విషయంలో సీఎం రేవంత్, మంత్రులు చిత్తశుద్ధితో పనిచేశారని చెప్పారు. ఇదే విషయాన్ని కాంగ్రెస్ నాయకులు పల్లెపల్లెన విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని చోట్లా కాంగ్రెస్ జెండా ఎగరాలన్నారు. కాగా, శాసనసభలో బీసీ బిల్లులను ఏకగ్రీవంగా ఆమోదించిన నేపథ్యంలో గాంధీ భవన్‌లో కాంగ్రెస్ బీసీ నేతలు పెద్ద ఎత్తున సంబరాలు నిర్వహించారు. టపాసులు కాల్చి, స్వీట్లు పంచారు.

బీఆర్ఎస్ ఎమ్మెల్యేల వాకౌట్

» గన్‌పార్క్‌వద్ద నిరసన.. ఘోష్ నివేదిక అంతా ట్రాష్

» కాంగ్రెస్ కుట్రలను ఎండగడతామన్న కేటీఆర్

హైదరాబాద్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన కాళేశ్వరం కమిషన్ నివేదిక ఏకపక్షమని, అందులో అబద్ధాలు ఉన్నాయని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు నిరసన తెలిపారు. దీనిపై సభలో వివరణ ఇవ్వడానికి తమకు మాట్లాడే అవకాశం ఇవ్వట్లేదని ఆరోపిస్తూ అసెంబ్లీ నుంచి వాకౌట్ చేశారు. ఆదివారం రాత్రి అసెంబ్లీ నుంచి గన్‌పార్క్ అమరవీరుల స్థూపం వద్దకు చేరుకుని నిరసన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ కక్షపూరితంగా తీసుకొచ్చిన కాళేశ్వరం ఘోష్ కమిషన్ నివేదిక అంతా ట్రాష్ అని, అందులో ఉన్నవన్నీ అబద్ధాలేనని ఆరోపిస్తూ నివేదిక ప్రతులు చించి చెత్తబుట్టలో వేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మాట్లాడుతూ.. అసెంబ్లీలో తమ గొంతు నొక్కారని, స్పీకర్ ఏం సంబంధం లేనట్లు వ్యవహరించారని ఆరోపించారు. తమ నేత హరీశ్‌రావు ఒకరు మాట్లాడితే.. సీఎం సహా మంత్రులంతా అబద్ధాలు చెప్పారన్నారు. కాళేశ్వరంపై కుట్రను ప్రజల్లో ఎండగడతామని, ఆ ప్రాజెక్టును కూల్చి ప్రజలను ఇబ్బంది పెట్టేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తున్నట్లు కనిపిస్తోందని కేటీఆర్ అన్నారు. కమిషన్స్ ఆఫ్ ఎంక్వైరీస్ చట్టాన్ని ఉల్లంఘించి కాళేశ్వరంపై పీసీ ఘోష్ ఇచ్చిన చెత్త నివేదికపై న్యాయపోరాటం చేస్తామని, దీనిపై పార్టీలో చర్చించి నిర్ణయిస్తామన్నారు.

భట్టి ఆరోపణలను నిరూపిస్తే రాజకీయాలకు దూరం: హరీశ్

బీఆర్ఎస్ హయాంలో ఒక్క ఎకరాకు కూడా నీరు ఇవ్వలేదన్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆరోపణలను రుజువు చేస్తే తాను ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి, శాశ్వతంగా రాజకీయాలకు దూరంగా ఉంటానని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు చెప్పారు. తమ ప్రభుత్వ హయాంలో 17 లక్షల ఎకరాలకు నీళ్లిచ్చినట్లు నిరూపిస్తే డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క రాజీనామా చేస్తారా? అని ప్రశ్నించారు. కాళేశ్వరంపై పీసీ ఘోష్ నివేదికపై అసెంబ్లీలో తాను మాట్లాడుతున్నప్పుడు సీఎంతోపాటు 8 మంది మంత్రులు తనను 33 సార్లు అడ్డుకున్నారని ఆరోపించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్‌పై బురద చల్లి ఏ విధంగా ఓట్లు రాబట్టుకోవాలనే ఈ దుశ్చర్యలకు పాల్పడుతున్నారన్నారు. ఘోష్ నివేదిక ఏకపక్షమని, ఎన్‌డీఏకు అనుకూలంగా ఎన్‌డీఎస్‌ఏ నివేదిక ఉందని అసెంబ్లీలో వివరించామన్నారు. గంటన్నర సేపు స్పీకర్‌ను, శాసనసభా వ్యవహారాలశాఖ మంత్రిని ప్రాధేయపడినా తమకు మైక్ ఇవ్వలేదని ఆరోపించారు. కోర్టులో కొట్టుకుపోతుందన్న భయంతోనే ఆదివారం అసెంబ్లీ పెట్టి కాళేశ్వరం కమిషన్‌పై చర్చ పెట్టారని ఆయన విమర్శించారు.

పంట నష్టపోయిన రైతులకు పరిహారమివ్వాలి

» బీజేపీ ఎమ్మెల్యేలు పాయల్ శంకర్, రామారావు

హైదరాబాద్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): వరదలతో పంట నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు వెంటనే నష్ట పరిహారం చెల్లించాలని బీజేపీ ఎమ్మెల్యేలు పాయల్ శంకర్, రామారావు డిమాండ్ చేశారు. ఈ మేరకు శాసన సభలో ప్రకటన చేయాలన్నారు. లేదంటే రైతుల తరఫున పోరాటం చేస్తామని హెచ్చరించారు. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజనను ప్రవేశపెట్టాలని రేవంత్ సర్కారును మొదట్నుంచి డిమాండ్ చేస్తున్నామని.. బడ్జెట్‌లో పెట్టారు.. కానీ దానికి బీమా చెల్లించలేదని విమర్శించారు. 42% బీసీ రిజర్వేషన్లు కేవలం బీసీలకు మాత్రమే ఇవ్వాలని, ముస్లింలను ఆ జాబితా నుంచి తొలగించాలని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే సూర్యనారాయణ డిమాండ్ చేశారు. ఒకవేళ అందులోంచి 10% ముస్లింలకు ఇస్తే, మరి వక్ఫ్ బోర్డు ఆస్తులను కూడా హిందువులకు ఇస్తారా అని ప్రశ్నించారు. జీవో 49ను రద్దు చేయకపోతే బీఆర్ఎస్ సర్కారుకు పట్టిన గతే కాంగ్రెస్‌కు పడుతుందని సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్ అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతికి పాల్పడ్డ వారికోసం ప్రత్యేకంగా జైలు నిర్మించాలని బీజేపీ మరో ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి వ్యాఖ్యానించారు.

సీఎం రేవంత్ ఢిల్లీలో దీక్ష చేయాలి

» ఒకే అంశంపై 5 రకాలుగా మాట్లాడుతున్నారు

» ఆర్డినెన్స్‌పై సంతకం పెట్టని గవర్నర్ అసెంబ్లీ తీర్మానాన్ని ఎలా ఆమోదిస్తారు?: కేటీఆర్



హైదరాబాద్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద నిరవధిక నిరాహార దీక్షకు దిగి.. బీసీలకు రాష్ట్ర స్థానిక సంస్థల్లో 42% రిజర్వేషన్లు కల్పించేలా పార్లమెంట్‌లో బిల్లును ఆమోదింపజేయాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేటీఆర్ అన్నారు. "రిజర్వేషన్లు పార్లమెంట్ పరిధిలోని అంశం. అంతేగానీ, అసెంబ్లీలో ఎంత గట్టిగా మాట్లాడినా.. పొలిటికల్ డైలాగులు కొట్టినా లాభం లేదు. ఈ విషయంపై ప్రధాని మోదీతో మాట్లాడేందుకు రాష్ట్రం నుంచి అఖిలపక్షాన్ని తీసుకెళ్లాలి. అందుకు మేం సహకరిస్తాం. కాంగ్రెస్-బీజేపీ తలచుకుంటే.. మోదీ-రాహుల్ కలిసి టీ తాగేలోపు పార్లమెంట్‌లో రాజ్యాంగ సవరణ చేసి, బీసీలకు న్యాయం చేయొచ్చు. పార్లమెంట్ ఆ చట్టాన్ని 9వ షెడ్యూల్‌లో చేర్చడం ఒక్కటే పరిష్కారం" అని వ్యాఖ్యానించారు. ఈ విషయం సీఎం రేవంత్‌రెడ్డికి తెలిసినా.. ఆ దిశలో ప్రయత్నం చేయడం లేదని విమర్శించారు. 2018 పంచాయతీరాజ్ చట్ట సవరణతో 50% రిజర్వేషన్ల పరిమితిని తొలగించేందుకు ఆదివారం శాసనసభలో ప్రవేశపెట్టిన బిల్లులపై చర్చ సందర్భంగా కేటీఆర్ మాట్లాడారు. బీసీ రిజర్వేషన్ల విషయంలో 5 రకాలుగా మాట్లాడుతున్నారని రేవంత్‌రెడ్డిపై మండిపడ్డారు. "కామారెడ్డిలో బీసీ డిక్లరేషన్ సందర్భంగా కేంద్రంలో అధికారంలోకి వస్తే చేస్తామని చెప్పి ఉండాల్సింది. అలా చేయకుండా.. హడావుడిగా ప్రకటించి, ఇప్పుడు చిత్తశుద్ధి లేనట్లు వ్యవహరిస్తోంది. రాజ్యాంగబద్ధంగా రిజర్వేషన్లను సాధిస్తామని ఒకసారి చెప్పారు. ఆర్డినెన్స్ ద్వారా అంటూ మరోసారి చెప్పారు. పార్టీపరంగా అని ఇంకోసారి.. రాహుల్ ప్రధాని అయితేనే అని మరోమారు ప్రకటించారు. ఇప్పుడు మళ్లీ బిల్లు తీసుకొచ్చారు. ఒకే అంశంపై ఐదు రకాలుగా చెబుతుంటే.. బీసీలు అర్థం చేసుకోలేరా?" అని ప్రశ్నించారు. గతంలో పంపిన ఆర్డినెన్స్‌పై గవర్నర్ సంతకం చేయలేదని, ఇప్పుడు శాసనసభ తీర్మానంపై ఎలా ఆమోదం వ్యక్తం చేస్తారని నిలదీశారు. "మార్చి నెలలో అసెంబ్లీ ఆమోదించి, రాష్ట్రపతికి పంపిన బిల్లుకు.. తాజా బిల్లుకు తేడా ఏంటో చెప్పాలి. సెప్టెంబరు 30లోపు రిజర్వేషన్లు ఇచ్చి, ఎన్నికలను ఎలా పూర్తిచేస్తారు? గవర్నర్‌తో సంతకం ఎలా చేయిస్తారు?" అనే విషయాలపై ప్రభుత్వం సమాధానం చెప్పాలన్నారు. కనీసం 15 రోజులైనా సభను నడపమని అడుగుతుంటే ప్రభుత్వం పారిపోతోందని ఎద్దేవా చేశారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.